
'ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹5.00

సంపుటి: 10 సంచిక: 344

సోమవారం 5-3-2018



ఆదాయానికి మార్గాలెన్నో

ఎన్నో పెట్టుబడి అవకాశాలు. వయసు, రిస్క్‌ను బట్టి సాధనాలు - బిజినెస్‌లో



రిజ్వీ 'పసిడి' గురి...

ప్రపంచకప్‌లో వరల్డ్ రికార్డు సృష్టించిన భారత షూటర్ - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

హస్తిన చేరిన హోదా పోరు

నేడే ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ మహాధర్నా

- దేశ రాజధానికి చేరుకున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు
- నాయకులు, కార్యకర్తలతో ఢిల్లీ చేరుకున్న ప్రత్యేక రైలు
- వివిధ మార్గాల్లో భారీగా తరలివస్తున్న శ్రేణులు
- రాజకీయాలకతీతంగా ధర్నాకు మద్దతు
- ఉద్యమాన్ని అడ్డుకునేందుకు బాబుసర్కార్ కుట్ర
- ఏపీభవన్‌లో నేతలను మీడియాతో మాట్లాడనీయకుండా ఆంక్షలు



ఉద్ధరిస్తామన్న టీడీపీ ఏం ఒరగబెట్టింది: ఏచూరి

ఇతరపార్టీలతోనూ చర్చించి అవిశ్వాసానికి మద్దతిస్తాం

2లో



ఆదివారం రాత్రి ప్రత్యేక రైలులో ఢిల్లీ చేరుకున్న అనంతరం సఫ్దర్‌జంగ్ వద్ద హోదా నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి/సాక్షి, న్యూఢిల్లీ

ఐదుకోట్ల ఆంధ్రులకు అపర సంజీవని వంటి ప్రత్యేక హోదాను సాధించడం కోసం జరుగుతున్న పోరాటం దేశ రాజధాని న్యూఢిల్లీకి చేరుకుంది. ''ప్యాకేజీతో మోసం చేయొద్దు.. ప్రత్యేక హోదా మన హక్కు'' అన్న నినాదంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, ముఖ్యనేతలంతా ఢిల్లీకి చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆవేదనను యావత్ భారతావనికి వినిపించేందుకు సమాయత్తమయ్యారు. కేంద్రంపై ఒత్తిడి పెంచి తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. నేడు ఢిల్లీలోని సంసద్‌మార్గ్‌లో మహా ధర్నా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి నాయకులతో పాటు శ్రేణులు కూడా పెద్ద ఎత్తున హాజరవుతుండడంతో ముఖ్యనేతలంతా ముందే చేరుకుని ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మహా ధర్నా కోసం హాజరయ్యే వారి కోసం శుక్రవారం విజయవాడ నుంచి ఢిల్లీకి ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలు ఆదివారం సాయంత్రానికి ఢిల్లీ చేరుకుంది. వేలాదిగా తరలివచ్చిన వారికి భోజనంతో పాటు వసతి ఏర్పాట్లు చేశారు. పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలే కాకుండా రాష్ట్రం నలుమూలల నుండి, హైదరాబాద్, బెంగుళూరుల నుంచి రైళ్లు, విమానాల ద్వారా పెద్ద ఎత్తున తరలివచ్చారు. కాగా రాష్ట్రంలో ప్రత్యేక హోదా ఉద్యమాన్ని నీరుగార్చేందుకు అనేక రకాలుగా ప్రయత్నించిన చంద్రబాబు సర్కార్ ఢిల్లీలోనూ తన నైజాన్ని బయటపెట్టుకుంది. ఏపీభవన్‌లో హోదా ఉద్యమకారులు మీడియాతో మాట్లాడనీ యకుండా ఆంక్షలు విధించింది. పోలీసులను పంపి అడ్డుకునే ప్రయత్నంచేయడంతో అన్నివైపుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆకాంక్షను సజీవంగా ఉంచిన పోరాటం..

ప్రత్యేక హోదా కోసం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పోరాటాలు, ధర్నాలు, బంద్‌లు, ఊరూరా యువభేరీలు భారీ ఎత్తున నిర్వహించారు. అందువల్లనే ప్రత్యేకహోదా అన్న భావన

మిగతా 2వ పేజీలో ▶



మేఘాలయ సారథి కన్రాడ్

- రేపు సీఎంగా ప్రమాణస్వీకారం
- ఎన్పీపీ సారథ్యంలో కొలువుదీరనున్న సంకీర్ణ సర్కారు

- వివరాలు 5లో



త్రిపుర కొత్త సీఎం విప్లవ్!

- రేపు బీజేపీ–ఐపీఎఫ్‌టీ ఎమ్మెల్యేల సమావేశం
- ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన మాణిక్

- వివరాలు 5లో

టెట్ ప్రాథమిక కీ విడుదల

- ఈ నెల 9 వరకు ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు స్వీకరణ

- వివరాలు 3లో

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

తొలిరోజు గవర్నర్ ప్రసంగం అనంతరం వాయిదా

- ఈ నెల 8న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ప్రధాన ప్రతిపక్షం లేకుండా బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తుండడం ఇదే ప్రథమం
- ఫిరాయింపుదార్ల మీద చర్యలు లేకపోవడంపై రాజ్యాంగ నిపుణుల విస్మయం

2లో



వారిపై వేటు వేస్తేనే..

ఫిరాయింపుదార్లపై చర్యలు తీసుకుంటే అసెంబ్లీకి వస్తామని స్పీకర్ కోడెల శివప్రసాద్‌కు వైఎస్సార్‌సీపీ స్పష్టీకరణ

2లో

- దెందులూరు స్థానం ఖాళీ అయినట్లు నోటిఫై చేయాలి
- స్పీకర్‌కు వినతిపత్రం అందజేసిన విజయసాయిరెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

పాదయాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా అద్దంకిలో ఆదివారం జరిగిన బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఒక భాగం. ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



కేంద్రం నుంచి వైదొలగడమే తొలి అస్త్రం కావాలి

చంద్రబాబేమో అదే చివరి అస్త్రం అంటున్నారు.. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మండిపాటు

ఇలాగైతే అవిశ్వాసం ఎప్పుడు పెడతారు?.. రాజీనామాలు ఎప్పుడు చేస్తారు?

నాలుగేళ్లు గడిచినా ఇంకా తాత్సారమా?.. కాలయాపన చేయడానికే ఈ డ్రామాలా?

6లో

టీడీపీలో దళితులకు గౌరవం లేదు



సొంత పార్టీపై మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే రావెల కిశోర్‌బాబు సంచలన వ్యాఖ్యలు

- ప్రజాప్రతినిధులం మేమైనా.. పెత్తనం ఒక కులానిదే!
- మంత్రులు, ఎమ్మెల్యేలకు కనీస గౌరవం కూడా ఇవ్వట్లేదు
- అన్ని ఎస్సీ నియోజకవర్గాల్లో అగ్రకుల నేతలదే పెత్తనం

- వివరాలు 6లో

'పలకరింపు'తో చిన్నారులకు టీకాలు

- హెల్త్ బులెటిన్, పలకరింపు కార్యక్రమాల ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు
- నేటి నుంచి 30వ తేదీ వరకు చిన్నారులకు టీకాలు
- రాష్ట్రంలో మానసిక సమస్యలు తీవ్రంగా పెరిగాయి
- అనారోగ్యంతో బాధపడే డాక్టర్లకు ఆరోగ్య సూచనలిచ్చే అర్హత లేదు

18లో



WWW.SAKSHI.COMలో

ఆర్థిక రంగం ఆణిముత్యాలు

బ్యాంకింగ్, బీమా, పెట్టుబడులు, ప్రణాళిక... ఇలా ఏ రంగమైనా అది మహిళలకు సంబంధించింది కాదనే భావన. ఇప్పుడు పరిస్థితుల్లో మార్పు వచ్చింది. వివిధ రంగాలతో పాటు ఆర్థిక రంగంలో కూడా మహిళలు తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు.

పులివెందులలో టీడీపీ రౌడీయిజం

- చర్చకు రాకుండా రచ్చకు దిగిన అధికార పార్టీ నేతలు
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై రాళ్లు, కర్రలతో దాడి
- పోలీసుల లాఠీచార్జీలో ముగ్గురు వైఎస్సార్‌సీపీ నేతలకు గాయాలు

2లో

ఇదండీ వరస్



నీరవ్ మోదీ ఇక్కడే ఉన్నాడట.. అన్ని బ్యాంకులకు సమాచారం ఇవ్వండి అప్పులివ్వకుండా

హస్తిన చేరిన హోదా పోరు

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే సజీవంగా ఉంది. ఓటుకు కోట్లు కేసు భయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకహోదాను కేంద్రం వద్ద తాకట్టు పెట్టి రాష్ట్రానికి తీవ్రంగా అన్యాయం చేస్తున్నారనే భావన ప్రజల్లో నెలకొంది. అందుకే వైఎస్సార్‌సీపీ ఢిల్లీలో తలపెట్టిన మహా ధర్నాకు రాజకీయాలకు అతీతంగా మద్దతు లభిస్తోంది. ఈ నెల 20వ తేదీ వరకు పార్లమెంటులో వైఎస్సార్‌సీపీ ఎంపీలు పోరాటం చేయనున్నారు. అప్పటికీ స్పందన లేకపోతే ఈనెల 21న కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించింది. [illegible] ఏప్రిల్ 6వ తేదీన వైఎస్సార్‌సీపీ ఎంపీలు రాజీనామా చేయనున్నారు.

ఉద్యమాన్ని అణగదొక్కేందుకు బాబు సర్కార్ కుట్రలు..

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఉద్యమాన్ని ఉధృతం చేయడంతో దానిని అణగదొక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోంది. ప్రత్యేక హోదా డిమాండ్‌తో వైఎస్సార్ సీపీ నేతలు, ఇతర ప్రజా సంఘాల నేతలు ఢిల్లీకి చేరుకుంటుండడంతో అక్కడి ఏపీ భవన్‌లో ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదని, మీడియా ప్రతినిధులను ఎవరి ఇంటర్వ్యూలు తీసుకోరాదని పోలీసులు ఆంక్షలు విధించారు. దీనిపై మీడియా ప్రతినిధులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని రోజులుగా లేని ఆంక్షలు ఇప్పుడే ఎందుకని ప్రశ్నిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశాన్ని కవర్ చేస్తున్న సాక్షి టీవీని పోలీసులు అడ్డుకున్నారు. ప్రత్యేక హోదాపై అనకాపల్లి పార్లమెంటు జిల్లా నియోజక వర్గ ఇన్‌చార్జ్ గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతుండగా పోలీసులు అడ్డుకొని ఏపీ భవన్‌లో ఎలాంటి ఇంటర్వ్యూలు చేయవద్దని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని, ఆ ఆవరణ నుంచి బయటకు వెళ్లిపోవాలంటూ హుకుం జారీ చేశారు. దీనిపై లిఖితపూర్వక ఉత్తర్వులు చూపాలని మీడియా ప్రశ్నించగా.. ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌తో మాట్లాడాలని పోలీసులు సమాధానం ఇచ్చారు.



ఏపీ భవన్‌లో వైఎస్సార్‌సీపీ నేతలను మీడియాతో మాట్లాడనివ్వకుండా అడ్డుకుంటున్న పోలీసులు

ప్రత్యేక హోదాయే పరిష్కారం..

రాష్ట్ర విభజన వల్ల హైదరాబాద్‌ను కోల్పోయిన ఏపీ ఇతర రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక హోదాతోనే సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. 'ప్యాకేజీతో మోసం చేయొద్దు.. ప్రత్యేక హోదా మన హక్కు' నినాదంతో తలపెట్టిన ధర్నాలో పాల్గొనేందుకు ఢిల్లీ చేరుకున్న ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాజన్న దొర, కళావతి మీడియాతో మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా ఏపీ హక్కు అని, హోదాతోనే రాష్ట్రంలోని అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. విభజన వేళ పార్లమెంటులో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఏపీకి ఐదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటన చేస్తే.. తాము పదేళ్లు ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చిందన్నారు. తిరుపతిలో ప్రధాని మోదీ స్వయంగా ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. హోదా కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గత నాలుగేళ్లుగా పోరాటం చేస్తుంటే.. హోదాపై అనేకసార్లు మాటమారుస్తూ సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు.

ఉద్ధరిస్తామన్న టీడీపీ ఏం ఒరగపెట్టింది!

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్ సీపీ చేస్తున్న పోరాటంలో భాగంగా పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వంపై ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానంపై ఇతర పార్టీలతోనూ చర్చించి అందులో భాగమవుతామని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. ఏపీకి పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రధాని మోదీ, రాష్ట్ర విభజన నాడు సభలో వెంకయ్యనాయుడు హామీ ఇచ్చారన్నారు. బీజేపీ ఇచ్చిన హామీకి ఇప్పుడు అతీగతీ లేకుండా పోయిందని ఆయన విమర్శించారు. బీజేపీ, రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తాం కాబట్టి ఏపీని ఉద్ధరిస్తామని చెప్పిన టీడీపీ నేతలు ఇప్పుడేం సాధించారని ఆయన ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదా, ప్యాకేజీ అమలు చేయాలని ముందు నుంచి తాము చేస్తున్న డిమాండ్‌కు కట్టుబడి ఉన్నామని, ఇచ్చిన హామీ మేరకు కేంద్రం ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

హోదా వస్తుందనే నమ్మకం కలుగుతోంది..

మా పోరాటం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు తప్పకుండా ప్రత్యేక హోదా లభిస్తుందనే నమ్మకం కలుగుతోంది. అసలు ఇంత కాలం రాష్ట్రానికి హోదా రాకపోవడానికి కారణం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే. కేంద్రంపై ఎన్నికలు ముగిసినప్పటి నుంచీ ఆయన ఒత్తిడి తేలేక పోవడం ఒక తప్పిదం అయితే హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజీ అని మభ్యపెట్టి అంగీకరించడం మరో తప్పిదం. మా పోరాటానికి కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందన్న ఆశ ఉంది. ఏపీ ప్రజల్లో హోదా కావాలన్న భావన రోజు రోజుకూ పెరుగుతోంది. విభజన వల్ల నష్టపోయిన పరిస్థితుల్లో ప్రత్యేక హోదా వస్తే రాష్ట్రం బాగుపడుతుందని రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. హోదా కావాలన్న ఆకాంక్షను జాతీయ స్థాయిలో చాటి చెప్పేందుకే ధర్నా చేయాలన్న నిర్ణయం తీసుకున్నాం.

– వి. విజయసాయిరెడ్డి,
వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు

కేంద్రంతో 'బాబు' లాలూచీ ఎందుకో..?

ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తున్న పార్టీలతో సీఎం చంద్రబాబు కలిసి రాకుండా కేంద్రంతో ఎందుకు లాలూచీ పడుతున్నారో అర్థం కావడం లేదు. రాష్ట్రం విడిపోయి నాలుగేళ్లయినా అభివృద్ధి ఏమాత్రం జరగలేదు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేస్తుంటే చంద్రబాబు మాత్రం కేంద్రంపై ఒత్తిడి తీసుకురాకుండా రోజుకో మాట చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారు.

– మేకపాటి రాజమోహన్‌రెడ్డి,
వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత

చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాలి..

హోదా డిమాండ్‌తో వైఎస్సార్‌సీపీ ఆందోళనలు చేస్తుంటే చంద్రబాబు అవహేళన చేస్తూ హోదాతో ఏమి వస్తుందంటూ ఇన్నాళ్లూ ప్రశ్నించారు. మరో ఏడాదిలో ఎన్నికలు వస్తున్నాయని ఇప్పుడేమో హోదా ఇవ్వాల్సిందేనంటూ కొత్త పల్లవి అందుకున్నాడు. హోదా కంటే ప్రత్యేక ప్యాకేజీనే బాగుందంటూ కేంద్రంపై ప్రశంసలు కురిపించి ఇప్పుడు ఎందుకు మాట మారుస్తున్నారో రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు సమాధానం చెప్పి తీరాల్సిందే.

– ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు,
శాసన మండలిలో ప్రతిపక్షనేత

పార్లమెంట్‌లో నిరసనలతో సరి!: టీడీపీ ఎంపీల నిర్ణయం

సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్‌సీపీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తూ సోమవారం ఢిల్లీలో ధర్నా చేయడంతో పాటు పార్లమెంట్‌ను స్తంభింపజేసే పరిస్థితి ఉండటంతో.. టీడీపీ తర్జనభర్జన పడుతోంది. ప్రభుత్వంలో కొనసాగుతూనే పార్లమెంట్ సమావేశాల్లో నిరసనలకు మాత్రమే పరిమితం కావాలని ఇప్పటికే టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నిర్ణయించడం తెలిసిందే. అయితే వైఎస్సార్ సీపీ ఆందోళనలు ఉధృతం చేయడంతోపాటు పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఏకంగా ఢిల్లీలోనే ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా చేయనుండటంతో టీడీపీ సందిగ్ధంలో పడింది. బీజేపీ అధిష్టానం నుంచి ఫోన్లు వచ్చినట్లు, రాష్ట్రానికిచ్చే నిధులపై ఫార్ములా రూపొందిస్తున్నారంటూ బయటకు కొన్ని లీకులిచ్చినా ప్రజల నమ్మే పరిస్థితి లేకపోవడంతో ప్రత్యామ్నాయ కార్యాచరణపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గత పార్లమెంటు సమావేశాల్లో మాదిరిగానే ఈసారి కూడా నిరసనలు చేస్తామని ఆ పార్టీ ఎంపీలు పేర్కొంటున్నారు.

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సమావేశాల్లో 2018–19 బడ్జెట్‌ను ఈ నెల 8న ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. సోమవారం ఉదయం 9.30కు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. అనంతరం సభ మంగళవారానికి వాయిదా పడనుంది. ఇవి 14వ అసెంబ్లీ 11వ సమావేశాలు కాగా, శాసన మండలికి 13వ సమావేశాలు. ఈ సమావేశాలకు ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ హాజరవుతుందా, లేదా అన్నది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకోవడంపై ఆధారపడి ఉంది.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేవరకూ అసెంబ్లీకి హాజరు కాబోమని వైఎస్సార్‌సీపీ గతంలోనే ప్రకటించింది. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఆ పార్టీ సభ్యులు శాసనసభ, మండలి గత సమావేశాలను బహిష్కరించిన సంగతి తెలిసిందే. వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి, శాసన మండలిలో పార్టీ ఫ్లోర్ లీడర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఆదివారం స్పీకర్ కోడెల శివప్రసాదరావును కలసి వినతిపత్రం అందజేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు రెండున్నరేళ్ల జైలు శిక్ష పడినందున, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఆయనను అనర్హుడిగా ప్రకటించాల్సి ఉన్నా స్పీకర్ ఇప్పటివరకూ చర్యలు చేపట్టలేదు. ఈ అంశాన్ని కూడా వైఎస్సార్‌సీపీ నేతలు స్పీకర్ వద్ద ప్రస్తావించారు. దెందులూరు స్థానం ఖాళీ అయినట్లుగా ప్రకటించాలని కోరారు. ఫిరాయింపుదార్లపై చర్యలు చేపడితే తమ సభ్యులంతా మంగళవారం నుంచి అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారని స్పష్టం చేశారు.

ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు

పార్టీ ఫిరాయించిన శాసనసభ్యులపై స్పీకర్ చర్యలు తీసుకోకపోతే ప్రతిపక్ష సభ్యులు అసెంబ్లీ హాజరయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఇదే జరిగితే రాష్ట్ర శాసనసభ, శాసన మండలి చరిత్రలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రధాన ప్రతిపక్షం లేకుండా నిర్వహించడం ఇదే తొలిసారి కానుంది. ఈ పరిణామం పట్ల రాజ్యాంగ నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి దారుణమైన పరిస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదని అంటున్నారు. ప్రతిపక్షం లేకపోతే సభలో అధికార పక్షం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది మంచి పరిణామం కాదని చెబుతున్నారు.

వారిపై వేటు వేస్తేనే అసెంబ్లీకొస్తాం

ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు వైఎస్సార్‌సీపీ వినతిపత్రం

సాక్షి, అమరావతి: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటీషన్లపై రాజ్యాంగంలోని షెడ్యూల్ 10 నిబంధనల ప్రకారం చర్య తీసుకుంటే ఈ నెల 6 నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే అవకాశముంటుందని స్పీకర్‌కు వివరించినట్టు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు విజయసాయిరెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం గుంటూరులో స్పీకర్ కోడెలను కలిసిన అనంతరం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వారుమీడియాతో మాట్లాడారు. ''స్పీకర్‌కు రెండు వినతిపత్రాలు అందజేశాం. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటీషన్లను పరిష్కరించాలని కోరాం. టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గెలిచిన దెందులూరు సీటు ఖాళీ అయినట్లు గుర్తిస్తూ నోటిఫై చేయాలని విన్నవించాం'' అని చెప్పారు.

శిక్ష ఖరారైతే అనర్హతకు గురైనట్టే...

లిల్లీ థామస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా వివాదంలో సుప్రీంకోర్టు 2013 జులై 10న వెలువరించిన తీర్పులోని పేరా 17లో ఎవరైనా ఎమ్మెల్యే, ఎంపీకి కోర్టు శిక్ష ఖరారు చేస్తే ఎలాంటి తదుపరి ప్రక్రియ లేకుండానే, దానిని ఎవరూ డిక్లరేషన్ చేయాల్సిన అవసరం లేకుండానే అతడు పదవిని కోల్పోతాడని స్పష్టంగా ఉంది. తీర్పు వెలువడిన మరుక్షణం ఆ ఎమ్మెల్యే లేదా ఎంపీ తన పదవిని కోల్పోయినట్టే అవుతుంది.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి, చిత్రంలో ఉమ్మారెడ్డి

చింతమనేనికి కోర్టు రెండేళ్ల కన్నా ఎక్కువ కాలమే శిక్ష ఖరారు చేసిన నేపథ్యంలో ఆ సభ్యుడి అసెంబ్లీ సీటు ఖాళీ అయినట్లు ప్రకటిస్తూ నోటిఫై చేయాలి. తీర్పు వెలువరించిన రోజు నుంచి ఆ సభ్యుడికి అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు, అసెంబ్లీలో ఓటు వేసేందుకు, ఎమ్మెల్యే హోదా ద్వారా వచ్చిన ఓటును ఏ రకమైన ఎన్నికల్లోనూ ఉపయోగించుకునేందుకు అతనికి అధికారం ఉండదని సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పింది. ఈ విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చాం'' అని వెల్లడించారు. కాగా, తెలంగాణ సీఎం కేసీఆర్ ఏర్పాటు చేస్తానన్న థర్డ్ ఫ్రంట్‌పై స్పష్టత లేదని, పూర్తి స్పష్టత వచ్చాక ఈ అంశంపై తమ పార్టీ స్పందిస్తుందని విజయసాయిరెడ్డి జవాబిచ్చారు. అవిశ్వాస తీర్మానాన్ని కేసీఆర్ చీప్ ట్రిక్ అనడం అర్థరహితమని ఉమ్మారెడ్డి పేర్కొన్నారు.

పులివెందులలో టీడీపీ రౌడీయిజం

చర్చకు రాకుండా రచ్చకు దిగిన టీడీపీ నేతలు

పులివెందుల: వైఎస్సార్ జిల్లా పులివెందుల అభివృద్ధిపై చర్చకైనా, రచ్చకైనా సిద్ధమని ప్రకటించిన తెలుగుదేశం పార్టీ నేతలు ఆదివారం అన్నంత పనీ చేశారు. అధికార బలంతో రౌడీల్లా రెచ్చిపోయారు. పూల అంగళ్ల సర్కిల్ వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కవ్వింపు చర్యలకు దిగారు. రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారు.

అసలేం జరిగింది..

పులివెందుల అభివృద్ధిపై చర్చకు రావాలని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి ఫిబ్రవరి 28న కడప ఎంపీ అవినాష్‌రెడ్డికి సవాల్ విసిరి మాటల యుద్ధం మొదలెట్టారు. ఎంపీ అవినాష్‌రెడ్డి స్పందించి 'చర్చకు నేను సిద్ధం. ఎప్పుడు.. ఎక్కడికి పిలిచినా వస్తా' అంటూ మార్చి 1న ప్రతి సవాల్ విసిరారు. పులివెందులలోని పూల అంగళ్ల సర్కిల్‌లో ఆదివారం సాయంత్రం 4 గంటలకు చర్చకు రావాలని సతీష్‌రెడ్డి అన్నారు. మళ్లీ శనివారం కడపలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, చర్చకైనా.. రచ్చకైనా సిద్ధమంటూ రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడారు.

చర్చకు సహకరించాలని విజ్ఞప్తి

పులివెందుల రాజకీయం వేడెక్కడంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణంలో ఆదివారం ఉదయం నుంచే భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల సమయంలో ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ శ్రీనివాసులు ఎంపీ అవినాష్‌రెడ్డికి ఇంటికి వెళ్లి.. మీరు బయటికొస్తే శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయి, బయటకు రావొద్దని అన్నారు. అయితే, తాను ఓల్డ్ ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లాలని చెబుతూ అవినాష్‌రెడ్డి అక్కడికి బయలుదేరి వెళ్లారు. మధ్యాహ్నం పులివెందుల ఏఎస్పీ ఆధ్వర్యంలో మరోసారి అవినాష్‌రెడ్డితో చర్చించారు. అర్థవంతమైన చర్చ జరిగేందుకు సహకరించాలని ఆయన పోలీసులను కోరారు. అయినా పోలీసులు పట్టించుకోకుండా ఎంపీని అరెస్టు చేసి తరలించేందుకు జీపు వద్దకు తీసుకురాగా.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకోవడంతో పోలీసులు వెనుతిరిగారు. ఈ సందర్భంగా అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ... అందరూ సంయమనం పాటించాలని కోరారు. చట్టాన్ని, పోలీసులను గౌరవించాలని, సాయంత్రం 5 గంటల వరకు ఇక్కడే ఉందామని అన్నారు.



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని బలవంతంగా పోలీసు వ్యానులోకి ఎక్కిస్తున్న దృశ్యం



టీడీపీ కార్యకర్తల రాళ్ల దాడిలో గాయపడ్డ కౌన్సిలర్

రణరంగం సృష్టించిన టీడీపీ నేతలు

పులివెందులలో చర్చకు బయలుదేరిన టీడీపీ మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డిని వేంపల్లె పోలీసులు మధ్యాహ్నం అరెస్టు చేసి గృహనిర్బంధంలో ఉంచారు. అదే సమయంలో పులివెందులలో టీడీపీ నేతలు బీటెక్ రవి, రాంగోపాల్‌రెడ్డి తమ పార్టీ కార్యకర్తలతో కలిసి పూల అంగళ్ల సర్కిల్‌కు చేరుకున్నారు. పెద్ద ఎత్తున ఈలలు, కేకలు వేస్తూ రణరంగం సృష్టించారు. అక్కడున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులపై రాళ్లు, కర్రలతో దాడి చేసేందుకు యత్నించారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేయగా.. ఈ దాడిలో ట్రాఫిక్ ఎస్‌ఐ చిరంజీవి గాయపడ్డారు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. అనంతరం బాష్పవాయువు ప్రయోగించారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై లాఠీచార్జి

జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ పులివెందులకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. పట్టణంలో 144 సెక్షన్ విధించినట్లు ప్రకటించారు. పూల అంగళ్ల సర్కిల్‌లో ఇరువర్గాలను చెదరగొట్టారు. దీంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో పోలీసులు అక్కడికి వచ్చి కార్యకర్తలను లాఠీలతో చావబాదారు. ఈ ఘటనలో పార్టీ పట్టణ కన్వీనర్ వరప్రసాద్‌తోపాటు మరో ఇద్దరు కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. రాళ్ల దాడికి దిగిన టీడీపీ నేతలను వదిలేసి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై పోలీసులు లాఠీలతో విరుచుకుపడడం పట్ల ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.

పక్కా ప్రణాళికతోనే టీడీపీ దాడి: అవినాష్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీ నేతలు చర్చకు బదులు రచ్చ చేశారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చ జరగాలన్న ఉద్దేశం సతీష్‌రెడ్డికి లేదని విమర్శించారు. టీడీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడినా తాను, తమ పార్టీ కార్యకర్తలు చట్టాన్ని గౌరవించి సంయమనం పాటించామన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం ముందు వందలాది మంది పోలీసులు మోహరించారు, కానీ టీడీపీ కార్యాలయం వద్ద ఎందుకు పోలీసులను పెట్టలేదని ప్రశ్నించారు. టీడీపీ నేతలు పక్కా ప్రణాళికతోనే దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రకు లభిస్తున్న ప్రజాదరణను చూసి అధికార పార్టీ నాయకులు ఓర్వలేకపోతున్నారని దుయ్యబట్టారు. పులివెందుల అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ చెబుతున్నదే జేఎఫ్‌సీ నివేదికలో ఉంది

- పవన్ కల్యాణ్ కమిటీ కొత్తగా నిర్ధారించిందేమీ లేదు
- మోదీ, చంద్రబాబు హామీల అమలు పూచీ నీదేనన్నావ్ కదా!
- ఆ లెక్కన ప్రత్యేక హోదా రాకపోవడంలో నీకూ భాగస్వామ్యముంది
- ఇప్పటికైనా కనువిప్పు అయ్యిందని ఒప్పుకో
- జనసేన అధినేతకు పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సూచన



సాక్షి, హైదరాబాద్: నాలుగేళ్లుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏదైతే చెబుతూ వస్తోందో.. అవే అంశాలు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఏర్పాటు చేసిన సంయుక్త నిజనిర్ధారణ కమిటీ(జేఎఫ్‌సీ) నివేదికలో కూడా ఉన్నాయని, వాళ్లు కొత్తగా చెప్పిందేమీ లేదని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ) చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పద్మనాభయ్య, ఉండవల్లి అరుణ్‌కుమార్, జేపీ, ఐవైఆర్ కృష్ణారావు సభ్యులుగా ఉన్న జేఎఫ్‌సీ రూపొందించిన నివేదికలో.. ప్రత్యేక హోదా మన హక్కు అని, అది వచ్చి తీరాల్సిందేనంటూ పేర్కొన్నారని.. పవన్ కూడా ఈ విషయం ప్రకటించారని గుర్తు చేశారు. ఇదే అంశంపై వైఎస్సార్‌సీపీ మొదటి నుంచీ పోరాటం చేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. 'కేంద్ర ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాల్సిన పోలవరం ప్రాజెక్టును రాష్ట్రం ఎందుకు తీసుకుంది? అని వైఎస్సార్‌సీపీ ఎప్పటినుంచో ప్రశ్నిస్తోంది. ఇదే విషయాన్ని జేఎఫ్‌సీ కూడా చెప్పింది' అని ఆయన వివరించారు. విభజన చట్టం ప్రకారం విశాఖ రైల్వే జోన్, దుగరాజపట్నం ఓడరేవు, కడప ఉక్కు ఫ్యాక్టరీ తదితరాలు రాష్ట్రానికి రావాల్సి ఉన్నాయని తాము చెబుతున్నామని.. అదే విషయం కమిటీ చెప్పిందన్నారు. వీటిని సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.

'అవిశ్వాసం'పై కట్టుబడి ఉండు..

తొలి నుంచీ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఏదైతే చెబుతున్నారో అవే అంశాలను జేఎఫ్‌సీ ఇవాళ నిర్ధారించినందున.. పవన్ కల్యాణ్ ప్రతిపక్షాన్ని అభినందించి, మద్దతుగా నిలవాలని బుగ్గన సూచించారు. అలాగే తనకు ఇప్పుడు కనువిప్పు అయ్యిందని.. ప్రతిపక్షం చెప్పేది సరైనదేనని కూడా పవన్ చెప్పాల్సిన అవసరముందన్నారు. కాగా, అవిశ్వాస తీర్మానానికి ప్రాధాన్యం లేదని పవన్‌కల్యాణ్ చెప్పడాన్ని బుగ్గన తోసిపుచ్చారు. కేంద్రంపై అవిశ్వాసం పెట్టడానికి ముందుకు వస్తే మద్దతు కూడగడతానని పవన్ చెప్పారని, ఆ మాటకు ఆయన కట్టుబడి ఉండాలని హితవు పలికారు.

చంద్రబాబు అసమర్థతేంటో కూడా చెప్పు..

గత ఎన్నికల్లో నరేంద్రమోదీ, చంద్రబాబు ఇచ్చే హామీల అమలుకు పూచీ తనదేనని పవన్‌కల్యాణ్ ప్రకటించిన విషయాన్ని బుగ్గన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ లెక్కన రాష్ట్రానికి హోదా సాధించ లేకపోవడంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పవన్‌కూ భాగస్వామ్యం ఉందన్నారు. ఇప్పటికీ బీజేపీ–టీడీపీ కూటమిలో భాగస్వామిగా ఉన్న పవన్.. ప్రస్తుతం ఆ పాత్ర నుంచి క్రమంగా జడ్జిమెంట్ ఇచ్చే స్థాయికి రూపాంతరం చెందుతున్నట్లుగా కనిపిస్తోందన్నారు. అసలు తప్పెవరిదో.. రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాలను సాధించలేక పోయిందెవరో? కచ్చితంగా చెప్పాల్సిన బాధ్యత జడ్జిమెంట్ ఇచ్చే వారిపైనే ఉందని సూచించారు. అదేమీ చెప్పకుండా మొత్తం బాధ్యత కేంద్రానిదే అన్నట్లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని విస్మరించడం సరికాదని హితవు పలికారు. కేంద్రంలో టీడీపీ మంత్రులున్నారని.. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వానికి రాష్ట్ర ప్రయోజనాలు, హోదా సాధించుకోవాల్సిన బాధ్యత ఇంకా ఎక్కువగా ఉంటుందన్నారు. అందుకే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తోందని చెప్పారు. ప్రాంతీయ పార్టీ ప్రభుత్వాలు.. కేంద్రంపై ఒత్తిడి తెస్తేనే రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించుకోగలుగుతామన్నారు. అలా కానప్పుడు ఇక ప్రాంతీయ పార్టీ అనేది అనవసరమని.. జాతీయ పార్టీలో విలీనం చేసుకోవచ్చని టీడీపీకి బుగ్గన సూచించారు.

టెట్ ప్రాథమిక 'కీ' విడుదల

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్) ప్రాథమిక 'కీ'ని కన్వీనర్ ఎ.సుబ్బారెడ్డి ఆదివారం విడుదల చేశారు. పేపర్–1, పేపర్–2, పేపర్–3ల వారీగా గత నెల 21 నుంచి ఈ నెల 2 వరకు టెట్ పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. పేపర్లవారీగా, సెషన్ల వారీగా పేపర్–1.. 6, పేపర్–2.. 6, పేపర్–3 మూడు సెట్ల 'కీ'లను పాఠశాల విద్యాశాఖ టెట్ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఆయా సెషన్ల వారీగా సెట్ల ప్రశ్నపత్రాలు, 'కీ'లను అందుబాటులో ఉంచింది. ఆయా అభ్యర్థులు రాసిన ఆన్సర్ షీట్లను ఇంతకుముందే వారి ఈ–మెయిళ్లకు పంపినందున వాటితో సెట్ల వారీగా 'కీ' సరిచూసుకుని అభ్యంతరాలను ఈనెల 9లోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలి. అభ్యంతరాలకు సరైన ఆధారాలను కూడా పొందుపర్చాలి. అయితే కొన్ని ప్రశ్నలకు సమాధానాలపై సందేహాలు ఉన్నాయని, వాటిపై అభ్యంతరాలను తెలియచేస్తున్నామని కొందరు పేర్కొన్నారు. 23వ తేదీ నాటి పరీక్షలో పేపర్–1 మ్యాథమెటిక్స్‌లో 113వ ప్రశ్నకు ఇచ్చిన నాలుగు సమాధానాల్లో సరైన సమాధానం ఏదీ లేదని నిపుణులు చెప్పారు. మరికొన్ని అభ్యంతరాలను అభ్యర్థులు లేవనెత్తుతున్నా వాటికి సరైన ఆధారాలు లేవన్నారు. కాగా.. పేపర్–3కి తాము ఆంగ్ల భాషను ఎంపిక చేసుకోగా తెలుగుకు సంబంధించిన ప్రశ్నపత్రాలు వచ్చాయని కొందరు చెబుతున్నారు. అయితే ఆయా అభ్యర్థులు టెట్ పేపర్–2కి దరఖాస్తు చేసినప్పుడే ఏ లాంగ్వేజ్ అనేది ఆప్షన్ ఇచ్చారని, కన్వర్షన్ అనంతరం వారిచ్చిన ఆప్షన్ల మేరకే పరీక్ష పత్రాలు వస్తాయని అధికారులు పేర్కొన్నారు. ప్రశ్నపత్రం తప్పు వచ్చినట్లుంటే పరీక్ష రాసే సందర్భంలోనే అక్కడి ఇన్విజిలేటర్లకు చెప్పి ఉండాలన్నారు.

ఘనంగా ముగిసిన గుడారాల పండగ

నాలుగు రోజుల ప్రార్థనల్లో పాల్గొన్న 10 లక్షల మందికి పైగా భక్తులు




ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు, మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

గుంటూరు రూరల్: క్రీస్తులో నడిస్తే విజయాలు సొంతమవుతాయని, ఆయనే అందరి దేవుడని హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహం తెలిపారు. హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 41వ గుడారాల పండగ ప్రత్యేక ప్రార్థనా మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు పాస్టర్ అనిల్ ప్రత్యేక ప్రార్థన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందించిన బ్రదర్ అబ్రహం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సహోదర ప్రేమను కలిగి ఉండాలన్నారు. క్రీస్తు మనకు ప్రేమను అందించాడని, అదే ప్రేమను మనం ప్రతి ఒక్కరికి పంచాలని చెప్పారు. హృదయంలో దేవుడి వాక్యం ఉండాలని, అప్పుడే స్వచ్ఛమైన హృదయాన్ని కలిగి ఉంటామని తెలిపారు. క్రీస్తును ఎరిగినవారు ధన్యులవుతారని, వారికి పరలోక రాజ్యం ప్రాప్తిస్తుందన్నారు. హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ దేవుడి కోసం నిరీక్షించాలని, ఆయన దీవెనల కోసం వేచి చూడాలన్నారు. అనంతరం క్రీస్తు స్తుతి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరుగ నాగార్జున, నామినేటెడ్ ఎమ్మెల్యే ఫిలిప్, గుంటూరు అర్బన్ ఎస్పీ సీహెచ్ విజయారావు దంపతులు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఢిల్లీలో తలపెట్టిన ధర్నాకు తాము మద్దతు ఇస్తామని ఏపీ నాన్‌పొలిటికల్ జేఏసీ, నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీలు ప్రకటించాయి. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలను సాధించలేకపోతే రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీల ఇళ్లను ముట్టడిస్తామని సంఘాల నేతలు హెచ్చరించారు.


- తమిళనాడు దివంగత సీఎం జయలలిత సమాధి వద్ద ఆదివారం భద్రతా విధుల్లో ఉన్న కానిస్టేబుల్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల షిఫ్ట్‌కు మదురై పెరుంగుడికి చెందిన అరుణ్ రాజ్(26)తో పాటు నలుగురు విధులకు వచ్చారు. ఉదయం 4.50 సమయంలో హఠాత్తుగా అమ్మ సమాధి ముందు విధుల్లో ఉన్న అరుణ్‌రాజ్ తుపాకీతో కాల్చుకుని చనిపోయాడు.

సాక్షి
సాహిత్యం
విజయవాడ | సోమవారం | మార్చి | 5 | 2018
అభిప్రాయాలకు: sakshisahityam@gmail.com



గ్రేట్ రైటర్

విలియం ఫాక్‌నర్




పిల్లాడిగా కథలు వింటూ పెరిగాడు విలియం ఫాక్‌నర్ (1897–1962). అమెరికా పౌరుడిగా, అందునా దక్షిణాది రాష్ట్రమైన మిసిసిపి వాడిగా అక్కడి ఉత్తరాది రాష్ట్రాలకూ దక్షిణాది రాష్ట్రాలకూ మధ్య జరిగిన సివిల్ వార్ గాథలూ, నల్లవాళ్లు–తెల్లవాళ్ల బానిసత్వపు కథలూ, శ్వేతాధిపత్యాన్ని ప్రవచించిన 'కు క్లక్స్ క్లాన్' కథలూ, ఫాక్‌నర్ వంశీయుల కథలూ... వాటన్నింటి ప్రభావం వల్ల పదిహేడేళ్ల నాటికే రాయడం ప్రారంభించాడు. కథలు, నవలలు, కవిత్వం, వ్యాసాలు, సినిమాలకు స్క్రీన్‌ప్లేలు రాశాడు. 'ఎ రోజ్ ఫర్ ఎమిలీ' ఒక అమెరికన్ రాసిన అత్యంత ప్రసిద్ధ కథగా ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టింది. 'ద సౌండ్ అండ్ ద ఫ్యూరీ' ఇంగ్లిష్‌లో వెలువడిన వంద గొప్ప నవలల్లో ఒకటిగా నిలిచింది. 'యాజ్ ఐ లే డైయింగ్', 'లైట్ ఇన్ ఆగస్ట్', 'ద రీయవర్స్', 'ద ఫేబుల్', 'అబ్‌సలోమ్, అబ్‌సలోమ్!' ఆయన ఇతర రచనలు. 1949లో ఫాక్‌నర్‌ను నోబెల్ సాహిత్య పురస్కారం వరించింది.

ఒక మంచి కళాకారుడు తనకు సలహా ఇవ్వగలిగే స్థాయిలో ఎవరూ ఉండరని నమ్ముతాడు, అన్నారు ఫాక్‌నర్. తప్పులు చేస్తూనే నేర్చుకోవాలనీ, రచన అనేది యాంత్రికంగా ఏదో టెక్నిక్‌ను పాటించడం కాదనీ అనేవారు.

సాహిత్య మరమరాలు

మీరు తింటే నేను లొట్టలేస్తా!



ముళ్లపూడి వెంకటరమణ ఫోర్త్ ఫారంలో ఉన్నప్పుడే కథలు రాశాడు. అప్పుడు చెన్నైలోని కేసరి స్కూల్లో చదువుతున్నాడు. ఉపాధ్యాయుడి సలహా మేరకు కథలను ఒక పుస్తకంగా కుట్టి, పాఠశాల 'ఫౌండర్స్ డే' రోజు కె.ఎన్.కేసరికి అంకితమిచ్చాడు. కేసరి ఆయుర్వేద వైద్యంలో ప్రసిద్ధులు. గొప్ప సంపన్నుడు, గొప్ప దాత. పిల్లాడి తీరుకు ముచ్చటపడి తెల్లారి రమణను ఇంటికి పిలిపించాడు కేసరి. రమణ, వాళ్లమ్మ ఇద్దరూ 'కేసరి కుటీ'రానికి వెళ్లారు. రమణ వాళ్లమ్మ కేసరి వారి గృహలక్ష్మి ప్రెస్సులోనే పనిచేసేవారు. వెళ్లగానే కేసరి వీళ్ల ఆర్థిక పరిస్థితి వాకబు చేశారు.

ఇంతలో బంట్రోతు జిలేబీ, మసాలాదోసెతో రెండు ప్లేట్లు వాళ్ల ముందు తెచ్చిపెట్టాడు. 'తినండి' అన్నారు కేసరి. 'మరి మీరు' అన్నట్టు వాళ్లు చూశారు.

''అదేరా, నువ్వు పది దోసెలు తినగలవు– కాని ఒక్కటీ కొనలేవు. కాని నేను? వెయ్యి దోసెలు కొనగలను– కాని ఒక్కటీ తినలేను. నేనూ చిన్నప్పుడు నీలా బీదవాడినే. అప్పుడు డబ్బు లేనప్పుడు ఆకలి. ఇప్పుడు డబ్బొచ్చాక అజీర్ణం. తిండి అప్పుడూ లేదు ఇప్పుడూ లేదు. అదే గమ్మత్తు'' అన్నారు కేసరి.

రమణ, వాళ్లమ్మ అలాగే చూస్తూండిపోయారు.

''తినండి తినండి. నేను లొట్టలేస్తాను'' అని పక పక నవ్వారు కేసరి.

ప్రతిధ్వనించే పుస్తకం

చిల్లర దేవుళ్ళు



దాశరథి రంగాచార్య

'బ్రిటీషు రాజ్యంలోని బెజవాడ' నుంచి నైజాం రాజ్యంలోని ఒక గ్రామానికి ఆదరణ కోసం వస్తాడు సారంగపాణి. అతడికి సంగీతం తెలుసు. 'రాళ్ళను కరి'గించేలా పాడిన సారంగపాణి పాట విన్న దొర రామారెడ్డి తన గడీలోనే ఉండిపొమ్మంటాడు. గడీ దొరవారి ఖిల్లా. ఆ ఊరి మొత్తానికీ ఏకైక భవంతి. అక్కడినుంచీ సారంగపాణి కోణంలో నైజాం రాజ్యంలో స్వాతంత్ర్యానికి పూర్వపు తెలంగాణ చరిత్రను 'చిల్లర దేవుళ్ల'లో చిత్రిస్తాడు రచయిత దాశరథి రంగాచార్య. తెలంగాణ సాయుధ పోరాటం నాటి స్థితిగతులు, అప్పుడు వేళ్లూనుకొనివున్న దారుణమైన బానిస పద్ధతులను వివరిస్తాడు. 'పట్నం పోవడానికి ఎక్కిన బండి ముంగల ఒకడూ, బెడ్డింగు నెత్తిన పెట్టుకుని ఇంకొకడూ ఉరికి రావడం' చూస్తాడు. ఉరకలేనివాణ్ని దొర ములుగర్రతో బాదినప్పుడు అతడి ప్రాణం విలవిల్లాడుతుంది. బల్లమీద సర్దుతుండగా గాజుబిందె పగిలిపోతే పనివాడిని దొర లాగి కొడతాడు, కాలితో తంతాడు.

రామారెడ్డి కూతురు మంజరి. ఆమెకు సంగీతమంటే ప్రాణం. దాంతో ఇద్దరికీ పరస్పరం ప్రేమ అంకురిస్తుంది. వాళ్లింట్లోనే దాసి వనజ ఉంటుంది. ఆమె ఆడబాప. గడీకి వచ్చిపోయే అతిథులకు ఒక బొమ్మగా ఉండాల్సిన బతుకు. ఆమె 'కన్నెచెర'ను దొర బావమరిది ఇంద్రారెడ్డి విడిపిస్తాడు. ఈ ఇద్దరూ ఒకే ఈడు ఆడపిల్లలే అయినా మంజరి జీవితానికీ, వనజ బతుక్కీ ఉన్న తేడా గ్రహిస్తాడు సారంగపాణి. రామారెడ్డికి తోడు లంబాడీల పైకం తిన్న కరణం మరో ముఖ్యపాత్ర. దొరకీ కరణానికి వైరం ఉన్నప్పటికీ జనాన్ని అణిచివేయాల్సి వచ్చినప్పుడు ఇద్దరూ ఒకటేనని తెలుసుకుంటాడు. బాగా తాగి లంబాడోళ్ల లక్ష్మిపై అత్యాచారం చేయబోతాడు అమీను. ఆమె ఎదురుతిరిగితే కాల్చేస్తాడు. మొత్తంగా, అధికార రూపంలో వెలిసిన చిల్లర దేవుళ్లు జరిపిన దాష్టీకాలకు ఈ నవల అద్దం పడుతుంది. మతమార్పిడుల ప్రహసనం, అప్పటి తెలుగు భాష పరిస్థితి కూడా అవగతమవుతాయి.

కృష్ణ ఒడ్డున తప్పిపోయిన మేనల్లుడే సారంగపాణి అని తెలియడమూ, చివర్లో రామారెడ్డి మారిపోవడమూ కొంత నాటకీయంగా ఉన్నప్పటికీ సహజమైన తెలంగాణ నుడికారంతో సాగే ఈ నవల చరిత్రను అర్థం చేసుకోవడానికి తప్పక చదవాల్సిన నవల.

మిమ్మల్ని బాగా కదిలించిన పుస్తకం గురించి మాతో పంచుకోండి.
మెయిల్: sakshisahityam@gmail.com


కథాసారం

మానవత్వమే శీలం

ఢాం... ఢాం... ఢాం..!

బాంబుల ప్రేలుడుతో అర్ధరాత్రి ప్రశాంత వాతావరణం ఛిన్నాభిన్నమైంది. గాఢనిద్రలో వున్న గ్రామమంతా ఒక్క పెట్టున దద్దరిల్లి పోయింది.

ఊరివారందరికీ ఒకే సమయాన ఏదో మహాభయంకరమైన పీడకల వచ్చి నిద్ర నుండి త్రుళ్లిపడి లేచారా అన్నంత అలజడి. ఊరిచుట్టు పెరండ్లలో కుక్కల అరుపు. తల్లులు పిల్లలకు శ్రీరామరక్ష తీశారు.



గొల్ల రామవ్వ తన గుడిసెలో చీకటిలోనే కూర్చుని వుంది. ఆమె కాళ్లు చేతులు వణుకుతున్నవి, కొంత వృద్ధాప్యం వల్ల, కొంత భయం వల్ల. ఆమె ఒడిలో ఒక పదిహేనేండ్ల బాలిక తలదాచుకొని వుంది. పేరు మల్లమ్మ.

హఠాత్తున కిటికీ నెవరో తట్టారు. కిటికీ అంటే దాని ప్రాణమెంత? మంటిగోడలో వెల్తురు కొరకని ఉంచబడ్డ ఒక రంధ్రం. దానికి రెండు చిన్న తలుపులు. చప్పుడుకు వారిద్దరు ఉలికిపడ్డారు. శ్వాస బిగబట్టి జాగ్రత్తగా వినసాగారు. మళ్లీ అదే చప్పుడు. ఎవరో కిటికీ తలుపులు తట్టుతున్న మాట నిజం. గాలి కాదు, పిల్లి అసలే కాదు. ఏం చేయాలి?

ఇక లాభం లేదు. ముసలవ్వ మెల్లగా లేవసాగింది. మల్లమ్మ గుండె దడదడ మాత్రం మితిమీరింది. 'నాకు బయమైతాందే అవ్వ'.

'అట్లుండు! ఏదో చూత్తాం' అని ముసలవ్వ దృఢ నిశ్చయంతో లేచింది. గొళ్లెం తీస్తూ 'ఎవర్రా?' అంది. ఆ ప్రశ్న ఉచ్చరించబడిందో లేదో ముసలవ్వ నోరు గట్టిగా మూయబడింది. వెంటనే అతడే తలుపులు బిగించాడు.

ఏ రజాకారో ఇంట్లో దూరాడు. తనకు చావు తప్పదు. తానల్లారు ముద్దుగా పెంచి పెండ్లి చేసిన మనుమరాలికి మానభంగం తప్పదు. తాను పిల్లను సాది సంబాళించింది తుదకీ రాక్షసునికి ఒప్పగించడానికేనా? ఇంకొక్క అడుగులో తన బ్రతుకు కొనముట్టుతుంది. ఆ తరువాత పాపం మల్లి!

ముసలవ్వ వెంటనే ఆ వ్యక్తి రెండు కాళ్లు దొరికించుకుంది. 'నీ బాంచెను. నీ కాళ్లు మొక్కుత. అది నీ చెల్లెలనుకో'.

ఆ వ్యక్తి గుసగుసగా చెప్పాడు: 'నేను దొంగను కాను, రజాకార్ను కాను, పోలీసును కాను. మిమ్మల్నేమీ అనను'.

కాళ్లు పట్టుకొన్న ముసలవ్వ మెల్లగా లేస్తూ అతని మోకాళ్లు, నడుము తడుమసాగింది. చొక్కా లేదు. దేహమంతటా పల్లేరు కాయలు, జిట్టరేగు ముండ్లు. గాయాల నుండి స్రవిస్తున్న రక్తపు తడి. శరీరం జ్వరంతో రొట్టెపెంక వలె మసలి పోతున్నది. ఆ వ్యక్తి నిస్సహాయుడు. అపాయస్థితిలో హఠాత్తుగా తటస్థించిన శరణాగతుడు.

'మల్లీ! దీపం ముట్టియ్యే జెప్పన'

'వద్దవ్వా వద్దు. దీపం వెలిగించకు. పోలీసులు నా వెంటపడ్డారు, పట్టుకుంటారు'

'పోలీసుల కన్నా ముందు నిన్ను సావుదేవతే పట్టుకునేటట్టున్నది' గద్దించింది ముసలమ్మ.

మల్లమ్మ దీపం వెలిగించింది. ముసలవ్వ మూలకొక గొంగడి పరిచింది. అతడు పదునెనిమిదేండ్లకు మించని బక్కపలుచని యువకుడు.

'మల్లిపోరీ! కుంపటి మీద కడుముంతెడు నీళ్లెక్కియ్యే. ఎక్కిచ్చినవా? ఇగరా. కూకో వాని పక్కన. ముండ్లు తీసెయ్యి ఉల్లుల్లుగ. అయొ! సిగ్గయితాందా వాన్ని ముట్టుకుంటె? ఏం మానవతివి గదనే! పాపం పీనుగోలె పడున్నడుగాదె!' ముసలవ్వ గొణుగు మహాప్రవాహం వలె సాగిపోతున్నది. అందులోనే చివాట్లు, అందులోనే వినోదం, అందులోనే ఆజ్ఞలు.

యువకుని దేహమంతా శుభ్రమైంది. ఇంతలో తలె తెచ్చి, ముసలవ్వ యువకుని తలాపున కూర్చుంది. 'ఇగ లే కొడుకా. కొద్దిగంత గట్క చిక్కటి సల్లల పిసుక్కచ్చిన. పొయ్యే పాణం మర్లుతది. కులం జెడిపోతవని భయపడుతున్నవా? మొదలు పాణం దక్కిచ్చుకో్క'.

ఆమె మాటలకు చిరునవ్వుతో యువకుడు తలె అందుకున్నాడు. అందులోది నవజీవన సర్వస్వ సారమన్నట్టు గటగట త్రాగాడు. సగం పోయిన ప్రాణాలు తిరిగివచ్చాయి. కండ్లలో జీవనజ్యోతి వెలుగజొచ్చింది.

యువకుడి దేహాన్ని ప్రేమతో నిమురుతున్న ముసలవ్వ చేయి హఠాత్తుగా అతని చడ్డీ జేబు వద్ద ఆగింది. 'గిదేందిరో' అంటూ ఒక్క వస్తువ తీసింది.

'అది తోటాల తుపాకి' అన్నాడు యువకుడు.

'ఎందుక్కొడుకో తుపాకి? మమ్ములగిట్ల చంపుదమనుకున్నవా ఏంది?'

'లేదవ్వా! మిమ్మల్ని చంపేవాళ్లను చంపే అందుకది... ఈ రాత్రి ఇద్దరు పోలీసులను హతమార్చాను. మొన్న మీ గ్రామంలో నలుగురు నిర్దోషుల్ని కాల్చి చంపిన పోలీసులే'

'ఎందుకురా నీకు పోలీసోల్ల తోటి కైలాట్కం?'

'నేను స్టేట్ కాంగ్రెస్ వాలెంటియర్ను. నైజాం రాజుతోటి కాంగ్రెస్ పోరాడుతున్నది'

పెద్ద పెద్దోల్లేమో పట్నంల ముచ్చట్లు పెట్టుకుంటు కూకుంటరట, పసిపోరగాళ్లనేమో పోలీసోల్ల మీదికి పొమ్మంటరట... అని రామవ్వ కాసేపు గొణిగింది. కొద్దిగ కన్ను మలుపుకొమ్మని యువకునికి చెప్పింది.

పాలు పిండేవేళ అతిక్రమించి పోతున్నది. యువకుడు సుఖనిద్ర పోతున్నాడు.

అకస్మాత్తుగా బజారులో మోటారు ట్రక్కు చప్పుడైంది. ఎటు విన్నా బూటుకాళ్ల తటతటలే.

మల్లమ్మ గడగడలాడింది. యువకుడు దిగ్గున లేచాడు. బయటికి పోబోతే ముసలవ్వ వారించింది.

'అటో యిటో తేలిపోవాలి. నా వల్ల మీకు అపాయం కలుగుతుంది' అన్నాడు యువకుడు.

ముసలవ్వ అతణ్ని వెనక్కి నెట్టింది. రివాల్వరు లాగుకుంది. మినుకు మినుకు మంటున్న దీపాన్ని పూర్తిగా ఆర్పేసింది.

బయట మనుషుల అలికిడి.

మల్లమ్మకు చెప్పింది: 'పొల్లా! నిన్న మర్రి కొంరడు కట్టుటానికియ్యలె? ఆ దుప్పటిన్నూ కండువా తీస్కరా!...'

తలుపు మీద నాలుగుసార్లు దిబదిబమని దెబ్బలు పడ్డవి.

యువకుడిని దుప్పటి కట్టుకొమ్మంది. కండువాను నెత్తికి చుట్టుకొమ్మంది.

'ఓ రామీ! తల్పూకి ఖోల్'

మల్లివి రెండు దండె కడాలు తీయించి అతడికి తొడిగింది. 'గొల్ల వేషం' తయారైంది.

మళ్లీ తలుపు మీద దిబదిబ. 'ఓ రామీ! తల్పూ తీస్తా లేదూ. నీకి తోడ్కల్ తీస్తం ఖైర్. ఫౌరన్ తీ తల్పు'.

'మల్లీ! ఆ మూలకు మంచం వాల్చి గొంగడెయ్యే. పిల్లగా! అండ్ల పండుకో'

యువకునికి ఎటూ తోచలేదు. తుదకు పట్టుపడటమే నొసటన వ్రాసి యున్నట్లుంది. విధి లేక పడుకున్నాడు.

ముసలవ్వ ఇప్పుడిప్పుడే నిద్ర లేచిన దాని వలె ఆవలిస్తూ– 'ఎవర్రా పెద్ద దొంగనాత్తిరచ్చి తలుపు కొడ్తాన్రు. మీ ఇల్లు పాడుబడ. పోలీసోల్లు రాత్రి గత్తుకత్తె మీ యిపులు పెట్న బలుగుతయ్' అంది. 'మల్లీ! మాట్లాడక ఆ పోరని పక్కల పండు, ఊ నడూ!...

బయటినుండి 'మేం పోలీసోళ్లం' అన్నది ముసలవ్వ వినిపించుకోలేదు.

'నన్నేం దోసుకుంటర్రా? లేచి తలుపు తీసేదాక గూడా ఓపిక లేకపోతే పగులగొట్టుండ్రి. దీపమన్న ముట్టిత్తామంటే కుంపట్ల అగ్గిలేదు. మల్లికి నిన్న మొగడచ్చిండేమో, దానికి పట్టపగ్గాల్లేకుంటున్నది. ఏ పని చెప్పినా యినిపించుకోదు...'

'చెయ్యేసి పండుకో పోరడా దానిమీద. చూసెటోని కనుమానం రావద్దు... '

'ఓ మల్లీ! ఓరి మల్లిగా! ఊహూ వీల్లు లేవరు. వీల్ల వైసు వక్కలుగాను, బజార్ల గంత లొల్లాయితాంటె మా రాజుగ గుర్రుకొడతాన్రు... నా ముంగట్నే కొడుకూ కోడలూ రుచ్చాలోలె పడిపోయిన్రు. ఈ పోర్నినా నెత్తిన పడేశిన్రు. యాడున్నవురో కొడుకా' అంటూ రాగం పెట్టి ఏడవసాగింది.

> **కాళ్లు పట్టుకొన్న ముసలవ్వ మెల్లగా లేస్తూ అతని మోకాళ్లు, నడుము తడుమ సాగింది. చొక్కా లేదు. దేహమంతటా పల్లేరుకాయలు, జిట్టరేగు ముండ్లు. గాయాల నుండి స్రవిస్తున్న రక్తపు తడి.**

బయటివాళ్లు నానావిధాల మాట్లాడుతున్నారు. 'పాపం పోనీ' అని ఒకరు. 'అబ్బో ఈ ముసలిది చాలా బద్మాష్' అని మరొకరు. బయటినుంచి పగలగొట్టుదామనే లోపు తలుపు తీసింది.

'పోరి మెడల గంటెపుత్తెలున్నయి, పోరగానికి రెండు దండె కడియాలున్నయి, ఇగేం కావాల్నో తీసుకోండి' అంది.


అప్పుడే నిద్రలోంచి లేచినట్టు మల్లమ్మ కండ్లు నులుముకుంటూ లేచింది. యువకుడు కూడా లేచి కూర్చున్నాడు. యువకుని వైపు చూపిస్తూ పోలీసు 'వాడు కాంగ్రెసోడా యేం' అని ప్రశ్నించాడు.

'వాడెవ్వడా? ఎవ్వడు పడితే వాడు మా పక్కల్ల పండుటానికి మేమేం బోగమోల్లమనుకున్నవా? నిన్నెవడన్న గట్లనే అడుగుతె ఎట్లుంటది?' ముసలవ్వ తీవ్రతకు పోలీసులు చకితులైనారు. రేపు వీన్ని హాజరు చెయ్యాలని ఆదేశించి వెళ్లిపోయారు.

'అవ్వా నువ్వు సామాన్యురాలవు కావు, సాక్షాత్ భారతమాతవే' అన్నాడు యువకుడు.

'దోర్ద్! నాకే పేర్లు బెడుతున్నావు? నేను గొల్లరామిని. గంతే. ఇగ నువ్వెల్లు. మల్లిని అత్తోరింటికి తోలుకపోత'.

భారత మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు కథ 'గొల్ల రామవ్వ'కు సంక్షిప్త రూపం ఇది. ఈ కథ కాకతీయ పత్రికలో 1949లో అచ్చయింది. 'విజయ' కలంపేరుతో రాశారు. బహుభాషా కోవిదుడిగా కీర్తినొందిన పీవీ ఆత్మకథాత్మక నవల 'ఇన్‌సైడర్' (లోపలి మనిషి) రాశారు.



పి.వి. నరసింహారావు

కొత్త బంగారం

పెళ్లి కాలానికి మళ్లీ వెళ్తే...





రెయిన్‌బో రవెల్

అమెరికన్ రచయిత్రి రెయిన్‌బో రవెల్ రాసిన 'లాండ్‌లైన్'లో– జోర్జీ మిక్కోల్ పెళ్ళయి, ఇద్దరు పిల్లలున్న స్త్రీ. టీవీ సీరియళ్ళ రచయిత్రి. లాస్ ఏంజెలెస్‌లో ఉంటుంది. భర్త నీల్ ఉద్యోగం వదిలేసి, ఇంటినీ పిల్లల్నీ చూసుకుంటుంటాడు. భాగస్వామీ, స్నేహితుడూ అయిన సెత్‌తో కలిపి రాయవలసినది చాలా ఉండటంతో, భర్తతో కలిసి క్రిస్మస్ జరుపుకోవడానికి ఒమహాలో ఉన్న అత్తగారింటికి వెళ్ళలేనని జోర్జీ నిశ్చయించుకుంటుంది. ప్రయాణానికి రెండు రోజుల ముందు తన నిర్ణయాన్ని భర్తకి తెలిపినప్పుడు, అతను మౌనం వహిస్తాడు. తమ మధ్య సంబంధం తెగిపోతోందని ఆమె భావిస్తుంది.

భర్తా, ఇద్దరు కూతుళ్ళూ ఎయిర్ పోర్టుకి వెళ్ళిపోయిన తరువాత తన నిర్ణయం తప్పేమో అన్న సందేహం పుడుతుంది జోర్జీకి. ఒక వారంపాటు అసలేమీ రాయలేకపోయి, భర్తతో మాట్లాడ్డానికి ప్రయత్నిస్తుంది. కానీ అతను ఫోన్ ఎత్తడు. ఒంటరిగా ఉండటం ఇష్టంలేక తల్లి ఇంటికి వెళ్ళినప్పుడు, అల్లుడు కూతుర్ని వదిలిపెట్టాడని తల్లి అనుకుంటుంది. అక్కడ జోర్జీ ఐఫోన్ పాడయినప్పుడు, తన పాతగదిలో ఉన్న 'లాండ్‌లైన్'తో అత్తగారింటికి ఫోన్ చేసి నీల్‌తో మాట్లాడుతుంది. వేలితో నంబర్లు తిప్పే ఆ పసుపుపచ్చటి ఫోన్ కాలయాన పరికరం అయి, ఆమెని గతంలోకి తీసుకెళ్తుంది. తను మాట్లాడుతున్నది భర్త అయిన 2013 సంవత్సరపు నీల్‌తో కాదనీ, 1988 సంవత్సరంలో తనకి కాలేజీలో తెలిసిన 22 ఏళ్ళ నీల్‌తోననీ రెండోరోజు గుర్తిస్తుంది. ఏది యథార్థమో, ఏది భ్రమో తెలుసుకోని పరిస్థితి ఏర్పడుతుంది. 'నీ చుట్టూ ఉన్న దాని పట్ల నాకున్న అసహ్యం కన్నా, నీమీద నాకున్న ప్రేమ ఎక్కువ' అని నీల్ తనకి చెప్పాడని సంభాషణ వల్ల గుర్తొస్తుంది.

వాళ్ళిద్దరూ ఎలా కలుసుకుని ప్రేమలో పడ్డారో, కాలం గడిచేగొద్దీ ఎలా దూరం అయ్యారో పాఠకులకి తెలుస్తుంది. తనను పెళ్ళి చేసుకొమ్మని అడిగేటందుకు, గతంలో అతను ఒమహా నుంచి లాస్‌ఏంజెలెస్‌కి 27 గంటలు డ్రైవ్ చేసుకుంటూ వచ్చాడని గతకాలపు నీల్ ఫోన్లో చెప్పినప్పుడు, జోర్జీ తను రాయవలిసిన స్క్రిప్ట్ వదిలి– భర్త, కుటుంబంతో పాటు క్రిస్మస్ జరుపుకోవడానికి వెళ్తుంది. జోర్జీ, నీల్– రాజీపడి, భవిష్యత్తులో సమస్యలని కలిసే పరిష్కరించుకుందామని నిర్ణయించుకుంటారు.


సంబంధాలు ఎలా మారతాయో, మనుష్యులు పలుమార్లు ఒకరినొకరు కోల్పోయి తిరిగి ఎలా ఒకటైపోతారో, ముఖ్యమైన సంబంధాల పట్ల నిబద్ధత ఎలా పాటిస్తారో అని చెప్పే ఈ నవల అధిక భాగం సంభాషణలతోనే సాగుతుంది. ఏ తిట్లూ, దూషణలూ లేకపోయినా వైవాహిక జీవితంలో కూడా రాపిడీ, ఘర్షణా ఉన్నప్పుడు ఆ సంబంధం చిక్కులు పడే ఉంటుందన్న సంగతిని పుస్తకం చెబుతుంది. నవల్లో జోర్జీ పడిన మీమాంస అందరికీ వర్తించేదే: ఉద్యోగమా, కుటుంబమా?

చదవడానికి తేలికగా ఉండే ఈ పుస్తకం– ప్రేమనీ, పెళ్ళినీ నిర్వచిస్తూ, 'సంబంధంలో కేవలం ప్రేమ ఉంటే సరిపోతుందా!' అనే ప్రశ్నలని కూడా గుప్పిస్తుంది. రచయిత్రి స్వరం, జోర్జీ మానసిక స్థితినే కాక చుట్టుపక్కలున్న వారందరి అభిప్రాయాలనీ కూడా వ్యక్తపరుస్తుంది.


ఇది రవెల్ నాలుగవ నవల. పబ్లిష్ అయినది 2014లో. 'గుడ్‌రీడ్స్ ఛాయిస్ అవార్డ్ ఫర్ బెస్ట్ ఫిక్షన్ ఆఫ్ ద ఇయర్' గెలుచుకుంది. ఆడియో పుస్తకం కూడా ఉంది.

◆ కృష్ణ వేణి


ఈవారం పుస్తకాలు




ఈలపాట కల్యాణం రఘురామయ్య నటజీవితం
రచన: ఆచార్య మొదలి నాగభూషణ శర్మ; పేజీలు: 162(ఆర్ట్ పేపర్); వెల: రూ.250 (సీడీ ఉచితం); ప్రచురణ: క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్, 1-8-725/ఎ/1, 103సి, బాలాజీ భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్, నల్లకుంట, హైదరాబాద్–44; ఫోన్: 9848065658



ఉషశ్రీ: ఇంతింతై వటుడింతయై
రచన: అనామకుడు; పేజీలు: 140; వెల: 200; ప్రచురణ: ఉషశ్రీ మిషన్, రేడియో ఆర్టిస్టుల కాలనీ, విజయవాడ–520008. ఫోన్: 9848598797



తెలంగాణ వేగుచుక్కలు ఒద్దిరాజు సోదరులు
(జీవితం–సాహిత్యం)
రచన: కొండపల్లి నీహారిణి; పేజీలు: 726; వెల: 800; ప్రతులకు: రచయిత్రి, ప్లాట్ నం. 16–559, శ్రీ శ్రీ హోమ్స్, అల్మాస్‌గూడ, బడంగ్‌పేట్, సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా–500058. ఫోన్: 9866360082



సామాజిక ఒడంబడిక
మూలం: జాన్ జాక్ రూసో; అనువాదం: నాదెళ్ళ అనురాధ; పేజీలు: 162; వెల: 150; ప్రతులకు: అలకనంద ప్రచురణలు, 59–6–15, కంచుకోట వీధి, మేరీ స్టెల్లా కాలేజీ ఎదురుగా, విజయవాడ–520008. ఫోన్: 0866–2476966

బొమ్మల ప్రపంచం

చిన్నప్పుడు బడి ఎగ్గొట్టడానికి కథలు చెప్పేవాణ్ణి, ఉద్యోగం వచ్చాకా సెలవు కోసం కథలు చెప్పేవాణ్ణి, పెళ్ళయ్యాకా ఇంటికి లేటుగా వచ్చి అమ్మకు కథలు చెప్పేవాణ్ణి. అంతేరా! అలా కథలు అలవాటయ్యి పెద్ద రచయితను అయిపోయాను.



పదం పలికింది - పాట నిలిచింది

వెదురులోకి ఒదిగింది కుదురులేని గాలి



సినిమాలో ఒక పాత్ర వ్యక్తిత్వాన్ని పాటలో పట్టుకోవడం, అదీ కవితాత్మకంగా మలవగలగడం గీతరచయితకు ఒక సవాలు. దాన్ని విజయవంతంగా 'స్వర్ణకమలం' కోసం ఛేదించారు సిరివెన్నెల సీతారామశాస్త్రి. భానుప్రియ పోషించిన మీనాక్షి పాత్ర స్వభావాన్నీ, ఆమె జీవితంలో వచ్చిన పరిణామాలనూ ప్రకృతికి అన్వయిస్తూ *'కొత్తగా రెక్కలొచ్చెనా గూటిలోని గువ్వపిల్లకి/ మెత్తగా రేకు విచ్చెనా కొమ్మచాటునున్న కన్నె మల్లికి'* పాట రాశారు. ఇందులోని ఈ పాదాలు మరింత శ్రేష్ఠమైనవి:

'వెదురులోకి ఒదిగింది కుదురులేని గాలి
ఎదురులేక ఎదిగింది మధుర గానకేళి'
'కొండదారి మార్చింది కొంటెవాగు జోరు
కులుకులెన్నో నేర్చింది కలికి ఏటినీరు'.

దీనికి సంగీతం ఇళయరాజా. పాడినవారు ఎస్.జానకి, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. 1988లో వచ్చిన ఈ చిత్రానికి దర్శకుడు కె.విశ్వనాథ్. వెంకటేష్ నాయకుడు.

రారండోయ్

- 'రెండు దశాబ్దాల తెలంగాణ సాహిత్యం – సమాలోచన'(1996–2016) సదస్సు మార్చి 6, 7 తేదీల్లో ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల, గజ్వేల్‌లో జరగనుంది.
- 'వాడ్రేవు వీరలక్ష్మీదేవి సాహిత్య స్ఫూర్తి సదస్సు మరియు 'భారతీయ నవలాదర్శనం' ఆవిష్కరణ మార్చి 11న ఉదయం 10 గంటలకు మధుమహాలక్ష్మి కల్చరల్ సెంటర్, మొగల్రాజపురం, విజయవాడలో జరగనున్నాయి. నిర్వహణ: చినుకు పబ్లికేషన్స్.
- 'ధ్వని' మహిళా కవయిత్రుల కవితా పఠన కార్యక్రమం మార్చి 11న ఉదయం 10:30కు తెలంగాణ స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో జరగనుంది. నిర్వహణ: తెలంగాణ సాహిత్య సమాఖ్య.
- 'జ్ఞాపకాల్లో ఇంద్రవెల్లి' కవితాసంపుటి కోసం రచనలను ఆహ్వానిస్తున్నారు. మెయిల్: gyapakalloindravelli@gmail.com. వివరాలకు: ఎస్.సుధాకర్, ఫోన్: 9246216234
- మద్దూరి నగేశ్‌బాబు, పైడి తెరేశ్‌బాబు, కలేకూరి ప్రసాద్ జ్ఞాపకార్థం ఇవ్వనున్న 'ధిక్కార దళిత కవిత్రయ' అవార్డు కోసం దళిత కవులు తమ కృషిని తెలియజేస్తూ వారి సంకలనాలు పంపాల్సిందిగా దళిత సాహిత్య వేదిక ఆహ్వానిస్తోంది. పురస్కార నగదు 50 వేలు. వివరాలకు: పిల్లి మల్లికార్జున్, ఫోన్: 8096353324
- 'ఎవ్రీ డే విమెన్' ఛాయాచిత్ర ప్రదర్శనను హైదరాబాద్‌లోని సామాన్య శాస్త్రం గ్యాలరీలో మార్చి 6న సా. 6 గంటలకు మామిడి హరికృష్ణ ప్రారంభిస్తారు.

గ్రహం అనుగ్రహం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం. తిథి బ.చవితి రా.3.02 వరకు, తదుపరి పంచమి. నక్షత్రం చిత్త రా.10.37 వరకు, తదుపరి స్వాతి. వర్జ్యం ఉ.6.24 నుంచి 8.01 వరకు, తిరిగి తె.4.23 నుంచి 6.03 వరకు (తెల్లవారితే మంగళవారం). దుర్ముహూర్తం ప.12.33 నుంచి 1.20 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.42 వరకు. అమృత ఘడియలు సా.4.10 నుంచి 5.48 వరకు

సూర్యోదయం : 6.21
సూర్యాస్తమయం : 6.04
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు
ఫజర్ : 5.20
జొహర్ : 12.28
అసర్ : 4.45
మగ్రీబ్ : 6.24
ఇషా : 7.36

మేఘాలయ సారథి కన్రాడ్

రేపు సీఎంగా ప్రమాణ స్వీకారం • ఎన్పీపీ సారథ్యంలో కొలువుదీరనున్న సంకీర్ణ సర్కారు



- గవర్నర్‌కు ఎమ్మెల్యేల మద్దతు లేఖలు
- సర్కారులో బీజేపీతో పాటు మరో మూడు పార్టీలు

షిల్లాంగ్

మేఘాలయలో కాంగ్రెసేతర ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. బీజేపీ, ఇతర పక్షాల మద్దతుతో నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్పీపీ) అధ్యక్షుడు కన్రాడ్ కే సంగ్మా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కానున్నారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు మేఘాలయ కొత్త సీఎంగా ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎన్పీపీ సారథ్యంలో బీజేపీ, మరో మూడు పార్టీల సంకీర్ణ కూటమి తరపున ఆదివారం రాత్రి గవర్నర్ గంగా ప్రసాద్‌ను కలిసిన కన్రాడ్ సంగ్మా.. ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. తమకు మొత్తం 34 మంది ఎమ్మెల్యేల మద్దతుందని పేర్కొంటూ ఎమ్మెల్యేల మద్దతు లేఖల్ని అందచేయగా.. ప్రభుత్వ ఏర్పాటుకు కన్రాడ్‌ను గవర్నర్ ఆహ్వానించారు. ఇక ఈ ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్ తరపున ప్రభుత్వ ఏర్పాటు కోసం ఆ పార్టీ అగ్రనేతలు కమల్‌నాథ్, అహ్మద్ పటేల్‌లు రంగంలోకి దిగినా ఫలితం దక్కలేదు. కాగా మేఘాలయ సీఎం ముకుల్ సంగ్మా తన పదవికి రాజీనామా చేశారు. సంగ్మా రాజీనామాను గవర్నర్ ఆమోదించారని రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి.

ఉమ్మడి ఎజెండా మేరకు పనిచేస్తాం: కన్రాడ్

గవర్నర్‌ను కలిసిన అనంతరం కన్రాడ్ సంగ్మా మాట్లాడుతూ.. 'ఎన్పీపీకి చెందిన 19 మంది, యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ(యూడీపీ) నుంచి ఆరుగురు, పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) నుంచి నలుగురు, హిల్ స్టేట్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(హెచ్ఎస్‌పీడీపీ) నుంచి ఇద్దరు, బీజేపీకి చెందిన ఇద్దరు, ఒక స్వతంత్ర ఎమ్మెల్యే మద్దతు లేఖల్ని గవర్నర్‌కు సమర్పించాం' అని చెప్పారు. సంకీర్ణ సర్కారును నడిపించడం అంత సులువైన విషయం కాదని, అయితే మాకు మద్దతిస్తోన్న పార్టీలు ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి అజెండా మేరకు తమ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. లోక్‌సభ మాజీ స్పీకర్ పీఏ సంగ్మా కుమారుడే కన్రాడ్ సంగ్మా.. 2016లో తండ్రి మరణం అనంతరం తుర స్థానం నుంచి ఎంపీగా పోటీచేసి గెలుపొందారు.

కాంగ్రెస్ ప్రతిపాదనను తిరస్కరించా

సంకీర్ణ సర్కారులో కన్రాడ్ సంగ్మానే సీఎం అవ్వాలన్న షరతుపై మద్దతిచ్చేందుకు అంగీకరించామని యూడీపీ అధ్యక్షుడు డొంకుపర్ రాయ్ తెలిపారు. మేఘాలయలో సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని, తమ ప్రభుత్వంలో బీజేపీ కూడా భాగస్వామిగా ఉంటుందని ఆయన చెప్పారు. కాంగ్రెస్, యూడీపీలు చెరి రెండున్నరేళ్లు ముఖ్యమంత్రి పదవిని పంచుకునేలా తనను కలిసి మాజీ సీఎం ముకుల్ సంగ్మా ప్రతిపాదించగా తిరస్కరించానని, కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. అంతకముందు రాయ్‌ను బీజేపీ నేత, కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు కలిసి కాంగ్రెసేతర ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించారు.

ప్రభుత్వ ఏర్పాటుకు పోటాపోటీగా..

మేఘాలయలో హంగ్ అసెంబ్లీ ఏర్పడడంతో ప్రభుత్వ ఏర్పాటు కోసం శనివారం మధ్యాహ్నం నుంచి కాంగ్రెస్, ఎన్పీపీలు పోటాపోటీగా పావులు కదిపాయి. అతి పెద్ద పార్టీగా నిలిచిన కాంగ్రెస్ శనివారం రాత్రే గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత తెలిపింది. కమల్‌నాథ్, అహ్మద్ పటేల్, సీపీ జోషీలు మేఘాలయ చేరుకుని మంత్రాంగం నడిపించారు. ఇతర చిన్న పార్టీలతో సంప్రదింపులు జరిపినా ప్రయోజనం దక్కలేదు. 'నిబంధనల మేరకు అతి పెద్ద పార్టీగా ప్రభుత్వ ఏర్పాటుకు ముందుగా మమ్మల్నే ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరాం' అని కమల్‌నాథ్ తెలిపారు. మేఘాలయలో 59 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగగా.. కాంగ్రెస్ 21 స్థానాలు గెలుచుకుని అతి పెద్ద పార్టీగా అవతరించింది.

నాగాలాండ్‌లో నేనంటే.. నేను!

- ప్రభుత్వం ఏర్పాటుకు ముందుకు వచ్చిన రియో, జెలియాంగ్
- మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్న వారే సీఎం: గవర్నర్



రియో



జెలియాంగ్

కోహిమా: నాగాలాండ్ ప్రభుత్వం ఏర్పాటులో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రభుత్వం ఏర్పాటు చేస్తామంటూ నాగాలాండ్ డెమొక్రటిక్ ప్రొగ్రెసివ్ పార్టీ(ఎన్‌డీపీపీ) నేత నేఫియో రియో, నాగాలాండ్ పీపుల్స్ ఫ్రంట్(ఎన్‌పీఎఫ్)కు చెందిన టీఆర్ జెలియాంగ్ గవర్నర్‌ను కలవటంతో రాజకీయాలు కొత్త మలుపు తిరిగాయి. ఆదివారం ఉదయం ఎన్‌డీపీపీ నేత రియో గవర్నర్ పీబీ ఆచార్యను కలిసి తనకు 32 మంది సభ్యుల మద్దతు ఉందని చెప్పారు. అనంతరం ఆపద్ధర్మ ముఖ్యమంత్రి టీఆర్ జెలియాంగ్ కూడా గవర్నర్ వద్దకు వెళ్లి మెజారిటీ సభ్యుల మద్దతు ఉందని తెలిపారు. వీరితో సమావేశాల అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. ఇద్దరికీ 48 గంటల సమయం ఇచ్చాననీ, మెజారిటీ సభ్యుల మద్దతుతో లేఖలు ఎవరు తీసుకువస్తే వారినే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరతానన్నారు. రియో వెంట ఎన్‌డీపీపీ అధ్యక్షుడు చింగ్వాంగ్ కొన్యాక్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విసాసోలీ లౌంగు, జనతాదళ్(యు) ఎమ్మెల్యే, మరో స్వతంత్ర ఎమ్మెల్యే ఉన్నారని గవర్నర్ చెప్పారు. రియోకు చెందిన ఎన్‌డీపీపీకి 18, బీజేపీకి 12 మంది సభ్యుల బలం ఉందని తెలిపారు. జెలియాంగ్‌కు చెందిన ఎన్పీఎఫ్‌కు 26 మంది సభ్యులుండగా ఇద్దరు నాగాలాండ్ పీపుల్స్ పార్టీ, ఒక జేడీయూ ఎమ్మెల్యే మద్దతు ఉందని చెప్పారన్నారు. అయితే ఇదే జేడీయూ ఎమ్మెల్యే రియోకు కూడా మద్దతు తెలిపారన్నారు. ఇలా ఉండగా, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి జెలియాంగ్ రాజీనామాకు నిరాకరించారు.

నాగాలాండ్‌లో సంకీర్ణ ప్రభుత్వం: రామ్‌మాధవ్

ఎన్‌డీపీపీతో కలిసి నాగాలాండ్‌లో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం ఖాయమని బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ తెలిపారు. 60 సీట్లున్న అసెంబ్లీలో రెండు పార్టీలతోపాటు జేడీయూ, ఇండిపెండెంట్ అభ్యర్థులతో కలిపి సాధారణ మెజారిటీ ఉందని తెలిపారు.

టీ అమ్ముతూ నెలకు 12 లక్షలు



నవ్‌నాథ్

పుణె: చాయ్ అమ్ముతూ నెలకు ఎంత సంపాదించొచ్చు? వ్యాపారం బాగా జరిగినా రోజుకు వెయ్యి రూపాయలు ఆదాయం పొందడం గగనం. అలాంటిది పుణెలో ఓ వ్యక్తి మాత్రం చాయ్ అమ్మి ఏకంగా నెలకు రూ. 12 లక్షలు ఆర్జిస్తున్నాడు. అతనే నవ్‌నాథ్ యేవలే. పుణెలో టీకి మంచి డిమాండ్ ఉన్నప్పటికీ ప్రఖ్యాత టీ బ్రాండ్లు, ఔట్‌లెట్‌లు ఏవీ లేవని 2011లో యేవలే గుర్తించారు. ఆ తర్వాత తాను ఆ వ్యాపారం చేయాలని నిర్ణయించుకుని తన టీ రుచి ఎలా ఉండాలనే దానిపై నాలుగేళ్లు పరిశోధనలు చేశారు. అనంతరం మరికొందరిని భాగస్వాములుగా చేర్చుకుని తన పేరుమీదనే చాయ్ దుకాణం తెరిచారు. కొద్దిరోజుల్లోనే ఆయన టీకి భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో పుణెలోనే మరో రెండు చోట్ల యేవలే ఔట్‌లెట్‌లను తెరిచారు. ఇప్పుడు ఒక్కో ఔట్‌లెట్‌లో 12 మందికి ఆయన ఉపాధి కల్పిస్తున్నారు. రోజుకు దాదాపు 4 వేల కప్పుల చాయ్ అమ్ముడుపోతోంది. త్వరలోనే యేవలే టీ స్టాల్‌ను ప్రపంచస్థాయికి తీసుకెళ్తాననీ, మరో వంద టీ స్టాల్స్ ఏర్పాటు చేసి మరింత మందికి ఉద్యోగాలిస్తానని ఆయన చెబుతున్నారు. పకోడీలు అమ్ముకోవడం కూడా ఉద్యోగమేనని ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఇటీవల వ్యాఖ్యానించడంతో దానిపై తీవ్ర చర్చ జరగడం తెలిసిందే. ఆ అంశాన్ని ప్రస్తావిస్తూ 'పకోడా వ్యాపారంలా కాకుండా మేం చాయ్ అమ్మి ఉపాధి కూడా కల్పిస్తున్నాం' అని నవ్‌నాథ్ అన్నారు.

80 శాతం ఖాతాలకు ఆధార్ లింకు

న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాలతో ఆధార్‌తో అనుసంధానానికి గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. ఇప్పటికే 80 శాతం బ్యాంకు ఖాతాలు, 60 శాతం ఫోన్ నంబర్లతో ప్రజలు ఆధార్‌తో అనుసంధానం చేసుకున్నట్లు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికారిక సంస్థ (యూఐడీఏఐ) వెల్లడించింది. లెక్కలోకి రాని డబ్బును ఏరివేసేందుకు ప్రతి బ్యాంకు ఖాతాను 12 అంకెల ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేసుకునేందుకు కేంద్రం 2018 మార్చి 31 వరకు గడువు విధించిన విషయం తెలిసిందే. అలాగే పాన్ నంబర్‌ను కూడా కచ్చితంగా ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచించింది. మొత్తం 109.9 కోట్ల బ్యాంకు ఖాతాలకు గాను 87 కోట్ల ఖాతాలు ఆధార్‌తో అనుసంధానమైనట్లు అధికారులు తెలిపారు.

వైట్‌హౌస్ ముందు వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ముందు ఓ వ్యక్తి తనకు తాను తుపాకితో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ సమయంలో వంద మందికి పైగా ప్రజలు అక్కడ ఉన్నారని అధికారులు తెలిపారు. సదరు వ్యక్తి వైట్‌హౌస్ ఫెన్సింగ్ వద్దకు చేరుకోగానే పలు రౌండ్లు షూట్ చేశాడు. మొదట తన ఫోన్‌ను కాల్చిన తర్వాత తనకు తాను షూట్ చేసుకున్నాడు. ఈ ఘటనలో సామాన్య ప్రజలకు ఎలాంటి హాని జరగలేదని వెల్లడించారు. ఆ సమయంలో అధ్యక్షుడు ట్రంప్, ఆయన భార్య మెలానియా ఫ్లోరిడాలో ఉన్నారని పేర్కొన్నారు.


కశ్మీర్ కాల్పుల్లో ఉగ్రవాది సహా నలుగురు మృతి

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పుల్లో ఒక ఉగ్రవాది సహా నలుగురు మరణించారు. పాహన్ సమీపంలో ఒక కారును ఆపేందుకు యత్నించగా.. అందులోని వ్యక్తులు ఆగకుండా వేగంగా వెళ్లడంతో భద్రతా బలగాలు వారిపైకి కాల్పులు జరిపాయని పోలీసు అధికారి తెలిపారు. ఉగ్రవాదులు కూడా కాల్పులకు పాల్పడ్డారని, ఎదురుకాల్పుల్లో ఉగ్రవాదితో పాటు మరో ముగ్గురు మరణించారని ఆయన తెలిపారు. మృతిచెందిన ఉగ్రవాదికి ఆ ముగ్గురూ సహాయకులుగా పనిచేశారని అధికారులు చెప్పారు.

ఉమా సుధీర్‌కు చమేలీ దేవి అవార్డు

న్యూఢిల్లీ: ఎన్డీటీవీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఉమా సుధీర్ 2017 సంవత్సరానికి ప్రతిష్టాత్మక చమేలీ దేవి అవార్డుకు ఎంపికయ్యారు. రాజకీయాలు, పిల్లలు, మహిళలు, మానవ హక్కులు, వ్యవసాయం, గ్రామీణ సమస్యలు, మైనారిటీల సమస్యలు తదితరాలపై ఆమె విస్తృతంగా వెలువరించిన కథనాలకు ఈ గుర్తింపు లభించింది. ఉమా సుధీర్ విశ్లేషణాత్మక కథనాలు క్షేత్రస్థాయిలో వాస్తవాలపై అవగాహన కలిగించేందుకు దోహదపడ్డాయని అవార్డు అందించే మీడి యా ఫౌండేషన్ పేర్కొంది. కుష్టు వ్యాధి వల్ల వేలిముద్రలు కోల్పోయి ప్రభుత్వ పథకాలకు దూరమైన వారి దుస్థితిపై కథనాలు రాసిన న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జర్నలిస్టు సురక్షను కూడా తగిన విధంగా గౌరవించాలని జ్యూరీ సిఫార్సు చేసింది.

మెసేజ్, కాల్స్‌తోనూ పర్యావరణానికి ముప్పు



టొరంటో: మెసేజ్, కాల్స్‌తో పర్యావరణానికి నష్టం ఎలాగా అని ఆలోచిస్తున్నారా..? ఈ రెండింటితోనే కాదు.. మీరు డౌన్‌లోడ్ లేదా అప్‌లోడ్ చేసే వీడియోలు, వీడియో కాల్స్, ఇంటర్నెట్ వినియోగం వీటన్నిటి వల్ల పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతోందని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఎందుకంటే వీటిని ప్రాసెస్ చేయడానికి పెద్దఎత్తున డేటా కేంద్రాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు నిరంతరాయం పనిచేస్తుంటాయి. దీంతో ఈ కేంద్రాల నుంచి భారీగా వెలువడే కర్బన ఉద్గారాల వల్ల పర్యావరణానికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతోందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. 2040 నాటికి పర్యావరణానికి జరిగే నాశనంలో స్మార్ట్‌ఫోన్స్, డేటా సెంటర్లదే అధిక భాగం ఉంటుందని హెచ్చరించారు. దీనిలో భాగంగా స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్స్, ట్యాబ్లెట్స్, డెస్క్‌టాప్స్, డేటా సెంటర్లు, ఇతర కమ్యూనికేషన్ నెట్‌వర్క్స్‌లో వినియోగించే కర్బన ఉద్గారాలపై వారు పరిశోధన చేపట్టారు. ప్రస్తుతం ఈ రంగం నుంచి వెలువడే కర్బన్ ఉద్గారాల శాతం 1.5 గా ఉందని.. 2040 నాటికి 14 శాతానికి చేరుకుంటుందన్నారు.

త్రిపుర కొత్త సీఎం విప్లవ్!

- 6న బీజేపీ–ఐపీఎఫ్‌టీ ఎమ్మెల్యేల భేటీ
- ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన మాణిక్
- ఏచూరి ప్రతిపాదనపై పునరాలోచనలో సీపీఎం



అగర్తలా: త్రిపుర తదుపరి ముఖ్యమంత్రిగా ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విప్లవ్ కుమార్ దేవ్ నియమితులు కానున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు నిర్ణయం జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. బీజేపీ–ఐపీఎఫ్‌టీ (ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర) కూటమి ఎమ్మెల్యేలు మంగళవారం సమావేశమై తమ ముఖ్యమంత్రిని ఎన్నుకోనున్నారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ హాజరవనున్నారు. విప్లవ్ మాట్లాడుతూ 'నేను ఇంకా బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎన్నిక కాలేదు. మాణిక్‌ను కలసి ఆశీర్వాదం తీసుకున్నాను' అని చెప్పారు. త్రిపురలో పుట్టి పెరిగిన విప్లవ్ తన గ్రాడ్యుయేషన్ అనంతరం ఢిల్లీ వెళ్లి 16 ఏళ్లు ఆరెస్సెస్‌లో పనిచేశారు. అనంతరం 2015లో త్రిపురకు తిరిగొచ్చి బీజేపీలో కీలక బాధ్యతలు చేపట్టారు. 2016లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడయ్యారు. గతేడాది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీలోకి తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించారు. విప్లవ్ సీఎంగా ఈనెల 8న ప్రమాణం చేసే అవకాశముంది.

మాణిక్ సర్కార్ రాజీనామా

శాసనసభ ఎన్నికల్లో ఓడిపోవడంతో త్రిపుర ప్రస్తుత సీఎం మాణిక్ సర్కార్ తన పదవికి రాజీనామా చేశారు. మాణిక్ ఆదివారం గవర్నర్ తథాగత రాయ్‌ని కలసి తన రాజీనామా లేఖను సమర్పించారు. 1998 నుంచీ త్రిపుర సీఎంగా ఉన్న మాణిక్ సర్కార్.. బీజేపీ కొత్త ముఖ్యమంత్రి బాధ్యతలు తీసుకునే వరకు పదవిలో కొనసాగుతారు. త్రిపురలో 59 స్థానాలకు ఎన్నికలు జరగ్గా బీజేపీ–ఐపీఎఫ్‌టీ కూటమి 43, సీపీఎం 16 సీట్లు గెలుపొందడం తెలిసిందే. కాగా, మంత్రివర్గంలో తమ పార్టీకి గౌరవనీయమైన ప్రాతినిధ్యం కల్పించాలని బీజేపీని ఐపీఎఫ్‌టీ కోరింది. బీజేపీ 35 స్థానాల్లో గెలవడంతో సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగే స్థితిలో ఉంది. అటు ఐపీఎఫ్‌టీ 9 స్థానాల్లో పోటీచేసి 8 చోట్ల గెలిచింది.

కాంగ్రెస్‌తో పొత్తుపై పునరాలోచన..

జనవరిలో సీపీఎం కేంద్ర కమిటీ సమావేశం జరిగినప్పుడు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలని పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రతిపాదించారు. అయితే ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ, భవిష్యత్తులో కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తులూ ఉండకూడదంటూ పార్టీ శ్రేణులు అప్పట్లో ఓ ముసాయిదా తీర్మానం కూడా చేశాయి. వచ్చే నెలలో సీపీఎం మహాసభలు జరగనున్నాయి. ఇప్పుడు త్రిపురలో ఓటమి నేపథ్యంలో ఆ తీర్మానాన్ని వెనక్కు తీసుకునే అవకాశముంది. 'కాంగ్రెస్‌తో పొత్తులు, సర్దుబాట్లు ఉండకూడదని గతంలో నిర్ణయించాం. కానీ ఇప్పుడు పునరాలోచించాల్సిన అవసరం ఉంది' అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు హన్నన్ మొల్లా చెప్పారు.

ఎస్పీ అభ్యర్థులకు బీఎస్పీ మద్దతు!

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ జోరును అడ్డుకునేందుకు ఎస్పీ, బీఎస్పీలు జట్టు కట్టనున్నాయా? తాజా ఘటనలు అవుననే చెబుతున్నాయి. ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్, ఉపముఖ్యమంత్రి కేశవప్రసాద్ మౌర్యల రాజీనామా కారణంగా జరుగుతున్న రెండు లోక్‌సభ స్థానాల ఉప ఎన్నికల్లో ఎస్పీ అభ్యర్థులకు బీఎస్పీ పరోక్షంగా మద్దతు తెలిపింది. బీజేపీని ఓడించగల అభ్యర్థికే తమ పార్టీ కార్యకర్తలు ఓటేస్తారని బీఎస్పీ అధినేత్రి మాయావతి ఆదివారం ప్రకటించారు. అలాగే, త్వరలో జరగనున్న రాజ్యసభ, ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)తో అవగాహనకు వచ్చినట్లు మాయావతి చెప్పారు. రాజ్యసభ ఎన్నికల్లో తమ అభ్యర్థి గెలిచేలా ఎస్పీ సాయపడుతుందనీ, అనంతరం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము ఆ పార్టీకి సాయపడేలా అవగాహన కుదిరిందన్నారు.

దేశ విభజనకు కారణం నెహ్రూనే

ఫరూక్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్య



జమ్మూ: దేశ విభజన అంశంపై జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశ విభజనకు జవహర్‌లాల్‌నెహ్రూనే కారణమని ఆరోపించారు. శనివారం జమ్మూలోని షేర్–ఇ–కశ్మీర్ భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'దేశ విభజనకు మహ్మద్ అలీ జిన్నా కారణం కాదు.. అప్పటి జాతీయ నేతలు జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్‌లే కారణం. ముస్లింలకు మైనారిటీ హోదా ఇచ్చేందుకు ఈ ముగ్గురు నేతలు అంగీకరించకపోవటమే విభజనకు దారి తీసింది. మొదట్లో జిన్నా పాకిస్తాన్ కావాలని అడగలేదు. ముస్లింలకు, సిక్కులకు ప్రత్యేక ప్రాతినిధ్యం ఇచ్చేందుకు కాంగ్రెస్ నిరాకరించటంతో ప్రత్యేక దేశం డిమాండ్ వైపు జిన్నా మొగ్గు చూపటానికి దారి తీసిందని నేను భావిస్తున్నాను. లేకుంటే దేశం విడిపోయేది కాదు..బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లు ఉండేవి కావు, భారత్ మాత్రమే ఉండేది' అని తెలిపారు. మతాన్ని రాజకీయాల్లో వాడుకోవటాన్ని ఆయన ఖండించారు. మతం ఆధారంగా దేశాన్ని విభజించవద్దని ఆయన బీజేపీని కోరారు. ఇది దేశ అభివృద్ధికి, ఐక్యతకు, శాంతికి విఘాతం కలిగిస్తుందని చెప్పారు. దేశ విభజనకు కారకులెవరనే అంశంపై గత కొన్నేళ్లుగా సర్వత్రా చర్చ సాగుతోంది. పాకిస్తాన్ విడిపోవటానికి నెహ్రూ కారణమని కొందరు.. కాదు, జిన్నానే కారణమని మరికొందరు వాదిస్తున్నారు.

పాక్ సెనెట్‌కు హిందూ మహిళ

చరిత్ర సృష్టించిన కృష్ణకుమారి కోల్హీ



కరాచీ: పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌కు చెందిన కృష్ణకుమారి కోల్హీ చరిత్ర సృష్టించారు. ఆ దేశ సెనెట్‌కు ఎన్నికైన తొలి హిందూ దళిత మహిళగా రికార్డుకెక్కారు. సింధు ప్రావిన్స్‌లోని థార్ జిల్లాలో ఉన్న మారుమూల ధనగామ్ గ్రామానికి చెందిన కోల్హీ (39).. ఆ ప్రావిన్స్‌లోని రిజర్వ్ స్థానానికి బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలోని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) తరపున పోటీ చేసి సెనెటర్‌గా గెలుపొందారు. పాక్‌లో మైనార్టీలకు హక్కులున్నాయని తెలిపేందుకు కోల్హీ గెలుపే నిదర్శనమని భుట్టో పేర్కొన్నారు. కోల్హీ మాట్లాడుతూ.. 'నేనో మానవ హక్కుల కార్యకర్తను. మైనార్టీలు.. ముఖ్యంగా హిందువులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తున్నా. ఈ స్థానంలో మరో మహిళను కూడా పీపీపీ నామినేట్ చేసి ఉండొచ్చు. కానీ మైనార్టీలకు అండగా ఉన్నామని చెప్పేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు' అని అన్నారు.

మూడేళ్లు జైల్లో..

1979లో ఓ పేద రైతు కుటుంబంలో జన్మించిన కోల్హీ.. మూడేళ్లపాటు తన కుటుంబం, బంధువులతో కలసి ఓ ప్రైవేట్ జైలులో బానిసగా జీవించారు. 'నేను, నా కుటుంబం, బంధువులు ఉమర్‌కోట్‌లోని ఓ భూస్వామికి చెందిన ప్రైవేటు జైల్లో బానిసలుగా ఉన్నాం. ఆ ప్రాంతంపై పోలీసులు దాడి చేసినప్పుడు అక్కడి నుంచి బయటపడ్డాం' అని కోల్హీ చెప్పారు. ఆ ఘటన జరిగినప్పుడు తాను చిన్న పిల్లనని.. మైనార్టీ మహిళలు, చిన్నారుల కోసం పోరాటం సాగించాలని అప్పుడే నిర్ణయించుకున్నానన్నారు. 16 ఏళ్ల వయసులో 9వ గ్రేడ్ చదువుతున్నపుడు లాల్ చంద్‌ను కోల్హీ వివాహమాడారు. 2013లో సింధ్ వర్సిటీ నుంచి సోషియాలజీలో మాస్టర్స్ పూర్తి చేశారు.

విద్వేష రాజకీయాలను తిరస్కరించారు

- బీజేపీకి ఏకగ్రీవంగా అధికారం కట్టబెట్టారు
- ఈశాన్య రాష్ట్రాల ఫలితాలపై ప్రధాని మోదీ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

బెంగళూరు: విద్వేష రాజకీయాలను ఈశాన్య రాష్ట్రాల ప్రజలు తిరస్కరించారని, అదే సమయంలో బీజేపీకి ఏకగ్రీవంగా అధికారం కట్టబెట్టారని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష కూటమిని ఓడించి బీజేపీ జయకేతనం ఎగురవేసిన సంగతి తెలిసిందే. ఆదివారం బెంగళూరుకు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుమకూరులో నిర్వహించిన యూత్ కన్వెన్షన్‌ను ఉద్దేశించి మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. ఈ సందర్భంగా త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితం తమకు అమితానందం ఇచ్చిందని పేర్కొన్నారు. తుమకూరులోని రామకృష్ణ వివేకానంద ఆశ్రమం సిల్వర్ జూబ్లీ వేడుకలు, స్వామీ వివేకానంద శిష్యురాలు సిస్టర్ నివేదిత 150వ జయంతి వేడుకల సందర్భంగా ఈ కన్వెన్షన్‌ను ఏర్పాటు చేశారు. 'యూత్ పవర్: కొత్త భారతదేశానికి ఓ విజన్'అనే అంశంపై మోదీ ప్రసంగిస్తూ.. అతివాద భావజాలా నికి ఏకత్వంతోనే సరైన సమాధానం ఇవ్వగలమన్నారు. భారత భూభాగంతో సంబంధం లేదనే భావనను గత పాలకులు ఈశాన్య రాష్ట్రాల ప్రజల్లో నాటుకునేలా చేశారని, తమ ప్రభుత్వం వారిలోని ఈ ఆందోళనను తొలగించేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు.

ఇంద్రాణితో కలిపి కార్తీ విచారణ

కార్తీని ఢిల్లీ నుంచి ముంబైకి తీసుకువచ్చిన సీబీఐ





ముంబై: ఐఎన్ఎక్స్ మీడియా కేసు విచారణలో భాగంగా సీబీఐ ఆదివారం కార్తీ చిదంబరంను ఢిల్లీ నుంచి ముంబైలోని బైకుల్లా జైలుకు తీసుకు వచ్చింది. అక్కడ ఐఎన్ఎక్స్ మీడియా మాజీ డైరెక్టర్, షీనా బోరా హత్య కేసులో నిందితురాలిగా ఉన్న ఇంద్రాణి ముఖర్జియాతో కలిపి విచారణ జరిపింది. ఇద్దరినీ ఒకే చోట కూర్చోబెట్టిన ఆరుగురు సభ్యుల సీబీఐ బృందం ఉదయం 11.15 గంటల నుంచి నాలుగు గంటల పాటు ప్రశ్నించింది. మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో కార్తీని తిరిగి విమానాశ్రయానికి, అక్కడి నుంచి ఢిల్లీకి తీసుకెళ్లింది. ఇద్దరినీ విచారణ జరుపుతున్న సమయంలో బైకుల్లా జైలు గేట్లను మూసి వేశారు. చిదంబరం కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో 2007లో ఆయన కుమారుడు కార్తీ నిబంధనలకు విరుద్ధంగా ఐఎన్ఎక్స్ మీడియాలోకి రూ.305 కోట్ల విదేశీ నిధులకు అనుమతులు మంజూరు చేయించారనీ ఇంద్రాణి ఇటీవల సీబీఐ ఎదుట అంగీకరించారు.

నేటి నుంచే మలిదశ పోరు



బ్యాంకు కుంభకోణాలపై నిలదీస్తాం: ప్రతిపక్షాలు

'ఫ్యూజిటివ్ ఎకనామిక్ అఫెండర్స్ బిల్లు' ప్రవేశపెడతాం: కేంద్రం

న్యూఢిల్లీ: పార్లమెంట్ మలిదశ బడ్జెట్ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. దాదాపు నెల రోజుల విరామం అనంతరం జరగబోతున్న ఈ సమావేశాల్లో.. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం సహా ఇతర బ్యాంకు కుంభకోణాలపై కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సమావేశాలు వాడీవేడిగా కొనసాగడం ఖాయంగా కన్పిస్తోంది. బ్యాంకు కుంభకోణాలపై 267 నిబంధన కింద చర్చించాలని ఇప్పటికే రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌కు కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ నోటీసు ఇచ్చారు. బ్యాంకు కుంభకోణాలపై ప్రధాని సమాధానం కోసం పట్టుబడతామని ఆయన తెలిపారు. ఆర్థిక నేరగాళ్లకు చెక్ పెట్టేందుకు 'ఫ్యూజిటివ్ ఎకనామిక్ అఫెండర్స్ బిల్లు'ను తీసుకొస్తున్నామని పేర్కొంటూ ప్రతిపక్షాల ప్రశ్నలకు దీటుగా బదులిచ్చేందుకు అధికార పక్షం సిద్ధమవుతోంది. ఈ చట్టం అమల్లోకి వస్తే పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్ల ఆస్తుల్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వానికి అధికారాలు సంక్రమిస్తాయి. ఈ బిల్లుకు గురువారమే కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఈ సమావేశాల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహాల్ని ప్రతిపక్షాలు ఇంతవరకూ ఖరారు చేయకపోయినా.. ఒకట్రెండు రోజుల్లో సమావేశం కావచ్చని తెలుస్తోంది. బ్యాంకు కుంభకోణాలతో పాటు దళితులు, మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, రైతుల సమస్యలు, దేశ ఆర్థిక వ్యవస్థ, నిరుద్యోగం తదితర అంశాలతో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీ అరెస్టు నేపథ్యంలో.. రాజకీయ ప్రత్యర్థులపై కేంద్ర ప్రభుత్వ కక్ష సాధింపును పార్లమెంటులో నిలదీస్తామని ఆనంద్ శర్మ తెలిపారు. సమావేశాలపై సీపీఐ నేత డి.రాజా మాట్లాడుతూ.. పీఎన్‌బీ కుంభకోణం ఎలా చోటుచేసుకుందో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామన్నారు. ఇతర ప్రతిపక్షాలతో కలిసి ప్రభుత్వ తీరును ఉభయ సభల్లో ఎండగడతామని తృణమూల్ నేత డెరెక్ ఒబ్రియెన్ తెలిపారు.

పలు బిల్లులు ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

బడ్జెట్ సమావేశాల మలిదశలో సాధారణంగా వివిధ శాఖలకు అవసరమైన నిధుల కేటాయింపుపై చర్చలు కొనసాగుతాయి. అలాగే ఆమోదం కోసం ఉభయ సభల్లో ప్రభుత్వం కొన్ని బిల్లుల్ని ప్రవేశపెట్టనుంది. లోక్‌సభలో గ్రాట్యుటీ చెల్లింపు(సవరణ)బిల్లు 2017, ప్రత్యేక పరిహారం(సవరణ) బిల్లు, డెంటిస్ట్స్ (సవరణ) బిల్లును మంగళవారం ప్రవేశపెడతారు. మోటారు వాహనాల(సవరణ) బిల్లు 2017, ద స్టేట్ బ్యాంక్స్(రద్దు, సవరణ) బిల్లు 2017ను సమావేశాల మొదటి రోజున రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశాల్లోనే ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం పొందేందుకు ప్రతిపక్షాలతో సంప్రదింపుల్ని కేంద్రం ముమ్మరం చేయనుంది.

యువతోత్సాహం


శ్రీరాంనగర్ కాలనీ నుంచి పాదయాత్ర ప్రాంతానికి బైక్‌పై వస్తున్న యువతి


అద్దంకి శివారులో జగన్, జనం పరస్పర అభివాదం


అద్దంకి బహిరంగ సభకు హాజరైన జనసందోహం

కేంద్రం నుంచి వైదొలగడమే తొలి అస్త్రం కావాలి

- చంద్రబాబేమో అదే చివరి అస్త్రం అంటున్నారు..
- ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మండిపాటు
- ఇలాగైతే అవిశ్వాసం ఎప్పుడు పెడతారు?
- రాజీనామాలు ఎప్పుడు చేస్తారు?
- నాలుగేళ్లు గడిచినా ఇంకా తాత్సారమా?
- కాలయాపన చేయడానికే ఈ డ్రామాలా?
- నాలుగేళ్లు కేంద్రంలో మంత్రి పదవులనుభవించారు..
- ఇంకా సరిపోదన్నట్లు ప్రజలను మభ్యపెడుతున్నారు..
- ఈ పెద్దమనిషికి చిత్తశుద్ధి లేదనడానికి ఇదే నిదర్శనం
- పెద్ద పెద్ద హామీలిస్తూ మళ్లీ మోసం చేయడానికి వస్తారు
- క్షమించారంటే కొండచిలువలా అందర్నీ మింగేస్తారు
- ఇలాంటి నాయకుడు అవసరమా..? ఆలోచించండి

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: 'కేంద్ర ప్రభుత్వం నుంచి టీడీపీ వైదొలగడమే తొలి అస్త్రం కావాలి. చంద్రబాబేమో అది చివరి అస్త్రం అంటున్నారు. అలాగైతే ఎప్పుడు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతారు..? ఎప్పుడు రాజీనామాలు చేస్తారు..? నాలుగేళ్లుగా కేంద్రంలో మంత్రి పదవులు అనుభవించారు. ఇది సరిపోదన్నట్లు రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా ఆ పదవులను పట్టుకుని ఇంకా వేలాడుతున్నారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదనడానికి ఇదే నిదర్శనం' అని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 103వ రోజు ఆదివారం ప్రకాశం జిల్లా అద్దంకిలో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే వ్యవహారంలో చంద్రబాబు రోజుకో మాట.. పూటకో అబద్ధం చెబుతున్నారని, ఊసరవెల్లికే ట్యూషన్లు చెప్పేలా తయారయ్యారని ధ్వజమెత్తారు. ప్రత్యేక హోదా సాధించే వరకు తమ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. 5న (నేడు) ఢిల్లీలో ధర్నా చేస్తామని, 21న అవిశ్వాస తీర్మానం పెడతామని చెప్పారు. చంద్రబాబు పార్ట్‌నర్ (పవన్ కళ్యాణ్) ఆయనతో మాట్లాడి మద్దతు కూడగట్టాలని విజ్ఞప్తి చేశారు. నాలుగేళ్లుగా చంద్రబాబు అవినీతి పాలన సాగిస్తూ.. లంచాలు దిగమింగి ఇప్పుడు అమాయకత్వాన్ని నటిస్తున్నారన్నారు. ఈ సభలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

హోదా కోసం ఎందాకైనా...

''రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈనెల 1న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేసింది. 3న పార్టీ నేతలు ఢిల్లీకి పయనమయ్యారు. 5న ఢిల్లీలో హోదా కోసం ధర్నా చేయబోతున్నారు. మంగళవారం నుంచి పార్లమెంట్ వేదికగా వైఎస్సార్‌సీపీ ఎంపీలు వీరోచిత పోరాటం చేస్తారు. అప్పటికీ కేంద్రం దిగి రాకపోతే మార్చి 21న కేంద్రంపై అవిశ్వాసం పెడతాం. అయినా కేంద్రం స్పందించకపోతే ఏప్రిల్ 6న పార్టీ ఎంపీలు రాజీనామా చేసి వాళ్ల ముఖాన కొట్టి రాష్ట్రానికి వస్తారు. చంద్రబాబు పార్ట్‌నర్‌కు చిత్తశుద్ధి ఉంటే అవిశ్వాసానికి టీడీపీ ఎంపీల మద్దతు కూడగట్టాలి. మొత్తం 25 మంది ఏపీ ఎంపీలు రాజీనామాలు చేస్తే కేంద్రం దిగిరాదా? నిన్న ఆయన పత్రికలో చూసినట్టు గుర్తు.. అవిశ్వాసానికి చంద్రబాబు ముందుకు రారట.. రాజీనామాలకూ ముందుకు రారట. కేంద్ర మంత్రి వర్గం నుంచి తన మంత్రుల్ని ఉప సంహరించడం ఆఖరి అస్త్రమట. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తేనే పరిశ్రమలు వస్తాయి. పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. హోదా ఉంటే ఆదాయపన్ను, జీఎస్టీ మినహాయింపు, కరెంటు రాయితీలుంటాయి. అవి ఉంటే ఎవరైనా వచ్చి పరిశ్రమలో, హోటళ్లో, ఆస్పత్రులో పెడతారు. ఈ విషయం తెలిసి కూడా చంద్రబాబు చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నారు. పూటకో మాట, రోజుకో నాటకం ఆడుతున్నారు. ఇప్పటికే నాలుగేళ్లు గడిచాయి కనుక హోదా కోసం తొలి అస్త్రంగా కేంద్రం నుంచి వైదొలుగుతూ మంత్రులు రాజీనామా చేయాలి.

ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా ఎక్కడ?

ఈ ఏడాది ఖరీఫ్, రబీలలో కలిపి 32 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. రబీలో అయితే అక్టోబర్, నవంబర్‌లో కురవాల్సిన వర్షాలు కురవలేదు. జనవరిలో చుక్కవాన లేదు. దీంతో వర్షపాతం లోటు రబీలో 95 శాతం దాటింది. ఇంతటి దారుణమైన పరిస్థితుల్లో రైతులున్నప్పుడు ఏ ముఖ్యమంత్రి అయినా ముందుకు వచ్చి ఆదుకుంటాడు. కానీ మన ఖర్మ ఏమిటంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయనకు ఇవేవీ పట్టవు. ఖరీఫ్‌లో కరవు వస్తే రబీ సీజన్‌కు అయినా ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పించి తోడుగా నిలవాలి. కానీ ఈ పెద్ద మనిషి ఆ ఆలోచన చేయడు. ఏ పంటకూ గిట్టుబాటు ధర రాని దుస్థితి. నాలుగేళ్లుగా ఇదే తీరు. ఇందులోనూ రాజకీయాలు చేయడమే పనిగా పెట్టుకుంటాడు. కందులు, శనగలకు గిట్టుబాటు ధర రాలేదని జగన్ అంటున్నాడు గనుక నామ్‌కే వాస్తేగా కందులు కొనండని మార్కెటింగ్ అధికారులను ఆదేశిస్తున్నట్టు ప్రకటనలు ఇచ్చాడు. రైతులు మార్కెట్‌కు వెళితే రూ.5,450 కనీస మద్దతు ధరకు కొనాల్సిన కందుల్ని రూ.4 వేలకు మించి కొనడం లేదు. రైతులు కష్టపడుతూ మార్కెట్‌కు వెళితే కేవలం 2 బస్తాలే కొంటున్నారు. అందులోనూ తేమ శాతం ఎక్కువగా ఉందని కోతలు పెడుతున్నారు. దీంతో రైతులు తిరిగి దళారుల్నే ఆశ్రయించాల్సి వస్తోంది. అక్కడా తెలుగుదేశం దళారులే. రైతుల నోట మట్టి కొడుతున్నారు. అసలీ ప్రభుత్వానికి మానవత్వం ఉందా?

అంచనాలు పెంచుకున్నా పనులు చేయలేదు..

తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు గుండ్లకమ్మ ప్రాజెక్టుకు టెంకాయలు కొట్టి శంకుస్థాపనలు చేశాడు. ఆతర్వాత పట్టించుకోలేదు. ఆ తర్వాత ముఖ్యమంత్రి అయిన వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.579 కోట్లతో ప్రాజెక్టు చేపట్టి పూర్తి చేసి జాతికి అంకితం చేశాడు. ఆ తర్వాత ఆయన మన మధ్య లేకుండా వెళ్లిపోయారు. ఇప్పుడు చంద్రబాబు తన నాలుగేళ్ల పాలనలో మిగిలిపోయిన కాల్వ పనులను పూర్తి చేయలేకపోయాడు. కుడి కాల్వ కింద 52 వేల ఎకరాల ఆయకట్టు ఉంటే చివరి 5 వేల ఎకరాలకు, ఎడమ కాల్వ కింద ఉన్న 28 వేల ఎకరాల ఆయకట్టులో 12 వేల ఎకరాలకు నీరు అందని పరిస్థితి. రూ.13 కోట్లతో అయిపోయే ఈ పనులకు చంద్రబాబు తన లంచాల కోసం అంచనాలను రూ.161 కోట్లకు పెంచినా ఇంత వరకు పనులు చేయలేదు. లంచాల మీద తప్ప నీళ్లు ఇద్దామనే ధ్యాసే లేదు. ఈ ప్రాంత ప్రజల కల భవనాశి రిజర్వాయర్. దివంగత నేత వైఎస్సార్ ఆనాడు రూ.170 కోట్లతో ఈ రిజర్వాయర్‌ను తలపెట్టి భూ సేకరణ కూడా పూర్తి చేస్తే ఈ నాలుగేళ్లలో చంద్రబాబు దాన్ని అసలు మరిచే పోయాడు. ఏదన్నా చెబితే దున్నపోతు ముందు శంఖం ఊదినట్టే ఉంది.


జగన్‌కు నాగలి అందజేస్తున్న అద్దంకి సమన్వయకర్త చెంచుగరటయ్య

ఆరోగ్యశ్రీకి పూర్వ వైభవం తెస్తాం

చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో అస్తవ్యస్తమైన ఆరోగ్యశ్రీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే విప్లవాత్మక మార్పులు తీసుకొస్తాం. మనందరి ప్రభుత్వం రాగానే ప్రతి పేదవానికీ ఉచితంగా ఎంత పెద్ద ఆపరేషనైనా.. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాలలో ఎంతటి పెద్ద ఆస్పత్రిలోనైనా చేయించుకునేలా ఆరోగ్యశ్రీని ఆధునీకరిస్తాం. రూ.1000 ఖర్చు దాటే ప్రతి వ్యాధిని ఆరోగ్య శ్రీ కిందికి చేర్చి ఉచితంగా వైద్యం చేయిస్తాం. చికిత్స అనంతరం డాక్టర్ల సలహా మేరకు తీసుకునే విశ్రాంతి సమయానికీ డబ్బులు ఇస్తాం. కిడ్నీ, తలసీమియా వ్యాధులతో బాధపడే వారికి రూ.10 వేల పెన్షన్ ఇస్తాం. చెవిటి, మూగ పిల్లలకు కాక్లియర్ ఇంప్లాంట్ వంటి ఆపరేషన్ చేయించాలంటే రూ.ఆరేడు లక్షలు ఖర్చు అవుతుంది. మన ప్రభుత్వం రాగానే ఈ ఆపరేషన్లను ఉచితంగా చేయిస్తాం. పేదల కోసం నాన్నగారు ఒక అడుగు ముందుకు వేస్తే ఆయన కొడుకుగా నేను రెండడుగులు ముందుకు వేస్తాను.

నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు, మోసాలు

బాబు నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు, మోసాలు. ఇటువంటి నాయకుడు మనకు అవసరమా? ఆలోచించండి. ఈ చెడిపోయిన రాజకీయ వ్యవస్థలో విశ్వసనీయత, నిజాయితీ రావాలి. ఎవరైనా రాజకీయ నాయకుడు మైకు పట్టుకుని ఏదయినా చెప్పి చేయకపోతే రాజీనామా చేసి ఇంటికి పోయే పరిస్థితి రావాలి. మోసాలు, అబద్ధాలు చెప్పే వ్యక్తుల్ని క్షమిస్తే రేపొద్దున పెద్ద పెద్ద మోసాలు చేస్తారు. ఇదే చంద్రబాబు మీ ముందుకు వచ్చి.. ప్రతి ఇంటికీ కేజీ బంగారం, ఇంటికో బెంజికారు అంటారు. వాటినీ నమ్మరనుకుంటే ఒక్కొక్కరికీ రూ.3 వేలు డబ్బు ఇస్తామంటారు. రూ.3 వేలు ఇస్తామంటే రూ.5 వేలు గుంజండి. అదంతా మన జేబులు కత్తిరించి దోచిన సొమ్మే. కానీ మీ మనస్సాక్షి ప్రకారం ఓటేయండి. అబద్ధాలు, మోసాలు చేసే వ్యక్తులను బంగాళాఖాతంలో కలపాలి. అప్పుడే ఈ రాజకీయ వ్యవస్థలో మార్పు వస్తుంది. ఈ పని జగన్ ఒక్కడి వల్లే కాదు. మీ అందరి సహాయ సహకారాలు, ఆశీర్వాదాలు, దీవెనలు కావాలి'' అని జగన్ అన్నారు.

అనగనగా ఓ కొండచిలువ..

చంద్రబాబు గారి గిమ్మిక్కులు, నాటకాలు చూస్తుంటే ఒక కథ గుర్తుకు వస్తోంది. ఆ కథ ఏమిటంటే.. అనగనగనగా ఒక మంచి మనిషి ఉన్నాడంట. ఒకసారి అనుకోకుండా అతను ఉన్న ప్రాంతంలో వరదలు వచ్చాయి. అప్పుడు తన దగ్గర ఉన్న పశువులు, మేకలు, కోళ్లను తీసుకొని పైతట్టు ప్రాంతానికి వెళుతుండగా ఒక కొండ చిలువ వరద నీళ్లలో కొట్టుకుపోతూ కనిపించింది. కొండచిలువ అని తెలిసినా అయ్యోపాపం అనుకుని అతను దానిని కాపాడాడు. ఆ తర్వాత దానిని తన దగ్గరే పెట్టుకొని సాకడం మొదలు పెట్టాడు. కొండచిలువ తన బుద్ధిని పోనిచ్చుకుంటుందా? ఆ మంచి మనిషి దగ్గర ఉన్న మేకలు, కోళ్లను ఆ మనిషి చూడనప్పుడు తినడం మొదలుపెట్టింది. ఏరకంగా అయితే చంద్రబాబు ఆ తొమ్మిదేళ్లలో ప్రజలను పీల్చి పిప్పి చేశాడో అదేమాదిరి. ఏందబ్బా.. నేను కొండచిలువను తొమ్మిదేళ్లు ఆదరిస్తే నాకున్న కోళ్లు, మేకలను తినేస్తోందని ఆ మనిషికి విసుగెక్కి ఆ కొండచిలువను బహిష్కరించాడు. ఆ తర్వాత అది పదేళ్లు కనపడలేదు. నేను మారిపోయాను, నన్ను క్షమించేసెయ్.. నన్ను నీదగ్గరే పెట్టుకో అని పదేళ్ల తర్వాత అది ఆ మనిషి దగ్గరకు వచ్చింది. పాపం ఆయన దానిని నమ్మాడు. చంద్రబాబును నమ్మి 2014లో అధికారం అప్పగించినట్లు. కొండచిలువ ఈసారి ఆ మంచి మనిషి దగ్గర ఉన్న మేకలు, కోళ్లనే కాకుండా ఆవులను, ఆవుదూడలను కూడా తినడం మొదలు పెట్టింది. రైతులు, పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలు, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి.. రాజధాని భూములతో చంద్రబాబు అవినీతి చేసినట్లన్నమాట. దీంతో మంచి మనిషికి కొండచిలువపై విసుగుపుట్టి ఏదోఒకటి చేయాలనే నిర్ణయానికి వచ్చాడు. అప్పుడు ఆ కొండచిలువ ఆ మంచి మనిషిని విపరీతంగా ప్రేమిస్తున్నట్లు నటించడం మొదలు పెట్టింది. మనిషి రాగానే చుట్టూ పెనవేసుకుని ముఖం మీద నాకేది. కొండచిలువ ఎందుకింత ప్రేమ చూపిస్తోందనుకున్నాడు. ఇప్పుడు ఏ విధంగా చంద్రబాబు ప్రేమను చూపిస్తున్నాడో అలా.. రేషన్ కార్డు అందటం లేదా.. అయ్యోనాకు ఇప్పుడే తెలిసింది. పెన్షన్లు అందటం లేదా అయ్యో నాకు ఇప్పుడే తెలిసింది. ఆరోగ్యశ్రీ హైదరాబాద్‌లో అమలు కావడం లేదా.. నాకు ఇప్పుడే నా దృష్టికొచ్చింది. మీకు ప్రత్యేక హోదా రాలేదా? 14వ ఆర్థిక సంఘం అలా చెప్పలేదా? నాకు ఇప్పుడే తెలిసిందని ఏరకంగా చంద్రబాబునాయుడు విపరీతమైన దొంగప్రేమ చూపిస్తున్నాడో ఆమాదిరిగా కొండచిలువ దొంగప్రేమ చూపించింది. ఒకరోజు కొండచిలువ ఉన్నట్లుండి పూర్తిగా తినడం మానేసిందంట. చంద్రబాబు అంటుంటారు చూశారా... వారానికి ఏడు రోజుల నుంచి ఎనిమిది రోజులు నేను కష్టపడుతున్నాను, రోజుకు 24 గంటలు ఉంటే 25 గంటలు కష్టపడుతున్నానని చెబుతున్నాడు కదా అలాగ. పాపం మంచి మనిషి కావడంతో కొండచిలువను డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాడు. డాక్టర్ దానిని పరీక్షించి.. 'అయ్యా.. నువ్వు మంచి మనిషివి కాబట్టి కొండచిలువ ఈ విధంగా చేస్తోంది. ఇది మాయదారి కొండచిలువ. ఇది నిన్ను ఎందుకు పెనవేసుకుంటుందంటే దాని బలంతో నిన్ను నలిపేయగలనా లేదా అని చూసుకుంటోంది. ఎందుకు నీ ముఖాన్ని నాకుతోందంటే నీతల దాని నోట్లో పడుతుందో లేదో చూసుకునేందుకు' అని డాక్టర్ చెప్పాడట. దాంతో ఆ మంచి మనిషికి కొండచిలువ గురించి అర్థమైందట. ఇవాళ చంద్రబాబునాయుడు చేస్తున్న మాయదారి పనులన్నీ మీరు చూస్తున్నారు. ఇప్పుడు ఈ వ్యక్తి రాష్ట్రంలో ఏమీ వదల్లేదు. అన్నీ తినేశాడు. పొరపాటున ఈ మనిషిని క్షమిస్తే రేపొద్దున ఏమవుతుందో తెలుసా? అందరినీ పూర్తిగా మింగేస్తాడు. చంద్రబాబు చిత్తశుద్ధి చూసి ఈ మాటలు చెప్పాల్సి వస్తోంది.

103వ రోజు

04-03-2018, ఆదివారం
అద్దంకి శివారు, ప్రకాశం జిల్లా



గెలవడం కోసం ఇన్ని అడ్డదారులు తొక్కాలా?

నాన్నగారే ఉంటే అద్దంకి ఇలా దయనీయంగా ఉండేదా? ఈ నియోజకవర్గంలో ఈ రోజు సాగిన పాదయాత్రలో చాలామంది అన్న మాట ఇది. నిజమే.. గుండ్లకమ్మ ప్రాజెక్టు, భవనాశి రిజర్వాయర్, యర్రం చిన్నపోలిరెడ్డి ఎత్తిపోతల.. ఆయన పథకాలే. రూ.592 కోట్ల అంచనా విలువున్న గుండ్లకమ్మకు నాలుగేళ్లలోనే దాదాపు రూ.579 కోట్లు వెచ్చించి ఆయన హయాంలోనే పూర్తిచేసి, జాతికి అంకితం చేశారు. కొద్దిపాటి కాల్వ పనులే మిగిలాయి. కానీ, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. మిగిలిన ఐదు శాతం పనుల అంచనాలను భారీగా పెంచాడు. కమీషన్ల కోసం రూ.13 కోట్ల అంచనాను కాస్తా.. రూ.161 కోట్లకు తెచ్చాడు. నిధులు మింగడమే తప్ప పనులు కదలడం లేదు. భవనాశి, యర్రం చిన్నపోలిరెడ్డి పథకాలను పూర్తిగా గాలికొదిలేశాడు. చాలా బాధనిపించింది. కాసుల కక్కుర్తిని కాస్త పక్కన పెడితే.. ఎంతమంది రైతన్నల కళ్లల్లో ఆనందం కనిపిస్తుందో కదా. మన ప్రభుత్వంలో ఇలాంటి పెండింగ్ ప్రాజెక్టులకు జీవం పోయాలన్నదే నా తపన.

పేద బ్రాహ్మణులపైనా చంద్రబాబుకు ఇంత కసేంటయ్యా.. అంటూ బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు ఒకింత కలవరపడ్డారు. రూ.500 కోట్లతో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుచేసి ప్రతి పేద బ్రాహ్మణుడినీ ఆదుకుంటానని ఆశలు కల్పించాడట. అధికారం చేజిక్కింది.. ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది.. అన్నారు. అరకొర నిధులు విదిల్చాడట. ఆ నిధుల వినియోగంలో కూడా అక్రమాలు, పక్షపాతమేనట. పారదర్శకత మచ్చుకైనా కన్పించడం లేదన్నారు. పచ్చ చొక్కా వేసుకుంటేనే.. కార్పొరేషన్ ద్వారా లబ్ధిపొందే పరిస్థితి ఉందన్నారు. ఇదేం అన్యాయం.. ఇదెక్కడి మోసం.. అని ప్రశ్నించిన కార్పొరేషన్ చైర్మన్‌ను అర్ధాంతరంగా, అవమానకరంగా గెంటివేయడం అన్యాయం కాదా.. అని ప్రశ్నించారు. అర్హులైన పేద బ్రాహ్మణులందరికీ న్యాయం చేయాల్సిందిపోయి.. కొద్దిమంది అధికార పార్టీ నాయకుల అనుయాయులకు మాత్రమే పరిమితం చేయడం శోచనీయమన్నారు. నాన్నగారి హయాంలో 13 వేల దేవాలయాలకు.. ఒక్కో దానికి రూ.3,000 చొప్పున ధూపదీప నైవేద్యాల కింద నిధులిచ్చారని, కానీ చంద్రబాబు ఆ దేవాలయాల సంఖ్యను 3000కు కుదించారని వాపోయారు. ఆ పేద బ్రాహ్మణుల గోడు విన్నాక నాకు అన్పించింది.. గెలవడం కోసం ఇన్ని అడ్డదారులు తొక్కాలా.. ఇన్ని అబద్ధాలాడాలా.. కులానికో పేజీ పెట్టి, నయ వంచనకు ప్రణాళికలు వేయాలా.. అని.

మా కష్టం వినండన్నా.. అంటున్న భవన నిర్మాణ కార్మికులతో కాసేపు ముచ్చటించాను. నాన్నగారు వారి కోసం కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, భరోసా కల్పించారట. ప్రభుత్వ, ప్రయివేటు నిర్మాణాల్లో ఒక శాతం వాటా సెస్ రూపంలో ఆ బోర్డుకు వెళ్లేదట. ఆపదొస్తే ఆ నిధులు అందేవన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాడు.. పరిస్థితి అంతా మారిపోయిందని చెప్పారు. దాదాపు రూ.350 కోట్లు చంద్రన్న బీమాకు మళ్లించారని తెలిపారు. కార్మిక శాఖలో అధికారులు తిరిగే వాహనాలకూ మా డబ్బే ఇస్తున్నారయ్యా.. అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రన్న బీమా ఏ కార్మికుడి కన్నీళ్లూ తుడవకపోయినా.. ఆ పథకం ప్రచార డబ్బులన్నీ మా నిధుల నుంచే ఖర్చుచేస్తున్నారు.. అంటూ వాపోయారు. సొమ్మొకరిది.. సోకొకరిదా సార్.. అంటూ ఆవేదనగా అన్నారు. నిజమే.. చెమటోడ్చి పోగేసుకున్న వాళ్ల సంక్షేమ నిధితోనూ సర్కారు సోకులు చేయడం చాలా అన్యాయం అనిపించింది.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. కేవలం నాలుగున్నర సంవత్సరాల వ్యవధిలో నాన్నగారు రూ.579 కోట్లు ఖర్చుపెట్టి గుండ్లకమ్మ ప్రాజెక్టును దాదాపు పూర్తిచేయగా.. అదే నాలుగేళ్ల మీ పాలనలో కేవలం రూ.13 కోట్లు ఖర్చుచేస్తే పూర్తయ్యే మిగిలిన ఐదు శాతం పనులను ఎందుకు పూర్తిచేయలేకపోయారు? నాన్నగారికి పేరొస్తుందన్న దుర్బుద్ధితో పేద ప్రజలను బలిపెట్టడం ధర్మమేనా? మిగిలిన ఆ కొద్దిపాటి పనులను కూడా మీ అక్రమార్జనకు మార్గంగా వాడుకోవడం అన్యాయం కాదా? మీ అక్రమార్జన కోసం రూ.13 కోట్ల విలువ చేసే ఐదు శాతం పనుల విలువల్ని రూ.161 కోట్లకు పెంచడం ప్రజా ధనాన్ని దోచుకోడానికే కాదా?

వై.యస్. జగన్.

ప్రజా సంకల్ప యాత్ర మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

ప్రజాసంకల్ప యాత్ర 103వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం
1,398.4 కి.మీ

103వ రోజు నడిచిన దూరం
15.3 కిలో మీటర్లు

ప్రారంభం: ఉ. 7.30 గంటలకు తాళ్లూరు శివారు

ముగింపు: సా.6.50 గంటలకు అద్దంకి శివారు

ముఖ్యాంశాలు

- తాళ్లూరు శివారు, రజానగరం గిరిజన కాలనీ, శ్రీరామ్‌నగర్ కాలనీ, పార్వతీపురం క్రాస్, తిమ్మాయపాలెంలో జనంతో మమేకం
- కుంకుపాడులో పార్టీ జెండా ఆవిష్కరణ
- అద్దంకిలో బహిరంగ సభ

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం

ఉ. 7.30 గంటలకు అద్దంకి శివారు

ముఖ్యాంశాలు

- అద్దంకి శివారు, తక్కెళ్లపాడులో జనంతో మమేకం
- నాగులపాడు, వెంకటాపురం, అలవలపాడులో పార్టీ జెండా ఆవిష్కరణ

"ప్రకాశం జిలాలో నాగార్జున సాగర్ కుడికాల్వ కింద నాలుగేళ్లుగా వరి పండించిన దాఖలాలు లేవు. అదే తెలంగాణలో సాగర్ ఎడమ కాల్వ కింద నాలుగేళ్లుగా వరిని సస్యశ్యామలంగా సాగు చేసుకుంటున్నారు. ఈ దశలో నన్ను కలిసిన రైతులు.. అన్నా, కేసీఆర్‌కు ఉన్నదేమిటీ.. చంద్రబాబుకు లేనిదేమిటీ? అని అడుగుతున్నారు. కారణం మీ అందరికీ తెలిసిందే. ఓటుకు కోట్లు ఘటనలో ఆడియో, వీడియోలతో అడ్డంగా దొరికిపోయిన టేపులు కేసీఆర్ దగ్గరున్నాయి. చంద్రబాబు ఏదన్నా అంటే ఆ టేపుల్ని కేసీఆర్ బయటకు తీసి బొక్కలో వేస్తారేమోనన్న భయమేనని అంటున్నారు. దీంతో ఈ పెద్దమనిషి ఇటు కేసీఆర్‌కు అటు నరేంద్ర మోదీకి భయపడుతున్నాడు. రాష్ట్రంలో అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. పైన చంద్రబాబు ఇసుక, మట్టి, కరెంటు కొనుగోళ్లు, కాంట్రాక్టులు, బొగ్గు, రాజధాని భూములు చివరకు గుడి భూముల్నీ వదలకుండా మేస్తుంటే కింద గ్రామాల్లో జన్మభూమి కమిటీలు పెన్షన్లు మొదలు మరుగుదొడ్ల నిర్మాణం వరకు దండుకుంటున్నాయి. ఇంత విచ్చల విడిగా అవినీతి ఉన్నప్పుడు చంద్రబాబు కేంద్రాన్ని ఏమని అడగగలడు? ఆయన అవినీతి బాగోతం పోలవరం మొదలు పట్టిసీమ వరకు బయటకు తీసి ఎక్కడ లెక్కలు అడుగుతారోనని కేంద్రాన్ని చూసి భయపడుతున్నాడు."


కుంకుపాడులో జగన్‌తో కలిసి నడుస్తున్న దివ్యాంగుడు

టీడీపీలో దళితులకు గౌరవం లేదు

మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే రావెల కిశోర్‌బాబు సంచలన వ్యాఖ్యలు

సాక్షి, గుంటూరు: టీడీపీలో దళిత ప్రజాప్రతినిధులకు గౌరవం లేదని, తమ ఆత్మగౌరవం దెబ్బతింటోందని అంటూ మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే రావెల కిశోర్‌బాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలుగుదేశం పార్టీలోని దళిత ప్రజాప్రతినిధులకు పదవులు తప్ప అధికారం లేదని అన్నారు. ఆయన తాజాగా ఓ టీవీ చానల్‌తో మాట్లాడారు. 'పదవులు మావి.. పెత్తనం మాత్రం వాళ్లదా?' అని నిలదీశారు. దళిత మంత్రులు, ఎమ్మెల్యేలకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని వాపోయారు. రావెల కిశోర్‌బాబు ఇంకా ఏం మాట్లాడారంటే... ''తెలుగుదేశం పార్టీలో నా ఒక్క నియోజకవర్గంలోనే కాదు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎస్సీ నియోజకవర్గాల్లో అగ్రకుల నేతల పెత్తనమే ఎక్కువగా ఉంది. ఎస్సీ మంత్రులు, ఎమ్మెల్యేలకు పదవులు మాత్రమే ఉన్నాయి. అధికారం చెలాయించేది మాత్రం బయటి వ్యక్తులే. కోడుమూరు ఎమ్మెల్యే మణిగాంధీని నామమాత్రపు ఎమ్మెల్యేగా చూస్తున్నారు. పెత్తనం మొత్తం అక్కడి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి సాగిస్తున్నారు. కొవ్వూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి పదవిలో జవహర్ ఉన్నప్పటికీ పెత్తనం మొత్తం సుబ్బరాజు చౌదరి చేస్తుంటాడు. పశ్చిమ గోదావరి జిల్లా గోపాలపురం ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు అధికారం మొత్తం అక్కడి చైర్మన్ బాపిరాజు చేతుల్లో ఉంటోంది. మంత్రి నక్కా ఆనందబాబు పదవిలో ఉండగా, వేమూరు నియోజకవర్గంలో అధికారమంతా తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజా చేతుల్లోనే ఉంది. ప్రకాశం జిల్లా కొండెపిలో ఎమ్మెల్యే పదవి స్వామిది, అధికారం చెలాయించేది మాత్రం జిల్లా టీడీపీ అధ్యక్షుడు జనార్దన్. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. దాదాపు అన్ని ఎస్సీ నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. కేవలం నామమాత్రపు నాయకత్వాన్ని ఇచ్చి అధికారం పక్కవాళ్లు చెలాయిస్తే దళితుల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుంది. ఇప్పుడు చదువుకున్నవారు, విజ్ఞానవంతులు అంబేడ్కర్‌వాదులు రాజకీయాల్లోకి వస్తున్నారు. వీరు అగ్రకుల ఆధిపత్యాన్ని సహించే పరిస్థితుల్లో లేరు. వీరికి పదవులతోపాటు అధికారం కూడా ఇవ్వాలి. అప్పుడే ఈ పార్టీలో నాకు గుర్తింపు ఉంది, గౌరవం ఉంది, అధికారం ఉంది అనే ఆత్మవిశ్వాసంతో వారు పార్టీని ముందుకు తీసుకెళ్తారు.

నా పేరు ప్రతిష్టలు దిగజార్చారు

నా నియోజకవర్గం పరిధిలోని ఓబులునాయుడుపాలెం గ్రామంలో అక్రమ మైనింగ్‌లో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తే ఆయన చెప్పా. ఎవరికి చెప్పినా ఉపయోగం లేకుండాపోయింది. నాకు వాటా పంపుతున్నామని ప్రచారం చేసి నా పేరుప్రతిష్టలను దిగజార్చడంతో అసలు ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు విలేకరులను తీసుకుని అక్కడికి వెళ్లా. యథేచ్ఛగా అక్రమ మైనింగ్ జరగడం చూసి ఆశ్చర్యపోయా. నారాయణస్వామి, అశోక్ అనేవాళ్లు ఇష్టం వచ్చినట్లు అక్రమ మైనింగ్ చేస్తున్నట్లు తేలింది..'' అని రావెల పేర్కొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
నేను శక్తి సాక్షి
విజయవాడ
సోమవారం, 5-3-2018



చికాకుల్లో చిరునవ్వును తోడు తెచ్చుకుంది.
కష్టాల్లో పట్టుదలను పనిముట్టుగా చేసుకుంది.
తన జీవితాన్ని తానే మలచుకుంది.
స్వావలంబనకు, సాధికారితకు,
సెల్ఫ్ మేడ్ వుమన్‌కు నిర్వచనంగా తానెలా మారారో...
తనను తాను ఎలా మలచుకున్నారో
చెబుతున్న ఝాన్సి కథ ఇది.
ఎందరికో స్ఫూర్తినిచ్చేంత నిజజీవనగాథ ఇది.

నా చిర్నవ్వే నాకు తోడు

ఝాన్సీ, ప్రముఖ టీవీ యాంకర్, నటి

''పెదవులపై చిర్నవ్వులు మోసుకొని కోర్టు మెట్లెక్కాను. దానికి నేను పెట్టిన పేరు ఆపరేషన్ స్మైల్. ఆ నవ్వు నా కోసం కాదు. నిత్యజీవితంలో ఎన్నో అవమానాలను భరిస్తూ, ఎంతో హింసాయుతమైన జీవితాన్ని అనుభవిస్తూ రోజూ ఛస్తూ బతుకుతోన్న ఎందరో ఆడవాళ్ళకు కోర్టుకెళ్ళడం తప్పేం కాదనే భరోసానిచ్చేందుకు నేనూ మా అమ్మా కోర్టుకెళ్లిన ప్రతిసారీ మరచిపోకుండా ఇంట్లోనుంచి చిర్నవ్వులను మోసుకెళ్ళే వాళ్ళం. కోర్టు చుట్టూ ఎందరో ఆడవాళ్ళు. వాళ్ళందరి గుండెల్లో రేపెలా ఉంటుందోననే గుబులు. కానీ ఎవరికోసమో మనం బతకలేంగా! మన కోసమే మనం బతకాలి. ఇది జీవితం నటన కాదు. అందుకే మనకి నచ్చినట్టు మనం బతకాలి. రోజూ ఎందరో ఆడవాళ్ళ సమస్యలను తెరపైకి తెస్తోన్న ఝాన్సీ నిజజీవితంలో ఇంతలా డీలా పడిపోతే ఇక సాధారణ మహిళలు ఎలా ఉంటారు. మరింతగా కుంగిపోరూ!. అందుకే రోజూ నేను తెరపైన చెప్పే ధైర్యాన్నే ఆచరణలోనూ వారికందివ్వాలనుకున్నాను. పెదవులపై చెరగని చిర్నవ్వుని అభినయించాను'' కోర్టుకెళ్లడం భారంగా, నామోషీగా ఫీలయ్యేవాళ్లెందరో మన చుట్టూ ఉంటారు. కానీ అది తప్పు. అది చెప్పడానికే నేను ప్రతి వాయిదా ఒక పిక్‌నిక్‌లా భావించాన్నేను. అమ్మానేనూ నచ్చిన పదార్థాలు, బాగా నచ్చిన పుస్తకాలూ ఎప్పటికీ చెదరని సన్నటి చిర్నవ్వులతో కోర్టుమెట్లెక్కేవాళ్ళం. కోర్టు లోపల కూడా జడ్జిగారి పోడియంకి దగ్గరగా కూర్చునేదాన్ని.

''ఝాన్సీ...ఝాన్సీ...ఝాన్సీ మూడు సార్లూ... నా పేరే... కోర్టుహాలు బయట నుంచొని బంట్రోతు పిలుస్తున్నాడు గట్టిగా. ఎందుకో గుండె కలుక్కుమంది. ఎంత ధైర్యంగా ఉన్నా. అది కూడా ఒక్క క్షణమే. తమాయించుకొని లోనికెళ్ళా. ఎనిమిదేళ్ళ నా పోరాటానికి విముక్తి లభించింది. నేను డైవోర్స్ తీసుకోవడాన్ని చాలా మంది చాలా రకాలుగా భావించారు. గుచ్చి గుచ్చి అడిగారు. మనస్సు నొచ్చుకునే ప్రశ్నలు. మన సర్వస్వాన్నీ నియంత్రించే ప్రశ్నలు. మనస్సుని గాయంచేసే మాటలెన్నో...నా చుట్టూ ఉన్న మనుషులు, నాతోనే ఉన్న స్నేహితులు, చాలా అందంగా సాయం చేస్తామని వచ్చినవారే అందులో చాలా మంది. ఎవ్వరేమన్నా నేను లక్ష్యపెట్టలేదు. ఎందుకంటే జీవితం నాది కనుక.

మా పెళ్ళి అయినప్పటి నుంచే మా యిద్దరికీ కుదరదని నేననుకున్నాను. అయినా ఒక ఛాన్స్ ఇచ్చాను. ట్రై చేసాను. ఆ వ్యక్తితో కలసి జీవించడానికి కావాల్సిన సఖ్యత లేదు. మాది కలిసి నడిచేందుకు అనువైన ప్రయాణం కాదు. కానీ ఆ నిర్ణయం తీసుకోడానికి 11 ఏళ్ళు పట్టింది. ''ఐ హావ్ మై ఓన్ లైఫ్ అండ్ విజన్''. పక్కవాళ్ళ ఎక్స్‌పెక్టేషన్స్‌కు అనుగుణంగా మీ జీవితాన్ని మార్చుకోవద్దు. అది మన పిల్లలైనా సరే. ముల్లు గుచ్చుకున్నా నవ్వేయడానికి ఇది నటన కాదని ముందే చెప్పాను. పోతపోసిన పితృస్వామ్య భావజాలంలో ఘనీభవించిన పురుషులెందరో... అదే భావజాలాన్ని మోస్తున్న స్త్రీలు కూడా...నన్ను ఆపే ప్రయత్నం చేసారు. నేనెవరినైతే నమ్ముతానో అందర్నీ సంప్రదించాను.''లెట్ మై ఫైట్ బి మైన్''. కానీ నన్ను నేను ప్రొటెక్ట్ చేసుకోవడానికి కొన్ని కోల్పోవాల్సి వచ్చింది. నా మిత్రులెవరో, ఎవరు కాదో అనుభవం తేల్చింది. నా ప్రయాణంలో ఇద్దరు మిత్రులు జారిపోయారు. ఇద్దరు మాత్రమే మిగిలారు. ఏ దాపరికం లేకుండా నన్ను నేనుగా స్వచ్ఛంగా పంచుకునే, ఇష్టంగా ప్రకటించుకునే మిత్రులు వీళ్లు. రామలక్ష్మి. శీతల్. వరదనీటికి కొట్టుకుపోయిన చెత్తపోగా మిగిలిన సారవంతమైన నేలలాంటి వాళ్ళు వీళ్ళిద్దరూ. ఇక నా చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ ఎప్పుడూ నాతోనే ఉన్నారు. నా ప్రయాణం రెండు దారులుండే సారంగం కాదు. ఒకే మార్గం గుండా చీకట్లోంచి ప్రారంభమై, గుహఅంచున దాగిన వెలుతురు రేఖలవైపే నా ప్రయాణం.

అమ్మ ఆల్ ఇండియా రేడియోలో ప్రొడ్యూసర్. వుమన్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్‌కి సంబంధించిన కార్యక్రమం కావడంతో అవి వింటూ తెలుసుకునే దాన్ని. చాలా వోకల్‌గా ఉండేదాన్ని. సంగీతం నాకెందుకు రాదని సంగీతంలో జాయిన్ అయ్యాను. గట్టిగా అరవడం వస్తే చాలనుకునేదాన్ని. నాకిక పాడ్డం రాదని డిక్లేర్ చేసాక వీణ నేర్చుకున్నాను. ఎవరైనా ఏదైనా చేయొచ్చు. సాధన కావాలంతే, అదేమంత కష్టంకాదని నా పట్టుదల. ఎస్‌పి బాలు లాగానో, చిత్ర లాగానో పాడలేకపోవచ్చు. పీటీ ఉష లాగా పరిగెత్తలేకపోవచ్చు. కానీ సాధన ద్వారా ఏదోమేరకు ఏదైనా సాధించొచ్చు. గ్రూప్ సింగింగ్‌కి వెళితే లిప్‌సింక్ ఇవ్వమనే వాళ్ళు. నువ్వు పాడితే పక్కాళ్ళు పారిపోతారు, పెదాలు కదిలిస్తే చాలనే వాళ్ళు. నాకెప్పుడూ ఓ బ్యాచ్ ఉండేది. టెంత్ క్లాస్ వరకూ నేనెప్పుడూ ఏదో దాంట్లో లీడర్‌గా ఉండే దాన్ని. కాళ్ళు పీకేవి. ఎప్పుడూ లో బీపీ. స్పోర్ట్స్‌కి పనికిరానన్నారు. కానీ వాలీబాల్, డిస్క్, జావలిన్ త్రోలో నేషనల్ గేమ్స్‌ని రిప్రజెంట్ చేశాను. అప్పట్నుంచే గెలవడం ముఖ్యం కాదు పాల్గొనడం ప్రధానం అనే భావం ఏర్పడింది. ప్రయాణం చాలా నేర్పిస్తుంది. గమ్యం మాత్రమే కాదు ప్రయాణం కూడా ప్రధానమే. విజయమే కాదు ఓటమే చాలా నేర్పిస్తుంది అలాగే స్నేహాలు కూడా.

నా పన్నెండవ ఏట అమ్మ మాక్సీమ్ గోర్కీ 'అమ్మ' నవల చదవమని యిచ్చింది. ఆల్ ఇండియా రేడియో యువవాణిలో సింపోజియం కోసం చదివిన ఆ పుస్తకం నాలో సాహిత్యకాంక్షను రేకెత్తించింది. ఎలెక్స్ హెలీ 'రూట్స్'(ఏడుతరాలు) పుస్తకం నాలో సామాజిక స్పృహను వేళ్ళూనుకునేలా చేసింది. ఏది చదవాలి? ఏది చదవకూడదు అని అమ్మెప్పుడూ నిర్దేశించలేదు. కానీ 'చలం' పుస్తకం చదువుతున్నప్పుడు మాత్రం నీకింకా ఆ వయస్సు రాలేదని వారించింది.

ఇక నాకు నంది అవార్డుని తెచ్చిపెట్టిన తొలి పాత్ర నన్నెంతగానో ప్రభావితం చేసింది. ఓల్గాగారు రాసిన 'తోడు' కథని అక్కినేని కుటుంబరావుగారి డైరెక్షన్‌లో మధు అంబటి కామెరాతో సినిమాగా తీసారు. జీవితమంతా ప్రతిపనికీ ఆమెపైన ఆధారపడి బతికి, భార్య (చనిపోయి) దూరమయ్యాక కనీసం గుండీలు కూడా కుట్టుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్న భర్త ఒకవైపు, భర్త చనిపోయి స్వేచ్ఛాగాలులు పీల్చుకుని, తనకోసం జీవించడం మొదలుపెట్టిన స్త్రీ మరోవైపు. ఈ సినిమాలో ఈ యిద్దరి మధ్యా నేను అనుసంధానకర్తను. ఈ కథలో నేను పూర్తిగా ఇమిడిపోయాను. ఈ కథే కాదు. అన్ని పాత్రల్లోనూ లీనమై, ఆ పాత్ర నిజంగా నేనైతే ఎలా అని ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటాను.

సెంట్రల్ వర్సిటీ నుంచి అప్పుడే ఇండస్ట్రీలో కొచ్చిన కొంగ్రొత్త భావజాలం, కొత్త నీరు గీత, అనురాధ, హేమంత్ గ్రూప్‌లో పెరగడం, నాకు దొరికిన గురువులు భరణి గారు, నిమ్ గారు, శ్యాంబెనగళ్ డైరెక్షన్‌లో గోపీచంద్‌గారి అబ్బాయి సాయిచంద్ గారి 'గోపీచంద్‌కీ అమర్ కహానియా' ఫిజికల్లీ ఛాలెంజ్డ్ వుమన్ విజయగాథ ఇతివృత్తంగా తీసిన 'విజేత' లాంటివెన్నో నన్ను ప్రభావితం చేసాయి. అలా ప్రారంభమైన నా జీవితాన్ని నన్ను నేనుగా తీర్చిదిద్దుకుంటూ వచ్చాను. పోచంపల్లి కాటన్ చీర కట్టుకుంటే ఉత్తమత్వం అనీ, మిడ్డీలూ, స్లీవ్‌లెస్‌లూ వేసుకుంటే తప్పనే స్వభావం కాదు నాది. సౌకర్యంగా అనిపించేది వేసుకోవచ్చు. అలా వేసుకోను అని చెప్పే స్వేచ్ఛ కూడా ఉండాలి. పురుషులు దగ్గరికి తీసుకోవడం కొందరికి అసభ్యంగా అనిపించకపోవచ్చు. కొందరికి వీపురాసి, పిరుదులు తాకినా అది తప్పనిపించక పోవచ్చు. కానీ ఆ స్పర్శలోని ఆంతర్యాన్ని బట్టి నాలాంటి కొందరికది నచ్చకపోవచ్చు. ఎంత వరకు లిమిట్ అనేది ఎవరికి వారు నిర్ణయించుకోవాలి. ఏ వివక్షనీ నేను సహించేదాన్ని కాదు. అందుకే నా ముందు చెత్తజోక్స్ వేసుకోవడానికి భయపడతారు. ఇలా ఉండడానికి చాలా మందిని కోల్పోయి ఉండొచ్చు. అయినా నాకు ఏ ఇబ్బందీ లేదు. నాకిష్టమైనట్లు నేనుండగలను అనేది అర్థం కావడానికి నాకే చాలా కాలం పట్టింది.

మనం ఉంటోంది అంతా తులసి వనం కాదు. కలుపు మొక్కలుంటాయి. వాటి మధ్య కూడా మహిళలు తమ అస్తిత్వాన్ని నిలుపుకునే చైతన్యం రావాలి. తమ హక్కుల్ని సాధించుకునే పోరాటపటిమ కావాలి.

నేనూ అందరమ్మాయిల్లాగానే పదవ తరగతి వరకు హాఫ్ లంగా అంచుల పట్టీలు(ఫ్రిల్స్) విప్పి రెండు మూడేళ్ళు అదే యూనిఫాం వాడేదాన్ని. మూడు యూనిఫాంస్‌తోనే స్కూలింగ్ గడిచిపోయింది. గుంటూరు జమీందారీ కుటుంబమే అయినా అమ్మానాన్నలకి పనుల విషయంలో తేడా లేదు. అన్ని పనులూ ఇద్దరూ చేసేవారు. నాకు తెలిసి నేనెప్పుడూ ఇస్త్రీ లేని యూనిఫాంతో స్కూల్‌కి వెళ్ళలేదు. అమ్మ చీరలు కూడా నాన్నే ఇస్త్రీ చేసేవారు. వంటకూడా యిష్టంగా చేసేవారు. ఇంట్లో వర్క్ డివిజన్ ఉండేది. నాన్న కాంట్రాక్టర్ అయినా మంచి హోమ్ మేకర్. మగాళ్ళు చాలా అగ్రెసివ్‌గా ఉన్న కాలంలో మా ఇంట్లో జెండర్ న్యూట్రాలిటీ ఉండేది. చిన్నప్పట్నుంచీ నాకది రాదు, నేను చేయలేను అని చెప్పడం నాకిష్టం ఉండేది కాదు.



- అత్తలూరి అరుణ
ఫొటోలు: కె. రమేష్ బాబు



మాటలతో అయ్యే పని కోసం మగవాళ్లను అడగవచ్చేమో కానీ, చేతలతో పూర్తయ్యే పనిలో మాత్రం ఆడవాళ్ల సహాయం తీసుకోవాలి.
- మార్గరెట్ థాచర్, బ్రిటన్ మాజీ ప్రధాని

చెట్టు నీడ

చెడేమిటో తెలియనివాడు

ఒక గురువు దగ్గర వివిధ ఊళ్ల నుంచి వచ్చిన విద్యార్థులు చదువుకునేవారు. వాళ్లంతా భిన్న నేపథ్యాల నుంచి వచ్చినవారు.

ఒకరోజు ఒక పిల్లాడు మరో విద్యార్థి పెట్టెలోంచి దొంగతనం చేయడం కొందరు పిల్లలు గమనించారు. దాన్ని వాళ్లు గురువు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన విని తలూపాడే తప్ప ఆ పిల్లాడి మీద ఏ చర్యా తీసుకోలేదు.

మరోమారు కూడా ఆ పిల్లాడు దొంగతనం చేస్తూ దొరికిపోయాడు. ఈసారి కూడా విద్యార్థులు గురువుకు ఫిర్యాదు చేశారు. 'నేను చూస్తాను' అని బదులిచ్చాడే తప్ప మరేమీ చేయలేదు.

దాంతో మిగిలిన విద్యార్థులకు కోపం వచ్చింది. వాళ్లందరూ సంతకాలు పెడుతూ, గురువుకు ఒక లేఖ ఇచ్చారు. ఆ పిల్లాడిని తక్షణం బహిష్కరించాలనీ, లేదంటే తామందరమూ మూకుమ్మడిగా గురుకులం వదిలి వెళ్లిపోతామనీ దాని సారాంశం.

> మీ అందరికీ మంచేమిటో, చెడేమిటో తెలిసిపోయింది. కానీ ఈ పిల్లాడున్నాడే... వీడికి ఇంకా చెడేమిటో తెలియలేదు. మరి ఇలాంటివాడికి నేను తప్ప మరెవరు బోధిస్తారు?

ఆ లేఖ చదివాక, సాయంత్రం విద్యార్థులందరినీ ప్రత్యేకంగా సమావేశ పరిచి, గురువు ఇలా చెప్పాడు: 'చూడండి, మీ అందరూ వివేకం గలవాళ్లు. మీ అందరికీ మంచేమిటో, చెడేమిటో తెలిసిపోయింది. కాబట్టి మీరు ఈ గురుకులంలో కాకపోతే మరోచోటైనా విద్యను అభ్యసించవచ్చు. కానీ ఈ పిల్లాడున్నాడే... వీడికి ఇంకా చెడేమిటో తెలియలేదు. మరి ఇలాంటివాడికి నేను తప్ప మరెవరు బోధిస్తారు? కాబట్టి వాడు ఇక్కడే ఉంటాడు. తుది నిర్ణయం మీకే వదిలేస్తున్నాను'.

గురువు చెప్పింది విని, విద్యార్థులందరూ సిగ్గుపడ్డారు. దొంగతనం చేసిన పిల్లాడి కళ్లల్లోంచి నీళ్లు కారాయి.

ప్రతినిధి

హాస్పిటల్ తెచ్చాను


రిజర్వేషన్ ప్రాతిపదికన కార్పొరేటర్‌గా కిందటిసారి పోటీ చేసి ఓడిపోయాను. రెండవసారి పోటీ చేసి గెలిచాను. మా కుటుంబానికి పాతికేళ్ల రాజకీయ నేపథ్యం ఉండటంతో ఈ రంగంలోకి రాగలిగాను. కార్పొరేటర్‌గా డివిజన్‌లోని పబ్లిక్ ఇష్యూకి సంబంధించిన ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే అక్కడ ఉండాలి. రాజకీయాల్లో చాలా నేర్చుకోవాలి. మా వారికి అనుభవం ఉంది కాబట్టి నాకు సూచనలు ఇస్తుంటారు. కానీ, నా నిర్ణయాలకు అడ్డుపడరు. మా ఏరియాలో బస్తీలు ఎక్కువ, గవర్నమెంట్ ఆసుపత్రి లేదు. డాక్టర్లతో, పై అధికారులతో మాట్లాడి ప్రభుత్వానికి హాస్పిటల్ ప్రపోజల్ పెట్టాను. పదే పదే ప్రజల సమస్యను ముందుకు తేవడం వల్ల నా ప్రపోజల్ శాంక్షన్ అయింది. త్వరలో హాస్పిటల్ ప్రారంభోత్సవం ఉంది. కార్పొరేటర్‌గా పేదవాళ్లకు సాయం చేయగలుగుతున్నందుకు ఆనందంగా ఉంది.




- సబితా కిశోర్, కార్పొరేటర్,
వెంకటాపురం డివిజన్, సికింద్రాబాద్

రక్షణ కవచాలు

సాధికారత కోసం...





- ఈక్వల్ రెమ్యూనరేషన్ యాక్ట్, 1976
- డౌరీ ప్రొహిబిషన్ యాక్ట్, 1961
- అక్రమ రవాణా నిషేధ చట్టం, 1956
- మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్, 1961
- మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్, 1971
- సతీసహగమన నిరోధక చట్టం, 1987
- బాల్య వివాహ నిరోధకచట్టం, 2006
- కడుపులో బిడ్డ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం, 1994
- పని చేసే ప్రదేశంలో లైంగిక వేధింపుల నివారణ, నిషేధ చట్టం, 2013

మన రాజ్యాంగ వ్యవస్థ మహిళల రక్షణ కోసం కల్పించిన ముఖ్యమైన సౌకర్యాలు ఇవి. న్యాయపరంగా పోరాడాల్సిన ఈ చట్టాలతో సాధికారత సాధన జరుగుతుందా అంటే... అదొక్కటే మార్గం అని కాదు. న్యాయపోరాటం చివరి అంశమే కావచ్చు. కానీ ఇలాంటి రక్షణ వ్యవస్థ ఉందనే స్పృహ ఆమెలో భరోసాని కలిగిస్తుంది. ఆమె పట్ల అనుచితంగా ప్రవర్తించే వారిలో భయానికి కారణమవుతుంది. మహిళ పట్ల గౌరవంతో ఆమెకు ఇబ్బంది కలిగించకుండా మెలిగే సంస్కారం ఉన్నప్పుడు ఇలాంటి చట్టాల అవసరం అంతగా ఉండకపోవచ్చు. అయితే అలాంటి సంస్కారం లోపించినప్పుడు ఇలాంటి చట్టాల రక్షణ గొడుగులు అవసరమే. ఈ చట్టాలన్నీ... మహిళకు సాధికారత సాధనలో వెనుకడుగు వేయాల్సిన పరిస్థితిని రానివ్వకుండా ఆమెకు తోడుగా ఉండే బాంధవ్యసాధనాలు.

అప్పుడలా!













స్వాతంత్ర్యోద్యమకాలంలోని వివిధ సందర్భాల్లో మహిళలు అనేక కార్యక్రమాల్లో పెద్దఎత్తున పాల్గొన్న ఉదంతాలను తెలిపే చిత్రాలు

ఇప్పుడు ఎందుకిలా?

భారత జాతీయోద్యమంలో మహిళలు చురుగ్గా పాల్గొన్నారు. స్వాతంత్య్ర సమరంలో పాల్గొనడానికి ముందుకు వచ్చిన మహిళలను మగవాళ్లు తమతో సమానంగా గౌరవించారు. 'మీరు మహిళలు, బలహీనులు, ఉద్యమంలో పోరాడడానికి మీ శక్తిసామర్థ్యాలు సరిపోవు, ఆ బాధ్యత మాకొదిలేయండి' అన్న మగవాళ్లు లేరు. మహిళాశక్తిని గుర్తించారు అప్పటి వాళ్లు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత రాజ్యాంగ రూపకల్పనలో మహిళలను సమాన స్థాయిలో గౌరవించారు. సామాజికంగానూ, ఆర్థికంగానూ, రాజకీయంగానూ మహిళలకు సమాన ప్రతిపత్తిని కల్పించారు.

అవకాశాలను అందిపుచ్చుకునే దగ్గరకు వచ్చేటప్పటికి మహిళలు ఇంటిపట్టునే ఉండాలన్నది సగటు మేల్ సొసైటీ. క్రమంగా... నిర్ణయాధికారానికి అవసరమైన మేధ మహిళలకు ఉండదనే భావన మగవాళ్ల మాటల్లో వ్యక్తమవసాగింది.

మహిళలకు ఉద్యోగాలెందుకు అనే ప్రశ్న నుంచి టీచర్, డాక్టర్ వంటి ఉద్యోగాలైతే మేలన్నారు.
ఇంజనీర్లుగా ఆడవాళ్లా? అని పెదవి విరిచారు.
పత్రికలలో పని చేస్తారా? రాత్రిళ్లు కూడా పని చేయాలి తెలుసా? అన్నారు.
పోలీస్ ఉద్యోగాలు చేయాలంటే యూనిఫామ్ వేసుకోవాలిగా అన్నారు.
రక్షణ రంగంలో అడుగుపెట్టాలంటే... తుపాకీ మోస్తారా అన్నట్లు చూశారు.
చట్టసభల్లోకి వస్తారా? చట్టం చేయడమంటే పచ్చడి రుబ్బడం కాదంటున్నారు.
అటకెక్కిన మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి మాట్లాడడానికి ఎవరికీ నోరు పెగలడం లేదు.
ఎందుకిలా? ఎందుకిలా?
అలనాడు ఏడు దశాబ్దాల కిందట ఉద్యమాలు... యుద్ధాలలో లేని వివక్ష, అసమానత్వం...
ఇంత పురోగతి సాధించాక ఇప్పుడు ఎందుకిలా?

– మంజీర

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నేను ఒక అమ్మాయిని లవ్ చేస్తున్నాను. తనకి ప్రపోజ్ చేస్తే, ఓకే చెప్పింది. మేమిద్దరం ఒకే కంపెనీలో జాబ్ చేస్తున్నాం. ఏదో పని పడటంతో పదిహేను రోజులు లీవ్ పెట్టి మా ఊరికి వెళ్లాను. వచ్చిన తర్వాత తనలో చాలా మార్పు కనిపించింది. అసలు నాతో మాట్లాడటమే మానేసింది. ఏమైంది? ఎందుకు? అని అడిగితే... 'మన నేపథ్యాలు వేరు' అంటోంది. మరి నా లవ్‌ను ఒప్పుకున్నప్పుడు తెలియదా అన్నయ్యా మా నేపథ్యాలు వేరని? అంతేకాదు, తను వేరే అబ్బాయిని లవ్ చేస్తోందని నా ఫ్రెండ్ ఒకడు చెప్పాడు. తన బర్త్‌డే పార్టీకి కూడా నన్ను పిలవలేదు. నాకేమీ అర్థం కావడం లేదు. ప్లీజ్ అన్నయ్యా..! నాకు మంచి సలహా ఇవ్వండి.

– శరత్

అంతగా బాధ పడకు బ్రో!

'ఫిఫ్టీన్ డేస్‌లో మైండ్ చేంజ్ అయితే బాధ కాదా సార్..??'

మైండ్ కాబట్టి చేంజ్ అవుతుంది.

'ఏంటి సార్..! అన్నీ పజిల్స్‌లో మాట్లాడుతున్నారు?'

హార్ట్ అయితే చేంజ్ అయ్యేది కాదు అని చెబుతున్నా..!

'మైండ్ అయితే చేంజ్ అయింది కానీ హార్ట్ చేంజ్ కాలేదని చెబుతున్నారా సార్?'

కాదు నీలాంబరి.. హార్ట్‌తో ప్రేమించి ఉంటే చేంజ్ అయ్యేది కాదని చెబుతున్నా..!

'అంటే మైండ్‌తో కూడా ప్రేమిస్తారా సార్?'

ఇష్టపడటం అంటే మైండ్‌కు నచ్చినట్టు నీలూ!

'ప్రేమంటే హార్ట్‌కు గుచ్చుకున్నట్టు కదా సార్..!!'

అబ్బా... నా దగ్గర ఎంత జ్ఞానం పుచ్చుకున్నావు నీలూ..!

'సార్..! ఈ ఆన్సర్ శరత్‌కి నచ్చుకున్నాది సార్...'

హార్ట్‌తో చదవమను, మైండ్‌తో కాదు... ఆన్సర్ నచ్చుతుంది నీలూ..!!

lovedoctorram@sakshi.com

నలుపు.. తెలుపు.. నేను

1992 అనుకుంటా... ఎలిమెంటరీ స్కూల్ అమ్మాయి. పదకొండేళ్లుంటాయి. స్కూల్ ఇంటర్వెల్ బ్రేక్‌లో టీవీ చూస్తోంది. కమర్షియల్ వస్తోంది ఆ టైమ్‌కి. రకరకాల వర్గాల్లోని ఆడవాళ్లు అంట్లుతోమడానికి గిన్నెలతో కుస్తీ పడుతున్నారు. అదే ట్యాగ్‌లైన్ ఆ యాడ్ కింద.. ''అమెరికాలోని ఆడవాళ్లంతా జిడ్డోడుతున్న పాత్రలతో ఫైటింగ్ చేస్తున్నారు'' అని!

ఆ యాడే చూస్తున్న ఆమె క్లాస్‌మేట్స్ అబ్బాయిలిద్దరూ ''ఆడవాళ్లు అంట్లతో కాక దేనితో కుస్తీ పడ్తారు?'' అంటూ నవ్వారు హేళనగా. అమ్మాయి షాక్ అయింది. కోపమొచ్చింది. బాధా కలిగింది. అంట్లు తోమడం ఆడవాళ్ల పనేనా? ప్రశ్న ఆ చిన్న మెదడులో. మధ్యాహ్నం ఇంటికెళ్లే సరికి అది రొదలా మారింది.

ఇంట్లో...

నాన్నతో చెప్పింది పొద్దున తను చూసిన టీవీ కమర్షియల్.. క్లాస్‌మేట్స్ పాస్ చేసిన కామెంట్స్ గురించి. అంట్లు ఆడవాళ్లు మాత్రమే ఎందుకు తోమాలి? ఆ కమర్షియల్‌ను ఎందుకలా తీశారు? అన్నం అందరం తింటున్నప్పుడు అంట్లు తోమే బాధ్యతను కూడా అందరూ షేర్ చేసుకోవాలి కదా.. అది కేవలం ఆడవాళ్ల పనే అన్నట్లుగా ఎందుకు చూపిస్తున్నారు? అలా ప్రమోట్ చేయబట్టే కదా నా క్లాస్‌మేట్స్ ఆడవాళ్లను అంత తేలికగా చూశారు? ఎందుకు నాన్నా ఇలా? దీన్ని మార్చాలి.. ఏదైనా చేయాలి?'' అంది చిన్న పిడికిలిని అంతే చిన్న అరచేతిలో నూరుతూ! తన బుజ్జి కూతురి గొప్ప ఆలోచనకు, ఆరాటానికి ముచ్చటపడ్డాడు. గర్వపడ్డాడు తండ్రి. ''ఏదైనా చెయ్ మరి! పెద్దవాళ్లకు ఉత్తరం రాయు''అని సలహా ఇచ్చాడు.

'' రాస్తాను డాడ్'' అంటూ తండ్రి మెడను రెండుచేతులతో చుట్టేసింది.

ఆ క్షణం నుంచే పెద్దవాళ్లు ఎవరా అని ఆలోచించసాగింది అమ్మాయి.

ఆ సమయంలో అమెరికన్ ప్రెసిడెంట్ బిల్‌క్లింటన్. వెంటనే ఆ పిల్లకు ఫస్ట్‌లేడీ హిల్లరీ క్లింటన్ గుర్తొచ్చింది. అప్పుడు కిడ్స్ న్యూస్ ప్రోగ్రామ్ హోస్ట్ చేస్తున్న లిండా ఎల్లర్బీ, పవర్‌హౌజ్ అటార్నీ గ్లోరియా ఆల్‌రెడ్‌లూ మనసులో మెదిలారు. ఆ ముగ్గురితోపాటు ఆ కమర్షియల్‌లో కనిపించిన అంట్లుతోమే లిక్విడ్ తయారు చేసే కంపెనీకీ రాసింది.

నెల తర్వాత..

మళ్లీ ఆ కమర్షియల్ ప్రసారం అయింది. అయితే ఈసారి.. ''అమెరికా ప్రజలంతా జిడ్డు, జిగురోడుతున్న అంట్లగిన్నెలతో కుస్తీపడుతున్నారు'' అనే ట్యాగ్‌లైన్‌తో! పదకొండేళ్ల అమ్మాయి మొహంలో నవ్వు! విజయంతో కూడిన నవ్వు! కిడ్స్ న్యూస్ ప్రోగ్రామ్ చానల్ యాంకర్ ఆ చిన్నారి ఇంటి తలుపు తట్టింది చేతిలో మైక్, కెమెరా క్ర్యూతో. ఆ పిల్ల ఇంటర్వ్యూ తీసుకోవడం కోసం! ఆ అమ్మాయి.. హిల్లరీ, లిండా, గ్లోరియా, అంట్లుతోమే లిక్విడ్ సోప్ తయారుదారు ప్రాక్టర్ అండ్ గ్రాంబుల్‌కి.. థాంక్స్ చెప్పుకుంది!

సమానత్వం అంటే ఓ మాట కాదు. స్త్రీ,పురుషులు ఇద్దరూ కలిసి సాధించే చేత! ఇది చర్చలకే పరిమితం కాకూడదు. కార్యాచరణకు రావాలి. ఓ పదకొండేళ్ల అమ్మాయి చేయగలిగింది ప్రపంచంలోని ఇంతమంది ప్రజలు చేయలేరా? ఈ భూమ్మీద స్త్రీ, పురుషులిద్దరూ సమానమనే ఆలోచనాధోరణిని అలవర్చుకోలేరా? సమానత్వం మీద మాటలు ఆపి యాక్షన్‌లోకి దిగుదాం అని ప్రపంచాన్ని కోరుతోంది నాటి పదకొండేళ్ల పిల్ల.. నేటి 36 ఏళ్ల యువతిగా!

ఆమె... టెలివిజన్ నటి.. బ్రిటిష్ యువరాజు హ్యారీకి కాబోయే సతీమణి.. మెఘన్ మార్కల్!

తండ్రి.. తెల్ల జాతీయుడు! తల్లి.. ఆఫ్రికన్! ముందున్న అప్లికేషన్‌లో నువ్వు నలుపా? తెలుపా? అన్న ప్రశ్న ఉంది! సమాధానం ఏం రాయాలి? రాస్తే సమాధానం కాదు వివక్ష అవుతుంది!!

మెఘన్ బయోగ్రఫీ..

మెఘన్ మార్కల్ పుట్టిపెరిగింది అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం, లాస్‌ఏంజెల్స్‌లో. తల్లి డోరియా.. ఆఫ్రికన్ అమెరికన్. క్లినికల్ థెరపిస్ట్, యోగా ఇన్‌స్ట్రక్టర్. తండ్రి టామ్..తెల్లజాతీయుడు. సినిమాటోగ్రాఫర్. టామ్ ఓ కమర్షియల్ యాడ్ షూటింగ్‌లో ఉన్నప్పుడు డోరియాను చూసి ప్రేమలో పడ్డాడు. పెళ్లి చేసుకున్నాడు. ఈ ఇద్దరి ప్రతిరూపంగా ఉంటుంది మెఘన్. తన పదకొండేళ్ల వయసులోనే జెండర్ ఇన్ ఈక్వాలిటీ మీద స్పందించి ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ప్రాక్టర్ అండ్ గ్యాంబుల్ కంపెనీ కమర్షియల్ యాడ్‌ను, ట్యాగ్‌లైన్‌నూ మార్చేసి అమెరికా దృష్టిని ఆకర్షించింది. అలా బాల్యంనుంచే పోరాటస్ఫూర్తితో ఉన్న మెఘన్ నార్త్‌వెస్ట్రన్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్‌లో థియేటర్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసింది. టెలివిజన్ రంగంలో అడుగుపెట్టింది. జనరల్ హాస్పిటల్ అనే షోలో గెస్ట్‌రోల్‌తో బుల్లితెరంగేట్రం చేసింది. కట్స్, ది వార్ ఎట్ హోమ్, ఎన్‌వై అండ్ 90210 వంటి సిరీస్‌లో నటించింది. సూట్స్ అనే సిరీస్‌లో రాచెల్ జేన్‌తో ప్రపంచమంతా సుపరిచితమైంది. గెట్ హిమ్ టు ద గ్రీక్, హారిబుల్ బాసెస్, యాంటీ సోషల్ వంటి సినిమాల్లోనూ నటించింది.

బ్లాక్ అండ్ వైట్..

తల్లి బ్లాక్,



మేఘన్ మార్కల్



కాబోయే భర్త బ్రిటిష్ యువరాజు హ్యారీతో మేఘన్ మార్కల్

మెఘన్ 2011లో టెలివిజన్ సిరీస్ నిర్మాత ట్రెవర్ ఇంజెల్‌సన్‌ను పెళ్లి చేసుకుంది. ఆ తర్వాత రెండేళ్లకే విడాకులతో ఆ ఇద్దరూ ఆ బంధం నుంచి బయటకు వచ్చారు.

తండ్రి వైట్ కావడం, సంప్రదాయవాదులున్న చోట బాల్యం గడవడం వల్ల ఆ వివక్షను చాలానే ఎదుర్కొంది మెఘన్. అది నటనా రంగంలోకి అడుగుపెట్టాక కూడా వెంటాడింది. అయితే ఎక్కడా తన ఐడెంటీటీ కల్పోలేదు. దీనికి కారణం చిన్నప్పుడు తన తండ్రి ఇచ్చిన ధైర్యమే అంటుంది ఆమె. సెవెంత్‌గ్రేడ్‌లో ఉన్నప్పుడు ఒకసారి.. ఇంగ్లిష్ క్లాస్‌లో తప్పక జవాబు చెప్పాల్సిన సెషన్ జరుగుతోంది. టీచర్ ఓ కాగితం ఇచ్చింది. విద్యార్థుల వివరాలను ఆ కాగితంలోని కాలమ్స్‌ను అనుసరించి నింపాలి. అందులో నలుపు, తెలుపు, లాటిన్ అమెరికన్, ఏషియన్ అని విద్యార్థుల గుర్తింపును సూచించే గడి కూడా ఉంది. ఆ నాలిగింట్లో పిల్లలు తాము ఏ ఉనికికి చెందిన వారైతే ఆ గడి దగ్గర టిక్ పెట్టాలి. మెఘన్ అన్నీ వివరాలు నింపి ఆ కాలమ్ దగ్గర ఆగిపోయింది. తల్లిలాంటి ఉంగరాల జుత్తు, తండ్రిలాంటి పాలిపోయిన తెలుపు ఒంటి రంగుతో ఉన్న తను ఆ మిశ్రమాన్ని ఏ గడిలో పెట్టాలో తెలియక ఏమీరాయకుండా లాగే ఉండిపోయింది. మెఘన్ అవస్థ గమనించిన టీచర్.. తెల్లగా ఉన్నావు కాబట్టి వైట్ దగ్గర టిక్ పెట్టు అని సలహా ఇచ్చింది. మరి అమ్మ పోలికలూ ఉన్నాయి కదా! వైట్‌ను తన ఉనికిగా చెప్పుకోవడానికి ఆ పిల్ల మనసు అంగీకరించలేదు. దాంతో ఆ కాలమ్‌ను ఖాళీగా వదిలేసింది. దిగులు మొహంతో ఇంటికెళ్లింది. తండ్రి అడిగాడు ఏమైంది అని. చెప్పింది. ఈసారి అలాంటి సంకటం వస్తే.. సందేహపడకుండా.. నీ సొంత ఐడెంటీనే చెప్పు అన్నాడు దగ్గరకు తీసుకొని. ఆ మాటంటున్నప్పుడు తన కూతురి చిన్నమెదడు ఎంత అయోమయాన్ని అనుభవించిందో అర్థం చేసుకున్నాడు. అది సృష్టించిన వ్యవస్థ పట్ల కోపం అతని మొహాన్ని ఎర్రబర్చడం ఆ బిడ్డ దృష్టిలో పడకపోలేదు. సొంత ఐడెంటిటీ గురించి తండ్రి చెప్పిన మాట ఆ రోజు నుంచి మైండ్‌లో అచ్చేసుకుంది. జ్ఞానాన్ని మించిన శక్తి లేదు.. సాధికారతను మించిన ఐడెంటిటీ లేదని తెలుసుకుంది. తర్వాత సాధికారతనే తన గుర్తింపుగా మార్చుకుంది మెఘన్.అందుకే 'నేను ఎవరు, ఎక్కడి నుంచి వచ్చాను అనే వివరం చెప్పాల్సి వస్తే... స్ట్రాంగ్, కాన్ఫిడెంట్ మిక్స్‌డ్ రేస్ ఉమన్'' అని గర్వంగా చెప్తాను అంటుంది.

నటన నుంచి రచన దాకా..

మెఘన్.. తన తల్లిలా యోగానిపుణురాలు. మంచి కుక్. ఎల్లే యూకే మ్యాగజైన్‌కు వ్యాసాలూ రాస్తుంది. తన లైఫ్‌స్టయిల్ బ్రాండ్ అయిన 'ది టిగ్'కు ఎడిటర్ ఇన్ చీఫ్‌గా వ్యవహరించింది. సంఘసేవిక. యూఎన్ విమెన్స్ అడ్వకేట్. వరల్డ్ విజన్ కెనడాకు గ్లోబల్ అంబాసిడర్. కాలీగ్రాఫర్ కూడా. నటనలోకి వచ్చేముందు కాలిగ్రఫే ఆమెకు ఆదాయమార్గం. వెడ్డింగ్ ఇన్విటేషన్స్ రాసేది. జెండర్ ఈక్వాలిటీకి సంబంధించి యూఎన్ఓతో కలిసి జెండర్ ఈక్వాలిటీ మీద ఎంతో కృషి చేసింది. పని పట్ల ఆమెకున్న అంకితభావానికి, నిబద్ధతకు అదే ప్రతీక. 2015, ఇంటర్నేషనల్ విమెన్స్ డే రోజు మెఘన్ ప్రసంగం ప్రేక్షకులతో సహా యూఎన్ సెక్రటరీ జెనరల్ బాన్ కీ మూన్‌నూ అమితంగా ఆకట్టుకుంది. ఆయనతో సహా ఆ సభంతా ఇచ్చిన స్టాడింగ్ ఒవేషనే అందుకు నిదర్శనం.

ప్రిన్స్ హ్యారీతో..

కెనడాలోని టొరంటోలో.. ఇన్‌విక్టస్ గేమ్స్ జరుగుతున్నాయి. హాజరుకావడానికి వచ్చాడు ప్రిన్స్ హ్యారీ. మెఘన్ నటించిన 'సూట్స్' షూటింగ్ అయిందీ అక్కడే. అలా ఇద్దరూ ఒకరికొకరు తారసపడ్డారు. డేటింగ్ స్టార్ట్ అయింది. ప్రేమ ఫిక్స్ అయింది. వీరి రొమాన్స్ ఆన్‌లైన్‌లో షికారూ చేసింది. 2017, నవంబర్ తొలినాళ్లలో తమ నిశ్చితార్థం జరిగిపోయినట్లు' నవంబర్ నెల ఆఖరున ప్రకటించారు ప్రిన్స్ హ్యారీ, మెఘన్ మార్కల్. ఆ తర్వాత కొన్ని వారాలకు.. ''2018, మే 19న ప్రిన్స్ హ్యారీకి, మెఘన్ మార్కల్‌కు వివాహం జరగనున్నట్టు కెన్సింగ్‌టన్ ప్యాలేస్ అనౌన్స్ చేసింది. విండ్సర్ కేసిల్‌లోని సెయింట్ జార్జెస్ చాపెల్ ఈ పెళ్లికి వేదికకానుంది.

''రెఫ్యూజీ క్యాంప్స్ నుంచి రెడ్ కార్పెట్‌కి షిఫ్ట్ అయింది నా జీవితం. ఈ రెండు దశలనూ గౌరవిస్తాను. ఎందుకంటే ఈ రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నవే. ఈ రెండూ నాకు ముఖ్యమే. నిజానికి అవసరం కూడా!'' అంటుంది స్ట్రాంగ్, కాన్ఫిడెంట్ మిక్స్‌డ్ రేస్ ఉమన్ మెఘన్ మార్కల్.

– శరాది

కానుకో సుడోకు

		1	3	9				
	7		2	1	4	6	9	
6		2		7	5	3		
		6			2		3	
	5	9				4	2	
	2		4			5		
		4	6	8		7		3
	6	5	7	2	3		1	
				4	1	8		


నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3x3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

8	6	3	5	4	9	7	1	2
2	1	9	3	6	7	5	4	8
4	7	5	8	2	1	3	6	9
5	8	6	1	9	3	2	7	4
7	9	1	2	5	4	8	3	6
3	4	2	7	8	6	9	5	1
9	3	7	6	1	2	4	8	5
6	5	4	9	3	8	1	2	7
1	2	8	4	7	5	6	9	3

సెల్ఫ్ చెక్

తరచూ మర్చిపోతున్నారా?



ఏదో అనుకుంటాం అంతలోనే మర్చిపోతుంటాం. ఏదైనా విన్నప్పుడు 'ఇది చాలా ముఖ్యం' అనుకుంటాం కాని అవసరమైనప్పుడు గుర్తురాదు. ఇలా ఎందుకవుతుంది? దీనికి ఒత్తిడే కారణమా?

1. ఒత్తిడికి లోనయినప్పుడు కార్టిసోల్ అనే హార్మోన్ విడుదలవుతుంది.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
2. ఈ హార్మోన్ రక్తంలో కలిసి మెదడుకు చేరడంతో తాత్కాలికంగా జ్ఞాపకశక్తి లోపించడం, అయోమయం వంటి సమస్యలు ఎదురవుతాయి.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
3. స్ట్రెస్‌తో చికాకుగా అనిపించినప్పుడు పదిహేను నిమిషాల పాటు చిన్న చిన్న చిట్కాలను పాటిస్తే తిరిగి ఉత్సాహంగా మారవచ్చని మీకు తెలుసు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
4. కుర్చీలో ప్రశాంతంగా కూర్చుని కాళ్లను చాచి మడమల దగ్గర క్రాస్‌గా ఉంచాలి. ఇప్పుడు చేతులను మీకు అభిముఖంగా చాచి రెండు చేతి వేళ్లను కలిపి లాక్ చేసి చేతులను బాగా స్ట్రెచ్ చేయాలి.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
5. తర్వాత చేతులను ఛాతీకి దగ్గరగా తీసుకురావాలి, ఈ దశలో కళ్లు మూసుకుని చేతుల మీదనే మనసును లగ్నం చేయాలి. ఇలా పది సార్లు చేసిన తర్వాత కొద్దిసేపు విశ్రాంతిగా ఉండాలి.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
6. ఇప్పుడు లేచి నిలబడి ముందుగా ఎడమ మోకాలిని పైకి లేపి కుడి చేత్తో తాకాలి, అలాగే కుడిమోకాలిని పైకి లేపి ఎడమచేత్తో తాకాలి. ఇలా రెండు నిమిషాలు చేయాలి.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
7. ఇప్పుడు భుజాలను నిటారుగా ఉంచి తలను కుడివైపుకి తరవాత ఎడమవైపుకి వంచాలి. అలాగే ముందుకి, వెనక్కి కూడా చేయాలి. ఇలా ఆరుసార్లు చేయాలి.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
8. ఒత్తిడి తగ్గించుకోవడానికి చేసే ఈ పనులను చేసేటప్పుడు శరీరాన్ని, మెదడుని ఒకే అంశం మీద లగ్నం చేయాలని మీకు తెలుసు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐

మీ సమాధానాల్లో 'ఎ'లు ఆరు అంతకంటే ఎక్కువగా వస్తే ఒత్తిడి బారిన పడినప్పటికీ తిరిగి సాంత్వన పొందడం తెలుసు. 'బి'లు ఎక్కువైతే ఒత్తిడిని దూరం చేసుకోవడం మీద మీకు అవగాహన తక్కువ అనుకోవాల్సి ఉంటుంది. పైన చెప్పిన వ్యాయామాన్ని చేసిన తర్వాత ప్రశాంతంగా కూర్చుని ఉదయం నుంచి విన్న వాటిని ఒకసారి గుర్తు చేసుకుంటే తాత్కాలిక మతిమరుపుకు లోనైన అంశాలు ఒకటొకటిగా గుర్తుకు వస్తాయి.

పరి పరిశోధన

కొత్త కాంక్రీట్‌తో జల సంరక్షణ సులువు!

వాన చినుకులన్నీ నేలలోకి ఇంకితే భూగర్భ జలం వృద్ధి చెందుతుంది. అందరికీ మేలు జరుగుతుంది. కానీ.. నగరాల్లో అంగుళం ఖాళీ లేకుండా వేసే కాంక్రీట్ రోడ్ల కారణంగా నీరంతా కొట్టుకుపోతోంది. అయితే వాషింగ్టన్ స్టేట్ యూనివర్శిటీ శాస్త్రవేత్తల పరిశోధనల కారణంగా ఈ చిక్కు సమస్య త్వరలోనే పరిష్కారం కానుంది. దృఢమైన కాంక్రీట్ ద్వారా కూడా నీళ్లు సులువుగా జారిపోయేలా వీరు ఓ కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేయడం దీనికి కారణం. ఏటికేడాదీ పెరిగిపోతున్న కార్బన్ ఫైబర్ వ్యర్థాలతోనే ఈ ఘనతను సాధించడం విశేషం. కాంక్రీట్ ద్వారా నీరు కొద్దిమోతాదులో ఇంకేందుకు అవకాశమున్నప్పటికీ ఇది కాస్తా కాంక్రీట్ దృఢత్వంపై ప్రభావం చూపుతుంది. కొద్దికాలానికే కాంక్రీట్ కొట్టుకుపోతుంది. ఈ నేపథ్యంలో కార్ల్ ఇంగ్లండ్, సామాయా నాసిరీలు కార్బన్ ఫైబర్ వ్యర్థాలతో కొత్త రకం కాంక్రీట్‌ను తయారు చేశారు. ఇది దృఢంగా ఉండటమే కాకుండా సాధారణ కాంక్రీట్ కంటే ఎక్కువ మోతాదులో నీరు భూమిలోకి ఇంకేలా రంధ్రాలు కలిగి ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. పరిశోధన శాలలో ఈ కొత్త కాంక్రీట్ బాగా పనిచేసినప్పటికీ.. సాధారణ పరిస్థితుల్లో ఎలా వ్యవహరిస్తుందో పరీక్షించాల్సి ఉందని.. ఆ తరువాత విస్తృత స్థాయి వాడకానికి సిద్ధం చేయవచ్చునని నాసిరీ అంటున్నారు.



దెబ్బతిన్న గుండెను సరిచేసేందుకు కొత్త పద్ధతి


తోక తెగిపోతే మళ్లీ పెంచుకోగల శక్తి బల్లులకు సొంతం. అలాగే కొన్ని రకాల చేపలు తమ గుండె కణజాలాన్ని మళ్లీ అభివృద్ధి చేసుకోగలవు. మనిషికీ ఇలాంటి శక్తి ఉంటే.. అనేక గుండెజబ్బులకు మెరుగైన, సులువైన చికిత్స సాధ్యమవుతుంది. ఇప్పుడు ఈ పనిలోనే ఉన్నారు గ్లాడ్‌స్టోన్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన వివేక్ శ్రీవాస్తవ. మన శరీరంలో కార్డియోమయోసైట్స్ అనే కణాలు కొన్ని ఉంటాయి. పిండదశలో గుండె ఏర్పడేందుకు గణనీయంగా విభజితమయ్యే ఈ కణాలు.. ఆ తరువాత మాత్రం విభజనకు గురికావు. కార్డియోమయోసైట్స్‌కు మళ్లీ ఆ శక్తిని అందించేందుకు శాస్త్రవేత్తలు దశాబ్దాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా వివేక్ శ్రీవాస్తవ ఇందులో విజయం సాధించారు. జంతువులపై చేసిన ప్రయోగాల్లో కార్డియోమయోసైట్స్ విభజితమవడమే కాకుండా దెబ్బతిన్న గుండె కణజాలాన్ని మరమ్మతు కూడా చేసినట్లు శ్రీవాస్తవ ప్రకటించారు.



కార్డియోమయోసైట్స్ విభజనకు సంబంధించి మొత్తం నాలుగు జన్యువులు పనిచేస్తున్నట్లు గుర్తించిన ఈయన వాటిని పూర్తిస్థాయిలో పనిచేసేలా చేయడం ద్వారా కణాలు వేగంగా విభజితమయ్యేలా చేయగలిగారు. కార్డియోమయోసైట్స్ విభజనను కచ్చితంగా నియంత్రించడం ఎలాగో అర్థం చేసుకోవడం ద్వారా ఈ పద్ధతిని మనుషుల్లోనూ ఉపయోగించవచ్చునని, తద్వారా గుండె పనిచేయని స్థితికి చేరుకున్న వారికీ సాంత్వన చేకూర్చడం వీలవుతుందని శ్రీవాస్తవ అంటున్నారు.

వెలుగులు ఒడిసి పడతాయి...

సూర్యుడి నుంచి వెలువడే వెలుగును వంద శాతం విద్యుత్తుగా మారిస్తే.. ఈ భూమ్మీద పెట్రోలు, డీజిల్ వంటివి అస్సలు అవసరం ఉండదు. కాకపోతే ఎంతటి గొప్ప సోలార్ ప్యానెలైనా కేవలం 25 శాతాన్ని మాత్రమే విద్యుత్తుగా మార్చగలవు. ఈ నేపథ్యంలో జర్మనీలోని బ్రాన్‌ష్వెగ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఓ వినూత్నమైన ఆవిష్కరణ చేశారు. అన్ని దిక్కుల నుంచి వెలుతురును తీసుకుని అతితక్కువ ప్రదేశంలోకి కేంద్రీకరించగలిగే సరికొత్త పరికరాన్ని అభివృద్ధి చేశారు. వీటిని వరుసగా పేర్చడం ద్వారా సూర్యకిరణాల్లోని అన్నిరకాల కాంతిని విద్యుత్తుగా మార్చవచ్చు. ఈ పరికరం మొక్కల్లో వెలుతురును ఒడిసిపట్టే కణాల మాదిరిగా పనిచేస్తుందని ఫోటాన్లను శోషించుకుని ఇతర కణాలకు చేరవేస్తాయని ఈ పరిశోధనల్లో పాలుపంచుకున్న శాస్త్రవేత్త పీటర్ జోమో వల్లా తెలిపారు. దాదాపు 80 శాతం కాంతిని చిన్న ప్రదేశంలోకి కేంద్రీకరించగల ఈ పరికరాలతో భవిష్యత్తులో అతితక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్తును ఉత్పత్తి చేయగల సోలార్ కాన్‌సెంట్రేటర్స్‌ను తయారు చేయవచ్చునని ఆయన వివరించారు. ప్రస్తుతం తాము నీలి రంగు కాంతిని శోషించుకుని మళ్లించగలిగేలా చేయగలిగామని.. ఇతర రంగులకు కూడా ఈ పద్ధతిని విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు.



ప్రతీకాత్మక చిత్రం



అన్నీ ఆయనే చూసుకుంటే...
ఆ భార్య చాలా లక్కీ!
ఆమె ఏటీఎం కార్డు కూడా
ఆయనదే అయితే...
అదే విజయలక్ష్మి జీవితం.
ఆమె చేతిలో లక్ష్మి లేదు
సాధించిన విజయమూ లేదు
మోసపోయానని తెలుసుకున్న
తర్వాత కళ్లు తెరిచింది
ఆ తర్వాత గొంతు విప్పింది.

నుమాయిష్

''కారింకా రాలేదా'' అంటూ ఆఫీస్‌కి రెడీ అయి ముందు గదిలోకి వచ్చింది విజయలక్ష్మి.

''ఇంకా టైముందిగా వస్తుందిలే. సాయంత్రం వచ్చేటప్పుడు సరుకులు తెచ్చేస్తాను'' తాను కూడా రెడీ అయ్యి షూ వేసుకుంటూ అన్నాడు మోహన్‌రావు.

''కార్ రెంట్ కట్టేశారా'' తొమ్మిదిన్నర అవుతున్నా కారు రాకపోవడంతో సందేహం విజయలక్ష్మిలో.

''ఐదో తేదీ లోపు కడితే చాలదూ, ఈ రోజు నాలుగేకదా'' కాస్త విసుగ్గా.

ఇంతలో కారు రానే వచ్చింది. భర్తకు 'ఆఫీస్‌కి వెళ్లొస్తాన'ని చెప్పి విజయలక్ష్మి ఆఫీస్‌కి బయలుదేరింది. మోహన్‌రావు కూడా తన బండి తీశాడు.

• ❖ •

కారులో విజయలక్ష్మి కోసం ప్లేస్ ఇస్తూ ''ఇంట్లో అన్నీ మీవారే చూసుకుంటారా? యు ఆర్ సో లక్కీ'' అన్నది సుజాత.

''ఇంటికి కావలసిన పనులే కాదు, పనివాళ్లకు, పాలవాళ్లకు లెక్క చూసి డబ్బివ్వడం, కూరగాయల నుంచి కరెంటు బిల్లుల వరకు అన్నీ చూసుకుంటారు. విజయకు జస్ట్ ఆఫీస్ ఉద్యోగమే'' అందుకుంది ఝాన్సీలత.

''మీరివన్నీ మా ఆవిడతో చెప్పకండి, నన్ను కూడా ఇవన్నీ చేయమంటే చచ్చిపోతాను'' జోకేశాడు కారు ముందు సీట్లో ఉన్న జగదీశ్.

వాళ్లంతా సికింద్రాబాద్‌లో రైల్వే ఉద్యోగులు. ఆఫీస్‌కి కార్‌పూలింగ్‌లో వెళ్తారు. పిల్లల్ని స్కూల్‌లో దించినట్లుగానే ఓ కాలనీలో నలుగురు కలిసి కారు పూలింగ్ సిస్టమ్‌లో నెలకు అద్దెకు పెట్టుకుంటారు. అలా వాళ్లంతా రోజూ ఆఫీస్‌కి కలిసే వెళ్తారు. దాదాపుగా అందరి ఇళ్లలో సంగతులు అందరికీ తెలుసు. చాలా కొద్ది రోజుల్లోనే విజయలక్ష్మి చాలా లక్కీ అని తేల్చేశారు మిగిలిన ముగ్గురూ.

• ❖ •

''సండే నుమాయిష్ ఎగ్జిబిషన్‌కి వెళ్దామా?'' అడిగింది ఝాన్సీలత సాయంత్రం ఆఫీస్ నుంచి ఇంటికి వస్తున్నప్పుడు.

''మీరు వెళ్లండి, నేను మా వారితో వెళ్తాను'' అని విజయలక్ష్మి పూర్తయిందో లేదో సుజాత అడ్డుకుంది. ''ఎప్పుడూ మీ వారితోనే వెళ్తుంటావు. ఈ సారికి మాతో రావచ్చు'' ఒత్తిడి చేసింది.

''లాస్ట్ ఇయర్ కూడా మీ వారితో వెళ్తానని చెప్పావు, చివరికి ఆయనకు కుదరలేదని వెళ్లనే లేదు నువ్వు. ఇప్పుడు మాతో వచ్చెయ్, అంతగా మీ వారితో కలిసి చెట్టాపట్టాగా చేతులు పట్టుకుని వెళ్లాలంటే మళ్లీ వెళ్లొచ్చులే'' అన్నది ఝాన్సీలత చమత్కారంగా.

విజయలక్ష్మికి మరిచిపోయిన గతం గుర్తుకు వచ్చింది. ఏమీ మాట్లాడకుండా నవ్వేసింది.

''ఎంత డబుల్ పీహెచ్‌డీ చేసినా... మరీ ఇంత మెచ్యూరిటీ ఉండకూడదు విజయా! చిన్న చిన్న ఆనందాలను ఆనందించడం అలవాటు చేసుకో. ఉన్నది ఒక్కటే జీవితం'' సుజాత ఒత్తిడి పెంచింది.

''అలాగే వెళ్దాం...'' విజయలక్ష్మికి కూడా వెళ్లాలనే సరదా కలిగింది.

• ❖ •

సోమవారం ఉదయం. విజయలక్ష్మి ఇంటి ముందు కారాగింది. అప్పటికే కారులో ఉన్న జగదీశ్ మహిళామణులంతా నిన్నటి ఎగ్జిబిషన్‌ను ఆఫీస్‌కు తెస్తున్నారల్లే ఉంది అనుకున్నాడు ఝాన్సీలత, సుజాత ధరించిన దుస్తులు, ఫ్యాన్సీ ఆర్నమెంట్‌లను చూసి.

విజయలక్ష్మి జాయిన్ అయింది చాలా సాదాసీదాగా.

''ఎగ్జిబిషన్ లుక్ అస్సలే లేదేంటి లక్ష్మీ... మమ్మల్ని చూడు ఇరవై నాలుగ్గంటల ముందు స్టాల్‌లో ఉన్నవి ఇప్పుడు మా ఒంటిమీద కొచ్చేశాయి'' అంది ఝాన్సీ.

''నీ చీరలను బీరువా ఎంజాయ్ చేస్తోందా. రిటైరయ్యాక కట్టుకుంటావా'' అన్నది సుజాత కొంచెం కోపంగానే. ఆ మాత్రం చనువు ఉంది సుజాతకి.

''విడాకులు తీసుకోవాలనుకుంటు న్నాను'' సుజాతకి మాత్రమే వినిపించేటట్లు అన్నది విజయలక్ష్మి.

ఎవరూ వినలేదు కదా అన్నట్లు కారులో ఉన్న అందరినీ చూసి విజయలక్ష్మి చేతి మీద నొక్కింది. తర్వాత మాట్లాడుదామన్నట్లు.

• ❖ •

''రైల్వేలో క్లాస్ వన్ ఆఫీసర్‌గా మీకు లక్షకు పైగా శాలరీ ఉంటుంది కదా! నెలకు రెండు వందలు మీ భర్త ఇవ్వడమేంటి?'' అడిగారు లాయర్.

''ఫైవ్ ఇయర్స్‌గా కొలీగ్స్‌మి. తన ఫైనాన్షియల్ కండిషన్ ఇదీ అని మాకే తెలియదు. నిన్న తాను ఏకంగా విడాకులు తీసుకుంటానని చెప్తే నాకే షాక్ అనిపించింది. అడ్వైజ్ కోసం మీ దగ్గరకు తీసుకువచ్చాను. రిటైర్ కాబోతున్న వయసులో విడాకులేంటి, మరేదైనా సొల్యూషన్ చెప్పండి ప్లీజ్'' రిక్వెస్ట్ చేస్తోంది సుజాత.

''డబ్బు పోగొట్టుకున్నాననే బాధలో విడాకులు అడగడం లేదు, మోసపోయాననే బాధతో అడుగుతున్నాను. మోసం చేసిన మనిషితో కలిసి జీవించలేను. ఒంటరిగా ఉండడానికే ఇష్టపడుతున్నాను'' విజయలక్ష్మి మాటల్లో ఆవేదన ఇద్దరికీ అర్థమవుతోంది. ఆమెనే చూస్తున్నారు.

''నాకు బ్యాంకు ఫార్మాలిటీస్ ఏమీ తెలియదు''

''అలాగని ఏటిఎం కార్డు కూడా అతడి చేతిలో పెట్టేశావా'' గయ్‌మంది సుజాత. ఆగమన్నట్లు చెయ్యి చూపించారు లాయర్.

''నెలనెలా నాకు రెండు వందలు ఇచ్చేవాడు. ఇంకా ఎక్కువ ఎందుకు, నగలు, చీరలంటూ తగలేస్తావు, నేను డబ్బును జాగ్రత్తగా ఇన్వెస్ట్ చేస్తాననేవాడు. గొడవ ఎందుకని నేనేమీ మాట్లాడలేకపోయేదాన్ని'' ఆగింది విజయలక్ష్మి.

''ఆ డబ్బుతో అతడు మొదటి భార్య పిల్లల పేరుతో ఆస్తులు ఏర్పరిచాడు. కొన్న ఆస్తి ఎవరి పేరుతో రిజిస్టర్ అవుతుందో అనే స్పృహ కూడా లేకుండా కళ్లు మూసుకుని ఉన్నావా'' సుజాత ఆవేశపడుతోంది.

''అలా చేస్తాడని నేనూహించలేదు. తర్వాత తెలిశాక గొడవ పడీ ప్రయోజనం లేదని మౌనంగా ఉండిపోయాను''

''ఆ తర్వాత అయినా నెల నెలా నీకు వచ్చిన జీతాన్ని నీ కంట్రోల్‌లోకి తెచ్చుకుని ఉంటే బావుండేదిగా'' సుజాత మాట్లాడకుండా ఉండలేకపోతోంది.

''ఆస్తుల వివరాలడిగిన ప్రతిసారీ ఏదో ఒకటి చెప్పేవాడు. ఈ మధ్య నీకు డబ్బు మీద యావ ఎక్కువైందనేవాడు''

''మంచిదానివి అనిపించుకోవాలనే అతిపెద్ద వ్యసనం ఒకటుందిగా నీకు. గట్టిగా అడిగితే 'మంచిదానివి' అనే ట్యాగ్ లైన్ ఎక్కడ పోతుందోనని త్యాగాలు చేశావా'' సుజాత కస్సుమన్నది.

''ఏం చేశానో ఏమో! ఇక నా నిర్ణయం మారదు'' అన్నదామె స్థిరంగా.

ఎగ్జిబిషన్‌లో చీరలు కొన్నందుకు ఆ రాత్రి ఇంట్లో జరిగిన ఘర్షణ, అప్పుడు తెలిసిన నిజాలు విజయలక్ష్మిని కలవరపరిచాయి. అతడు నెలనెలా ఇచ్చిన రెండు వందలను దాచుకుని కొనుక్కున్నా సరే... వెయ్యి రూపాయల చీర కొన్నందుకు చేసిన రగడ ఆమె మనసును విరిచేసింది. అది చీర కోసం కాదు, ఆ మాత్రం చిన్న అధికారం కూడా తనకు లేదా అనే ఆవేదన. తాను కోల్పోయింది ఆర్థిక సాధికారతనా, తన జీవితాన్నా? అనే ప్రశ్న ఆమె మదిని తొలుస్తూనే ఉంది.

- వాకా మంజులారెడ్డి


ఆలస్యమైంది!

విజయలక్ష్మికి విడాకులకంటే మంచి ప్రత్యామ్నాయం కోసం ప్రయత్నించాం. ఒక్కో సంగతి తెలుస్తూ వచ్చాక విడాకులే నయమనిపించింది. ఇప్పుడామె పెన్షన్‌తో జీవిస్తోంది. ఉద్యోగం చేసినన్ని రోజులూ తన జీతం డబ్బును తాను కంటితో చూడలేదు. ఇప్పుడు బ్యాంకు వ్యవహారాలు సొంతంగా చేసుకుంటోంది. ఈ వయసులో ఒంటరిగా జీవిస్తోందనే సానుభూతి తప్ప ఇక ఆమె జీవితం పట్ల ఎవరికీ ఎటువంటి భయాలూ లేవు. డబ్బును రొటీన్ ఖర్చులకు, షార్ట్ టర్మ్ ఇన్వెస్ట్‌మెంట్‌కు విభజించుకుని ప్లాన్ చేసుకుంటోంది. నలుగురికి సలహా ఇస్తోంది. దశాబ్దాల పాటు మౌనంగా దోపిడీని భరించడంతో జీవితమే ఆలస్యమైంది.



- నిశ్చల సిద్ధారెడ్డి, హైకోర్టు న్యాయవాది

అంతరానికి తొలిమెట్టు!



ప్రాచీన కాలంలో స్త్రీ, పురుష అంతరాలు లేవు. అన్ని క్రతువుల్లో అందరూ పాల్గొనేవారు.


మనదేశంలో స్త్రీపురుషుల మధ్య ప్రాచీనకాలంలో అంతరాలు లేవు. క్రమంగా అనేక కారణాలు అంతరాలకు దారితీశాయి. భారత్ లెక్కకు మించినన్ని విదేశీ దాడులను ఎదుర్కొంది. రకరకాల సంస్కృతులు, దురాచారాలు మనదేశంలోకి వచ్చాయి. ఆ క్రమంలో మాతృస్వామ్యం నుంచి పితృస్వామ్యం లోకి మారడమూ ఒక కారణమే. శారీరకంగా బలవంతులైన మగవాళ్లు స్త్రీకి రక్షణ కల్పించే బాధ్యత తీసుకోవడం, అతడి రక్షణలో ఉండడం వల్ల వచ్చే సౌకర్యాన్ని స్త్రీలు ఆస్వాదించడం అంతరానికి తొలిమెట్టు. స్త్రీకి రక్షణ కల్పించడం మగవాళ్ల తప్పని సరి బాధ్యతగా మారిపోయింది. ఇంటికే పరిమితం చేస్తే బయటి నుంచి ఎదురయ్యే ప్రమాదాలను తప్పించుకోవచ్చు అనుకున్నాడు. దేహదారుఢ్యం కంటే మేధోదారుఢ్యం మెండుగా కలిగిన మగవాళ్లు మరో అడుగు ముందుకేసి ఇంట్లోనే ఉండే ఆడవాళ్లకు చదువు ఎందుకు అనే కొత్త వాదన లేవదీసి మహిళలను చదువుకు దూరం చేశారు.

డబ్బు లెక్క మగవాళ్లదే!

చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ ఆర్థిక లావాదేవీలంటేనే సింహస్వప్నంగా భావించే ఆడవాళ్లు ఇంకా ఉన్నారు. వాళ్లు తమంతట తామే ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్‌ని భర్తల చేతుల్లో పెట్టేస్తుంటారు. కొంతమంది... భర్త తన ఏటిఎం కార్డు తీసుకుని తన ఖర్చులకు డబ్బు రాలుస్తాడని చెప్పుకోలేక 'పిన్ నంబరు నాకు గుర్తుండదు. అందుకే మా వారికిస్తాను' అని చెప్పుకుంటూంటారు. ముఖ్యంగా యాభైలు దాటిన వారిలో ఈ కండిషన్ ఎక్కువగా కనిపిస్తోంది. నలభై లోపు మహిళలు కొంత చైతన్యవంతంగానే ఉంటున్నారు. ఆంక్షలను ఛేదిస్తూ అంతరాన్ని పూడ్చడానికి జరుగుతున్న పోరాటమే సాధికారత సాధన. ఆ దిశగా మహిళ వేస్తున్న ముందడుగు ఇది.

కౌన్సెలింగ్

నేనేం చేయాలి?



ప్రతీకాత్మక చిత్రం

నేను బీటెక్ తర్వాత విప్రోలో ఉద్యోగం చేస్తున్నాను. చేరి నాలుగు నెలలైంది. పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. అమ్మానాన్నల నుంచి నేను డబ్బును ఎలా ఖర్చు పెడుతున్నాననే నిఘా కానీ, ఇలాగే ఖర్చు చేయమనే ఒత్తిడులు కానీ లేవు. ఇన్వెస్ట్‌మెంట్ అలవాటు చేసుకోమని మాత్రమే చెబుతుంటారు. నా డౌట్ ఏమిటంటే... పెళ్లయిన తర్వాత డబ్బంతా భర్తకో అత్తగారికో ఇచ్చేయాల్సిందేనా? నాకు వస్తున్న పెళ్లి సంబంధాలలో చాలా వరకు నా ఉద్యోగం, జీతం వివరాలను ప్రధానంగా అడుగుతున్నారు. కొంతమంది ధోరణి చూస్తుంటే 'మా అమ్మానాన్న నన్ను పెంచి, చదివించి, పెళ్లి చేస్తున్నది సంపాదించే యంత్రాన్ని వాళ్లింటికి పంపడానికే' అన్నట్లుంది. పెళ్లయితే ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్‌ని కోల్పోవల్సిందేనా?

– శ్రీలేఖ, విశాఖపట్టణం

పెళ్లికి– ఆర్థిక సాధికారతకు ఏ మాత్రం సంబంధం లేదు. అయితే ఆర్థిక సాధికారతను నిలబెట్టుకోవడం, చేజార్చుకోవడం అనేది పెళ్లితో ముడిపడి ఉంటాయి. ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్ కోల్పోకుండా జీవితాన్ని సజావుగా కొనసాగించడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- ప్రతి ఒక్కరికీ సొంతంగా డబ్బు ఉండాలి. దానిని దాచుకోవడానికి బ్యాంకు లేదా పోస్టాఫీస్ అకౌంట్ ఉండాలి. తమ ఇష్టాలను నెరవేర్చుకోవడానికి పర్సనల్ స్పేస్ ఉన్నట్లే పర్సనల్ అకౌంట్ కూడా ఉండాలి.
- ఇంటి నిర్వహణ బాధ్యత భార్యాభర్తలిద్దరి మీదా ఉంటుంది. కాబట్టి కొంత డబ్బు ఇంటికి వాడుతూనే చిన్నమొత్తమైనా సరే తన కోసం... అది పూర్తిగా తనకోసమే దాచుకోవాలి.
- అమ్మాయి జీతం భర్తకు ఇచ్చి తీరాలనే షరతు పెడుతుంటారు పెళ్లి కుదుర్చుకునేటప్పుడు, దానికి అంగీకరించరాదు. అమ్మాయి తల్లిదండ్రులు పెళ్లి సమయంలో అమ్మాయికి తెలియకుండా ఎలాంటి ఒప్పందాలు చేసుకోకూడదు.
- రెంటల్ ఇన్‌కమ్ వచ్చే ఆస్తి పెళ్లి సమయంలో అమ్మాయి తల్లిదండ్రులు వరుడికి రిజిస్టర్ చేస్తుంటారు. ఇది పూర్తిగా పొరపాటే. వాటిని అమ్మాయి పేరు మీదనే ఉంచాలి. అలాగే ఆ అద్దెలు అమ్మాయి చేతికి వచ్చేటట్లు చేయాలి.
- పెళ్లయిన తర్వాత భర్త జాబ్ రికార్డ్స్‌లో భార్య పేరు విధిగా ఎంటర్ చేయాలి. ఇన్సూరెన్స్ పాలసీలకు కూడా నామినీ పేరు తప్పనిసరిగా భార్య పేరు చేర్చాలి. అలా కాని పక్షంలో రిస్క్ ఎదురైతే తామే అసలైన నామినీలమంటూ తల్లిదండ్రులు రంగంలోకి వచ్చి భార్యకు ఏమీ చెందకుండా అడ్డుకుంటుంటారు. అది వివాదాలకు దారి తీస్తుంది.
- మ్యారేజ్‌ని రిజిస్టర్ చేయించి తీరాలి.
- భర్తను నమ్మాలి. అయితే భర్తే సర్వస్వం అన్నట్లు గుడ్డిగా ఉండకూడదు. తన స్వావలంబన, సాధికారత విషయంలో తన కాళ్ల మీద తానే నిలబడాలి. ఇప్పటి పరిస్థితులు అలాగే ఉన్నాయి మరి.

మహిళకు ఫైనాన్షియల్ ఎంపవర్‌మెంట్ చాలా అవసరం. అయితే అది ఒకరు ఇస్తే వచ్చేది కాదు, స్త్రీ తనకు తానుగా పరిరక్షించుకోవాలి. మొదటగా ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్ చేజారి పోకుండా చూసుకోవాలి.

– ఫ్యామిలీ కౌన్సెలర్

పారదర్శకత ఉంటే మరేమీ అక్కరలేదు!

సురేంద్ర ఎకనమిక్ ప్రొఫెసర్. భార్య వినీత సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్. కొన్నేళ్లకు సురేంద్ర కూడా సాఫ్ట్‌వేర్ రంగంలోకి మారిపోయాడు. ఇద్దరికీ అమెరికాలో ఉద్యోగాలు వచ్చాయి. ఇద్దరి పేరు మీద జాయింట్ అకౌంట్ ఓపెన్ చేశారు. ఇద్దరూ ప్రతి డాలర్‌కీ లెక్కరాస్తారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా రెండో వాళ్లు ఎదురు చెప్పరు. అక్కడే ఇల్లు కొని, ఇద్దరి పేరు మీద రిజిస్టర్ చేయించుకున్నారు. భార్యాభర్తల మధ్య అత్యంత నిజాయితీ, పారదర్శకత ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. అందరూ సురేంద్ర ఉన్నట్లు ఉండకపోవచ్చు, పోవచ్చు కాదు ఉండరు. అందుకే కొద్దిపాటి జాగ్రత్తలతో జీవితాలను పటిష్టంగా నిర్మించుకోవాలి.

మాకు పంపండి: ఒక మహిళగా మీరు గృహహింస వంటి వేధింపులకు గానీ, సామాజికంగా వివక్షకుగానీ లేదా సంబంధిత ఇతర సమస్యలతో బాధపడుతున్నారా? మీ సమస్యను రాసి మాకు మెయిల్ ద్వారా పంపించండి.ఆయా రంగాలకు చెందిన నిపుణులతో మీకు తగిన సూచనలు / సలహాలు ఇప్పించే ఏర్పాటు చేస్తాం. మీరు మీ ప్రశ్నలను పంపాల్సిన మెయిల్ ఐడీ : nenusakthiquestions@gmail.com

---

మళ్లీ చెప్పుకుందాం! రీటోల్డ్ కథలు - 23

పురుష సేవ

రేడియో రూము దగ్గర ఊరంతా జమయ్యింది.

పంచాయితీ అట.

ఎవరి మీద?

మాదిగ కందారప్ప మీద.

వాడు రావాలి వాడి సంగతి చూడాలి అని కాచుకుని ఉన్నారు జనం.

కందారప్ప వచ్చాడు. వాడి పెళ్లాము వచ్చింది. బక్కగా ఒంటిలో నౌటాకు కండ లేకుండా దీనంగా... తినీ తినని బతుకులు అని తెలిసిపోతూ ఉంది.

'చెప్పండి దేవరా' అన్నాడు కందారప్ప.

'నువ్వు అమ్మోరికి మొక్కుకుని వదిలిన దున్నపోతు ఏనుగంత అయ్యి ఊళ్లోళ్ల పొలాలు మేసేస్తోంది. దానిని ఎప్పుడు బలిస్తావురా కందారప్ప' అన్నాడు ఊరి పెద్ద.

కందారప్ప తల దించుకున్నాడు.

ఈ పంచాయితీ దేని కోసమో అర్థమైపోయింది.

దున్నపోతు కోసం కాదు. కూతురి కోసం. ఇంకా పదేళ్లయినా రాని కూతురి కోసం.

'ఇంక నాలుగునాళ్లు ఆగండి దేవరా. మీకు పుణ్యముంటుంది'

'ఏయ్.. ఇంకా ఎంతకాలం ఆగమంటావురా?'

అందరి వైపు చూశాడు. మగాళ్లు. బలిసిన మగాళ్లు. ఆశగా ఉన్న మగాళ్లు. ఆత్రంగా ఉన్న మగాళ్లు. మాంసం కోసం కాచుకుని ఉన్న మగాళ్లు. వీళ్లందరికీ తన కూతురు కావాలి. బోడెక్క కావాలి.

తను కూడా వద్దనుకోలేదు.

ఒక్కగానొక్క కూతురు. ఎవరికో ఒకరికి ఇచ్చి కట్టబెడితే పిల్ల కళ్ల ముందు ఉండదు. అవసరానికి పలకదు. ముసలితనంలో గంజి పోయదు. అదే బసివిని చేస్తే ఊళ్లోనే పడి ఉంటుంది. నాలుగు చిల్లర డబ్బులు తెస్తుంది. అన్నం పెడుతుంది. అందుకే కూతురిని బసివిని చేస్తానని అమ్మోరికి మొక్కుకుని, ఒక దున్నపోతు పిల్లను కొని, దానిని దేవర దున్నగా ఊరి మీద విడిచిపెట్టాడు. బసివిని చేసే కార్యం రోజున ఆ దున్నను బలి ఇవ్వాలి. ఇవ్వను అని తను అనట్లేదు. కాని చిన్నపిల్ల కదా అని ఆగుతున్నాడు. ఊరి జనం ఆగడం లేదే.

'మీకు పుణ్యముంటుంది... పదేళ్లు కూడా నిండలేదు దానికి'

'రేయ్... ఎన్ని తూర్లు చెప్పాలిరా నీకు. కర్నాటకంలో ఇంత ఆలస్యం చేస్తున్నారా? మూడు నాలుగేళ్లకే బసివిని చేస్తున్నారు. చుట్టుపక్కల పల్లెల్లో నెలల బిడ్డను కూడా బసివినిగా చేస్తున్నది వినట్లేదా. నీదేందిరా ఆలస్యం'

కందారప్ప కులం మనుషుల వైపు చూశాడు.

కులం మనుషులు ఏమీ మాట్లాడలేదు. ఇది కులాచారం. పాటించాల్సిందే. కాకపోతే ఈ ఆచారం చిన్న కులాల్లోనే ఉంటుంది. పెద్ద కులాల్లో ఉండదు. పెద్దకులాల వాళ్లకి చిన్న కులాల ఆడవాళ్లు బసివినులుగా ఉండాలి తప్ప చిన్నకులాలవాళ్లకు పెద్దకులాల ఆడవాళ్లు బసివినులుగా ఉండరు. ఇది చిన్న కులాల ఖర్మ. అంతే. ఈ ఖర్మకు ఊరంతా మద్దతు ఇస్తుంది. ఊరంతా అంటే ఊళ్లోని మగవాళ్లంతా అని అర్థం.

కందారప్ప చివరి బలహీన అస్త్రం సంధించాడు.


'నా కాడ డబ్బులు లేవు దేవరా'

'అదెంత పనిరా' అన్నాడు ఊరి పెద్ద.

లెక్కలు గట్టారు. చుట్టుపక్కల మాదిగవాళ్ల బువ్వకు, తప్పెట్లకు, సారాకు, కుల దేవతకు సమర్పించాల్సిన సాంగేనికి ఇంతవుతుందని తేల్చారు.

'సగం నాది' అన్నాడు ఊరి పెద్ద.

'మిగిలిన సగం



ఊరిది' అంది ఊరు.

కరణం లేచాడు.

'మొలకల పున్నమి నాటికి బోడెక్క పెద్దమనిషి అవడం ఖాయం. కనుక అది దాటిన రెండు మూడు రోజుల్లో వచ్చే మంచి ముహూర్తానికే అమ్మిని బసివినిగా విడవాలి. ఇందులో మార్పు లేదు' అని నిర్ణయం చెప్పాడు.

మట్టిలో ఆడుకుంటున్న బోడెక్కకు ఈ సంగతి ఎవరో చెప్పారు. గుక్కపెట్టి ఏడ్చింది బోడెక్క. నేల మీద దొర్లి కాళ్లు చేతులు కొట్టుకుంది బోడెక్క. నన్ను అమ్మోరికి బలివ్వండి... అంతేతప్ప బసివినిగా విడొద్దు అని నెత్తీ నోరూ కొట్టుకుంది బోడెక్క. వినేవాళ్లు లేరు.



• నాగప్పగారి సుందర్రాజు

ముహూర్తం వచ్చింది.

ఆడపిల్ల అప్పనంగా దొరికే వేడుకకు ఊరంతా జమైంది.

ఓ... యమా హుషారు. తప్పెట్లు మోగుతున్నాయి. సారా పారుతోంది. మగాళ్లు ఊగుతున్నారు. ఆడవాళ్లు నోటికి కొంగు అడ్డం పెట్టుకుని కళ్లు చికిలించి చూస్తూ ఉన్నారు. ఊరి పెద్దలు నలగని బట్టలు కట్టుకొని అజమాయిషీ చేస్తున్నారు.

బోడెక్కకు బట్టలూడదీసి, వేపాకు మండలు కట్టి, వీధుల్లో ఊరేగించి, సాంగెం ముగించి ఆఖరు తంతుగా దేవర దున్నపోతును బలి యివ్వడానికి రంగం సిద్ధం చేశారు.

ఒక్క వేటుకు దున్న తల నరికే మొనగాడికి మూడు తులాల బంగారం నజరానా అట.

ఇది అసలు వేడుక. జనం ఇసుక వేస్తే రాలనంతగా దగ్గరకు కూడారు.

'అదుగో పోతురాజు' అన్నారెవరో.

పోతురాజు వచ్చాడు. కండలు పొంగిస్తూ వచ్చాడు. గండ్రగొడ్డలి మెరిపిస్తూ వచ్చాడు.

ఊరు ఆత్రంగా చూస్తూ ఉంది.

బోడెక్క ఏడుస్తూ ఉంది. కత్తి పదును తేలుతోంది. దున్న పెనుగులాడుతూ ఉంది.

గండ్రగొడ్డలి పైకెత్తాడు.

బోడెక్క కళ్లల్లో బతుకు భయం. దున్న కళ్లల్లో ప్రాణభయం.

ఫట్. ఒకే దెబ్బ. తల ఎగిరి పడింది.

'ఓ'... కరతాళధ్వనులు..

కేరింతలు.. కేకలు.

తంతు ముగిసింది.

మాదిగలంతా ఇప్పుడు దేవర దున్న కూరాకు కోసం వంతులు వేసుకుంటూ ఉన్నారు.

ఇంకా పెద్దమనిషి కాని బోడెక్క కోసం ఊరి పెద్దలు వంతులు వేసుకుంటూ ఉన్నారు.


కథ ముగిసింది.

నాగప్పగారి సుందర్రాజు రాసిన 'నడిమింటి బోడెక్క బసివిరాలయ్యెద' కథ ఇది.

దైవసేవకు పశువును విడిచినట్టు పురుషసేవకు స్త్రీని విడిచిపెట్టే ఆచారాన్ని మగవాడు కనిపెట్టాడు. అందుకోసం పీడింపబడే జాతిని సిద్ధం చేశాడు. ఆ జాతి ఆడవాళ్ల మీద స్వీయ అంగీకారం పొందాడు. అమానుషమైన మగవాంఛకు బలయ్యే బసివినులు, మాతంగులు ఇప్పటికీ ఉన్నారు. దేశమంతా రకరకాల పేరుతో ఈ దురాచారం ఉంది. వీరి దు:ఖనది అంతర్వాహినిగా ఈ మట్టిలో సజీవంగా ప్రవహిస్తూనే ఉంది.

పునః కథనం: **ఖదీర్**

హుహహా..!



● రజనీకాంత్

'హుహహా'...'2.0' టీజర్‌లో ఇదిగో ఇలాగే ఫినిషింగ్ టచ్ ఇచ్చారు రజనీకాంత్. అవునా! మరి..'2.0'టీజర్‌ను అధికారికంగా రిలీజ్ చేయలేదు కదా! అంటే..నిజమే అధికారికంగా రిలీజ్ చేయకుండానే '2.0' టీజర్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. శంకర్ దర్శకత్వంలో రజనీకాంత్, అక్షయ్‌కుమార్, అమీజాక్సన్ ముఖ్య తారలుగా ఆల్మోస్ట్ 400 కోట్ల భారీ బడ్జెట్‌తో లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన చిత్రం '2.0'. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ గ్రాఫిక్స్ వర్క్ పెండింగ్ ఉండటం వల్ల వాయిదా వేశారు. కానీ ఇంతలోనే ఊహించని విధంగా ఆల్మోస్ట్ 90 సెకన్ల నిడివి ఉన్న '2.0' టీజర్ సోషల్ మీడియాలో లీకైంది. ఈ లీకేజ్ పై రజనీకాంత్ కూతురు సౌందర్యా రజనీకాంత్ స్పందిస్తూ– ''అధికారికంగా ప్రకటించడానికి ముందే ఆన్‌లైన్‌లో ఇలాంటివి లీక్ అవ్వడం సహించరానిది. ప్రోత్సహించకూడని విషయం. ఓన్లీ కొన్ని సెకన్ల ఎగ్జైట్‌మెంట్ కోసం మూవీ యూనిట్ హార్డ్‌వర్క్‌ని, కష్టాన్ని, సెంటిమెంట్స్‌ను అగౌరవపరచడం సరికాదు. ఇది సిగ్గుపడ్సాలిన విషయం. పైరసీని ఆపండి. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ని దుర్వినియోగం చేయకండి'' అని అన్నారామె. మరోవైపు లైకా ప్రొడక్షన్స్ సంస్థకు చెందిన ఓ ముఖ్య ప్రతినిధి బర్త్‌డే సందర్భంగా వీఐపీలకు '2.0' టీజర్ స్పెషల్‌గా వేశారట. అక్కడి నుంచి ఈ '2.0' టీజర్ లీకైందన్న వాదనలు మీడియాలో వినిపిస్తున్నాయి. ఈ సంగతి ఇలా ఉంచితే.. రజనీకాంత్ హీరోగా రూపొందిన 'కాలా' టీజర్ కూడా అధికారికంగా చెప్పిన సమయానికన్నా ముందే ఆన్‌లైన్‌లో లీకైన విషయం తెలిసిందే. 'కాలా' చిత్రాన్ని ఏప్రిల్ 27న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

శ్రీదేవి మరో జన్మలోనూ శ్రీదేవిలానే పుట్టాలి -సుబ్బరామిరెడ్డి


● జయసుధ, జయప్రద, జీవిత, బాబుమోహన్, కృష్ణంరాజు, రాజశేఖర్, సుబ్బరామిరెడ్డి, సుశీల, జగపతిబాబు....

''అందరూ జన్మిస్తారు. జీవిస్తారు. మరణిస్తారు. కొంత మంది మరణించినా శాశ్వతంగా గుండెలో ఎప్పుడు చెరగని ముద్ర వేసి జీవిస్తారు. అలాంటి కోవకు చెందిన మనిషి శ్రీదేవి'' అన్నారు కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి. ప్రముఖ సినీతార శ్రీదేవి సంస్మరణ సభ ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లో టి.సుబ్బిరామిరెడ్డి అధ్యక్షతన జరిగింది. పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి వచ్చి శ్రీదేవితో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ–'' భారతదేశ చలనచిత్రరంగంలో శ్రీదేవి కోట్లాది అభిమానులను సంపాదించుకున్నారు. తెలుగు ప్రేక్షకులు అభిమానించారు. హిందీలో చాందినీగా ఆకట్టుకున్నారు. ఆవిడ మరణవార్త విని దేశం మొత్తం షాక్ అయ్యింది. ఎవ్వరూ కలలో కూడా ఊహించలేదు. శ్రీదేవితో మా అమ్మాయి పింకీ రెడ్డి ఎంతో సన్నిహితంగా ఉండేది. శ్రీదేవి ఎంత పెద్ద ఆర్టిస్టో అంత మంచి హ్యూమన్ బీయింగ్. ఎంత ఎత్తు ఎదిగినా రూట్స్‌ని మరిచిపోలేదు. అంత గొప్ప నటి, శక్తి స్వరూపిణి దూరమైయేసరికి కోట్లాది అభిమానులు తమ అభిమానాన్ని, దుఃఖాన్ని చూపించారు. బోనీ కపూర్, శ్రీదేవి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఎప్పుడు వాళ్లు విడిగా వచ్చేవారు కాదు. శ్రీదేవి మరోజన్మలోను శ్రీదేవిలానే పుట్టాలి. తెలుగమ్మాయిగానే పుట్టాలి. మా శ్రీదేవి మళ్లీ వచ్చిందనుకోవాలి'' అన్నారు. ప్రముఖ గాయని సుశీల మాట్లాడుతూ–'' దేవలోకం నుంచి వచ్చిన దేవకన్య శ్రీదేవి. మనల్ని మైమరపించి మళ్లీ తన లోకానికే వెళ్లిపోయింది. 8 ఏళ్ల వయసులో శ్రీదేవికి పాట పాడాను. అంతేకాదు ఆమె మొట్టమొదటి సినిమాకు కూడా పాట పాడాను. మనకు ఎన్నో తీపిగుర్తులను మిగిల్చి తను వెళ్లిపోయింది'' అన్నారు.''శ్రీదేవితో కలిసి నాలుగు సినిమాల్లో నటించాను. ఆమె నిగర్వీగా ఉండేది'' అన్నారు నటుడు కోటశ్రీనివాసరావు. ''శ్రీదేవి గురించి ఎంత చెప్పినా తక్కువే. నన్ను ఎప్పుడూ సార్ అని పిలిచేది. ఆమెకు పెద్దలంటే ఎంతో గౌరవం. ఇప్పుడు ఆమె లేదు అంటే నమ్మబుద్ధి కావడం లేదు. దేశం గర్వించదగ్గ నటి శ్రీదేవి. ఆమె మరణించినా..సినీ ప్రపంచంలో చెరగని ముద్ర వేశారు. ప్రతి ఒక్కరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారామె'' అని అన్నారు కృష్ణంరాజు. '' శ్రీదేవి మరణవార్త విన్న తర్వాత ఎంతో దుఃఖించాను. తెలుగు అమ్మాయిగా ఎంతో సాధించింది. జీవితంలోని ప్రతి అడుగును ఒక లక్ష్యంగా చేసుకుని నడిచింది. ప్రతి పాత్రను ఒక సవాలుగా తీసుకునేది శ్రీదేవి. కొత్తగా సినిమాల్లోకి వచ్చే వారు శ్రీదేవిలా ఉండాలని కోరుకుంటారు. శ్రీదేవి గొప్ప నటి మాత్రమే కాదు. మంచి మాతృమూర్తి కూడా. తనలాగే జాన్వీని కూడా తీర్చిదిద్దాలని అనుకున్నారు. జాన్వీ మంచి నటిగా రాణించాలని కోరుకుంటున్నాను''అన్నారు నటి జయప్రద. ''శ్రీదేవి మరణవార్తను జీర్ణించుకోలేకపోయాను. శ్రీదేవి కుటుంబంతో మా కుటుంబానికి మంచి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆమెతో ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. వాటిని మరిచిపోలేక పోతున్నాను. జాన్వీ మంచి నటిగా పేరు తెచ్చుకోవాలి'' అన్నారు నటి జయసుధ.

''శ్రీదేవితో కలిసి నటించలేదు. కానీ ఫ్యామిలీ ఫ్రెండ్. ఆమెతో ఓ సినిమాలో నటించే అవకాశం కొద్దిలో తప్పిపోయింది. ఆమె దేశంలోని ప్రతి కుటుంబంలో ఒక సభ్యురాలే. ముంబైలో జరిగిన శ్రీదేవి అంత్యక్రియలకు వెళ్లాలి అనుకున్నాను. కానీ..కుదర్లేదు. ఇప్పుడు సంస్మరణసభలో పాల్గొనే అవకాశం వచ్చింది'' అన్నారు హీరో రాజశేఖర్. ''1972లో 'బడిపంతులు' సినిమాలో శ్రీదేవిని చూసిన మొదటి రోజే గొప్ప నటి అవుతుందని అనుకున్నాను. రామానాయుడు ఆమెను 'దేవత'ను చేస్తే..ఎన్టీఆర్ ఆమెను 'అనురాగదేవత'ను చేశారు'' అన్నారు రచయిత పరుచూరి గోపాలకృష్ణ. ''శ్రీదేవి సెట్‌లో ఎవర్నీ బాధపెట్టలేదు. కానీ చనిపోయి అందర్నీ నొప్పించింది'' అన్నారు నిర్మాత సి.కల్యాణ్. ''శ్రీదేవికి నేను పెద్ద అభిమానిని. 'బడిపంతులు' సినిమాలో శ్రీదేవి నటన చూసి, గొప్ప నటి అవుతుందనుకున్నాను'' అన్నారు నటుడు బాబుమోహన్. ''శ్రీదేవితో నటించాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు. శ్రీదేవితో నటించే అవకాశం దక్కనందుకు బాధపడుతున్నాను. శ్రీదేవి లాంటి హీరోయిన్ కావాలని కోరుకునే వారిలో నేనూ ఉన్నాను'' అన్నారు హీరోయిన్ నివేధా థామస్. రేలంగి నరసింహరావు, అమల, శ్రీకాంత్, అల్లు అరవింద్, జగపతిబాబు, సుమంత్, ఆలీ, శివాజీ రాజా, నరేశ్, ఉపాసన కామినేని తదితరులు పాల్గొన్నారు.

రంగస్థలానికి టాటా


● రామ్‌చరణ్

వెయిటింగ్..వెయిటింగ్...వెండితెరపై చిట్టిబాబు నటనను చూడడానికి ఫ్యాన్స్ అందరూ పిచ్చ వెయిటింగ్. చిట్టిబాబు కూడా ఈ వెయిటింగ్‌ను తగ్గించే పనిలోనే ఉన్నాడు. ఆదివారం 'రంగస్థలం' సినిమా షూటింగ్‌కు చిట్టిబాబు టాటా చెప్పేశాడు. రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, చెరుకూరి మోహన్ నిర్మించిన చిత్రం 'రంగస్థలం'. ఇందులో సమంత కథానాయిక. ఆదివారం జరిగిన షెడ్యూల్‌తో చిట్టిబాబు షూటింగ్‌కు టాటా చెప్పారు. ఈ విషయాన్ని రామ్‌చరణ్ సతీమణి ఉపాసన సోషల్‌మీడియా ద్వారా తెలిపారు. ''చిట్టిబాబు షూటింగ్ కంప్లీట్ చేశాడు. మార్చి 30న ఆడియన్స్ రెస్పాన్స్ వినడానికి వెయిట్ చేస్తున్నాడు'' అని పేర్కొన్నారామె. అదేంటి.. చిట్టిబాబు వినలేడు కదా? అంటే..అది రీల్ లైఫ్ అండి..బాబు. రియల్ లైఫ్‌లో కాదుగా! మరి..ఈలలతో థియేటర్స్‌ను మోతమోగించడానికి ఫ్యాన్స్ అందరూ రెడీగా ఉండాలన్న మాట. ఈ సినిమాలో చిట్టిబాబు పాత్రలో రామ్‌చరణ్, రామలక్ష్మి పాత్రలో సమంత నటించారు. ప్రకాశ్‌రాజ్, జగపతిబాబు, ఆది పినిశెట్టి, అనసూయ కీలక పాత్రలో నటించిన 'రంగస్థలం' చిత్రాన్ని మార్చి 30న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ స్వరకర్త.

నవ్వులు పంచటానికి నాలుగోసారి

''ఆహనా పెళ్లంట, యాక్షన్ 3డి, జేమ్స్ బాండ్' సినిమాల తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, ప్రొడ్యూసర్ అనిల్ సుంకర్ నాలుగో సినిమాకు రెడీ అయ్యారు. ఏటీవీ సమర్పణలో రామ బ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ సినిమాకు 'నందిని నర్సింగ్ హోమ్' ఫేమ్ పీవీ. గిరి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో నిర్వహించారు. ''నాలుగోసారి కూడా నవ్వులు పంచటానికి రెండింతలు ఎక్కువ టైమ్, మూడింతలు ఎక్స్‌ట్రా కేర్ తీసుకున్నాం. కచ్చితంగా బాక్సాఫీస్ వద్ద నవ్వులు వర్షం కురిపిస్తాం'' అని పేర్కొన్నారు అనిల్ సుంకర. ఈ సినిమాకు కెమెరా: నగేశ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికపాటి.


● అల్లరి నరేశ్


● 'పరిచయం' సినిమా యూనిట్ సభ్యులతో నాని....

పరిచయం మంచి విజయం సాధించాలి: నాని

విరాట్ కొండూరి, సిమ్రత్ కౌర్ జంటగా అసిన్ మూవీ క్రియేషన్స్‌పై 'హైద్రాబాద్ నవాబ్స్' ఫేమ్ లక్ష్మీకాంత్ చెన్నా దర్శకత్వంలో రియాజ్ నిర్మించిన చిత్రం 'పరిచయం'. ఈ సినిమా ఫస్ట్‌లుక్ అండ్ టీజర్‌ను హీరో నాని రిలీజ్ చేశారు. నాని మాట్లాడుతూ–'' టీజర్ చూస్తుంటే మణిరత్నంగారి 'గీతాంజలి' మూవీ గుర్తొస్తుంది. మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా ఉంది. కథకు హీరోహీరోయిన్లు బాగా సూట్ అయ్యారు. ఈ చిత్రం ద్వారా నా మిత్రుడు లక్ష్మీకాంత్ చెన్నకి, చిత్ర నిర్మాత రియాజ్ గారికి మంచి సక్సెస్ రావాలి.'' అన్నారు. ''నానీగారు మా టీజర్‌ను 'గీతాంజలి' లాంటి మంచి మూవీతో పోల్చడం ఆనందంగా ఉంది. మా చిత్రాన్ని సపోర్ట్ చేయడానికి వచ్చిన నానీకి థ్యాంక్స్. లవ్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటుగా స్ట్రాంగ్ ఎమోషనల్‌గా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు లక్ష్మీకాంత్. ''షూటింగ్ కంప్లీటైంది. ఏప్రిల్ మొదటి వారంలో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు రియాజ్. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు: శేఖర్ చంద్ర, కెమెరా:నరేష్ రానా.

ఖర్చు తగ్గిందన్నమాట!


● నితిన్, రాశీఖన్నా

సోషల్ మీడియాలో ఒకటే చర్చ. హీరో నితిన్ పెళ్లి గురించి. పెళ్లికొడుకు గెటప్‌లో ఉన్న ఫోటోను నితిన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడమే ఇందుకు కారణం. కానీ నితిన్ పెళ్లికొడుకుగా మారింది రియల్ లైఫ్‌లో కాదు. రీల్ లైఫ్‌లోనే. 'శతమానం భవతి' ఫేమ్ సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో నితిన్ హీరోగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై 'దిల్' రాజు నిర్మిస్తున్న చిత్రం 'శ్రీనివాస కల్యాణం'. ఇందులో రాశీఖన్నా, నందిత శ్వేత కథానాయికలుగా నటిస్తున్నారు. ఆల్మోస్ట్ 14 ఏళ్ల తర్వాత నితిన్, 'దిల్' రాజుల కాంబినేషన్‌లో ఈ చిత్రం రూపొందుతుండటం విశేషం. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను ఆదివారం రిలీజ్ చేశారు. చిత్రీకరణ మొదలైంది. '' ఈ నెల 16 నుంచి రెగ్యులర్ షూట్ స్టార్ట్ కానుంది. ఈ షెడ్యూల్ ఈ నెల 30 వరకు జరుగుతుంది. ఈ ఏడాది జూన్ కల్లా షూటింగ్‌ను కంప్లీట్ చేసి, జూలై చివరి వారం లేదా ఆగస్టు మొదటి వారంలో చిత్రాన్ని విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కి జె. మేయర్, కెమెరా: సమీర్ రెడ్డి. ఈ సినిమా సంగతి ఇలా ఉంచితే..''మ్యారేజ్‌కి కెమెరామెన్ అవసరం లేదన్నా, ఇవే పెళ్లి ఫొటోలు అని పోస్ట్ చేసినా నమ్మేలా ఉన్నాయ్'' అని ఓ నెటిజన్ నితిన్ పోస్ట్ చేసిన ఈ సినిమా ఫొటోను ఉద్దేశించి అన్నాడు. 'ఖర్చు తగ్గిందన్నమాట' అంటూ సరదాగా అతనికి బదులు ఇచ్చాడు నితిన్.

ఈ ప్రయత్నం సక్సెస్ కావాలి
– శ్రీకాంత్


● అమృత అయ్యర్, సాయి రోనక్, ఛరిష్మాపై క్లాప్ ఇస్తున్న శ్రీకాంత్

సాయి రోనక్, అమృత అయ్యర్,ఛరిష్మా శ్రీకర్ , శ్రీప్రియ ముఖ్య పాత్రల్లో వి.ఎన్.ఆదిత్య దర్శకత్వంలో రూపొందనున్న సినిమా 'అలా నేను ఇలా నువ్వు'. రాజ్ కందుకూరి సమర్పణలో వీరశంకర్ నిర్మించనున్నారు. ఇటీవల షూటింగ్ ప్రారంభమైంది. శ్రీకాంత్ క్లాప్‌నివ్వగా 'మా' అధ్యక్షుడు శివాజీరాజా కెమెరా స్విచ్చాన్ చేశారు. బి గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత వీరశంకర్ మాట్లాడుతూ– ''వేరు వేరు సాంప్రదాయల మధ్య పెరిగే యువతీయువకులకు వేరువేరు అభిరుచులు ఉంటాయి. ఆ అభిరుచుల వల్ల ఎలాంటి సంఘర్షణలు ఎదుర్కొన్నారన్నది ఈ సినిమా కథాంశం. ఈ కథ 80–90 మధ్యలో జరుగుతుంది. హెటివో ద్వారా నేరుగా ఇంట్లో హోమ్ థియేటర్స్‌లో విడుదల అవుతుంది'' అన్నారు. ''ప్రేమా,యాక్షన్‌ను ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ఎంటర్‌టైనింగ్‌గా చెబుతున్నాం. మా ప్రయత్నం ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నాం'' అన్నారు వివిఎన్ ఆదిత్య. ''ఎక్కడికీ వెళ్లకుండా నేరుగా ఇంట్లోనే కూర్చొని చూసే చిత్రంగా చేస్తున్న ఈ ప్రయత్నం కచ్చితంగా సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు శ్రీకాంత్. ''వీరశంకర్ గారు చేస్తున ఈ ప్రయత్నం నచ్చి ఈ సినిమాలో భాగమైయాను'' అన్నారు రాజ్ కందుకూరి. ఈ సినిమాకు సంగీతం:నిహాల్.


● మంచు లక్ష్మీ


స్టైలిష్ బాస్

ఏదైనా కంపెనీకు బాస్ అంటే ఎలా ఉండాలి? హైఫై లుక్స్, ట్రెండీ డ్రెస్‌లు వాటన్నింటికంటే ముఖ్యమైనది ఆ కంపెనీకి ప్లస్ అయ్యే వాటిని వెంటనే గుర్తించగలగటం. ప్రస్తుతం ఇలాంటి క్యారెక్టరైజేషన్‌తో కూడిన స్టైలిష్ బాస్ పాత్రనే పోషించనున్నారు లక్ష్మీ మంచు. హిందీలో హిట్ సాధించిన 'తుమ్హారీ సులు' తమిళంలో రీమేక్ అవుతున్న విషయం తెలిసిందే. విద్యా బాలన్ పాత్రను జ్యోతిక పోషించనున్నారు. కె.రాధా మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. తుమ్హారీ సులు సినిమాలో విద్యా బాలన్ బాస్‌గా నేహా ధూపియ పోషించిన పాత్రను తమిళ రీమేక్‌లో మంచు లక్ష్మీ పోషిస్తున్నారు. తన క్యారెక్టర్ గురించి లక్ష్మీ మాట్లాడుతూ–''ఇటీవల అన్నీ డీ–గ్లామర్ రోల్స్ చేశాను. రేడియో చానల్ హెడ్ రోల్‌లో చాలా గ్లామరస్‌గా కనిపించనున్నాను. ఈ స్టైలిష్ బాస్ క్యారెక్టర్ చేస్తున్నందుకు చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. సూర్య జ్యోతిక ఈ రోల్‌కు నేను బాగా సూట్ అవుతానని ఫీలయ్యారని డైరెక్టర్ చెప్పారు'' అని పేర్కొన్నారు.

ఏ నిమిషానికి ఏమి జరుగునో!


● నాగ అన్వేష్

'వినవయ్యా రామయ్య','ఏంజెల్' చిత్రాల ఫేమ్ నాగ అన్వేష్ కథానాయకుడిగా శ్రీకృష్ణ గొర్లె దర్శకత్వంలో రూపొందనున్న 'ఏ నిమిషానికి ఏమి జరుగునో' పూజా కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ,ప్రముఖ దర్శకులు వీవీ వినాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. షో టైమ్ స్టూడియోస్ సమర్పణలో గణేష్ క్రియేషన్స్ పతాకంపై లండన్ గణేశ్, సీహెచ్‌వీ. నాగేశ్వరరావు నిర్మించనున్నారు. '' వినగానే కథ నచ్చింది. ఏ నిమిషానికి ఏం జరుగుతుందో క్లైమాక్స్ వచ్చే వరకు అర్థం కాదు'' అన్నారు నాగ అన్వేష్. ''సైన్స్ ఫిక్షన్ చిత్రమిది. ప్రీ–ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. వచ్చే నెల నుంచి షూటింగ్ స్టార్ట్ చేస్తాం'' అన్నారు శ్రీ కృష్ణ గొర్లె. ''నాగ అన్వేష్‌ని చూస్తే బాలీవుడ్ హీరోని చూసినట్లు అనిపిస్తుంది. డిఫరెంట్ సైన్స్ ఫిక్షన్ స్టోరీ ఇది'' అన్నారు లండన్ గణేశ్. ''మూడు షెడ్యూల్స్‌లో సినిమాను కంప్లీట్ చేస్తాం'' అన్నారు నాగేశ్వరరావు.



లవ్ అండ్ ఫ్యామిలీ

ఫైట్‌మాస్టర్ విజయ్ తనయుడు రహుల్ హీరోగా కావ్య థాపర్ హీరోయిన్‌గా రాము కొప్పుల దర్శకత్వంలో వి.ఎస్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై దివ్య విజయ్ నిర్మాతగా ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. ఈ చిత్ర టాకీ పార్ట్ కంప్లీట్ అయ్యింది. దర్శకుడు రాము మాట్లాడుతూ– ''టాకీ పార్ట్ అనుకున్న విధంగా కంప్లీట్ అయింది. రాహుల్ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయే కథ. అద్భుతంగా నటించాడు. మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు'' అన్నారు.
నిర్మాత దివ్య విజయ్ మాట్లాడుతూ –''దర్శకుడు చాలా బాగా తెరకెక్కించాడు.లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా అందర్ని ఆకట్టుకుంటుంది. రాహుల్, కావ్య పెయిర్ స్క్రీన్‌పై చాలా బావుంది. మణిశర్మ సంగీతం, శ్యామ్ కె నాయుడు సినిమాటోగ్రఫీ సినిమాకు ప్లస్ అవుతాయి. పోస్ట్ ప్రొడక్షన్ పనులు త్వరలోనే స్టార్ట్ చేస్తాం'' అని అన్నారు. రాజేంద్ర ప్రసాద్, మురళీ శర్మ, పవిత్రా లోకేష్ తదితరులు నటించిన ఈ సినిమాకు లైన్ ప్రొడ్యూసర్: రాజు ఓలేటి.


● కావ్య థాపర్, రహుల్

మంత్రులు, ఎమ్మెల్యేల వాహనాల్లో ఎవరూ అసెంబ్లీలోకి రాకూడదు

అసెంబ్లీ సమావేశాలపై బులెటిన్

సాక్షి, అమరావతి: మంత్రులు, సభ్యుల వాహనాల్లో ఇతరులెవరూ అసెంబ్లీ ప్రాంగణంలోకి రాకూడదని అసెంబ్లీ కార్యదర్శి విజయబాబు స్పష్టం చేశారు. సోమవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండడంతో ఆయన ఒక బులెటిన్ విడుదల చేశారు. మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్, అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ముఖ్యమంత్రి ఒకటో గేటు నుంచి అసెంబ్లీలోనికి రావాలని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడు, ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, చీఫ్ విప్‌లు, విప్‌లు రెండో గేటు నుంచి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు నాలుగో గేటు నుంచి అసెంబ్లీలోకి రావాలని సూచించారు. సభ్యులు, ఇతరుల వాహనాలన్నీ నాలుగో గేటు ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రదేశంలో ఉంచాలని కోరారు. అసెంబ్లీ లోపల మంత్రులు, సభ్యులెవరూ విలేకరుల సమావేశాలు నిర్వహించకూడదని, మీడియా పాయింట్‌లోనే తమ అభిప్రాయాలను చెప్పాలని సూచించారు.

గవర్నర్ నరసింహన్‌కు ఘనస్వాగతం


గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న దేవినేని ఉమా తదితరులు

గన్నవరం: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన గవర్నర్ ఈఎస్ఎల్.నరసింహన్‌కు గన్నవరం విమానాశ్రయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. సతీమణి విమలానరసింహన్‌తో కలసి ఆయన ఎయిర్ ఇండియా విమానంలో ఆదివారం సాయంత్రం ఇక్కడికి చేరుకున్నారు. గవర్నర్‌కు రాష్ట్ర మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, ప్రోటోకాల్ అదనపు కార్యదర్శి ఎం.అశోక్‌బాబు, అడిషనల్ సీపీ కాంతిలాల్‌రాణా, పోలీసులు, అధికారులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ దంపతులు రోడ్డు మార్గం ద్వారా విజయవాడ చేరుకున్నారు. ఇదే విమానంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కూడా వచ్చారు. కాగా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జోగి రమేష్, వైఎస్సార్‌సీపీ విజయవాడ నగర అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాస్, పార్టీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ మల్లాది విష్ణు.. ప్రత్యేక హోదా ధర్నాలో పాల్గొనేందుకు ఎయిర్ ఇండియా విమానంలో ఢిల్లీ బయలుదేరివెళ్లారు.

శ్రీకాకుళంలో మన్యం బంద్ ప్రశాంతం

సీతంపేట: బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రయత్నాలకు నిరసనగా శ్రీకాకుళం జిల్లా సీతంపేటలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మన్యం బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆందోళనకారులు వాహనాల రాకపోకలు నిలిపివేశారు. దుకాణాలను కూడా మూసివేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు బి.అప్పారావు, పి.కుమార్, బి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ.. అగ్రకులాలైన బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, నాన్‌షెడ్యూల్డ్ ఏరియాల్లోని గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నేతలు ఆరిక లక్ష్మయ్య, నిమ్మక కాంతారావు, హెచ్.ప్రసాదరావు, భాస్కరరావు, రామస్వామి, తిరుపతిరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ థర్డ్ ఫ్రంట్‌కు జనసేన మద్దతు: పవన్



సాక్షి, అమరావతి: టీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఏర్పాటు చేయబోయే థర్డ్ ఫ్రంట్‌కు జనసేన పూర్తి మద్దతు ఇస్తుందని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. పవన్ ప్రసంగ వీడియోను ఆదివారం ఆ పార్టీ కార్యాలయం మీడియాకు విడుదల చేసింది. 'దేశ రాజకీయాల్లో మూడో ప్రత్యామ్నాయం ఉండాలి. రాష్ట్రాల్లో చోటుచేసుకునే సున్నిత సమస్యలను అర్థం చేసుకునే కొందరు వ్యక్తుల సమూహం దేశ రాజకీయాల్లో అవసరం. రాజకీయాల్లోకి కొత్త రక్తం రావాలి. కొత్త ఆలోచన రావాలి. కొత్త రక్తంతో కూడిన థర్డ్ ఫ్రంట్ కావాలి. దీనికి అంకురార్పణ చేద్దామని అనుకున్న కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాను. సాటి తెలుగువాడిగా ఆయన ప్రకటనకు మద్దతు పలుకుతున్నాను' అని పవన్ కల్యాణ్ అన్నారు. థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేసే సామర్థ్యం కేసీఆర్‌కు ఉందన్నారు. రక్తం చుక్క చిందకుండా రాష్ట్రాన్ని సాధించుకున్న మహాయోధుడు అంటూ కేసీఆర్‌ను పొగడ్తల్లో ముంచెత్తారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశంలో మద్దతుగా మాట్లాడారని.. టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు పార్లమెంట్‌లో ప్రత్యేక హోదా కోసం చేసే పోరాటంలో టీఆర్ఎస్ సహాయం కూడా తీసుకొని సమస్య పరిష్కారానికి ప్రయత్నించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు ఏఎన్‌యూ బంద్: విద్యార్థి జేఏసీ

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో బంద్ చేపట్టనున్నారు. హోదా సాధనకు విద్యార్థులు ఏ త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నారని ఈ బంద్ ద్వారా చాటి చెబుతామని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రావిపాటి జగదీష్, జిల్లా అధ్యక్షుడు నంబూరు శాస్త్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం హోదా ఇవ్వాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు.

6, 20 తేదీల్లో దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం

తిరుపతి (అలిపిరి): వయో వృద్ధులు (65 ఏళ్లు పైబడినవారికి), దివ్యాంగులకు ఈనెల 6, 20వ తేదీల్లో తిరుమల శ్రీవారి ప్రత్యేక దర్శనం టోకెన్లను టీటీడీ అదనంగా జారీ చేయనుంది. ఆయా తేదీల్లో ఉదయం 10.00, మధ్యాహ్నం 2.00 గంటలకు రెండు వేల టోకెన్లు, 3.00 గంటలకు వెయ్యి టోకెన్లు జారీ చేయనున్నారు. ఈనెల 7, 21వ తేదీల్లో ఐదేళ్లలోపు చంటి పిల్లల తల్లిదండ్రులకు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సుపథం ద్వారా శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు.

హోదా కోసం తాడోపేడో తేల్చుకుంటాం..

- నీతి ఆయోగ్‌ను అడ్డుపెట్టి రాష్ట్రానికి అన్యాయం చేస్తారా?
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపాటు



సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయంలో కేంద్రంతో తాడోపేడో తేల్చుకుంటామని, విభజన హామీల అమలుపై స్పష్టత వచ్చే వరకు ఢిల్లీలోనే మకాం వేసి ఆందోళనలు నిర్వహిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వెల్లడించారు. ఆదివారం విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య, పుట్టా హరినాథరెడ్డితో కలసి రామకృష్ణ మీడియాతో మాట్లాడారు. మోదీ అధికారంలోకి వచ్చిన 9 నెలలకు ఏర్పాటు చేసిన నీతి ఆయోగ్‌ను అడ్డుపెట్టి.. ఏపీకి అన్యాయం చేయడం సరికాదన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలపై ఆనాడు సాక్షాత్తూ ప్రధాని పార్లమెంట్‌లో ప్రకటించడమే కాకుండా.. కేబినెట్ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించి దాన్ని ఆర్థిక సంఘానికి పంపిస్తే.. నీతి ఆయోగ్‌ను సాకుగా చూపిస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్, ప్రధాని, కేంద్ర మంత్రివర్గం కంటే నీతి ఆయోగ్ గొప్పదా? అని రామకృష్ణ ప్రశ్నించారు. రాష్ట్రానికి కేంద్రం ఏమిచ్చిందో అసెంబ్లీ సమావేశాల్లో చెబుతామని బీజేపీ నేతలు ప్రకటించడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. అదే సమయంలో విభజన హామీలు ఎందుకు అమలు చేయలేదో కూడా బదులివ్వాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రానికి పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన బీజేపీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు మాట మార్చిందో చెప్పాలన్నారు. రాష్ట్ర బీజేపీ నేతలకు ఏమాత్రం నైతిక విలువలున్నా తక్షణమే ఎంపీ, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి.. మళ్లీ గెలవాలని రామకృష్ణ సవాల్ విసిరారు.

ఈ–'పాస్' అయితేనే రేషన్!

- వేలిముద్రలు పడక కార్డుదారుల అవస్థలు
- రేషన్ దుకాణాల్లో పనిచేయని ఐరిష్ యంత్రాలు
- దాదాపు అరకోటి మందికి అష్టకష్టాలు
- అధికారులు కరుణిస్తేనే అందుతున్న సరుకులు

సాక్షి, అమరావతి



రాష్ట్రంలో రేషన్ కార్డుదారులను ఈ–పాస్ కష్టాలు వెంటాడుతున్నాయి. వేలిముద్రలు పడక, సరుకులు రాక జనం లబోదిబోమంటున్నారు. ఏపీలో 1.42 కోట్ల తెల్ల రేషన్‌కార్డులున్న కుటుంబాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 48 లక్షల మంది కార్డుదారుల వేలిముద్రలు ఈ–పాస్ యంత్రంలో సరిగ్గా పడడం లేదు. దాంతో సబ్సిడీ సరుకులు ఇచ్చేందుకు ఈ–పాస్ యంత్రాలు అనుమతించడం లేదు. ఇలాంటి వారి కోసం రేషన్ దుకాణాల్లో ప్రత్యేకంగా ఐరిష్ యంత్రాలు ఏర్పాటు చేశారు. అయితే, కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేయడం వల్ల రాష్ట్రంలోని 29,000 రేషన్ దుకాణాల్లో ఐరిష్ మిషన్లు కొన్ని నెలలుగా పని చేయడం లేదు. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ) లేదా వీఆర్వో వేలిముద్రలను ఈ–పాస్ మిషన్‌లో వేసి కార్డుదారులకు సరుకులు ఇస్తున్నారు. రేషన్ దుకాణాల్లో సరుకులను ప్రతి నెలా 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ఈ గడువులోగా అధికారులకు కరుణించి, వేలిముద్రలు వేస్తే పేదలకు సబ్సిడీ బియ్యం అందుతున్నాయి. లేకపోతే ఇక అంతే సంగతులు. పని చేయని ఐరిష్ మిషన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

రాష్ట్రంలోని తెల్ల రేషన్ కార్డుదారులు, ఐరిష్ ద్వారా సరుకులు తీసుకొనే లబ్ధిదారులు

జిల్లా	మొత్తం రేషన్ కార్డులు	ఐరిష్‌తో సరుకులు తీసుకునేవారు
శ్రీకాకుళం	7,97,155	2,68,261
విజయనగరం	7,01,495	2,54,951
విశాఖపట్నం	11,94,098	5,47,032
తూర్పు గోదావరి	16,15,278	1,79,317
పశ్చిమ గోదావరి	12,11,758	1,07,489
కృష్ణా	12,38,627	5,17,114
గుంటూరు	14,31,551	8,71,080
ప్రకాశం	9,45,540	3,75,058
నెల్లూరు	8,66,478	4,97,124
కర్నూలు	11,53,185	6,09,292
వైఎస్సార్	7,61,855	2,76,936
అనంతపురం	11,95,329	1,87,854
చిత్తూరు	10,91,375	1,70,733
మొత్తం	1,42,03,724	48,62,271



➢ కోడూరు నూకరాజు కుటుంబం విజయవాడలో బట్టలు ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. వేడిగా ఉన్న ఇస్త్రీ పెట్టె తగలడంతో నూకరాజు చేతి వేలిముద్రలు దెబ్బతిన్నాయి. ఈ-పాస్ యంత్రంలో వేలిముద్రలు వేస్తేనే రేషన్ బియ్యం అందుతాయి. వేలిముద్రలు పడక, రేషన్ బియ్యం రాక నూకరాజు కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటోంది.



➢ విజయవాడకు చెందిన షేక్ బిజన్‌బీ వయస్సు 70 ఏళ్లు. భర్త మృతి చెందాడు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ బియ్యంపైనే ఆధారపడి జీవిస్తోంది. ఈ-పాస్ యంత్రంలో ఈమె వేలిముద్రలు సరిగ్గా పడడం లేదు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లేదా వీఆర్వో వేలిముద్రలు వేసి బియ్యం ఇవ్వాల్సిన పరిస్థితి. వారు దయ చూపకపోతే ఆ నెల బియ్యం రానట్టే.



➢ తూర్పు గోదావరి జిల్లా కొత్తపేటకు చెందిన పి.వెంకటేశ్వరరావు, పి.వెంకటలక్ష్మి భార్యాభర్తలు. వెంకటేశ్వరరావు తాపీమేస్త్రీగా పని చేస్తుండడంతో వేలి ముద్రలు పూర్తిగా పోయాయి. వెంకటలక్ష్మి మట్టి బొమ్మల తయారీ పనికి వెళ్తుండటంతో వేలిముద్రలు అరిగిపోయాయి. ఈ-పాస్ మిషన్‌లో వీరి వేలిముద్రలు పడక ప్రభుత్వం నుంచి సబ్సిడీ బియ్యం అందడం లేదు.

మళ్లీ మొదటికి.. ఏకీకృత సర్వీసు నిబంధనలు

న్యాయ వివాదాలే కారణం

- సమస్య పరిష్కారమవ్వక భర్తీకాని వందలాది ఎంఈవో పోస్టులు
- డైట్ లెక్చరర్లు, డిప్యూటీ డీఈవో పోస్టులు కూడా ఖాళీ

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనల వ్యవహారం న్యాయ వివాదాల మధ్య చిక్కుకొని మళ్లీ మొదటికే వస్తోంది. సుదీర్ఘకాలం న్యాయవివాదాల్లో ఉండి చివరకు సుప్రీంకోర్టు తీర్పుతో రాష్ట్రపతి ఉత్తర్వులు కూడా వెలువడి కొలిక్కి వచ్చిందనుకొంటున్న తరుణంలో మళ్లీ న్యాయవివాదాల్లో చిక్కుకుంది. సర్వీసు నిబంధనలపై ప్రభుత్వం ఇచ్చిన 72, 73, 74 జీవోలపై మళ్లీ హైకోర్టులో, తర్వాత ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో ప్రభుత్వ టీచర్లు పిటిషన్లు దాఖలు చేశారు. దీంతో సర్వీసు నిబంధనలు అమలు కాక దశాబ్దాల తరబడి 550 ఎంఈవో పోస్టులు, 150 డిప్యూటీ డీఈవో పోస్టులు, డైట్ లెక్చరర్ పోస్టులు భర్తీ కాకుండా నిలిచిపోయాయి.

వివాదం నేపథ్యమేమిటంటే..

1971లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ శాఖల్లోని పోస్టులను రాష్ట్ర, జోనల్, జిల్లా స్థాయిగా ప్రభుత్వం విభజించింది. ఉద్యోగుల నియామకాలు, పదోన్నతులకు రాష్ట్రపతి ఆమోదముద్రతో ప్రభుత్వం జీవో 529ను విడుదల చేసింది. విద్యాశాఖకు వచ్చేసరికి అప్పటికింకా పంచాయతీ రాజ్ టీచర్ల వ్యవస్థ ఏర్పాటుకానందున ప్రభుత్వ పాఠశాలల టీచర్లను మాత్రమే చేర్చారు. ఆ తర్వాత పంచాయతీరాజ్ శాఖ పరిధిలో జిల్లా పరిషత్‌లు పాఠశాలలు ఏర్పాటుచేసి టీచర్లను నియమించడంతో 1981 నాటికి ఆ స్కూళ్లు, టీచర్ల సంఖ్య పెరిగింది. తమను కూడా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పరిగణించి పదోన్నతులు కల్పించాలని పంచాయతీరాజ్ ఉపాధ్యాయ సంఘాలు పోరాటం చేయగా టీచర్లందరినీ రాష్ట్రీయకరణ చేస్తూ 1992లో జీవో 40ని ప్రభుత్వం విడుదల చేసింది. న్యాయ ఆటంకాలతో అది అమలుకు నోచుకోలేదు. తర్వాత చంద్రబాబునాయుడు హయాంలో ఉమ్మడి సర్వీసు రూల్స్‌పై జీవోలు 505, 538 ఇచ్చారు. రాష్ట్రపతి ఉత్తర్వులు సవరించాకే ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లను కలపాలని హైకోర్టు ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను 2003లో కొట్టివేసింది. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో మళ్లీ ఏకీకృత సర్వీసులపై జీవోలు 95, 96లను విడుదల చేసి పదోన్నతులు కల్పించారు. దీనిపై మళ్లీ ప్రభుత్వ టీచర్లు ట్రిబ్యునల్‌లో సవాల్ చేసి గెలిచారు. ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించగా 2007 ఫిబ్రవరిలో ఉమ్మడి సర్వీసు రూల్స్‌కు వ్యతిరేకంగా కోర్టు తీర్పు ఇచ్చింది. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా 2015 సెప్టెంబర్ 30న ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. తీవ్ర జాప్యం తర్వాత గతేడాది న్యాయ శాఖ ఏకీకృత సర్వీసు నిబంధనలకు మార్గం సుగమం చేసింది. దీనిపై రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ అనంతరం ప్రభుత్వం జీవోలు ఇచ్చినా మళ్లీ అవి న్యాయవివాదాల్లో చిక్కుకోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది.

ఈనామ్‌కు తూట్లు!

- భారీగా మిర్చి, పసుపు, చింతపండు, వేరుశనగ నిల్వలు
- నేటి నుంచి దుగ్గిరాలలో పసుపు వ్యాపారుల సమ్మె


గుంటూరు యార్డులో పేరుకుపోయిన మిర్చి బస్తాలు

సాక్షి, అమరావతి: ఈనామ్ (ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చరల్ మార్కెటింగ్)కు ఆటంకాలు ఎదురవుతున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాల్లో రైతులు మోసపోకుండా ఉండేందుకు ప్రవేశపెట్టిన ఈ విధానానికి వ్యాపారులు, మార్కెటింగ్ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ఈ విధానాన్ని ఏపీలో అమలు చేయడానికి మార్కెట్ యార్డులకు కంప్యూటర్లు, వేయింగ్ మిషన్ల కొనుగోళ్లు, సిబ్బందికి శిక్షణను అధికారులు పూర్తి చేశారు. ఈ విధానాన్ని ప్రవేశపెట్టే ముందు గతేడాది నవంబర్‌లో వ్యాపారులు, ఏజెంట్లతో చర్చలు జరిపారు. ఈనామ్‌లో వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయాలంటే వ్యాపారులకు పెద్ద మొత్తంలో ఆర్థిక వనరులు ఉండాలని, పంటను కొనుగోలు చేసిన వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో ఆ మొత్తాలు జమ చేయాలని సూచించారు. అయితే ఈ ఏడాది జనవరి వరకు సమయం ఇవ్వాలని వ్యాపారులు కోరారు. ఆ మేరకు సమయం ఇచ్చిన అధికారులు మిర్చి, పసుపు, పత్తి, మామిడి, టమోట, చింతపండు, అపరాలు, వేరుశనగ వంటి వ్యవసాయ ఉత్పత్తులు అధికంగా విక్రయించే గుంటూరు, దుగ్గిరాల, పిడుగురాళ్ల, కర్నూలు, రాయదుర్గం, హిందూపురం వంటి 22 మార్కెట్ యార్డుల్లో ఈనామ్‌ను అమల్లోకి తీసుకురావడానికి యత్నించారు. వ్యాపారులు, ఏజెంట్లు మార్చి వరకు సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేశారు. దీంతో ప్రభుత్వం మార్చి 1 నుంచి ఈనామ్‌ను ప్రవేశపెట్టింది. వ్యాపారులు రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసిన వెంటనే నగదు చెల్లించడానికి కనీసం పదిహేను రోజుల వ్యవధి కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ విధివిధానాలు దీనికి విరుద్ధంగా ఉండటంతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు వ్యాపారుల ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో గుంటూరు యార్డులో రోజూ లక్ష బస్తాల మిర్చి కొనుగోలుకు బదులు శనివారం 25 వేల బస్తాల కొనుగోళ్లు మాత్రమే జరిగాయి. దుగ్గిరాల మార్కెట్ పరిధిలోని వ్యాపారులు ఈనామ్ నిబంధనలు సడలించాలని, లేకుంటే సోమవారం నుంచి సరుకును కొనుగోలు చేసేది లేదని సమ్మె చేస్తామని అధికారులకు అల్టిమేటం జారీ చేశారు.

కేంద్రం స్పందించకపోతే మద్దతు ఉపసంహరణ: చినరాజప్ప

అవనిగడ్డ: సీఎం చంద్రబాబుతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా సోమవారం చర్చలు జరపనున్నారని, రాష్ట్రానికి ఇచ్చిన హామీలపై స్పందించకపోతే కేంద్రానికి మద్దతు ఉపసంహరించుకుంటామని హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప స్పష్టం చేశారు. ఆదివారం కృష్ణా జిల్లా అవనిగడ్డలో వివాహ వేడుకల్లో పాల్గొనడానికి వచ్చిన ఆయన పులిగడ్డ ఇరిగేషన్ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకూ తగిన కేటాయింపులు చేయలేదన్నారు.

'కియో' ప్రాంతంలో భూ కుంభకోణం

బీజేపీ యువ మోర్చా నేత రమేష్‌నాయుడు ఆరోపణ

సాక్షి, అమరావతి: అనంతపురం జిల్లాలో కియో మోటర్స్ సంస్థ ఏర్పాటు చేసిన ప్రాంతంలో టీడీపీ నేతలు పయ్యావుల కేశవ్, పల్లె రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.200 కోట్ల భూ కుంభకోణం జరిగిందని బీజేపీ యువ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు రమేష్‌నాయుడు ఆరోపించారు. జిల్లా అధికార పార్టీ నేతలు ఇద్దరు పెనుగొండ ప్రాంతంలో కార్ల ఫ్యాక్టరీ వస్తుందని ముందే తెలుసుకొని.. రైతుల నుంచి ఎకరా రూ.3 లక్షలకు 270 ఎకరాలు కొనుగోలు చేశారన్నారు. వీటిల్లో సగం భూమిని ఎకరా రూ.40 లక్షలకు తిరిగి అమ్ముకున్నారని.. మిగిలినవి ఎకరా రూ.80 లక్షల చొప్పున ఇతర సంస్థలతో కలసి వ్యాపారం చేసేలా ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు.

అగ్నికి ఆహుతైన 50 దుకాణాలు

కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలులో ఘటన


పెనుగంచిప్రోలులో కాలి బూడిదైన పాకలు

పెనుగంచిప్రోలు (జగ్గయ్యపేట): కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలులో తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల సందర్భంగా పేదలు మునేరులో వేసుకున్న పాకలు అగ్ని ప్రమాదంలో ఆహుతయ్యాయి. ఇక్కడ పేదలు చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఓ పాకలో పొంగలి వండుతుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాటు మధ్యాహ్న సమయంలో గాలి అధికంగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి సుమారు 50 దుకాణాలు పూర్తిగా బూడిదయ్యాయి. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని దుకాణదారులతో పాటు, పాకల్లో ఉన్న భక్తులు మంటల్లో అన్నీ వదిలి పరుగులు తీశారు. సుమారు రూ.50 లక్షల మేర నష్టం వాటిల్లి ఉండవచ్చని అంచనా. కాగా, ప్రభుత్వం వైఫల్యం వల్లే ఈఘోర ప్రమాదం జరిగిందని వైఎస్సార్‌సీపీ విజయవాడ పార్లమెంటరీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను విమర్శించారు. ప్రమాదంలో చిరు వ్యాపారులు భారీగా నష్ట పోయారన్నారు. ఫైర్ ఇంజన్ కేవలం ఒక్క రోజు మాత్రమే ఉండటం వల్ల ఈ ప్రమాదం జరిగిందన్నారు. నష్టపోయిన వారికి ఒకొక్కరికి రూ.1 నుంచి రూ.1.50 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆస్కార్ వేడుకల్లో విశాఖ వజ్రాభరణాలు

విశాఖ సిటీ


అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో జరిగే 90వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో విశాఖపట్నానికి చెందిన రెండు జ్యువెలరీ దుకాణాల నుంచి వజ్రాభరణాలు ప్రదర్శనకు ఎంపికయ్యాయి. విశాఖలోని వైభవ్ జ్యువెలరీస్, పీఎంజే జ్యువెలరీస్ సేకరించిన అరుదైన అందమైన ఫరెవర్ మార్క్ వజ్రాలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన రెడ్ కార్పెట్ కలెక్షన్‌లను ఎంపిక చేశారు. ఏటా ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన ఆభరణాల్ని ఎంపిక చేసి ఈ ప్రదర్శన నిర్వహిస్తారు. దేశీయ ప్రతిభను అంతర్జాతీయ వేడుకల్లో ఆవిష్కరిస్తామని జ్యువెలరీస్ సంస్థల యాజమాన్యాలు తెలిపాయి.


ఆస్కార్ వేడుకల్లో ప్రదర్శనకు ఉంచే వజ్రాభరణాలు ఇవే..

ఫైన్ వేస్కోండి..

- లైసెన్సు ఉన్నా లేవని చెబుతున్న డ్రైవర్లు
- వాహన తనిఖీల్లో జరిమానా విధించమంటున్న వైనం
- లైసెన్సు సస్పెన్షన్ నుంచి తప్పించుకునేందుకు ఎత్తుగడ!
- అవాక్కవుతున్న అధికారులు

సాక్షి, అమరావతి



ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినా తమ డ్రైవింగ్ లైసెన్సు సస్పెండ్ అవ్వకుండా కొందరు వాహనాదారులు కొత్త దారులు వెతుక్కుంటున్నారు. ఎంతైనా ఫైన్ వేస్కోండి గానీ.. తమకు లైసెన్సు లేదంటూ ఎంచక్కా తప్పించుకుంటున్నారు. తమ తీరుతో రవాణా అధికారులను అవాక్కయ్యేలా చేస్తున్నారు. మితిమీరిన వేగం, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా, మద్యం తాగి వాహనం నడిపినా.. లైసెన్సు సస్పెండ్ చేయాలని గతేడాది సుప్రీంకోర్టు కమిటీ ఆదేశాలిచ్చింది. దీంతో రవాణా శాఖ సస్పెన్షన్లపై గురి పెట్టింది. ఇప్పటివరకు 20 వేల డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేసింది. అయితే దీని నుంచి తప్పించుకునేందుకు వాహనదారులు అసలు తమకు లైసెన్సే లేదని చెబుతున్నారు. గతేడాది రవాణా శాఖ అధికారులు జరిపిన వాహన తనిఖీల్లో దాదాపు 78,130 మంది తమకు డ్రైవింగ్ లైసెన్సులు లేవని చెప్పడం గమనార్హం. రాష్ట్రంలో మొత్తం 1.08 కోట్ల మందికి డ్రైవింగ్ లైసెన్సులున్నట్లు గణాంకాలుండగా.. ప్రతి వంద మందిలో 70 మంది లైసెన్సు లేదని చెప్పడంతో రవాణా శాఖ అధికారులు అవాక్కయ్యారు. 'డ్రైవింగ్ లైసెన్సు లేదని చెబితే జరిమానా విధించి వదిలేస్తున్నారు. అదే లైసెన్సు ఉందంటే.. ఏకంగా ఆ లైసెన్సును సస్పెండ్ చేస్తున్నారు. దీని వల్ల మా ఉపాధి దెబ్బతింటోంది. అదే లైసెన్సు లేదని చెబితే ఉల్లంఘనలకు గానూ రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు జరిమానా చెల్లించి తప్పించుకోవచ్చు..' అని వాహనదారులు చెబుతుండటం గమనార్హం. కాగా, ఆధార్‌తో డ్రైవింగ్ లైసెన్సులను లింక్ చేస్తున్నామని.. దీంతో అసలు విషయం తేలిపోతుందని అధికారులు చెబుతున్నారు.

జిల్లా	డ్రైవింగ్ లైసెన్సులు లేని వారి సంఖ్య
అనంతపురం	6,426
చిత్తూరు	5,543
వైఎస్సార్	1,909
కర్నూలు	7,014
నెల్లూరు	5,311
ప్రకాశం	2,483
గుంటూరు	4,233
కృష్ణా	10,593
పశ్చిమగోదావరి	9,209
తూర్పుగోదావరి	12,755
విశాఖపట్నం	6,541
శ్రీకాకుళం	2,198
విజయనగరం	3,915
మొత్తం	78,130

చిట్టి 'తల్లి'కి ఎన్ని కష్టాలో!

పంతొమ్మిదేళ్లకే తల్లవుతున్న వారి సంఖ్య పెరుగుతున్న వైనం

జిల్లాల వారీగా (19 ఏళ్లలోపే ప్రసవం)..

జిల్లా	19 ఏళ్లలోపే తల్లులైన వారి శాతం
విజయనగరం	17.8
ప్రకాశం	17.1
చిత్తూరు	14.7
గుంటూరు	13.6
కర్నూలు	12.9
తూర్పుగోదావరి	12.8
పశ్చిమగోదావరి	12.6
నెల్లూరు	11.8
శ్రీకాకుళం	11.7
వైఎస్సార్	10.4
విశాఖపట్నం	9.5
కృష్ణా	8.9
అనంతపురం	5.2



- గ్రామాల్లో పద్దెనిమిదేళ్లు నిండకుండానే పెళ్లిళ్లు
- యుక్తవయసులోనే తల్లవుతున్న వారిలో విజయనగరం టాప్
- 20 ఏళ్ల లోపు తల్లయితే భవిష్యత్‌లో శారీరక సమస్యలు
- జాతీయ కుటుంబ సంక్షేమ సర్వేలో వెల్లడి

సాక్షి, అమరావతి: ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానానికి వెళ్లాలనే తపన ఉన్నా ఆర్థిక పరిస్థితులు అనుకూలించక పోవడం, కుటుంబ పరిస్థితుల నేపథ్యంతో పెళ్లీడు రాకుండానే మహిళలు తల్లి బాధ్యతలు మోయాల్సిన పరిస్థితి రాష్ట్రంలో చాలాచోట్ల ఉంది. పద్దెనిమిదేళ్లు నిండాకే పెళ్లి చేసుకోవాలని, 20 ఏళ్ల తర్వాత పిల్లలు కంటేనే ఆరోగ్యానికి మంచిదని వైద్యులు చెబుతున్నా ఈ మాటలు మహిళలకు వర్తించడం లేదు.. పాపం. రాష్ట్రంలో చాలా కుటుంబాల్లో పెళ్లీడుకు ముందే యువతులకు పెళ్లి చేయడం, ఆ వెంటనే తల్లి కావడంతో వారి ఆరోగ్యం దెబ్బతింటోంది. కొంతమంది అమ్మాయిలు మధ్యలోనే చదువు ఆపేసి పెళ్లి చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నట్టు జాతీయ కుటుంబ సంక్షేమ శాఖ చేసిన సర్వేలో వెల్లడైంది. రాష్ట్రంలో 11.6 శాతం మంది యువతులు పంతొమ్మిదేళ్లు నిండకుండానే తల్లులవుతున్నట్టు తేలింది. ఓ వైపు అన్ని రంగాల్లో మహిళలు ముందంజ వేస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం అవగాహన లోపంతో ఇప్పటికీ ఇలాంటి పరిస్థితే కొనసాగుతోంది.

కుటుంబ పరిస్థితులే వల్లే..: చదువుకునే వయసులోనే పెళ్లి, ఆ తర్వాత వెంటనే తల్లి కావడం ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోనే చోటు చేసుకుంటున్నట్టు జాతీయ కుటుంబ సంక్షేమ సర్వేలో తేలింది. ఇప్పటికీ సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో ఆడపిల్లకు త్వరగా పెళ్లిచేస్తే తమ బాధ్యత తీరిపోతుందని తల్లిదండ్రులు భావిస్తున్నారు. కొంతమంది పద్దెనిమిదేళ్లకు ముందే పెళ్లి చేస్తున్నారు. పద్దెనిమిదేళ్లు నిండాక కూడా చాలామంది అమ్మాయిలు చదువుకుంటున్నా ఆపేసి పెళ్లిళ్లు చేస్తున్నారు. పెళ్లి చేసుకున్నాక చాలామంది అమ్మాయిలు పెళ్లికీ, బిడ్డలు పుట్టేందుకు మధ్య విరామాన్ని పాటించడంలో అవగాహన లేక కొద్ది నెలల్లోనే గర్భం దాల్చడం, ఆ తర్వాత తల్లికావడం జరుగుతున్నాయి. దీంతో కెరీర్ మధ్యలోనే ఆగిపోవడంతోపాటు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

పంతొమ్మిదేళ్ల లోపే తల్లి కావడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. అవి..

- బిడ్డ ఎదుగుదలకు సరిపడా శక్తి తల్లిలో లేకపోవడం
- గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మందికి రక్తహీనత ఉండటంతో తల్లి కాగానే ఆరోగ్య సమస్యలు రావడం
- రక్తహీనత ఉన్న అమ్మాయిలు గర్భం దాలిస్తే బరువు తక్కువ పిల్లలు పుట్టడం
- బిడ్డ ఎదుగుదలలో లోపాలతో ప్రసవ సమయంలో సిజేరియన్ చేయాల్సి రావడం
- దీనివల్ల భవిష్యత్‌లో నడుమునొప్పితో పలు రకాల ఇబ్బందులు తలెత్తడం
- మొదటి కాన్పు వెంటనే రెండో కాన్పుతో మరిన్ని సమస్యలు రావడం
- రక్తహీనతతోపాటు విటమిన్‌ల లోపం వల్ల పుట్టుకతోనే పిల్లల్లో సమస్యలు
- గ్రామాల్లో ఇప్పటికీ మేనరికపు పెళ్లిళ్లతో జన్యుపరమైన లోపాలతో పిల్లల్లో ఎదుగుదల లేకపోవడం
- ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకున్న కొన్నేళ్లకే గర్భసంచి సమస్యలు రావడం.

ప్రథమ స్థానంలో.. విజయనగరం

వివిధ జిల్లాల్లో పెళ్లీడుకే తల్లిబాధ్యతలు మోస్తున్న అమ్మాయిల గణాంకాలు చూస్తే విజయనగరం జిల్లా మొదటి స్థానంలో ఉంది. ఆ జిల్లాలో 17.8 శాతం మంది పంతొమిదేళ్ల వయసు లోపే ప్రసవానికి వస్తున్నట్టు వెల్లడైంది. ఆ తర్వాతి స్థానం ప్రకాశం జిల్లాది. ఇక్కడ కూడా 17.1 శాతం మంది వయసుకు ముందే తల్లిగా మారుతున్నారు. 14.7 శాతం మందితో చిత్తూరు జిల్లా మూడో స్థానంలో ఉంది. ఇప్పటికీ ఎక్కువ మంది అమ్మాయిల్లో పెళ్లిపైనా, బిడ్డలు కనడంపైనా సరైన అవగాహన లేదని సర్వేలో వెల్లడైంది.

జాతీయ కుటుంబ సంక్షేమ సర్వే ప్రకారం రాష్ట్రంలో రక్తహీనత శాతం

0-10 ఏళ్ల లోపు చిన్నారుల్లో	60.8%
15-49 ఏళ్ల లోపు మహిళల్లో	60.2%
15-49 ఏళ్ల లోపు గర్భిణుల్లో	52.9%
15-49 ఏళ్ల లోపు పురుషుల్లో	26.9%



తిరుమలలో పెళ్లి సందడి

శ్రీవారి ఆశీస్సులతో వివాహాలు చేసుకున్న 2 వేల జంటలు



పెళ్లితో ఒక్కటవుతున్న జంట

తిరుపతి (అలిపిరి): నిత్యం గోవిందనామ స్మరణలతో మార్మోగే తిరుమలలో ఆదివారం పెళ్లి సందడి నెలకొంది. సుమారు రెండు వేల జంటలు శ్రీవారి ఆశీస్సులతో వివాహాలు చేసుకున్నారు. దీంతో టీటీడీ కల్యాణ వేదిక, మఠాల్లో పెళ్లి బాజాలు మోగాయి. నూతన వధూవరులకు టీటీడీ ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసింది. ఆదివారం వేకువజాము వరకు ఈ వివాహాలు జరగనున్నాయి. కాగా, హస్త నక్షత్రం, మేషలగ్నంలో పెళ్లి చేయడం వల్ల దంపతులు సుఖసంతోషాలతో ఉంటారని పండితులు చెబుతున్నారు.

గిన్నిస్ రికార్డు దిశగా నంది నాటకోత్సవాలు

కేంద్ర సెన్సారు బోర్డు సభ్యుడు దిలీప్‌రాజా



తెనాలి: ఆంధ్రప్రదేశ్ టీవీ, చలనచిత్రం, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 2017 నంది నాటకోత్సవాలు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సుకు అర్హమైనవని కేంద్ర సెన్సారు బోర్డు సభ్యుడు దిలీప్ రాజా తెలిపారు. సంబంధిత శాఖ తరఫున త్వరలో గిన్నస్ రికార్డు కోసం దరఖాస్తు చేయనున్నట్టు వెల్లడించారు. ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నంది నాటకోత్సవాలను తెనాలిలో ప్రారంభించి.. ఐదు ప్రాంతాల్లో 82 రోజులుపాటు 360 నాటక, నాటికల ప్రదర్శనలు చేశామని చెప్పారు. వివిధ విభాగాల నుంచి న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసిన ఈ ప్రదర్శనల వీడియోలను జ్యూరీ తిలకించి తుది ఫలితాలను ప్రకటిస్తుందన్నారు.

పేరుపాలెం బీచ్‌కు భారీ షార్క్ కళేబరం



మొగల్తూరు: పశ్చిమగోదావరి జిల్లా పేరుపాలెం బీచ్‌కు ఆదివారం భారీ షార్క్ కళేబరం కొట్టుకొచ్చింది. సుమారు 200 కేజీల బరువున్న ఈ షార్క్ సముద్రంలో బలమైన గాయమై..చనిపోయి ఉంటుందని మత్స్యకారులు తెలిపారు. గత రెండు నెలలుగా నాలుగు షార్క్ కళేబరాలు కొట్టుకొచ్చాయన్నారు

మార్చి 21న చలో అసెంబ్లీ

వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

సాక్షి, అమరావతి: డిమాండ్ల సాధన కోసం మార్చి 21న నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమానికి కూలీలంతా కదిలి రావాలని వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐఏడబ్ల్యూయూ), ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు, ఆవుల శేఖర్, జల్లి విల్సన్‌లు ఆదివారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని కార్మిక సంఘాలు ఆరోపించాయి. కూలీలకు పని కల్పించడంలేదని, చేసిన పనులకు కూడా రూ.70కి మించి ఇవ్వట్లేదన్నారు. ప్రతి కుంటుంబానికి 200 రోజులు పని కల్పించడంతో పాటు రోజు కూలీ రూ. 500 ఇవ్వాలని తదితర 10 డిమాండ్లపై చలో అసెంబ్లీ నిర్వహిస్తున్నట్లు ప్రకటించాయి.

సూక్ష్మ 'ముడుపుల' పథకం

- రూ.805.77 కోట్లతో ఉరవకొండ సీఎల్‌డీఐకి టెండర్ నోటిఫికేషన్
- నోటిఫికేషన్ జారీ చేయకముందే కాంట్రాక్టర్‌తో 'ముఖ్య'నేత ఒప్పందం
- 4.5 శాతం అదనపు ధరలకు ఎంఈఐఎల్ సంస్థకు పనుల అప్పగింత
- భారీ ఎత్తున చేతులు మారిన ముడుపులు

సాక్షి, అమరావతి

ఉరవకొండ సామాజిక ఎత్తిపోతల సూక్ష్మ నీటిపారుదల పథకం(సీఎల్‌డీఐ) పనుల కేటాయింపులో భారీగా అవినీతి చోటుచేసుకుంది. బాగా కావాల్సిన కాంట్రాక్టర్‌కు 4.57 శాతం అదనపు ధరలతో పనులు కట్టబెట్టారు. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున ముడుపులు చేతులు మారినట్లు సాక్షాత్తూ జలవనరుల శాఖ అధికార వర్గాలు ఆరోపిస్తుండడం గమనార్హం.

ఖజానాపై రూ.36.82 కోట్ల అదనపు భారం

అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో జీడిపల్లి రిజర్వాయర్, పెన్నా అహోబిలం రిజర్వాయర్(పీఏబీఆర్), మిడ్ పెన్నార్ రిజర్వాయర్(ఎంపీఆర్)లలో 1.69 టీఎంసీలను ఎత్తిపోసి, 20,201 హెక్టార్లకు సాగునీరందించేందుకు సీఎల్‌డీఐ పథకాన్ని రూ.899.20 కోట్లతో మంజూరు చేస్తూ గతేడాది సెప్టెంబరు 5న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పనులకు టెండర్ నోటిఫికేషన్ జారీ చేయకముందే ఓ కాంట్రాక్టర్‌తో 'ముఖ్య'నేత రహస్య అవగాహనకు వచ్చారు. ఆ సంస్థకే పనులు దక్కేలా నిబంధనలు విధిస్తూ టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించారు. ఆ మేరకు నిబంధనలు రూపొందించి రూ.805.77 కోట్ల అంచనా వ్యయంతో ఈపీసీ–టర్న్‌కీ పద్ధతిలో 18 నెలల్లో పూర్తిచేసేలా గడువు పెట్టి గత డిసెంబర్ 22న హంద్రీ–నీవా అధికారులు టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. నిబంధనల ప్రకారం ఈ పనులను నాలుగు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవాలి. కానీ, ఉన్నతస్థాయి ఒత్తిడి మేరకు ఒకే ప్యాకేజీ కింద టెండర్లు పిలిచారు. ఈ నెల 16వ తేదీన టెక్నికల్ బిడ్ తెరిచారు. ఎంఈఐఎల్, ఎన్‌సీసీ, హెచ్‌ఈఎస్ సంస్థలు షెడ్యూళ్లు దాఖలు చేసినట్లు వెల్లడైంది. ఈ సంస్థలు దాఖలు చేసిన ఆర్థిక బిడ్‌లను శుక్రవారం తెరిచారు. ఎంఈఐఎల్ సంస్థ 4.57 శాతం అదనపు ధరలకు(ఎల్–1), ఎన్‌సీసీ సంస్థ 4.78 శాతం అదనపు ధరలకు(ఎల్–2), హెచ్‌ఈఎస్ సంస్థ 4.89 శాతం అదనపు ధరలకు(ఎల్–3) కోట్ చేస్తూ బిడ్‌లను దాఖలు చేశాయి. ఎల్–1గా నిలిచిన ఎంఈఐఎల్‌కు పనులు కట్టబెట్టాలంటూ బుధవారం హంద్రీ–నీవా అధికారులు సీవోటీకి ప్రతిపాదనలు పంపారు. నాలుగు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు నిర్వహించి ఉంటే.. కాంట్రాక్టర్లు భారీ ఎత్తున పోటీ పడేవారు. దీనివల్ల తక్కువ ధరలకే పనులు పూర్తయ్యే అవకాశం ఉండేది. 4.57 శాతం అదనపు ధరలతో పనులను అప్పగించడం వల్ల ఖజానాపై రూ.36.82 కోట్లకుపైగా అదనపు భారం పడుతుంది. ఈ పథకం అంచనా వ్యయాన్ని మొదట్లోనే భారీగా పెంచారు. అదనపు ధరలకు పనులు అప్పగించడం ద్వారా కాంట్రాక్టర్‌కు భారీ ఎత్తున ప్రయోజనం చేకూర్చారు. ఈ వ్యవహారంలో 'ముఖ్య'నేత, మరో కీలక నేతకు భారీ ఎత్తున ముడుపులు ముట్టినట్లు సమాచారం.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'నేను శక్తి' వేడుకలు

'నేను శక్తి'. స్త్రీలు తరతరాల అంతరాలను దాటుకుని, తమలో దాగున్న అనంత శక్తిని యావత్ ప్రపంచానికి చాటాలన్న సమున్నత లక్ష్యంతో రూపుదిద్దుకున్న కార్యక్రమం. అసమానతల్ని అధిగమించి ఇంటా బయటా, సమాజ ప్రగతికి సంబంధించిన ప్రతి మలుపులోనూ తనదైన ముద్రవేసిన మహిళా మణులెందరినో మనసారా స్మరించుకునే ఘట్టం. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీ, పురుష సమానత్వాన్ని కాంక్షిస్తూ, సిసలైన మహిళాభ్యున్నతి భావనను 'సాక్షి' సొంతం చేసుకున్న అపురూప సందర్భం. స్త్రీలు ఆజన్మాంతం ఎదుర్కొంటున్న సవాళ్ళను సవివరంగా చర్చించి, పరిష్కార మార్గాలను అన్వేషించి, మహిళా సాధికారతను మనస్ఫూర్తిగా కాంక్షిస్తూ సాగింది 'సాక్షి'. ఈ క్రతువులో నెల రోజుల పాటు అందించిన, అందిస్తున్న కథనాలు, కథలు, వాస్తవికతలను పాఠకలోకం ఆప్యాయంగా అక్కున చేర్చుకుంది. నిండు మనసుతో సొంతం చేసుకుంది. సమానత్వ సాధనకు 'సాక్షి' చేపట్టిన లింగ వివక్ష వ్యతిరేకోద్యమంలో అశేష పాఠకులు ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. స్త్రీ, పురుషుల మధ్య అసమానతలను నిలదీస్తూ, వారి మధ్య సమానత్వ సాధన దిశగా 'సాక్షి' వేసిన ఈ ముందడుగును మేధావులు, కవులు, రచయిత్రులు, ప్రజాస్వామికవాదులెందరో హృదయపూర్వకంగా అభినందించారు.

'నేను శక్తి' ప్రచారోద్యమంలో మొదట లింగ వివక్ష, గృహ హింస, లైంగిక వేధింపులు, సాధికారత... ఈ నాలుగు అంశాలపై 'సాక్షి' విస్తృతంగా చర్చించింది. తమ అమ్మాయిలను వివక్షను ఎదిరించి నిలిచే ధీరలుగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులను 'సూపర్ పేరెంట్స్'గా సత్కరించుకునేందుకు, సంబంధిత కథనాలతో కూడిన 10 నిమిషాల నిడివి గల 'షార్ట్ ఫిల్మ్'లను ఆహ్వానించింది. ఇందుకు పాఠక లోకం నుంచి విశేష స్పందన లభించింది. అందిన ఎంట్రీల్లోంచి అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేసి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'నేను శక్తి' ముగింపు వేడుకల్లో సముచితంగా సత్కరించాలని భావిస్తున్నాం. ఈ నెల 7న హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు జరిగే 'నేను శక్తి' అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి మీ అందరికీ ఇదే సాదర ఆహ్వానం. వేడుకల్లో పాల్గొనేందుకు 95055 55020కు ఫోన్ చేసి పేరు నమోదు చేయించుకోగలరు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

- 1,200 మందికి వైద్య పరీక్షలు
- ఉచితంగా మందుల పంపిణీ
- 80 మందిని ఉచిత శస్త్ర చికిత్సలకు రిఫర్



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు సాంబశివారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి

రాజుపాలెం (సత్తెనపల్లి): గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తానని డాక్టర్ బూచిపూడి సాంబశివారెడ్డి (సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్) తెలిపారు. మండల కేంద్రంలోని నవోదయ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో హైదరాబాద్‌లోని సీటీ న్యూరో సెంటర్ డాక్టర్ బూచిపూడి సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వగ్రామమైన చేజర్ల లో, నకరికల్లులోనూ ఉచిత వైద్య శిబిరాలకు మంచి స్పందన వచ్చిందన్నారు. శిబిరానికి హాజరైన వారికి బీపీ, షుగర్, అవసరమైన వారికి ఈసీజీ, 2డీ ఎకో, చెస్ట్ ఎక్స్‌రే, గర్భకోశ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, బోన్ డిస్సిటీ టెస్ట్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ న్యూరాలజిస్టులు, న్యూరో సర్జన్‌లు, ఆర్థోపెడిక్స్, కార్డియాలజిస్టులు, క్యాన్సర్ స్పెషలిస్టులు, మానసిక వైద్య నిపుణుల సహకారంతో సుమారు 1,200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అందులో 80 మందిని శస్త్ర చికిత్సల నిమిత్తం సీటీ న్యూరో సెంటర్‌కు రిఫర్ చేశారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి (న్యూరాలజీ), మధుసూదన్‌రావు (ఆర్థోపెడిక్), అంజాన్ (న్యూరాలజీ), పవన్‌కుమార్ (న్యూరో సర్జన్), శివకాంత్ (కార్డియాలజిస్టు), భూషన్ (ఫిజీషియన్) ఆదిల్ (జనరల్ ఫిజీషియన్)తోపాటు 60 మంది సిబ్బంది, షేరింగ్ హ్యాండ్స్, నవోదయ పాఠశాల డైరెక్టర్ రామారావు, ఉపాధ్యాయులు సేవలు అందించారు.

వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలి

వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు



గుంటూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీ మేరకు వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు డిమాండ్ చేశారు. గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమ డిమాండ్‌పై పలుమార్లు టీడీపీ నాయకులతో కలిసి వెళ్లి సీఎం చంద్రబాబుకు వినతిపత్రాలు అందజేశామన్నారు. ప్రతిసారీ తమకు న్యాయం చేస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే గత మూడేళ్లుగా తమ సామాజికవర్గానికి ఎలాంటి న్యాయం చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని 12 రాష్ట్రాల్లో వడ్డెరలను ఎస్టీలుగా గుర్తించారనీ, అయితే ఏపీ ప్రభుత్వం మాత్రం మిన్నకుండిపోతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో 10 రోజుల్లో దీనిపై చంద్రబాబు ప్రకటన చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్‌ల ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

ఆర్టీపీపీలో 600 మెగావాట్ల ప్లాంటు పూర్తి

- 15న సీవోడీ చేయడానికి సన్నాహాలు
- ఏపీ జెన్‌కో డైరెక్టర్ సుందర్‌సింగ్

ఎర్రగుంట్ల: వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని ఆర్టీపీపీలో 600 మెగావాట్ల ప్లాంటు నిర్మాణం పూర్తయింది. దీన్ని ఈనెల 15న సీవోడీ (కమర్షియల్ ఆపరేషన్ డిక్లరేషన్) చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏపీజెన్‌కో డైరెక్టర్ సుందర్‌సింగ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయనిక్కడ మాట్లాడారు. ఈ ప్లాంటును ఆయిల్‌తో లైటప్ చేశామన్నారు. సీవోడీకి కావాల్సిన బొగ్గును అందుబాటులో ఉంచామని, ప్రస్తుతం పాత యూనిట్ నుంచి బొగ్గును సరఫరా చేస్తామన్నారు. మొదట్లో నిదానంగా ఉత్పత్తిని 250 మెగావాట్లు చేసి, ఏడు రోజులపాటు యూనిట్‌ను రన్నింగ్‌లో ఉంచి టెస్టింగ్ చేస్తామన్నారు. తర్వాత 300, 500, 600 మెగావాట్ల వరకు తీసుకెళ్తామని తెలిపారు. ఇలా యూనిట్ విజయవంతమైతే సీవోడీ ప్రకటిస్తామని చెప్పారు. ఈ యూనిట్‌కు బొగ్గు కొరత లేదన్నారు.

ఏపీ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

రాష్ట్ర అధ్యక్షుడిగా ఆంజనేయులు



జెన్ని రమణయ్య

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం విజయవాడలోని ఐలాపురం హోటల్లో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా జంగ్రాజుపల్లి ఆంజనేయులు (ప్రకాశం జిల్లా), తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శిగా పొలిమేర హరికృష్ణ (పశ్చిమ గోదావరి), వర్కింగ్ కమిటీ చైర్మన్‌గా పమిడిపాటి కోటయ్య (గుంటూరు), రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా మంద రవికుమార్, ఇజ్రాయేల్, అధికార ప్రతినిధులుగా డి. దేవకుమార్, ఏ.సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యదర్శులుగా బి.ప్రేమ్‌దాస్, తాటవర్తి రాజారావు, యేసును ఎన్నుకున్నారు. వీరితో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, 13 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులను కూడా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు జెన్ని రమణయ్య మాట్లాడుతూ.. మాదిగల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేయాలని కోరారు.

అమరావతిలో బీఆర్‌టీఎస్ రవాణా వ్యవస్థ

విజయవాడ బీఆర్‌టీఎస్‌ను అక్కడికి విస్తరించేందుకు ప్రణాళిక

సాక్షి, అమరావతి: విజయవాడలో ఉన్న బీఆర్‌టీఎస్ (బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థ)ను రాజధాని అమరావతి, అటు నుంచి గుంటూరు వరకూ విస్తరించేందుకు సీఆర్‌డీఏ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే దీనిపై ప్రాథమికంగా కొన్ని ప్రతిపాదనలు రూపొందించగా, పూర్తిస్థాయి ప్రణాళిక సిద్ధం చేసేందుకు సన్నద్ధమవుతోంది. గుంటూరు జిల్లా తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల పరిధిలోని 29 గ్రామాల పరిధిలో రాజధానిని నిర్మిస్తున్న ప్రభుత్వం విజయవాడ, గుంటూరు నగరాలను దానికి అనుసంధానం చేయాలని భావిస్తోంది. దీనికి తొలుత మెట్రో రైలు వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రయత్నించినా జనాభా తక్కువగా ఉండడం, దానివల్ల పెద్దగా ఉపయోగం ఉండే పరిస్థితి లేకపోవడంతో తాజాగా బీఆర్‌టీఎస్ వ్యవస్థ వైపు మొగ్గు చూపింది. ప్రస్తుతం విజయవాడలో ఉన్న ఈ వ్యవస్థను రాజధానిలో నిర్మిస్తున్న ముఖ్యమైన రోడ్లు, ప్రాంతాలకు అటు నుంచి గుంటూరు వరకూ విస్తరించాలని ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చింది. విజయవాడలో బీఆర్‌టీఎస్ వ్యవస్థను ఆరు కారిడార్లుగా ఏర్పాటు చేయాలని పదేళ్ల క్రితం నిర్ణయించి ఒక కారిడార్‌ను నిర్మించారు. ఆరు కారిడార్లు నిర్మించినట్లు చెబుతున్నా అందుబాటులో మాత్రం ఒక కారిడార్ మాత్రమే ఉంది. అది కూడా బీఆర్‌టీఎస్ తరహాలో ఉపయోగించడం లేదు. ప్రజలు, ఉద్యోగులు రాజధానికి రాకపోకలు సాగించేందుకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు, సొంత వాహనాలే దిక్కయ్యాయి. ఈ నేపథ్యంలో అందరికీ అందుబాటులో ఉండేలా బీఆర్‌టీఎస్ వ్యవస్థను అక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తొలుత రాజధాని సీడ్ యాక్సెస్ రోడ్డుకు దీన్ని కలపాలని చూస్తోంది. ఆ తర్వాత రాజధానిలో ఆర్టీరియల్, మేజర్ ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్ రోడ్లతోపాటు ఎల్పీఎస్ లేఔట్లు, అక్కడక్కడా ప్రతిపాదిస్తున్న టౌన్‌షిప్‌లకు వేసే రోడ్లకు కారిడార్లను కలపాలని చూస్తున్నారు. విజయవాడ, గుంటూరు, అమరావతిని కలుపుతూ నిర్మించాలనుకుంటున్న ఈ వ్యవస్థకు సమగ్ర ప్రణాళిక రూపొందించేందుకు సీఆర్‌డీఏ కన్సల్టెన్సీలను ఆహ్వానించింది.

సీపీఎస్ రద్దు కోరుతూ మహాపాదయాత్ర

- భిక్షాటన, అర్ధనగ్న ప్రదర్శనలతో ఉద్యోగుల నిరసన
- అడ్డుకున్న పోలీసులు.. పలువురు అరెస్టు



విజయవాడలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



పాడేరు ర్యాలీకి హాజరైన సీపీఎస్ ఉద్యోగులు

పటమట/పాడేరు రూరల్: సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆదివారం ఉద్యోగులు తలపెట్టిన 'మహాపాదయాత్ర'ను పోలీసులు అడ్డుకున్నారు. వారిని బలవంతంగా జీపుల్లో ఎక్కించి వివిధ స్టేషన్లకు తరలించారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉద్యోగులు విజయవాడలో మహాపాదయాత్ర నిర్వహించారు. పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద భిక్షాటన, అర్ధనగ్న ప్రదర్శనలు చేశారు. సీపీఎస్ రద్దుపై చట్టసభల్లో తీర్మానం చేసి, కేంద్రానికి పంపాలని, పాత పెన్షన్ విధానంపై ప్రభుత్వం తన అభిప్రాయం చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే రంగంలోకి దిగిన పోలీసులు ఉద్యోగుల ప్రదర్శనను అడ్డుకున్నారు. నిరసన తెలుపుతున్న ఉద్యోగులను పోలీసులు బలవంతంగా జీపుల్లో ఎక్కించి వివిధ స్టేషన్లకు తరలించారు. అసెంబ్లీ వద్దకు చేరుకుని ప్రభుత్వానికి తమ సమస్యను వివరించేందుకు శాంతియుతంగా పాదయాత్ర చేపట్టామని, ప్రభుత్వం తమ పట్ల కఠినంగా వ్యవహరించడం శోచనీయమని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పేపేటి సత్యనారాయణ అన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ ప్రదర్శనను అడ్డుకోవటం అప్రజాస్వామికమని సంఘం కార్యదర్శి ముప్పాళ శ్రీనివాసరావు మండిపడ్డారు.

పాడేరులో భారీ ర్యాలీ

సీపీఎస్ విధానం రద్దు చేయాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం విశాఖ ఏజెన్సీలోని పాడేరులో భారీ ర్యాలీ నిర్వహించారు. దీనికి ఏజెన్సీలోని 11 మండలాలకు చెందిన సీపీఎస్ ఉద్యోగులు హాజరయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాజీ పఠాన్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు చెప్పిన టీడీపీ అధికారంలో వచ్చిన తరువాత ఉద్యోగుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కోశాధికారి కోడా సింహాద్రి మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

దరఖాస్తు చేశారా?

- ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామినేషన్-2018కు చివరి తేదీ: మార్చి 6. వెబ్‌సైట్: upsconline.nic.in
- విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)లో 7 పోస్టులకు చివరి తేదీ: మార్చి 6. వెబ్‌సైట్: www.hslvizag.in
- యూఆర్‌డీఐపీలో 7 పోస్టులకు చివరి తేదీ: మార్చి 7. వెబ్‌సైట్: urdip.res.in
- హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)లో 14 పోస్టులకు చివరి తేదీ: మార్చి 7. వెబ్‌సైట్: www.hal-india.com

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

గ్రాడ్యుయేట్స్ స్పెషల్

సివిల్స్ 2018

ఆప్షనల్ ఎంపిక ఇలా..

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్.. మూడంచెల ఎంపిక ప్రక్రియ. తొలిదశ ప్రిలిమ్స్ జీఎస్, ఆప్టిట్యూడ్‌పైనే ఉంటుంది! మలిదశ మెయిన్స్‌లో మాత్రం ఒక ఆప్షనల్ సబ్జెక్టును ఎంపిక చేసుకోవాలి. ఇందులో సాధించే మార్కులు కీలకం. సివిల్స్ (2018) దరఖాస్తుకు గడువు మార్చి 6న ముగియనుంది. జూన్ 3న జరిగే సివిల్స్ ప్రిలిమ్స్‌కు ప్రిపరేషన్ ప్రారంభించిన అభ్యర్థులు.. ఇప్పటినుంచే ఏ ఆప్షనల్‌ను ఎంపిక చేసుకోవాలి? ఏది స్కోరింగ్ ఆప్షనల్? తదితర అంశాలపై కసరత్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సివిల్స్ మెయిన్స్‌లో ఆప్షనల్ ఎంపికపై నిపుణుల సలహాలు, సూచనలు..



ప్రస్తుతం సివిల్స్‌కు పెరుగుతున్న పోటీ దృష్ట్యా అభ్యర్థులు ప్రిలిమ్స్ నుంచే మెయిన్ ఎగ్జామినేషన్ దృక్పథంతో ముందుకు సాగాలి. ముఖ్యంగా ఆప్షనల్ ఎంపికలో అభ్యర్థులకు సాధ్యమైనంత ముందు నుంచే స్పష్టత అవసరం. ప్రిలిమ్స్‌లో విజయం సాధించాక చూద్దామనే ధోరణి సరికాదని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మెయిన్స్‌లో భాషా సాహిత్యంతో సహా 26 ఆప్షనల్ సబ్జెక్టులు అందుబాటులో ఉన్నాయి. ఆర్ట్స్, హ్యూమానిటీస్, సైన్స్, టెక్నాలజీ, మెడికల్, మేనేజ్‌మెంట్, మ్యాథమెటిక్స్.. ఇలా అన్ని విభాగాలకు సంబంధించిన సబ్జెక్టులను యూపీఎస్సీ పొందుపరిచింది. అభ్యర్థులు వీటినుంచి ఒక ఆప్షనల్ సబ్జెక్టును ఎంపిక చేసుకోవాలి. ఈ సబ్జెక్టుకు సంబంధించి మెయిన్స్‌లో పేపర్-6 (ఆప్షనల్ సబ్జెక్టు పేపర్-1), పేపర్-7 (ఆప్షనల్ సబ్జెక్టు పేపర్-2) పేరుతో రెండు పేపర్లలో పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఒక్కో పేపర్‌కు 250 మార్కులు కేటాయించారు. అంటే మెయిన్స్ రాత పరీక్షకు సంబంధించిన మొత్తం 1750 మార్కుల్లో (మెరిట్‌కు పరిగణనలోకి తీసుకొనే).. ఒక్క ఆప్షనల్‌కే 500 మార్కులున్నాయి.

ఆసక్తి, నేపథ్యం

ఆప్షనల్ సబ్జెక్టు ఎంపికలో అభ్యర్థులు తమ ఆసక్తి, అకడమిక్ నేపథ్యం.. రెండింటినీ పరిగణనలోకి తీసుకోవాలి. కొన్ని ఆప్షనల్స్‌కు క్రేజీ, స్కోరింగ్ ఆప్షనల్స్‌గా ముద్రపడింది. ఉదాహరణకు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఫిలాసఫీ, హిస్టరీ, జాగ్రఫీ. ఇలాంటి ఆప్షనల్స్‌ను ఎంపిక చేసుకునే అభ్యర్థులు ఆయా సబ్జెక్టుల పరంగా తమ అవగాహన స్థాయిపై స్వీయ విశ్లేషణ చేసుకోవాలి. ఆ సబ్జెక్టులను ఎంపిక చేసుకుంటే.. అందుబాటులో ఉన్న సమయం (ప్రిలిమ్స్ నోటిఫికేషన్ నుంచి మెయిన్స్ వరకు)లో సిలబస్ పూర్తిచేయగలమా? అనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

- కొన్ని సబ్జెక్టులను చదువుతున్నప్పుడు ఎంతో సులువనే భావన ఏర్పడుతుంది. కానీ, వాటికి సంబంధించి పరీక్షలో వచ్చే ప్రశ్నల తీరులో వ్యత్యాసం ఉంటుంది. ఉదాహరణకు

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సబ్జెక్టును పరిగణనలోకి తీసుకుంటే.. మనం నిత్యం చూసే కలెక్టర్ వ్యవస్థ మొదలు ప్రముఖ శాస్త్రవేత్తల సిద్ధాంతాల వరకు అన్నీ సమ్మిళితంగా ఉంటాయి. పరీక్ష రోజు కనిపించే ప్రశ్నలు మాత్రం పూర్తిగా లోతైన అవగాహనను పరీక్షించేలా ఉంటాయి. ఉదాహరణకు గత మెయిన్ ఎగ్జామినేషన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1లో అడిగిన ఒక ప్రశ్న..

"Leaders do the right things; managers do them rightly" - (*Warren Bennis*). Is this distinction by him valid? Explain.

- పై ప్రశ్నకు సమాధానం రాయాలంటే.. పాలనా వ్యవస్థతోపాటు కార్య నిర్వాహక వ్యవస్థకు సంబంధించిన అన్ని అంశాలపైనా సంపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలి. ఆప్షనల్ ఎంపికలో ఇలాంటి అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలి.

మెటీరియల్ లభ్యత

ఆప్షనల్ ఎంపికలో మెటీరియల్ లభ్యత కూడా కీలకం. ప్రస్తుతం ఆర్ట్స్, హ్యూమానిటీస్ సబ్జెక్టుల మెటీరియల్ లభ్యతలో ఎలాంటి సమస్య లేదు. కానీ, టెక్నికల్, సైన్స్ తదితర స్పెషలైజ్డ్ సబ్జెక్టుల విషయంలో మాత్రం మెటీరియల్ కొరత ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సబ్జెక్టులను ఎంపిక చేసుకునే అభ్యర్థులు తమ అకడమిక్ పుస్తకాలపై ఎక్కువగా ఆధారపడాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్, మెడికల్ అభ్యర్థులకు కలిసొచ్చే అంశం ఏంటంటే.. ఇంజనీరింగ్ అభ్యర్థులకు ప్రామాణికమైన గేట్, ఐఈఎస్ మెటీరియల్ అందుబాటులో ఉంటోంది. మెడికల్ ఆప్షనల్ అభ్యర్థులకు సీఎంఎస్‌కు సంబంధించిన మెటీరియల్ లభిస్తోంది. ఇతర సబ్జెక్టుల (ఉదా: అగ్రికల్చర్, మేనేజ్‌మెంట్ తదితర)కు మెటీరియల్ లభ్యత కొంత తక్కువనే చెప్పొచ్చు. కాబట్టి ఆప్షనల్ ఎంపికలో మెటీరియల్ లభ్యత, దాని ప్రామాణికతలను పరిగణనలోకి తీసుకోవాలి.

భాషా సాహిత్యం ఆప్షనల్

ఇటీవల సివిల్స్ మెయిన్స్ ఫలితాల సరళిని పరిశీలిస్తే భాషా సాహిత్యం (లాంగ్వేజ్ లిటరేచర్)ను ఆప్షనల్‌గా ఎంపిక చేసుకొని, విజయం సాధిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించొచ్చు. అయితే భాషా సాహిత్యాన్ని ఆప్షనల్‌గా ఎంపికచేసుకునే అభ్యర్థులు అప్రమత్తంగా వ్యవహరించాలి. మాతృభాషకు సంబంధించిన సాహిత్యాన్ని ఎంపిక చేసుకునే వారు కూడా.. ఆ ఆప్షనల్ సిలబస్‌ను పూర్తిగా పరిశీలించాలి. గత ప్రశ్నపత్రాలను విశ్లేషించాలి. అప్పుడే భాషా సాహిత్యాన్ని ఆప్షనల్‌గా ఎంపిక చేసుకోవడంపై నిర్ణయం తీసుకోవాలి.

ప్రిపరేషన్

ఆప్షనల్‌ను ఎంపిక చేసుకున్నాక.. ప్రిలిమ్స్‌కు సమాంతరంగా కొంత సమయాన్ని ఆప్షనల్ ప్రిపరేషన్‌కు కేటాయించాలి. ఎకానమీ/సోషియాలజీ/పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్/హిస్టరీ/జాగ్రఫీ తదితర ఆప్షనల్స్ ఎంపిక చేసుకున్న వారికి కొంత అదనపు ప్రయోజనం ఉంటుందని చెప్పొచ్చు. ఎందుకంటే.. ఆయా ఆప్షనల్స్‌కు సంబంధించిన అంశాలు ప్రిలిమ్స్ సిలబస్‌లోనూ ఉంటాయి. మెయిన్స్‌లోని జీఎస్-1 నుంచి జీఎస్-4 వరకు పేపర్లలో పై సబ్జెక్టులకు సంబంధించిన అంశాలను సిలబస్‌లో నిర్దేశించారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. విశ్లేషణాత్మక అధ్యయనం ద్వారా మెరుగైన మార్కులు సొంతం చేసుకోవచ్చు.

కనీసం రెండుసార్లు చదివేలా..

మెయిన్స్ ఆప్షనల్ సబ్జెక్టును పరీక్షకు ముందు కనీసం రెండుసార్లు పూర్తిగా చదివేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. దీనికి అనుగుణంగా సబ్జెక్టును ఎంపిక చేసుకోవాలి. కొన్ని సబ్జెక్టుల నిడివి విస్తృతంగా ఉంటుంది. వీటిని ఒకసారి పూర్తిచేయడం కూడా కష్టమే. మరికొన్ని సబ్జెక్టుల సిలబస్ తక్కువగా ఉన్నప్పటికీ.. తేలిగ్గా అర్థమై ఒకటికి రెండుసార్లు చదివే వీలుంటుంది. ఇలాంటి వాటిని ఎంపిక చేసుకోవడం మేలు అనేది నిపుణుల మాట.

స్వీయ ప్రిపరేషన్

స్వీయ ప్రిపరేషన్‌కు కూడా వీలైన సబ్జెక్టును ఆప్షనల్‌గా ఎంపిక చేసుకోవడం మంచిది. ఆర్ట్స్, హ్యూమానిటీస్ సబ్జెక్టులదే పైచేయి అనడంలో సందేహం లేదు. ముఖ్యంగా వర్కింగ్ ఎగ్జిక్యూటివ్స్ ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. స్వీయ ప్రిపరేషన్ సాగించే అభ్యర్థులు నిరంతరం తమ నైపుణ్యాల స్థాయిని విశ్లేషించుకోవాలి. దీనికోసం మోడల్ టెస్ట్‌లు రాసి, వాటిని నిపుణులతో మూల్యాంకనం చేయించుకోవాలి.

– శ్రీరంగం శ్రీరామ్, డైరెక్టర్, శ్రీరామ్స్ ఐఏఎస్.

ఆసక్తి.. వనరుల లభ్యత

ఆప్షనల్ ఎంపికలో అభ్యర్థులు తొలుత ఆసక్తికి ప్రాధాన్యమివ్వాలి. ప్రిపరేషన్‌కు అందుబాటులో ఉన్న వనరులను కూడా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి. టెక్నికల్, సైన్స్ సబ్జెక్టులను ఆప్షనల్‌గా ఎంపిక చేసుకోవాలనుకుంటే.. సదరు అభ్యర్థులు తమ అకడమిక్స్‌కు సంబంధించి పూర్తి అవగాహన ఏర్పరచుకోవడం ఒక్కటే విజయానికి సాధనం.

– వి.గోపాలకృష్ణ, డైరెక్టర్, బ్రెయిన్ ట్రీ.



విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐఎం బెంగళూరులో ఎన్ఎస్ఆర్ ప్రి డాక్ ఫెలోషిప్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)... 2018-19కి గాను ప్రొఫెసర్ ఎన్.ఎస్.రామస్వామి ప్రి డాక్టొరల్ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ బడుగు, బలహీన (ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ (ఎన్‌సీఎల్)/దివ్యాంగ/మహిళ/ట్రాన్స్‌జెండర్) వర్గాల కోసం ప్రవేశపెట్టారు. ఈ వర్గాల అభ్యర్థులకు మేనేజ్‌మెంట్/మేనేజ్‌మెంట్ అనుబంధ విభాగాల్లో పరిశోధనలు చేయడానికి అవసరమైన చేయూతను అందించడం ఈ ప్రోగ్రామ్ లక్ష్యం.

- **ప్రోగ్రామ్:** ఎన్.ఎస్.రామస్వామి ప్రి-డాక్టొరల్ ఫెలోషిప్.
- **వ్యవధి:** ఏడాది (ఒక విద్యాసంవత్సరం: జూన్ 2018-మార్చి 2019).
- **స్టైపెండ్:** నెలకు రూ.25,000తోపాటు కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.25,000 చెల్లిస్తారు. దీంతోపాటు ఇంటి అద్దె భత్యం నెలకు రూ.8,000, ఇతర ఫీజులు అందిస్తుంది.
- **పరిశోధన విభాగాలు:** డెసిషన్ సైన్సెస్, ఎకనమిక్స్ అండ్ సోషల్ సైన్సెస్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ పాలసీ, స్ట్రాటజీ.
- **పరిశోధన ఇలా..:** ఎంపికైన అభ్యర్థులకు మెంటార్ పర్యవేక్షణలో శిక్షణ ఇస్తారు. అభ్యర్థులు తప్పనిసరిగా ప్రిపరేటరీ ప్రోగ్రామ్‌లకు హాజరుకావాలి. ప్రతి అభ్యర్థి కనీసం 3 డాక్టొరల్ స్థాయి క్రెడిట్ కోర్సులు పూర్తిచేయాల్సి ఉంటుంది.
- **అర్హతలు:** కనీసం 50 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ/ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ (లేదా) సీఏ/ఐసీడబ్ల్యూఏ/సీఎస్ (లేదా) నాలుగేళ్ల/8 సెమిస్టర్ల బ్యాచిలర్ డిగ్రీ.
- **ఎంపిక:** మెరిట్ జాబితా, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.500. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఏప్రిల్ 1, 2018. **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.iimb.ac.in

బీఎంఆర్‌సీలో 33 ఖాళీలు

కేంద్రం, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ (బీఎంఆర్‌సీ) లిమిటెడ్... ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ వింగ్‌లోని 33 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** జనరల్ మేనేజర్ (జీఎం)-2 (ఆపరేషన్స్-1+సిగ్నలింగ్ అండ్ టెలికాం-1); డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం)-4 (పీ వే/సీఎస్‌డబ్ల్యూ-1+ ట్రాక్షన్-1+ఎఫ్ అండ్ ఏ-1+హెచ్‌ఆర్-1); మేనేజర్-7 (ఆపరేషన్స్/ఓసీసీ-3+పీ వే-2+ఐటీ-2); అసిస్టెంట్ మేనేజర్ (ఏఎం)-10 (ఎఫ్ అండ్ ఏ-4+హెచ్‌ఆర్-4+ఐటీ-2); సెక్షన్ ఇంజనీర్ (ఎస్ఈ)-3 (నెట్‌వర్కింగ్); జూనియర్ ఇంజనీర్ (జేఈ)-7 (ఐటీ).
- **వేతనం:** జీఎం-రూ.1,37,790; డీజీఎం-రూ.74,760; మేనేజర్-రూ.63,960; ఏఎం-రూ.52,920; ఎస్ఈ-రూ.41,100; జేఈ-రూ.35,960.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఇంజనీరింగ్ డిగ్రీ/డిప్లొమా/ డిగ్రీ+సీఏ/ఐసీడబ్ల్యూఏ/ఐసీఎస్ఐ/పీజీ+డిప్లొమా (హెచ్‌ఆర్)/ఎంబీఏ/ఎంకామ్/సీఏ ఇంటర్/సీఎస్ ఇంటర్/ఐసీడబ్ల్యూఏ ఇంటర్/బీఎస్సీ (ఐటీ)/ఎంసీఏ/బీసీఏ. అలాగే నిబంధనల మేరకు అనుభవం, సంబంధిత రంగం ప్రత్యేకాంశాల్లో నైపుణ్యం తదితర అర్హతలుండాలి. **వయసు:** జీఎంకు 50 ఏళ్లు; డీజీఎం-45 ఏళ్లు; మేనేజర్-40 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ.



- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి పంపాలి. **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** మార్చి 28, 2018.
- **వెబ్‌సైట్:** www.bmrc.co.in

వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో 9 ఖాళీలు

వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ)... 9 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. డబ్ల్యూఐఐ.. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి వ్యవస్థ.

- **పోస్టు-ఖాళీలు:** జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-3; జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో (జేపీఎఫ్)/సీనియర్ ప్రాజెక్ట్ ఫెలో (ఎస్‌పీఎఫ్)-1; జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో (జేపీఎఫ్)-1; రీసెర్చ్ అసోసియేట్ (ఆర్ఏ1)-1; ప్రాజెక్ట్ అసోసియేట్ (పీఏ)-1; ఫోరెన్సిక్ రీసెర్చర్ (ఎఫ్ఆర్)-2.
- **ఫెలోషిప్:** జేఆర్ఎఫ్, జేపీఎఫ్, ఎఫ్ఆర్-రూ.25,000; ఎస్‌పీఎఫ్-రూ.28,000; పీఏ, ఆర్ఏ (1)-రూ.36,000. వీటితో నిబంధనల మేర హెచ్‌ఆర్ఏ ఉంటుంది.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను బట్టి కనీసం 60 శాతం మార్కులతో బోటనీ/ ఫారెస్ట్రీ/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/వైల్డ్‌లైఫ్ సైన్సెస్/జువాలజీ/లైఫ్ సైన్సెస్/ఎన్విరాన్ మెంటల్ మేనేజ్‌మెంట్/బయోలాజికల్ సైన్సెస్/బయోటెక్నాలజీ/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీలో ఎంఎస్సీ/పీహెచ్‌డీ.
- **వయసు:** జేఆర్ఎఫ్, ఎఫ్ఆర్‌కు 28 ఏళ్లు; జేపీఎఫ్-30 ఏళ్లు; ఎస్‌పీఎఫ్-35 ఏళ్లు; పీఏ-45 ఏళ్లు; ఆర్ఏ1కు 40 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** అర్హత పరీక్ష, ఇంటర్వ్యూ. **దరఖాస్తు రుసుం:** రూ.500. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. **చివరి తేదీ:** మార్చి 26, 2018. **వెబ్‌సైట్:** www.wii.gov.in

టీఎస్ ఈసెట్-2018

తెలంగాణలోని వివిధ వృత్తి విద్యా కళాశాలల్లో 2018-19కి గాను బీఈ/బీటెక్/బీఫార్మసీలో ప్రవేశాలకు 'తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీఎస్ ఈసెట్)-2018' ప్రకటన విడుదలైంది. సంబంధిత విభాగాల్లో డిప్లొమా, బీఎస్సీ (మ్యాథమెటిక్స్) ఉత్తీర్ణులు అర్హులు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. చివరి తేదీ ఏప్రిల్ 6, 2018. దరఖాస్తు రుసుం ఎస్సీ/ఎస్టీ-రూ.400; మిగిలిన కేటగిరీలకు రూ.800.

మే 9న ప్రవేశపరీక్ష ఉంటుంది.

ఢిల్లీ పోలీస్, సాయుధ దళాల్లో 1,223 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) .. 2018కి గాను ఢిల్లీ పోలీస్, సాయుధ పోలీస్ దళాల్లో (సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్:సీఏపీఎఫ్) 1223 ఎస్ఐ, ఏఎస్ఐ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది. ఇందులో ఢిల్లీ పోలీస్ విభాగంలో 150 (పురుషులు-97+ మహిళలు-53) ఎస్ఐ పోస్టులు; సాయుధ దళాల్లో (సీఆర్‌పీఎఫ్-274+ బీఎస్ఎఫ్-508+ఐటీబీపీ-85+ఎస్ఎస్‌బీ-206) 1,073 ఎస్ఐ పోస్టులు ఉన్నాయి. సాయుధ దళాల్లోని మొత్తం ఎస్ఐ పోస్టుల్లో మహిళలకు 38 పోస్టులు (బీఎస్ఎఫ్-25+ఐటీబీపీ-13) కేటాయించారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)లోని ఎస్ఐ, ఏఎస్ఐ పోస్టుల వివరాలను తర్వాత ప్రకటిస్తారు. ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై, వయసు 2018, ఆగస్టు 1 నాటికి 20-25 ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులు. వీటితోపాటు నిబంధనల మేర శారీరక ప్రమాణాలు, దృఢత్వం తప్పనిసరి. ఢిల్లీ పోలీస్ విభాగంలో ఎస్ఐ (పురుష) అభ్యర్థులకు అదనంగా ఎల్ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్ (మోటార్ సైకిల్, కారు) ఉండాలి. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. చివరి తేదీ ఏప్రిల్ 2, 2018. పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.ssc.nic.in

షార్‌లో 25 ఖాళీలు

నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (ఎస్‌డీఎస్‌సీ) షార్‌లో 25 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.



- **పోస్టు-ఖాళీలు:** సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'-24 (కెమికల్ ఇంజనీరింగ్-11+క్వాలిటీ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్-1+థర్మల్ ఇంజనీరింగ్-2+ మెషిన్ డిజైన్-1+ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్-2+ఇండస్ట్రియల్ సేఫ్టీ-4+ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్-1+ఎంఎస్సీ ఆర్గానిక్/అనలిటికల్ కెమిస్ట్రీ-2); మెడికల్ ఆఫీసర్ 'ఎస్‌సీ' -1 (ఆర్థోపెడిక్స్).
- **వేతనం:** సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'-రూ.56,100; మెడికల్ ఆఫీసర్-రూ.67,700. వీటితోపాటు ఇతర అలవెన్సులు ఉంటాయి.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్/ఎంఎస్సీ/ఎంబీబీఎస్+డిప్లొమా (ఆర్థోపెడిక్స్)/ ఎంబీబీఎస్+ఎండీ/డీఎన్‌బీ (ఆర్థోపెడిక్స్). నిబంధనల మేర మార్కుల శాతం తప్పనిసరి.
- **వయసు:** సైంటిస్ట్/ఇంజనీరింగ్ 'ఎస్‌సీ'కి 18-35 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి. మెడికల్ ఆఫీసర్‌కు గరిష్ఠ వయోపరిమితి లేదు.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** మార్చి 23, 2018. **వెబ్‌సైట్:** www.shar.gov.in

కాంపిటీటివ్ గైడెన్స్

గ్రూప్ డిస్కషన్ (జీడీ)లో విజయానికి..



గ్రూప్ డిస్కషన్ (జీడీ).. ప్రస్తుతం వివిధ ఉద్యోగాల భర్తీకి, ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశానికి కీలకంగా మారుతున్న విభాగం. జీడీలో కొంతమంది అభ్యర్థులను ఒక బృందంగా ఏర్పాటు చేస్తారు. ఒక అంశాన్ని ఇచ్చి దానిపై చర్చించమంటారు. జీడీలో ఇచ్చే అంశాలు చాలా వరకు సమకాలీన అంశాలకు సంబంధించి ఉంటాయి. నిర్దేశ సమయంలో బృంద సభ్యులు ఆ అంశంపై తమ అభిప్రాయాలు చెప్పాల్సి ఉంటుంది. జీడీ సందర్భంగా అభ్యర్థుల సబ్జెక్టు పరిజ్ఞానంతో పాటు ప్రవర్తనా శైలిని కూడా గమనిస్తారు. కాబట్టి అభ్యర్థులు వ్యక్తిగతంగా కొన్ని ముఖ్యమైన అంశాలపై శ్రద్ధ తీసుకోవాలి. జీడీలో నిర్వాహకులను మెప్పించే విధంగా వ్యవహరించాలి. బాడీ లాంగ్వేజ్‌లో సమతుల్యత పాటించడం ఎంతో అవసరం.

- జీడీలో ఒక్కోసారి అభ్యర్థులకు ఏ మాత్రం అవగాహన లేని అంశం ఎదురుకావొచ్చు. అలాంటప్పుడు ఒత్తిడికి గురికాకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలి. ఇచ్చిన అంశంపై ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులు చర్చించే వరకు వేచి చూడాలి. వారు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలతోపాటు, వారు పేర్కొంటున్న ఫ్యాక్ట్స్, ఫిగర్స్‌ను నోట్ చేసుకోవాలి. ఫలితంగా ఆ అంశంపై విషయ పరిజ్ఞానంతోపాటు, తాము వ్యక్తం చేయదగ్గ అభిప్రాయంపైనా స్పష్టత వస్తుంది. జీడీలో అభ్యర్థులు తమ అభిప్రాయాన్ని స్పష్టంగా, నిర్దిష్టంగా చెప్పాలి. స్వీయ నియంత్రణ పాటించడమూ ముఖ్యమే.
- జీడీకి సిద్ధమయ్యే అభ్యర్థులు సమకాలీన అంశాలపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలి. దీనికి సరైన మార్గం దినపత్రికలు చదవడం. పత్రికల్లో వచ్చే ఎడిటోరియల్స్, కథనాల నుంచి ముఖ్య పాయింట్లు రాసుకోవాలి.

ఆదాయం కోసం ఎన్నో మార్గాలు

రిటైర్మెంట్ కోసమే అనుకోవద్దు ◆ ఇతర అవసరాలకూ క్రమానుగత ఆదాయ ఏర్పాట్లు
ఇందుకోసం ఎన్నో పెట్టుబడి అవకాశాలు ◆ వయసు, రిస్క్‌ను బట్టి సాధనాలు




దీర్ఘకాలంలో అధిక రాబడులు



డెట్ పెట్టుబడులపై అధిక ఆదాయం కోరుకునేట్టు అయితే దీర్ఘకాలిక బాండ్లలో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. వీటిపై వడ్డీరేటు అధికంగా ఉంటుంది. దీనివల్ల స్వల్పకాలంలో వడ్డీ రేట్లు తగ్గినా గానీ మీ రాబడుల్లో మార్పు ఉండదు. ఇలాంటి దీర్ఘకాలిక సాధనాల్లో ఇన్వెస్ట్ చేసే ముందు స్వల్పకాలిక అవసరాలకు, అత్యవసరాలకు తగినంత నిధుల్ని పక్కన పెట్టుకోవాల్సి ఉంటుంది. కచ్చితమైన కాల వ్యవధితో కూడిన బాండ్‌ను గడువు కంటే ముందు రిడీమ్ చేసుకోవడానికి వీలు పడదు. ఒకవేళ సెకండరీ మార్కెట్లో విక్రయించితే కొంత నష్టపోవాల్సి వస్తుంది. అందుకే మీకు ఆదాయం ఎంత కాలం పాటు అవసరం ఉందో అంతమేర కాల వ్యవధి కలిగిన బాండ్లలో ఇన్వెస్ట్ చేయడం అనుకూలం. ఉదాహరణకు పిల్లల ఉన్నత విద్య కోసం అయితే 10 ఏళ్ల కాల వ్యవధి కలిగిన బాండ్‌లో ఇన్వెస్ట్ చేసి దానిపై వచ్చే వడ్డీ ఆదాయాన్ని వినియోగించుకోవచ్చు.

రిస్క్ కొద్దీ ఆదాయం



కొందరు అధిక వడ్డీ ఆదాయం కోసం రిస్క్ తీసుకునేందుకు సిద్ధంగా ఉంటారు. ఇటువంటి వారు 'ఏ' రేటింగ్ కలిగిన బాండ్లలో ఇన్వెస్ట్ చేయడం వల్ల 'ఏఏఏ' రేటింగ్ ఉన్న బాండ్లకంటే అధిక వడ్డీ ఆదాయం అందుకోవచ్చు. కొన్ని ప్రభుత్వరంగ సంస్థలు సైతం బాండ్లను జారీ చేస్తుంటాయి. వీటి క్రెడిట్ రేటింగ్ అధికంగా లేకపోయినప్పటికీ డిఫాల్ట్ అయ్యే అవకాశాలు దాదాపు తక్కువే. ప్రైవేటు రంగానికి చెందిన బాండ్లలో ఇన్వెస్ట్ చేసే ముందు స్థిరమైన రాబడులు, డెట్ కవరేజీ రేషియో, మెరుగైన యాజమాన్యం తదితర అంశాలను పరిశీలించుకోవాలి. బాండ్ కాల వ్యవధి వరకూ ఒకే రేటింగ్ ఉంటుందనుకోవద్దు. రేటింగ్‌లు మారిపోతూ ఉంటాయి. బాండ్లను జారీ చేయడం ద్వారా ఇన్వెస్టర్ల నుంచి నిధులు సమీకరించే సంస్థలు తిరిగి వాటిని చెల్లించే సామర్థ్యాన్ని రేటింగ్‌లు తెలియజేస్తాయి. పెట్టుబడి పెట్టి బాండ్ తెచ్చుకుని నిశ్చింతగా కూర్చోవడానికి లేదు. మీ కష్టార్జితాన్ని ఏ కంపెనీకి అయితే స్వాధీనం చేశారో, వాటి ఆర్థిక పరిస్థితులపై ఓ కన్నేసి ఉంచాలి. ఆదాయం తగ్గిపోతున్నా లేదా లాభాలు కరిగిపోతున్నా, రుణాలు పెరిగిపోతున్నా, యాజమాన్యంలో మార్పులు జరుగుతున్నా రిస్క్ పెరుగుతున్నట్టుగానే భావించాల్సి ఉంటుంది.

ఒక బాండ్‌ను కొనుగోలు చేస్తున్నారంటే కాల వ్యవధి వరకు అదే వడ్డీరేటుకు ఫిక్స్ అయినట్టు. ఒకవేళ ఆ తర్వాత స్వల్పకాలానికే వడ్డీ రేట్లు పెరిగిపోతే అప్పుడు ఆ ప్రయోజనాన్ని పొందేందుకు అదనపు నిధులు ఉంటే మంచిది. మార్కెట్లో వడ్డీ రేట్లు పెరిగితే తక్కువ రేటుపై అప్పటికే ఇన్వెస్ట్ చేసిన పోర్ట్‌ఫోలియో విలువ తగ్గుతుంది. అందుకే పెట్టుబడులను పలు భాగాలు చేసి, భిన్న కాల వ్యవధులకు ఇన్వెస్ట్ చేయాలని నిపుణులు సూచిస్తుంటారు. స్వల్ప కాలం కోసం చేసిన పెట్టుబడులు ముందే మెచ్యూరిటీ తీరతాయి. దీంతో ఒకవేళ వడ్డీ రేట్లు పెరిగిపోతే ఆ రేటుపై ఇన్వెస్ట్ చేయడం ద్వారా ప్రయోజనం పొందొచ్చు. ఒకవేళ వడ్డీ రేట్లు తగ్గితే తక్కువ రేటుపై ఇన్వెస్ట్ చేయాల్సి రావచ్చు. అయితే ఇదేమంత ప్రతికూలతగా చూడక్కర్లేదు. ఎందుకంటే మీ పెట్టుబడుల్లో మిగిలిన భాగమంతా వివిధ కాల వ్యవధులకు ఇన్వెస్ట్ చేసి ఉంటారు. కనుక వాటిపై అధిక వడ్డీ రేటే లభిస్తుంది. దీనివల్ల వడ్డీ రేట్లు పెరగడం, తగ్గడం ద్వారా ప్రయోజనం పొందొచ్చు.

రిటైర్ అయిన వారికే స్థిరాదాయం అవసరం అనుకుంటే పొరపాటే. పిల్లల విద్య, రుణాల చెల్లింపులకు పెట్టుబడులపై క్రమం తప్పకుండా వచ్చే ఆదాయం ఉంటే ఎంతో హాయి. వేతనమే ఈ అవసరాలను తీర్చలేకపోవచ్చు. అటువంటప్పుడు స్థిరాదాయం వచ్చేలా మనకు మనమే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. బ్యాంకు డిపాజిట్లు, కంపెనీల డిపాజిట్లు, బాండ్లు, డిబెంచర్లు, ఇన్‌కమ్ స్కీమ్‌లు, మ్యూచువల్ ఫండ్స్ డెట్ స్కీమ్‌లు ఇవన్నీ పెట్టుబడులపై ఆదాయం కోరుకునే వారికి ఉన్న ఆప్షన్లు. అయితే, వీటిలో ఇన్వెస్ట్ చేసి ఆశించిన ప్రయోజనం పొందాలంటే ఓ విధానం అంటూ ఉండాలి. ఇందుకు సంబంధించి నిపుణుల సూచనలతో 'ప్రాఫిట్' అందిస్తున్న కథనమిది...

–సాక్షి, బిజినెస్ విభాగం

డెట్ కాకుండా...



డెట్ సాధనాలు కాకుండా ఈక్విటీ పెట్టుబడులపై డివిడెండ్ ఆదాయం, అద్దె ఆదాయం కూడా క్రమానుగతంగా లభించేదే. అయితే డివిడెండ్ ఆదాయం అన్నది కచ్చితంగా వస్తుందన్న హామీ ఉండదు. ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తట్టుకునే ఆదాయం మాత్రం లభిస్తుంది. అందుకే రెగ్యులర్‌గా ఆదాయం ఆశించే వారు మెరుగైన వృద్ధి రేటుతో కొనసాగే కంపెనీలు, క్రమం తప్పకుండా డివిడెండ్ పంపిణీ చేసే వాటిని ఎంచుకోవాలి. తక్కువ వృద్ధి అవకాశాలున్న వాటికి దూరంగా ఉండాలి. షేరు ధర పెరిగితే డివిడెండ్ ఈల్డ్ తగ్గుతుంది. షేరు ధర తగ్గితే డివిడెండ్ ఈల్డ్ పెరుగుతుంది. అందుకే డివిడెండ్ ఈల్డ్ ఎక్కువగా ఉన్న వాటిని ఎంచుకోవాలి. ద్రవ్యోల్బణ రక్షిత ఆదాయంలోకి అద్దె ఆదాయం కూడా వస్తుంది.

పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం

ఇక క్రమానుగత ఆదాయానికి ఈక్విటీ, బంగారంపై మూలధన రాబడులను వెనక్కి తీసుకోవడం కూడా ఒకటి. ప్రతీ అసెట్‌క్లాస్‌కు సంబంధించి ఎంత మేర విలువ వృద్ధి చెందాలన్నది ఓ లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. ఉదాహరణకు 15 శాతం రాబడులన్నది లక్ష్యమైతే మీ పెట్టుబడుల విలువ 15 శాతం వృద్ధి చెందగానే పెరిగిన మేర వెనక్కి తీసేసుకోవాలి. ఈ విధానం ఈక్విటీ, బంగారంలో మేలు చేస్తుంది. ఒకవేళ ధరలు తగ్గినా నష్టం లేదు. ఎందుకంటే, పెరిగిన మేర లాభాలను తీసుకుని ఉంటారు గనుక. ఇక ఆదాయార్జనకు అనుసరించే విధానం వయసును బట్టి కూడా ఆధారపడి ఉంటుంది. చిన్న వయసులో ఉంటే డెట్‌పై మరింత రాబడి కోసం రిస్క్ తీసుకుని క్రెడిట్ రేటింగ్ తక్కువ ఉన్న సాధనాలను ఆశ్రయించే వెసులుబాటు ఉంటుంది. అదే రిటైర్ అయిన వారు దీర్ఘకాలంతో కూడిన బాండ్లలో ఇన్వెస్ట్ చేసే వీలుండకపోవచ్చు. మీ పోర్ట్‌ఫోలియోను ప్రస్తుత ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా, మీ ప్రాధాన్యతలకు అనుగుణంగా రీబ్యాలెన్స్ చేసుకుంటూ ఉండాలి.



బీమా నుంచి గాడ్జెట్ల దాకా!!

మన దేశీ జనాభాలో దాదాపు సగం మంది పాతికేళ్ల కన్నా తక్కువ వయసున్న వారే. ఇక ముప్పై అయిదేళ్ల కన్నా తక్కువ వయసున్న వారిని చూస్తే ఏకంగా 65 శాతం. ఇందులో చాలా మంది ఇప్పటికే ఏదో ఒక ఉద్యోగం చేస్తున్న వారో.. లేదా త్వరలో చేరబోయే వారో, స్వయం ఉపాధిలో ఉన్నవారో ఉన్నారు. ఇంత భారీ స్థాయిలో యువజనాభా ఉండటం.. దేశానికి ప్రయోజనకరమే. అయితే, వీరంతా రిటైరయ్యాక పరిస్థితి ఏంటి? రిటైరయిన వారికీ భరోసానిచ్చేలా సామాజిక భద్రత పథకాలు, వృద్ధులకు చెప్పుకోతగ్గ స్థాయిలో ఆదాయాన్నిచ్చే ఆర్థికపరమైన తోడ్పాటు మన దగ్గర లేకపోవడంతో.. వీరంతా తమ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు సమస్యలు తప్పవు. పైగా.. దేశీయంగా ఉద్యోగానికి సైతం భద్రత తగ్గిపోతోంది. అందుకే... నేటి యువతరం కాస్త ముందు నుంచే ఆర్థిక ప్రణాళికలను వేసుకోవడం మంచిది. భవిష్యత్ అవసరాలు చిన్నవైనా, పెద్దవైనా... లక్ష్యాలు స్వల్పకాలికమైనా, దీర్ఘకాలికమైనవైనా... స్మార్ట్‌గా అధిగమించవచ్చు.

స్వల్ప, మధ్యకాలిక లక్ష్యాల కోసం సిప్‌లు..

అన్నింటికన్నా ముందుగా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ ఒకటి తీసుకోవడం ప్రధానం. మీ కంపెనీ నుంచి ఆరోగ్య బీమా కవరేజీ ఉన్నప్పటికీ.. కుటుంబం మొత్తానికి ఉపయోగపడేలా ప్రత్యేకంగా ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ ఒకటి తీసుకోవడం శ్రేయస్కరం. ఇందుకోసం ప్రీమియం వార్షికంగా చెల్లించేలా ప్లాన్ చేసుకోండి. మిగతా కాలవ్యవధులతో పోలిస్తే.. దీని వల్ల ప్రీమియం కొంత తగ్గుతుంది.

- ప్రణాళిక ఉంటే తేలిగ్గానే అధిగమించొచ్చు
- అందుకోసం యుక్త వయసు నుంచే పెట్టుబడి
- అధిక రాబడులకు ఈక్విటీలే ఉత్తమం
- కాకపోతే దీర్ఘకాలం సిప్ చేస్తేనే లాభాలు
- రిటైర్మెంట్ ఆదాయానికీ ఇదే ఇన్వెస్ట్‌మెంట్

అటుపైన స్వల్పకాలిక డెట్ ఫండ్‌లో నెలవారీగా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌లో (సిప్) ఇన్వెస్ట్ చేయడం మొదలెట్టండి. తర్వాత ప్రతి ఏటా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీకి అవసరమైన మొత్తాన్ని క్రమంగా సదరు డెట్‌ఫండ్ సిప్ నుంచి విడ్‌డ్రా చేసి కట్టేయొచ్చు. ఈ విధానంతో రెండురకాల ప్రయోజనాలుంటాయి. మొదటిది... వార్షికంగా కట్టడం వల్ల ప్రీమియం కొంత తగ్గుతుంది. అదే సమయంలో మీరు సిప్‌లో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చే పెట్టుబడి ఏడాది పొడవునా ఎంతో కొంత రాబడి అందిస్తూనే ఉంటుంది. అలాగే, కాస్త ముందుగా ప్లాన్ చేసుకుంటే.. స్మార్ట్‌ఫోన్లూ, ల్యాప్‌టాప్‌లు, బైక్‌లు, కార్లు.. ఇతర గాడ్జెట్స్ లాంటివి కొనుక్కోవడానికి ఈఎంఐల బాట పట్టకుండా సొంతంగానే కొనుక్కునే వీలుంటుంది. ఇందుకోసం కూడా స్వల్పకాలిక సిప్‌లు ప్రారంభించవచ్చు. తర్వాత వాటి నుంచి కొద్దికొద్దిగా విత్‌డ్రా చేసుకుని మీరు కోరుకున్న గాడ్జెట్స్.. లేదా వస్తువులు కొనుక్కోవచ్చు.

టాప్ రేటెడ్ ఫండ్స్‌లోనే...

దీర్ఘకాలంలో సంపదను గణనీయంగా పెంచుకునే దిశగా టాప్ రేటెడ్ ఈక్విటీ ఫండ్స్‌లో మాత్రమే సిప్ చేయడం మంచిది. అత్యంత తక్కువగా రూ.1,000 నుంచి కూడా ఇన్వెస్ట్ చేయడం ప్రారంభించి... జీతం పెరిగే కొద్దీ కేటాయింపులూ పెంచుకుంటూ వెళ్లండి. ఉదాహరణకు.. సగటున పదిహేను శాతం వార్షిక రాబడులు ఇచ్చే సిప్‌లో ప్రతి నెలా రూ. 1,000 పెట్టుబడితో మొదలుపెట్టారనుకుందాం. ఏటా ఈ మొత్తాన్ని రూ. 1,000 చొప్పున పెంచుకుంటూ పోతే.. ముప్ఫై ఏళ్ల తర్వాత ఏకంగా రూ. 4.8 కోట్ల సంపద పోగవుతుంది. కాబట్టి స్మార్ట్‌గా ఇన్వెస్ట్ చేస్తే.. లక్ష్యం ఎలాంటిదైనా సులువుగా సాధించవచ్చు.

దీర్ఘ కాలికానికీ సిప్‌లు...

యుక్త వయసులో కాస్త రిస్కు సామర్థ్యం ఎక్కువగానే ఉంటుంది కనుక... దీర్ఘకాలంలో అధిక రాబడులిచ్చే అవకాశాలున్న ఈక్విటీల్లో అధికంగా ఇన్వెస్ట్ చేయడాన్ని పరిశీలించొచ్చు. ఎందుకంటే దీర్ఘకాలికంగా షేర్లలో రిస్కులు క్రమంగా తగ్గి రాబడులు పెరిగే అవకాశాలుంటాయి. పైపెచ్చు అనేక సంవత్సరాలుగా ఇన్వెస్ట్ చేస్తూ ఉండటం వల్ల చక్రవడ్డీ తరహా కాంపౌండింగ్ మహిమ కూడా తోడై మరింత మెరుగైన రాబడులందుకునే ఆస్కారముంటుంది. చాలా మటుకు మిగతా ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలతో పోలిస్తే దీర్ఘకాలంలో ఈక్విటీలు అధిక రాబడులు అందిస్తాయి. యుక్తవయస్సులోనే ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడం మొదలుపెట్టడం వల్ల పెట్టుబడుల్లో ఒకటి రెండు తప్పిదాలేమైనా చేసినా.. సత్వరం సరిదిద్దుకునేందుకు కొంత అవకాశం ఉంటుంది. అదే రిటైర్మెంట్‌కి దగ్గరవుతుండగా.. ఏ చిన్న తప్పిదం చేసినా సరిదిద్దుకునేందుకు ఎక్కువ సమయం ఉండదు.

పెట్టుబడిని బట్టే రాబడి. అదే అధిక రాబడి కావాలంటే... అక్కడ రిస్క్ కూడా అధికంగానే ఉంటుంది. కాకపోతే తక్కువ రిస్క్‌తో కాస్తంత ఎక్కువ రాబడులనిచ్చే పథకాలు కూడా మార్కెట్లో చాలానే ఉన్నాయి. వయో వృద్ధులకు, కాస్త క్రమానుగతంగా పొదుపు చేసే వారికి, తమ పెట్టుబడిని పోగొట్టుకునే పరిస్థితిలో లేమని భావించేవారికి... ఇలాంటివారికి ఈ పథకాలు అనువుగా ఉంటాయి. అవన్నీ వివరించేదే ఈ ప్రాఫిట్ ప్లస్ కథనం...

- పెరుగుతున్న వడ్డీ రేట్లు; ఇంకా పెరిగే ఛాన్స్
- ఆకర్షణీయంగా మారుతున్న బ్యాంకు ఎఫ్‌డీలు
- స్వల్పకాలం కోసం బాండ్లను కూడా చూడొచ్చు
- సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ కూడా అనుకూలమే
- రిస్క్ వద్దనుకునేవారికి ఇవే ప్రత్యామ్నాయాలు



రిస్క్ లేదు... రాబడి ఎక్కువ!

గడిచిన మూడేళ్లలో స్థిరాదాయం కోసం ఈక్విటీలను నమ్ముకున్న సీనియర్ సిటిజన్లకు (వృద్ధులు) రాబడులు బాగానే వచ్చాయి. సురక్షిత సాధనాల్లో రాబడులు క్షీణించిపోవడంతో రిస్క్ సాధనాలైన ఈక్విటీ సేవింగ్స్ పథకాలు, బ్యాలన్స్‌డ్ ఫండ్స్ తదితర వాటిని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఇప్పుడు ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. సంప్రదాయ స్థిరాదాయ పథకాల వడ్డీ రేట్లు మూడేళ్ల తర్వాత మళ్లీ మెల్లగా పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం పెరుగుతుండడంతో ఆర్‌బీఐ కీలక రేట్ల తగ్గింపునకు బ్రేక్ వేసింది. 2017 ఆగస్ట్ నుంచి యథాతథ స్థితినే కొనసాగిస్తూ వస్తోంది. రానున్న ఏడాదిలో వడ్డీ రేట్లను పెంచొచ్చని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. బ్యాంకులు ఇప్పటికే మెల్లగా రేట్ల పెంపును ప్రకటిస్తూ ఉండగా... ఈ రేట్ల పెంపును బాండ్ల మార్కెట్ ఇప్పటికే సర్దుబాటు కూడా చేసేసుకుంది. బాండ్ల మార్కెట్‌కు బెంచ్ మార్క్ అయిన పదేళ్ల ప్రభుత్వ బాండ్ల రాబడులు 130 బేసిస్ పాయింట్ల మేర పెరిగి 7.5 శాతానికి చేరాయి. దీంతో మార్కెట్లో ఇతరులు కూడా దీన్ని అనుసరించక తప్పదు. ఈ నేపథ్యంలో బ్యాంకులు, కంపెనీలు రానున్న నెలల్లో కనీసం పదేళ్ల బాండ్ల ఈల్డ్ స్థాయికి అయినా రేట్లను పెంచక తప్పని పరిస్థితి ఉందంటున్నారు విశ్లేషకులు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రిస్క్ వద్దనుకునే సీనియర్ సిటిజన్లు స్థిరాదాయం కోసం ఈక్విటీలు కాకుండా ఇతర సాధనాలతో పోర్ట్‌ఫోలియోను ఏర్పాటు చేసుకోవచ్చని సూచిస్తున్నారు.

బ్యాంకు ఎఫ్‌డీలు...

రానున్న కాలంలో వడ్డీ రేట్ల పెరుగుదల అవకాశాల నేపథ్యంలో స్థిరాదాయం కోరుకునే సీనియర్ సిటిజన్లు దీర్ఘకాలిక డెట్ సాధనాలకు బదులు బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లను పరిశీలించొచ్చు. మూడు నెలల నుంచి ఏడాది కాలానికి కూడా వీటిలో ఇన్వెస్ట్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఏడాది కాలానికి చాలా బ్యాంకులు మంచి రేటునే ఆఫర్ చేస్తున్నాయి. దీర్ఘకాలానికి ఎఫ్‌డీలపై తక్కువ రేటు ఉంది. కనుక ఆరు నెలల నుంచి ఏడాది కాలానికి ఎఫ్‌డీలను ఆశ్రయించొచ్చు. సెక్షన్ 80టీటీబీ కింద సీనియర్ సిటిజన్లకు (60 ఏళ్లు పైబడిన వారు) ఏడాదిలో వడ్డీ ఆదాయం రూ.50,000 వరకూ ఎలాంటి పన్నూ విధించకుండా తాజా బడ్జెట్లో రాయితీ ఇవ్వటం ఆకర్షణీయం. అంటే రూ.50,000 వరకు వడ్డీ ఆదాయంపై టీడీఎస్ (మూలం వద్ద పన్ను కోత/బ్యాంకు స్థాయిలో) ఉండదు. కమర్షియల్ బ్యాంకులు, కోపరేటివ్ బ్యాంకులు, పోస్టాఫీసు డిపాజిట్లపై ఈ మినహాయింపు ఉంటుంది. అయితే, కోపరేటివ్ బ్యాంకుల్లో ఎఫ్‌డీలు రిస్క్‌తో కూడినవి. అలాగే, పోస్టాఫీసులో డిపాజిట్లపై వడ్డీ ఆదాయం 6.6 శాతం స్థాయిలోనే ఉంది. వీటికంటే బ్యాంకు డిపాజిట్లు మెరుగ్గా ఉన్నాయి. కోటక్ మహీంద్రా బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐడీఎఫ్‌సీ బ్యాంకులు సీనియర్ సిటిజన్లకు అధిక రాబడులను ఆఫర్ చేస్తున్నాయి.

ఐడీఎఫ్‌సీ బ్యాంకు 366 రోజుల డిపాజిట్‌పై సీనియర్ సిటిజన్లకు 7.5 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. కోటక్ మహీంద్రా బ్యాంకు 390 రోజుల కాల వ్యవధి కలిగిన బ్యాంకు డిపాజిట్‌పై 7.35 శాతం వడ్డీని అందిస్తోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఈ రేటు 7.25 శాతంగా ఉంది. ఈ మూడు బ్యాంకులు కూడా నెలవారీ, త్రైమాసిక వారీ వడ్డీ ఆదాయం చెల్లింపు ఆప్షన్ అందిస్తున్నాయి. 7.25 శాతం వడ్డీ రేటుపై సీనియర్ సిటిజన్లకు రూ.7 లక్షల డిపాజిట్‌పై ఏటా రూ.50,000 ఆదాయం లభిస్తుంది. కాకపోతే పన్ను చెల్లించాల్సిన ఆదాయం ఉన్న సీనియర్ సిటిజన్లు ముందుగా కొత్తగా ప్రవేశపెట్టిన రూ.50,000 వడ్డీ ఆదాయం మినహాయింపును ఉపయోగించుకోవడం ద్వారా పన్ను రహిత ఆదాయం పెంచుకోవచ్చు.


సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్

మిగతా పథకాలపై వడ్డీ రేట్లు తగ్గిపోగా, పోస్టాఫీసు సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్) ఇప్పటికీ అధిక స్థాయిలో 8.3 శాతం వార్షిక రాబడులను ఆఫర్ చేస్తోంది. మార్కెట్ రేట్ల కంటే ఇది ప్రీమియం రేటే. ఈ పథకంలో ఏడాది తర్వాత కార్పస్‌పై 1.5 శాతం పెనాల్టీ చెల్లించడం ద్వారా పెట్టుబడులను వెనక్కి తీసుకునే సౌలభ్యం కూడా ఉంది. కనుక ఐదేళ్ల కాల వ్యవధి కలిగిన ఈ పథకాన్ని సీనియర్ సిటిజన్లు స్థిరమైన రాబడుల కోసం పరిగణనలోకి తీసుకోవచ్చు. కాకపోతే ఈ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది. ఆదాయపన్ను చట్టం కింద వార్షికంగా రూ.3 లక్షల ఆదాయం వరకు సీనియర్ సిటిజన్లకు పన్ను మినహాయింపు ఉన్నందున ఎక్కువ మందికి పన్ను పరమైన ఇబ్బందేమీ ఉండదు. పైగా సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల పెట్టుబడి వరకూ దీనికి మినహాయింపు ఉంది.

ఈ అవకాశాలు కూడా చూడొచ్చు...

సీనియర్ సిటిజన్లకు ఆర్‌బీఐ కొత్తగా తీసుకొచ్చిన 7.75 శాతం ప్రభుత్వ బాండ్లు లేదా ఎన్‌బీఎఫ్‌సీ సంస్థల బాండ్ల ఆప్షన్లు కూడా ఉన్నాయి. ఆర్‌బీఐ 7.75 శాతం బాండ్లు గతంలో ఉన్న 8 శాతం వడ్డీ రేట్ల బాండ్ల స్థానంలో తీసుకొచ్చినవి. భద్రత పరంగా ఢోకా లేనివి ఇవి. కాకపోతే దీనిపై వచ్చే వడ్డీ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది. టీడీఎస్ కూడా వర్తిస్తుంది. ఇతర సంప్రదాయ సాధనాల కంటే కాస్త మెరుగైన రాబడులకు ఇందులో హామీ ఉంటుంది. ఎస్‌బీఐతోపాటు పలు ఇతర జాతీయ బ్యాంకుల నుంచి వీటిని డీమ్యాట్ రూపంలో తీసుకోవాల్సి ఉంటుంది. ఏడేళ్ల పాటు లాకిన్ పీరియడ్ ఉండడం ప్రతికూలత. 60–70 ఏళ్ల వయసులో ఉన్న వారు ఆరేళ్ల తర్వాత ఉపసంహరణకు అవకాశం ఉంది. అదే 70 ఏళ్లు దాటిన వారు అయితే ఐదేళ్ల తర్వాత, 80 ఏళ్ల వారు నాలుగేళ్ల తర్వాత పెట్టుబడులను వెనక్కి తీసుకోవచ్చు. దీర్ఘకాలం పాటు లాకిన్ పీరియడ్ ఉండడం అన్నది మారే వడ్డీ రేట్ల నేపథ్యంలో ప్రతికూలతగానే చూడాల్సి ఉంటుంది.

కొంచెం రిస్క్ అయినా ఫర్వాలేదనుకుంటే బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) అందించే బాండ్లను పరిశీలించొచ్చు. ఏఏఏ రేటింగ్ ఉన్న బాండ్లను స్వల్ప కాలం కోసం పరిగణనలోకి తీసుకోవచ్చు. ఎం అండ్ ఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఏడాదికి 7.5 శాతం), హెచ్‌డీఎఫ్‌సీ (7.4 శాతం), బజాజ్ ఫైనాన్స్ (7.6 శాతం) బాండ్లను రాబడులు, కాస్తంత భద్రత ఉన్నవాటిగా పరిగణించొచ్చు. వీటికి లాకిన్ పీరియడ్ లేకపోవడం అనుకూలత. కావాలనుకున్నప్పుడు పెట్టుబడులు వెనక్కి తీసుకోవచ్చు. ఎల్‌ఐసీ పదేళ్ల వయవందన యోజనలో పెట్టుబడుల పరిమితిని పెంచుతామని తాజా బడ్జెట్లో కేంద్రం ప్రకటించింది. అది అందుబాటులోకి వచ్చినప్పుడు వీటిలో పెట్టుబడుల్ని వెనక్కి తీసుకుని నచ్చిన వాటిలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.



> ఒక పనిని నువ్వు చేయగలవా? లేదా? అనేది నీకు మాత్రమే తెలుస్తుంది.
> అందుకే ఎప్పుడూ సరైనా నిర్ణయం తీసుకోవాలి.
> – హెన్రీ ఫోర్డ్, ఫోర్డ్ మోటార్ వ్యవస్థాపకుడు

పొదుపు-మదుపు



పన్ను ఆదా.. మెరుగైన ఆదాయం

ఐడీఎఫ్‌సీ ట్యాక్స్ అడ్వాంటేజ్ ఫండ్





పన్ను ఆదా పథకాలు వేతన జీవులకు ఏటా ఫిబ్రవరి, మార్చిలోనే గుర్తుకు వస్తుంటాయి. చివరి నిమిషంలో ఏదో ఒక దాన్లో పెట్టేసి పన్ను ఆదా చేసుకున్నామనే సంతృప్తి పొందుతారు. వాస్తవంగా పన్ను ఆదా ఒక్కటే ప్రామాణికం కాదు, దాంతోపాటు మంచి రాబడి కూడా ఇచ్చే సాధనంలో ఇన్వెస్ట్ చేస్తేనే లక్ష్యం సిద్ధిస్తుంది. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 80సి కింద పన్ను ఆదా చేసుకోవడంతోపాటు, మంచి రాబడులిచ్చే సాధనాలుగా ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్‌లను (ఈఎల్ఎస్ఎస్) చెప్పుకోవాలి. వీటిలో మంచి పనితీరు చూపించే పథకాల్లో ఐడీఎఫ్‌సీ ట్యాక్స్ అడ్వాంటేజ్ కూడా ఒకటి.

రాబడులు ఎలా ఉన్నాయంటే...

ఈఎల్ఎస్ఎస్ పథకాలన్నింటిలోనూ కనీసం మూడేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. ఆ లోపు పెట్టుబడులు వెనక్కి తీసుకునే అవకాశం ఉండదు. ఐడీఎఫ్‌సీ ట్యాక్స్ అడ్వాంటేజ్‌లోనూ అంతే. సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల వరకు చేసే పెట్టుబడులకు పన్ను ఆదా చేసుకోవచ్చు. గత ఐదేళ్ల కాలంలో ఈ ఫండ్ ఏటా సగటున 21 శాతం రాబడులనిచ్చింది. ఈ విభాగంలోని ఇతర పథకాలతో పోలిస్తే పనితీరులో ఇదే నంబర్ 1. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లాంగ్‌టర్మ్ ఈక్విటీ, ఎల్ అండ్‌టీ ట్యాక్స్ అడ్వాంటేజ్, ఫ్రాంక్లిన్ ఇండియా ట్యాక్స్ షీల్డ్ తదితర పథకాలతో చూస్తే ఈ పథకమే ముందుంది.

పెట్టుబడుల విధానం

ఈ పథకం తన నిర్వహణ పరిధిలో ఉన్న నిధుల్లో 25–30 శాతం వరకు స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. అది కూడా రూ.10,000 కోట్ల లోపు మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న వాటినే ఎంచుకుంటుంది. అందుకే అధిక రిస్క్ తీసుకునే సామర్థ్యం ఉన్న వారే ఈ పథకాన్ని ఎంచుకోవడం సమంజసం. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా రంగాలను, షేర్లను ఎంచుకుంటుంది. బుల్ దశలో 95 శాతం నిధుల్ని మిడ్‌క్యాప్ స్టాక్స్‌కు కేటాయిస్తుంది. అదే బేరిష్ దశలో రిస్క్ తగ్గించుకునేందుకు రక్షణాత్మక రంగాల్లోని స్టాక్స్‌ను ఎంచుకుంటుంది. ఈ పథకం ఆటో, ఆటో యాన్సిలరీ, ఇండస్ట్రియల్స్, కన్‌స్ట్రక్షన్ రంగాలకే అధిక శాతం పెట్టుబడుల్ని కేటాయిస్తోంది. సాధారణంగా తన పోర్ట్ ఫోలియోను 70 శాతం స్టాక్స్‌తో నిర్వహిస్తూ ఉంటుంది. ఒక స్టాక్‌కు 5 శాతం మించకుండా చూస్తుంది. మిడ్, స్మాల్‌క్యాప్ రంగాల్లో ప్రస్తుతం ఈ పథకం చేసిన పెట్టుబడులు 32 శాతంగా ఉన్నాయి. మార్కెట్లలో అస్థిరత ఎక్కువైన ఈ దశలో ఇంత ఎక్స్‌పోజర్ స్మాల్, మిడ్ క్యాప్‌ల్లో తీసుకోవడం అన్నది అధిక రిస్క్‌గానే భావించాలి. అయితే, ఈ పథకంలో పెట్టుబడులకు మూడేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. సిప్ అయితే ప్రతీ సిప్‌కు మూడేళ్లు వర్తిస్తుంది. కనుక దీర్ఘకాలంలో అస్థిరతలు తగ్గి సగటున చూస్తే లాభాలనిస్తుందని చెప్పుకోవచ్చు. ఈ పండ్ బ్యాంకింగ్ రంగానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఐసీఐసీఐ బ్యాంకు, ఇండస్‌ఇండ్ బ్యాంకు, కోటక్ మహీంద్రా బ్యాంకు పోర్ట్‌ఫోలియోలో ఉండగా, ఇటీవలే ఎస్‌బీఐ కూడా వచ్చి చేరింది.

పోర్ట్‌ఫోలియో

స్టాక్ పేరు	నిధుల కేటాయింపు (శాతంలో)
హెచ్‌డీఎఫ్‌సీ	4.36
ఫ్యూచర్ రిటైల్	3.39
ఐసీఐసీఐ బ్యాంకు	3.31
కేఈసీ ఇంటర్నేషనల్	2.17
మిండా ఇండస్ట్రీస్	2.13
గెయిల్	2.08
ఇన్ఫోసిస్	1.93
మారుతి సుజుకి	1.88
వీఆర్ఎల్ లాజిస్టిక్స్	1.86
ఆర్‌బీఎల్ బ్యాంకు	1.84

'వాణిజ్య యుద్ధం'లో పసిడి మెరుపు!



స్టీల్, అల్యూమినియం దిగుమతులపై వరుసగా 25, 10 శాతం చొప్పున సుంకాలు విధిస్తూ, అమెరికా ట్రంప్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రపంచ వాణిజ్య యుద్ధం పసిడి ధర పెరుగుదలకు దోహదపడే అంశంగా పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఫిబ్రవరి 2వ తేదీతో ముగిసిన వారంలో పసిడి వరుసగా రెండవ వారమూ తగ్గింది. అంతర్జాతీయంగా వారం వారీగా 7 డాలర్ల నష్టంతో 1,323 డాలర్ల వద్ద ముగిసింది. 1,300, 1,270, 1,240 వద్ద పసిడికి పటిష్ట మద్దతు ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇక దేశీయంగా ముంబై ప్రధాన మార్కెట్‌లో పసిడి వారం వారీగా 99.9 స్వచ్ఛత ధర రూ.35 నష్టంతో రూ.30,535కు పడింది. 99.5 స్వచ్ఛత ధర కూడా అదే స్థాయిలో తగ్గి రూ. 30,385కు చేరింది. వెండి కేజీ ధర భారీగా రూ.180 నష్టపోయి, రూ.38,210కి చేరింది. ఇక మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో పసిడి వారంలో 10 గ్రాముల ధర రూ.30,448 గా ఉంది. వారంలో డాలర్ ఇండెక్స్ 89.95 వద్ద ఉండగా, డాలర్ మారకపు విలువలో రూపాయి 30 పైసలు నష్టంతో రూ. 65.20కి చేరింది.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, ఫిబ్రవరి 22 నాటికి (అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు– ఏడాది	1–2 ఏళ్లు	5 ఏళ్లు, ఆపైన
ఆంధ్రా బ్యాంక్	6.25	6.50	6.25
యాక్సిస్ బ్యాంక్	6.25-6.5	6.75- 6.90	6.90
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.25	6.45- 6.55	6.25-6.5
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.60	6.25
కెనరా బ్యాంక్	6.35	6.45- 6.5	6.00
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.60	6.50
కార్పొరేషన్ బ్యాంక్	6-6.25	6.5-6.7	6.50
డీసీబీ బ్యాంక్	7.00	7-7.15	7.2-7.25
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.75-6.25	6.25 - 6.75	6.00
ఐసీఐసీఐ బ్యాంక్	6 - 6.50	6.6- 6.75	6.50
ఐడీబీఐ బ్యాంక్	6 - 6.5	6.5-6.75	6.00
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	5.75 - 6.25	6.50 - 6.75	6.00
ఇండస్‌ఇండ్ బ్యాంక్	6.25 - 6.5	6.75 - 6.85	6.50
కోటక్ మహీంద్రా బ్యాంక్	6.6-6.7	6.7-6.85	6.25
ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.2-6.4	6.60	6.40
ఎస్‌బీఐ	6.25	6.25	6.00
సిండికేట్ బ్యాంక్	6.25	6.75	6.50

మరింత సమాచారం కోసం www.bankbazaar.comపై క్లిక్ చేయండి

సీనియర్లకు ఉపశమనం కొంతే...

2018–19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో సీనియర్ సిటిజన్లకి వర్తించే ప్రతిపాదనవల్ల వారికి నష్టమా? లాభమా? ఒకసారి చూద్దాం...

2018-19 బడ్జెట్ ఏం చెబుతోందంటే...

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య



ట్యాక్సేషన్ నిపుణులు

1 బేసిక్ శ్లాబ్ మారలేదు.

2 రేట్లలో కూడా మార్పు లేదు.

3 ప్రస్తుతం విద్య నిమిత్తం 3% వసూలు చేసే సెస్సుని అధికంగా ఆరోగ్యం పేరిట మరో 1% పెంచారు. ఈ మేరకు చెల్లించే మొత్తం పెరుగుతుంది.

4 ఉద్యోగస్తులు, పెన్షనర్లకి శుభవార్త. స్టాండర్డ్ డిడక్షన్ రూ.40,000 తగ్గింపు ఇచ్చారు. ఈ మేరకు పన్ను పరిధిలోని ఆదాయం/జీతం తగ్గుతుంది. అయితే ఇక్కడే ఒక మెలిక పెట్టారు. ఈ తగ్గింపు ఇస్తూ... ప్రస్తుతం అమల్లో ఉన్న మెడికల్ అలవెన్స్ రూ.15,000, రవాణా అలవెన్స్ రూ.19,200 (నెలకు రూ.1,600 చొప్పున 12 నెలలకు) ఇక నుంచి మినహాయింపు పరిధిలోకి రావని స్పష్టంచేశారు. అంటే రూ.34,200 విలువైన మినహాయింపులను రద్దు చేస్తూ.. రూ.40,000 మినహాయింపు నిచ్చారు. ఈ సందర్భంలో ప్రయోజనం అదనంగా రూ.5,200 మాత్రమే. ఇది చాలా స్వల్పం.

5 ప్రస్తుతం సెక్షన్ 80డి ప్రకారం.. మెడిక్లెయిమ్ రూ.30,000 వరకు మినహాయింపు ఇచ్చారు. కొత్త ప్రతిపాదనల ప్రకారం.. ఈ పరిమితిని రూ.50,000కు పెంచారు. ఎక్కువ ప్రీమియం చెల్లిస్తున్న వారికి ఈ పెంపు ఉపశమనం.

6 అలాగే 80డీడీబీ ప్రకారం కొన్ని నిర్దేశిత జబ్బుల వైద్యానికయ్యే ఖర్చుల విషయంలో మినహాయింపు 60 ఏళ్లు దాటిన వారికి రూ.60,000.. 80 ఏళ్లు దాటిన వారికి రూ.80,000 వరకు ఉండేది. ప్రస్తుత ప్రతిపాదనల ప్రకారం ఈ పరిమితిని రూ.1,00,000కు పెంచారు. ఈ మేరకు పన్నుల్లో ప్రయోజనం ఉంటుంది.

7 ప్రస్తుతం 80టీటీఏ ప్రకారం అందరికీ సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్‌పై వడ్డీ రూ.10,000 దాకా మినహాయింపు ఇస్తున్నారు. ఇది కొనసాగుతుంది. కానీ ఈ సెక్షన్ సీనియర్స్‌కి వర్తించదు. బదులుగా 80టీటీబీ ప్రవేశపెట్టారు. ఈ సెక్షన్ ప్రకారం.. సీనియర్ సిటిజన్లకు మంచి ఉపశమనం ఇచ్చారు. ఒక సంవత్సర కాలంలో వడ్డీని రూ.50,000 దాకా మినహాయింపు ఇచ్చా రు. సేవింగ్స్ బ్యాంక్ వడ్డీ, ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద వడ్డీ అన్నీ పరిగణనలోకి తీసుకొని రూ.50,000 దాకా మినహాయింపు ఇస్తారు. అందుకనే టీడీఎస్ పరిమితిని రూ.50,000కు పెంచారు. ఈ మార్పు వలన సీనియర్లకు మంచి ఉపశమనం. టీడీఎస్ వేరు.. పన్ను భారం వేరు.. ఇది చాలా ప్రయోజనం చేకూరుస్తుంది. పన్ను భారం తగ్గుతుంది.

8 ఇదివరకు 10 (38) ప్రకారం.. లాంగ్‌టర్మ్ ఈక్విటీ షేర్లు, కొన్ని యూనిట్లు మొదలైనవి అమ్మినప్పుడు ఏర్పడ్డ లాభాలకు మినహాయింపు ఉంది. కానీ ఇకపై ఇది ఉండదు. ఇటువంటి లాభాలు రూ.1,00,000 లోపల ఉంటే ఎలాంటి పన్ను భారం ఉండదు. అది దాటితే మాత్రం లాభాలపై 10 శాతం పన్ను భారం ఉంటుంది.

సాక్షి



బొమ్మ-బొరుసు

“నువ్వు ఏదైనా పనిని చాలా ముఖ్యమని భావిస్తే... ఎలాంటి అడ్డంకులు ఎదురైనా, పరిస్థితులు వ్యతిరేకంగా ఉన్నా.. దాన్ని కచ్చితంగా చేసి తీరాలి.” – ఎలాన్ మస్క్, సీఈవో (టెస్లా, స్పేస్ ఎక్స్)



ఆకాశ్ అంబానీకి పెళ్లి కళ

వజ్రాల వ్యాపారి కుమార్తె శ్లోకా మెహతాతో త్వరలో వివాహం?

న్యూఢిల్లీ: అంబానీల ఇంట్లో పెళ్లి బాజా మోగనుందా? అపర కుబేరుడు, దేశీ కార్పొరేట్ రంగ రారాజు ముకేశ్ అంబానీ పెద్ద కుమారుడు ఆకాశ్ అంబానీ త్వరలో పెళ్లి చేసుకోనున్నారా? విశ్వసనీయ వర్గాలు అవుననే అంటున్నాయి. ఇంతకీ ఈ కార్పొరేట్ యువరాజును మనువాడబోయే వధువు ఏవరంటారా...! డైమండ్ కింగ్‌గా పేరుగాంచిన రసెల్ మెహతా కుమార్తె శ్లోకా మెహతా అంటూ మీడియాలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.



నిశ్చితార్థంపై కొద్ది వారాల్లో ప్రకటన వెలువడనుందని.. ఈ ఏడాది డిసెంబర్ ఆరంభంలో వివాహం జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయా వర్గాల సమాచారం. అయితే, ఈ పెళ్లి విషయంపై వ్యాఖ్యానించేందుకు ఇరు కుటుంబాలు నిరాకరించడం గమనార్హం. నిశ్చితార్థం, పెళ్లికి సంబంధించి ఇంకా తేదీలేవీ ఖరారు కాలేదని ముకేశ్ అంబానీ కుటుంబానికి చెందిన సన్నిహిత వర్గాలు తెలిపారు. ‘ఆకాశ్ అంబానీ పెళ్లికి సంబంధించిన శుభవార్తను తగిన సమయంలో ముకేశ్ కుటుంబమే స్వయంగా అందరితో పంచుకుంటుంది. పెళ్లి ఖరారైతే కచ్చితంగా అది భారత్‌లోనే జరుగుతుంది’ అని ఆయా వర్గాలు వివరించారు. ఈ నెల 24న నిశ్చితార్థం ఉండొచ్చన్న వార్తలను తోసిపుచ్చారు.

ఎవరీ శ్లోకా మెహతా?

‘రోజీ బ్లూ డైమండ్స్’ అధినేత రసెల్ మెహతా కుటుంబంతో ముకేశ్ అంబానీ కుటుంబానికి మంచి సంబంధాలు ఉన్నాయి. శ్లోకా మెహతా, ఆకాశ్ అంబానీ కూడా ఒకరికొకరు ఇదివరకే తెలుసనేది సంబంధిత వార్గాల సమాచారం. ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో వీరిద్దరూ కలిసి చదువుకోవడం విశేషం. 2009లో హైస్కూలు విద్యను పూర్తి చేసుకున్న శ్లోకా మెహతా... ఆ తర్వాత ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో ఆంత్రపాలజీ డిగ్రీ చదివారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ నుంచి న్యాయ శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. రోజీ బ్లూ ఫౌండేషన్‌లో 2014 జూలై నుంచి డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. అంతేకాకుండా, స్వచ్ఛంద సంస్థలకు అవసరమైన వాలంటీర్లను అందించే ‘కనెక్ట్‌ఫర్’అనే సంస్థ సహ వ్యవస్థాపకురాలు కూడా ఆమె. రసెల్, మోనా మెహతాల ముగ్గురు సంతానంలో చివరి కుమార్తె శ్లోకా. ఇక ముకేశ్, నీతా అంబానీలకు ముగ్గురు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు ఆకాశ్. కుమార్తె ఈషా అంబానీలు కవలలు. చిన్న కుమారుడు అనంత్ అంబానీ. రిలయన్స్ ఇండస్ట్రీస్ టెలికం వెంచర్ రిలయన్స్ జియో కంపెనీ బోర్డులో ఇప్పటికే ఆకాశ్ అంబానీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా, పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) మెగా కుంభకోణంలో ప్రధాన నిందితుడు, పరారీలో ఉన్న డైమండ్ వ్యాపారి నీరవ్ మోదీకి మోనా మెహతాతో బంధుత్వం ఉండటం కొసమెరుపు.

ప్రపంచ పరిణామాలే దిక్సూచి!

నేడు సేవల రంగం గణాంకాలు
- పార్లమెంట్ బడ్జెట్ సమావేశ పరిణామాలు
- ట్రంప్ సుంకాల విధింపు
- వివిధ దేశాల కేంద్ర బ్యాంక్‌ల పాలసీలు
- ఈ వారం మార్కెట్‌పై ప్రభావం చూపే అంశాలు



సమీప భవిష్యత్తులో కీలకమైన అంశాలేమీ లేనందున, ఈ వారంలో చోటు చేసుకునే ప్రపంచ పరిణామాలు, పార్లమెంట్ రెండో దశ బడ్జెట్ సమావేశ పరిణామాలు స్టాక్ మార్కెట్‌పై ప్రభావం చూపుతాయని నిపుణులంటున్నారు. వీటితో పాటు డాలర్‌తో రూపాయి మారకం, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల గమనం, విదేశీ, దేశీ పెట్టుబడుల సరళి తదితర అంశాలు కూడా స్టాక్ సూచీల కదలికను నిర్దేశిస్తాయని వారంటున్నారు.

నేడు సేవల రంగం గణాంకాలు..

నేడు(సోమవారం) వెలువడే ఫిబ్రవరి నెల సేవల రంగం పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్(పీఎమ్ఐ) గణాంకాలు మార్కెట్ ట్రెండ్‌ను నిర్దేశించడంలో కీలకం కానున్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో 50.9గా ఉన్న సేవల రంగం పీఎమ్ఐ ఈ ఏడాది జనవరిలో 51.7కు పెరిగింది. సమీప భవిష్యత్తులో ప్రభావం చూపే కీలకాంశాలు ఏమీ లేనందున మార్కెట్ కన్సాలిడేషన్ బాటలోనే పయనిస్తుందని మార్కెట్ విశ్లేషకులంటున్నారు.

కమల వికాసం కలసివస్తుందా ?

ఈశాన్య రాష్ట్రాల్లో ముఖ్యంగా త్రిపురలో బీజేపీ ఘన విజయం స్టాక్ మార్కెట్‌కు ఉత్తేజాన్నివ్వవచ్చని నిపుణులంటున్నారు. ఈ విజయంతో రానున్న లోక్ సభ ఎన్నికల్లో ఆ పార్టీ విజయవకాశాలు మరింతగా మెరుగుపడ్డాయని, ఇది ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కు సానుకూలమేనని విశ్లేషకులంటున్నారు. నేటి నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ రెండో దశ బడ్జెట్ సమావేశ పరిణామాలు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతాయని హెమ్ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ ఎనలిస్ట్ ఆస్థా జైన్ తెలిపారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ రుణ కుంభకోణం చర్చకు రావచ్చు.

ట్రంప్ సుంకాల దెబ్బ..

అమెరికాకు దిగుమతయ్యే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించడం మన మార్కెట్‌పై ప్రభావం చూపవచ్చు. కాగా, ఈ సుంకాల ప్రభావం తక్షణం మన కంపెనీలపై ఉండకపోవచ్చని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

ఇక అంతర్జాతీయ అంశాల పరంగా చూస్తే యూరోపియన్ కేంద్ర బ్యాంక్, జపాన్, కెనడా, ఆస్ట్రియా కేంద్ర బ్యాంక్‌లు తమ తమ ద్రవ్య విధానాలను ప్రకటిస్తాయి. ఫెడ్ చైర్మన్ వడ్డీరేట్ల పెంపు విషయమై తీసుకునే నిర్ణయంపైనే అందరి కళ్లూ ఉన్నాయని కోటక్ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్(రీసెర్చ్) టీనా విర్మాణి అన్నారు.

ఈ క్యూ3లో జీడీపీ గణాంకాలు పుంజుకుంటాయనే అంచనాలతో గత వారం స్టాక్ మార్కెట్ ఆశావహంగానే ఆరంభమైందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. అయితే బాండ్ ఈల్డ్‌లు పెరగడం, మొండి బకాయిల సమస్య, రుణ మోసాల కారణంగా ఆర్థిక రంగ షేర్లలో అమ్మకాలు కొనసాగడంతో ఈ లాభాలు వారం చివరి వరకూ నిలబడలేదని వివరించారు. రేట్ల పెంపు విషయంలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ దృఢమైన వైఖరి ఇన్వెస్టర్లను మరింత అప్రమత్తం చేసిందని పేర్కొన్నారు. మార్కెట్ వేల్యూయేషన్ ప్రస్తుత పరిస్థితుల్లో గరిష్టంగా ఉన్నా, ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలిక అంచనాలు పటిష్టంగానే ఉన్నాయని తెలిపారు.

హెచ్‌జీ ఇన్‌ఫ్రా లిస్టింగ్

హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ కంపెనీ ఈ నెల 9న(శుక్రవారం) స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావచ్చు. గత నెల 26–28 మధ్య వచ్చిన ఈ ఐపీఓ ప్రైస్‌బాండ్ రూ.263–270గా ఉంది.

11 వేల కోట్ల ‘విదేశీ’ నిధులు వెనక్కి...

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ)లు మన స్టాక్ మార్కెట్ నుంచి గత నెలలో రూ.11,037 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ విషయంలో గత ఐదు నెలల్లో ఇదే అత్యధిక మొత్తం. గత ఏడాది సెప్టెంబర్‌లో విదేశీ ఇన్వెస్టర్లు రూ.11,392 కోట్ల మేర పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. మరో వైపు డెట్ మార్కెట్ నుంచి కూడా విదేశీ ఇన్వెస్టర్లు రూ.253 కోట్ల మేర పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఇతర వర్ధమాన దేశాల్లో మంచి అవకాశాలుండటంతో విదేశీ ఇన్వెస్టర్లు ఇక్కడ తమ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారని నిపుణులంటున్నారు. కాగా ఈ ఏడాది జనవరిలో మన ఈక్విటీ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్లు రూ.13,781 కోట్లు పెట్టుబడులు పెట్టారు. బ్రెజిల్ లాంటి ఇతర వర్ధమాన దేశాల్లో స్టాక్ మార్కెట్ రాబడులు ఆకర్షణీయంగా ఉండటంతో ఎఫ్‌పీఐలు గత నెలలో ఇన్వెస్ట్‌మెంట్స్‌ను భారీ స్థాయిలో ఉపసంహరించుకున్నారని ఎస్ఎస్ఈ ఎమ్‌డీ, సీఈఓ విక్రమ్ లిమాయే చెప్పారు.

మహిళా ఉద్యోగుల పెంపునకు రంగాలవారీ చర్యలు: సీఐఐ



న్యూఢిల్లీ: పని ప్రదేశాల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచేందుకు రంగాల వారీ విధానాన్ని అనుసరించడం ఫలితాన్నిస్తుందని సీఐఐ సూచించింది. తయారీ రంగంలో అధిక ఉద్యోగులకు అవకాశం ఉన్న ఉప విభాగాలు మహిళలకు ప్రధానంగా ఉపాధినిచ్చేవని పేర్కొంది. అలాగే, నిర్మాణ రంగం, కమ్యూనికేషన్స్, ఆర్థిక సేవల రంగాల్లోనూ మహిళలకు ఎక్కువ ఉపాధి అవకాశాలున్నాయని సూచించింది. మహిళా ఉద్యోగుల ప్రాతినిధ్యం పెరగడం ఇరు వర్గాలకూ ప్రయోజనకరమని, దేశ ఆర్థిక వృద్ధి అవకాశాలు పెరగడంతోపాటు సామాజిక ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేందుకు సాయపడుతుందని అభిప్రాయపడింది. మహిళలను ఉద్యోగాల దిశగా ప్రోత్సహించేందుకు, పని ప్రదేశాల్లో అనుకూల వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని సూచించింది. మహిళా కార్మిక శక్తి 2015–16లో 27.4 శాతం ఉండగా, గత రెండు దశాబ్దాలుగా వారి భాగస్వామ్యం తగ్గిపోతున్న విషయమై ఆందోళన వ్యక్తం చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 5-3-2018

విజయవాడ	340-00
గోదావరి	340-00
విశాఖ	350-00
వరంగల్	347-00
చిత్తూరు	378-00
చెన్నై	385-00
ముంబై	390-00
నమక్కల్	370-00
4-3-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	345-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.05
బెంగళూరు	375-00
కోల్‌కతా	380-00
ఢిల్లీ	350-00

ఆధార్ అనుసంధాన గడువు పొడిగించాలి

బ్యాంకు ఖాతాలపై ప్రభుత్వానికి అసోచామ్ సూచన



న్యూఢిల్లీ: ఆధార్‌తో బ్యాంకు ఖాతాల అనుసంధానికి ఇచ్చిన గడువును పొడిగించాలని, ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకులకు ఇది అవసరమని పరిశ్రమల సమాఖ్య అసోచామ్ సూచించింది. పీఎన్‌బీ స్కామ్ అనంతరం ప్రభుత్వరంగ బ్యాంకుల (పీఎస్‌బీ) సిబ్బంది తమ ప్రధాన వ్యాపారాన్ని కాపాడుకునే క్రమంలో ఉన్నారని, ఆధార్ అనుసంధానం కోసం వారిపై ఒత్తిడి తీసుకురావడం తగదని అభిప్రాయపడింది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ తాలూకు ప్రభావాల నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ ఇంకా బయటకు రాలేదని, మార్చి 31 తర్వాత బ్యాంకు ఖాతాలు నిర్వహణ రహితంగా మారిపోయే రూపంలో ఎదురయ్యే మరో సవాలుకు సిద్ధంగా లేదని పేర్కొంది. ఆధార్‌తో బ్యాంకు ఖాతాల అనుసంధానానికి ఈ ఏడాది మార్చి 31 వరకు గడువు ఉంది. అయితే, కస్టమర్ల ఖాతాలన్నింటినీ మార్చి 31లోపు ఆధార్‌తో అనుసంధానించడం సవాలుతో కూడుకున్నదని, కనుక గడువును పొడిగించాల్సిన అవసరం ఉందని సూచించింది. ఆధార్‌తో అనుసంధాన లక్ష్యాన్ని చేరేకంటే ముందుగానే బ్యాంకులు ప్రస్తుత సంక్షోభం నుంచి బయటపడేందుకు అవకాశం ఇవ్వాలని కోరింది.

2017లో అమ్ముడుపోని ఇళ్లు 4.4 లక్షలు

హైదరాబాద్ సహా ఏడు పెద్ద పట్టణాల్లో పరిస్థితి
- జేఎల్ఎల్ ఇండియా నివేదిక



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా హైదరాబాద్ సహా ఏడు అతిపెద్ద పట్టణాల్లో 2017 ఆఖరుకు 4.4 లక్షల నివాస భవనాలు అమ్ముడుపోకుండా మిగిలి ఉన్నాయని ప్రాపర్టీ కన్సల్టెంట్ జేఎల్ఎల్ ఇండియా తెలిపింది. వీటిలో ఒక్క ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలోనే అమ్ముడు కాని 1.5 లక్షల ఫ్లాట్లు ఉన్నాయని పేర్కొంది. ఇలా అధిక సంఖ్యలో మిగిలిపోవడం వల్ల ధరలు స్థిరంగా ఉన్నాయని విశ్లేషించింది. జేఎల్ఎల్ ఇటీవల నిర్వహించిన సర్వేలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ ఎన్‌సీఆర్, చెన్నై, పుణే, బెంగళూరు, కోల్‌కతా ఈ జాబితాలో ఉన్నాయి. ఢిల్లీలో నికరంగా 1,50,654 యూనిట్లు అమ్మకం కాకుండా ఉండిపోగా, చెన్నైలో విక్రయం కాకుండా మిగిలిపోయిన వాటిలో ఎక్కువ యూనిట్లు నిర్మాణం పూర్తి చేసుకున్నవేనని జేఎల్ఎల్ తెలిపింది. కోల్‌కతాలో అతి తక్కువగా 26,000 యూనిట్లే మిగిలిపోయాయి. ఆ తర్వాత హైదరాబాద్ కింది నుంచి రెండో స్థానంలో ఉంది. ఇక్కడ విక్రయం కాని ఇళ్లు, ఫ్లాట్లు 28,000. ముంబైలో 86,000, బెంగళూరులో 70,000, పుణేలో 36,000 మిగిలిపోయాయి. రెరా, డీమోనిటైజేషన్, జీఎస్టీ వల్ల నిర్మాణ కార్యకలాపాలు మందగించడంతోపాటు డిమాండ్ కూడా తగ్గినట్టు జేఎల్ఎల్ పేర్కొంది. ధరలు స్థిరంగా ఉండడంతో ఈ ఏడాది ద్వితీయార్ధంలో విక్రయాలు క్రమంగా పుంజుకుంటాయని అంచనా వేస్తున్నట్టు తెలిపింది.

మనీలా విమానాశ్రయ విస్తరణ ప్రాజెక్టుకు జీఎంఆర్ పోటీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్–మెగావైడ్‌ల కన్సార్షియం ఫిలిప్పైన్స్ రాజధాని మనీలాలోని నినోయ్ అక్వినో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ విస్తరణ ప్రాజెక్టుకు పోటీ పడుతోంది. 3 బిలియన్ డాలర్లతో ఈ మేరకు బిడ్ దాఖలు చేశాయి. ఎయిర్‌పోర్ట్ విస్తరణ పూర్తి అయితే 35 శాతం అదనంగా.. అంటే రోజుకు 1,000 విమానాలు రాకపోకలు సాగిస్తాయి. ఏడాదికి 7.2 కోట్ల ప్రయాణికులకు సేవలు అందించే వీలవుతుంది. 2017లో నినోయ్ అక్వినో విమానాశ్రయం నుంచి 3.7 కోట్ల మంది ప్రయాణించారు.

60 సంస్థలు, వ్యక్తుల ఆస్తుల విక్రయాలపై నిషేధం

పీఎన్‌బీ స్కామ్‌లో ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలు



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) రూ.12,700 కోట్ల రూపాయల స్కామ్‌లో జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) కీలక ఆదేశాలు ఇచ్చింది. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, వారికి సంబంధించిన కంపెనీలు, పీఎన్‌బీకు చెందిన పలువురు ఉద్యోగులు, లిమిటెడ్ పార్ట్‌నర్‌షిప్ కంపెనీలు ఇలా 60కుపైగా సంస్థలు, వ్యక్తులకు చెందిన ఆస్తులు విక్రయించకుండా నిషేధం విధిస్తూ ఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వులు జారీ చేసినట్టు కార్పొరేట్ వ్యవహారాల శాఖ వెల్లడించింది. పీఎన్‌బీ స్కామ్ నేపథ్యంలో కంపెనీల చట్టంలోని పలు సెక్షన్ల కింద కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు చేయగా ఎక్స్‌పార్టీ ఆదేశాలు జారీ చేసింది. నిధులు, ఆస్తుల బదిలీ, వినియోగం, వెనక్కి తీసుకోవడంపై నిషేధం విధించింది. తదుపరి విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది. ఆస్తులు విక్రయంపై నిషేధానికి గురైన వాటిలో గీతాంజలి జెమ్స్, గిల్లి ఇండియా, నక్షత్ర బ్రాండ్స్, ఫైర్‌స్టార్ డైమండ్, సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లర్ డైమండ్ తదితర కంపెనీలు ఉన్నాయి.

గత వారం హీరోలు

స్టాక్స్	1 ముగింపు	22 ముగింపు	మార్పు(%)
టీవీఎస్ మోటార్	677	630	7
అశోక్ లేలాండ్	141	132	6
అరబిందో ఫార్మా	624	587	6
టాటా స్టీల్	675	638	6
యూపీఎల్	715	677	5
గ్రాసిమ్ ఇండస్ట్రీస్	1,167	1,110	5
డా.రెడ్డీస్ ల్యాబ్స్	2,228	2,121	5
టాటా గ్లోబల్ బేవరేజ్	275	262	5
ఐటీసీ	381	364	5
భారత్ ఎలక్ట్రానిక్స్	153	146	5

ఎందుకు పెరిగాయంటే...

ఫిబ్రవరి నెల వాహన విక్రయాలు పెరగడంతో టీవీఎస్ 7% ఎగసింది. గత నెలలో వాహన విక్రయాలు 29% వృద్ధి చెందడంతో అశోక్ లేలాండ్ 6% లాభపడింది. రూ.12,800కోట్ల రైట్స్ ఇష్యూ విజయవంతమైన నేపథ్యంలో టాటా స్టీల్ షేర్ 6 శాతం లాభపడింది. వేల్యూ బయింగ్ చోటు చేసుకోవడంతో అరబిందో ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ వంటి ఫార్మా షేర్లు 6–5% రేంజ్‌లో పెరిగాయి. రూ.945 టార్గెట్ ధరగా కొనచ్చు రేటింగ్‌ను మోతిలాల్ ఓస్వాల్ ఇవ్వడంతో యూపీఎల్ 5% లాభపడింది.

గత వారం జీరోలు

స్టాక్స్	1 ముగింపు	22 ముగింపు	మార్పు(%)
వక్రంగీ	155	200	-23
పీఎన్‌బీ	101	115	-12
అపోలో హాస్పిటల్	1,182	1,245	-5
ఐసీఐసీఐ బ్యాంక్	305	318	-4
సీమెన్స్	1,154	1,199	-4
ఎస్‌బీఐ	263	273	-4
బ్యాంక్ ఆఫ్ బరోడా	138	143	-3
గెయిల్	453	466	-3
పవర్ ఫైనాన్స్ కార్ప్	102	105	-2
హెచ్‌పీసీఎల్	377	384	-2

ఎందుకు తగ్గాయంటే...


వక్రంగీ నష్టాలు గత వారం కూడా కొనసాగాయి. ఈ కంపెనీ ట్రేడింగ్‌పై సెబీ దృష్టి సారించిందన్న వార్తల నేపథ్యంలో ఈ షేర్ 23 శాతం పతనమైంది. బ్యాంక్ రుణ మోసాలు వెలుగులోకి వస్తుండటంతో పీఎన్‌బీ, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లతో పాటు ప్రైవేట్ రంగానికి చెందిన ఐసీఐసీఐ బ్యాంక్ కూడా 4% నష్టపోయింది. లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో అపోలో హాస్పిటల్స్ 5% తగ్గింది.

కీలక మద్దతు 33,550-అవరోధం 34,320

మార్కెట్ పంచాంగం


ఫిబ్రవరి తొలివారంలో ప్రపంచ మార్కెట్లను బెంబేలెత్తించిన అమెరికా సూచీలు...తదుపరి కుదుటపడి సాంకేతికంగా కీలకమైన 61.8 శాతం రిట్రేస్‌మెంట్ ర్యాలీని జరపగలిగినప్పటికీ, గతవారం మళ్లీ ఆ మార్కెట్‌తో పాటు ఇతర ప్రపంచ ప్రధాన మార్కెట్లు కూడా ఒక కుదుపునకు లోనయ్యాయి. ఈ ఏడాది అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ నాలుగు దఫాలు వడ్డీ రేట్లు పెంచవచ్చన్న సంకేతాలు ఫెడ్ అధికారుల నుంచి వెల్లడికావడం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్...ఉక్కు, అల్యూమినియం లోహాలపై దిగుమతి సుంకాన్ని ప్రతిపాదించి...ప్రపంచ దేశాల మధ్య వాణిజ్య యుద్ధానికి తెరతీయడం వంటి అంశాలు ప్రస్తుతం ఈక్విటీ మార్కెట్‌ను అనిశ్చితిలోకి పడదోసాయి. వీటికి తోడు మన దేశానికి సంబంధించి...దీర్ఘకాలిక ఈక్విటీ పెట్టుబడులపై బడ్జెట్లో ప్రతిపాదించిన పన్ను, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం వంటి అంశాలు ఎలాగూ వున్నాయి. అయితే ఫిబ్రవరి 6 నాటి కనిష్టస్థాయిల్ని ఇప్పటివరకూ సెన్సెక్స్, నిఫ్టీలు నిలుపుకోగలగడం, ఇండెక్స్ హెవీవెయిట్ షేర్లయిన రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీలు గరిష్టస్థాయిలోనే స్వల్ప హెచ్చుతగ్గులకు లోనుకావడం సానుకూలాంశం. వీటిలో కనీసం రెండు షేర్లయినా భారీగా తగ్గితేనే మన మార్కెట్ మరింత పతనమయ్యే ప్రమాదం వుంటుంది. లేకపోతే కొన్ని రోజులపాటు గత మూడు వారాల్లానే 3 శాతం శ్రేణిలో కదలవచ్చు.

సెన్సెక్స్ సాంకేతికాలు..



మార్చి 1తో ముగిసిన నాలుగురోజుల ట్రేడింగ్‌వారంలో గత మార్కెట్ పంచాంగంలో సూచించిన అంచనాలకు అనుగుణంగా 34,610 గరిష్టస్థాయిని చేరినంతనే అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొని 34,015 పాయింట్ల కనిష్టస్థాయికి బీఎస్ఈ సెన్సెక్స్ పడిపోయింది. చివరకు అంతక్రితంవారంతో 95 పాయింట్ల స్వల్పనష్టంతో 34,047 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం కూడా 34,100 స్థాయి సెన్సెక్స్‌కు ఈక్విలిబ్రియమ్‌గా వ్యవహరించవచ్చు. ఈ స్థాయి ఎగువన బలం, దిగువన బలహీనతల్ని సెన్సెక్స్ ప్రదర్శించవచ్చని టెక్నికల్ చార్టులు సూచిస్తున్నాయి. ఈ సోమవారం గ్యాప్‌డౌన్‌తో మొదలైతే సెన్సెక్స్ 33,830 వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతు దిగువన సెన్సెక్స్ మొదలైతే 33, 550 పాయింట్ల వద్ద లభించబోయే మద్దతు మార్కెట్‌కు కీలకమైనది. ఈ స్థాయిని కోల్పోతే డౌన్‌ట్రెండ్ వేగవంతమై, వచ్చే కొద్దిరోజుల్లో 32,600 వరకూ పతనం కొనసాగే ప్రమాదం వుంటుంది. ఈ వారం రెండో మద్దతుస్థాయిని పరిరక్షించుకున్నా, ఈ సోమవారం పాజిటివ్‌గా మొదలైనా 34,320 వద్ద తక్షణ అవరోధం కలగవచ్చు. గతవారం ఇదేస్థాయి అధిక ట్రేడింగ్ పరిమాణంతో మార్కెట్‌ను పడదోసినందున, ఈ వారం ఈ నిరోధస్థాయి కీలకం. ఈ స్థాయి ఎగువన ముగిస్తే 34,610–34,670 శ్రేణిని మరోదఫా చేరవచ్చు.

నిఫ్టీ కీలక మద్దతు 10,300–నిరోధం 10,535



క్రితం వారం కాలమ్‌లో సూచించిన రీతిలోనే 10,615–10,640 శ్రేణి వరకూ పెరిగిన ఎన్ఎస్ఈ నిఫ్టీ.. ఆ శ్రేణి వద్ద గట్టి అవరోధం చవిచూడటంతో 10,447 కనిష్టానికి పడిపోయింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 33 పాయింట్ల నష్టంతో 10,458 వద్ద ముగిసింది. ఈ సోమవారం నెగెటివ్‌గా మార్కెట్ మొదలైతే నిఫ్టీకి 10,350 పాయింట్ల వద్ద తొలి మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతుస్థాయికి దిగువనే నిఫ్టీ ప్రారంభమైతే 10,300 పాయింట్ల వద్ద లభించబోయే మద్దతు కీలకమైనది. ఈ స్థాయిని ముగింపులో కోల్పోతే తదుపరి రోజుల్లో 10,075 వరకూ క్షీణత కొనసాగవచ్చు. ఈ వారం రెండో మద్దతుస్థాయిని పరిరక్షించుకోగలిగినా, మార్కెట్ పాజిటివ్‌గా మొదలైనా 10,535 వద్ద గట్టి అవరోధం ఏర్పడవచ్చు. ఈ స్థాయి పైన స్థిరపడితే మరోదఫా 10,615–10,640 శ్రేణి వరకూ పెరగవచ్చు.

– పి. సత్యప్రసాద్

ఎల్‌టీసీజీ పన్ను.. ఇన్వెస్టర్లు ఏం చేయాలి?

నేను సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో 2,3 ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. అయితే దీర్ఘకాల మూలధన లాభాల పన్ను మళ్లీ వచ్చింది కదా ! అందుకని ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఉన్న ఇన్వెస్ట్‌మెంట్స్ అన్నింటినీ అమ్మేసి, తిరిగి వేరే మ్యూచువల్ ఫండ్స్ కొనుగోలు చేయమంటారా ? లేకుంటే సిప్‌లను అలాగే కొనసాగించమంటారా ?

– నిరంజన్, హైదరాబాద్

దీర్ఘకాల మూలధన లాభాల పన్ను(ఎల్‌టీసీజీ) మళ్లీ వచ్చింది. అయితే ఈ పన్ను కారణంగా మీ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ అన్నింటినీ అమ్మేసి, మళ్లీ కొనుగోలు చేయనవసరం లేదు. ఈ ఏడాది జనవరి 31 వరకూ మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌పై మీకు వచ్చిన లాభాలపై ఎలాంటి పన్ను భారం ఉండదు. ఆ తర్వాతి కాలంలో వచ్చిన లాభాలపై మాత్రమే పన్ను ఉంటుంది. మీరు ఏప్రిల్ 1 తర్వాత విక్రయిస్తేనే, పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఎల్‌టీసీజీ విధింపు అందరి ఇన్వెస్టర్లను నిరాశపరిచింది. అయితే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోని మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌పై వచ్చే లాభాలపై ఎల్‌టీసీజీ చాలా స్వల్పం. మీరు ఇన్వెస్ట్ చేసిన ఫండ్స్ మంచి పనితీరు కనబరుస్తున్నట్లయితే నిశ్చింతగా ఉండండి. మీ సిప్‌లను కొనసాగించండి. ఎల్‌టీసీజీ విధింపు కారణంగా ఎలాంటి మార్పులు, చేర్పులు చేయకండి.

మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి ఏమేం చార్జీల భారం ఇన్వెస్టర్లపై ఉంటుంది ? బయటకు కనిపించని చార్జీలు ఏమైనా ఉంటాయా?

– రాజేశ్, విజయవాడ

మ్యూచువల్ ఫండ్స్ చార్జీలన్నీ పారదర్శకంగానే ఉంటాయి. బయటకు కనిపించని చార్జీల భారం ఏమీ ఇన్వెస్టర్లపై ఉండదు. మీరు మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లు కొనుగోలు చేసేటప్పుడు ఒకే ఒక చార్జీ–ఎక్స్‌పెన్స్ రేషియో(దీంట్లోనే అన్ని చార్జీలూ కలసి ఉంటాయి) ఉంటుంది. ఈ ఎక్స్‌పెన్స్ రేషియోలోనే మేనేజ్‌మెంట్ ఫీజు, విక్రయాల వ్యయాలు, నిర్వహణ చార్జీలు, రిజిస్ట్రార్ ఫీజు, కస్టోడియన్ ఫీజు, ఇతర వ్యయాలు కలసి ఉంటాయి. ఒకే మ్యూచువల్ ఫండ్‌కు సంబంధించిన రెగ్యులర్ ప్లాన్‌కు, డైరెక్ట్ ప్లాన్‌కు ఈ ఎక్స్‌పెన్స్ రేషియో వేర్వేరుగా ఉండొచ్చు.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

సాధారణంగా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌కు ఎక్స్‌పెన్స్ రేషియో 2.5 శాతం నుంచి 2.65 శాతం రేంజ్‌లో ఉంటుంది. ఇదే మ్యూచువల్ ఫండ్ డైరెక్ట్ ప్లాన్‌కు అయితే ఎక్స్‌పెన్స్ రేషియో 50–75 బేసిస్ పాయింట్లు తక్కువగా ఉంటుంది. డెట్ మ్యూచువల్ ఫండ్స్‌కు ఎక్స్‌పెన్స్ రేషియో ఇంకా తక్కువగా ఉంటుంది. ఇక తర్వాత ఎగ్జిట్ లోడ్ ఉంటుంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌ను మీరు కొనుగోలు చేసిన ఏడాదిలోపే విక్రయిస్తే ఎగ్జిట్ లోడ్ చెల్లించాల్సి ఉంటుంది. వివిధ రకాల ఫండ్స్‌కు ఈ టైమ్ పీరియడ్ వేర్వేరుగా ఉంటుంది. డెట్ ఫండ్స్ యూనిట్లను కొనుగోలు చేసిన నెల రోజులు, మూడు నెలలలోపు విక్రయిస్తే, వాటిపై కూడా ఎగ్జిట్ లోడ్ ఉంటుంది. లిక్విడ్ ఫండ్స్‌కు అయితే ఎలాంటి ఎగ్జిట్ లోడ్ ఉండదు. ఎగ్జిట్ లోడ్ మళ్లీ మ్యూచువల్ ఫండ్‌లోకే వస్తుంది. ఇది మ్యూచువల్ ఫండ్ సంస్థకు వెళ్లదు. మ్యూచువల్ ఫండ్‌లోని ఇతర ఇన్వెస్టర్లకు ఇది ప్రయోజనం కలిగించే విషయమే.

నా వయసు 25 సంవత్సరాలు. ఇటీవలే ఉద్యోగంలో చేరాను. మార్కెట్ గరిష్ట స్థాయిల్లో ఉన్నప్పుడు మాలాంటి యువ ఇన్వెస్టర్లు ఇన్వెస్ట్ చేయవచ్చా ? లేక మార్కెట్ పడేంత వరకూ ఎదురు చూడాలా?

– అనంత్, విశాఖపట్టణం

మీరు యువకులు. టైమ్ అంతా మీ చెంతనే ఉంటుంది. అందుకని ముందుగా ఏదైనా కన్సర్వేటివ్ ఫండ్‌ను ఎంచుకోండి. దాంట్లో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేయడం కొనసాగించండి. ఒకేసారి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయకండి. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేస్తే, దీర్ఘకాలంలో మంచి రాబడులు పొందే అవకాశాలు అధికంగా ఉంటాయి. మార్కెట్ గరిష్ట స్థాయిలో ఉందా, పతన బాటలో ఉందా అన్న విషయాన్ని పక్కన బెట్టి, మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయండి. 2016, 2017ల్లో కూడా మార్కెట్ గరిష్ట స్థాయిల్లోనే ఉంది. చాలా మంది ఇన్వెస్టర్లు మార్కెట్ పతనమైన తర్వాత ఇన్వెస్ట్ చేద్దామనే ఉద్దేశంతో ఎదురు చూశారు. కానీ, మార్కెట్ పడకపోగా, మరింతగా పెరిగింది. దీర్ఘకాలం దృష్ట్యా చూస్తే, మార్కెట్ పతనం జరగవచ్చు లేదా జరగకపోవచ్చు. మీరు యువకులు కాబట్టి, మార్కెట్ అంటే భయపడవద్దు. మీకు మరో ఐదేళ్లపాటు అవసరం లేని సొమ్ములనే షేర్లలోనూ, మ్యూచువల్ ఫండ్స్‌లోనూ ఇన్వెస్ట్ చేయాలి. ముందుగా బ్యాలెన్స్‌డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ప్రారంభించండి. ఇలా మూడేళ్లపాటు క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసిన తర్వాత మీకు మ్యూచువల్ ఫండ్స్, ఇన్వెస్ట్‌మెంట్స్‌పై తగిన అవగాహన వస్తుంది. అప్పుడు మీరు మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్‌కు సంబంధించి స్వయంగా నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా ఇతరులకు సలహాలు ఇచ్చే స్థాయికి వస్తారు. సొంత ఇల్లు సమకూర్చుకోవడం, పిల్లల ఉన్నత విద్యావసరాలు, రిటైర్మెంట్ నిధి ఏర్పాటు తదితర దీర్ఘకాల ఆర్థిక అవసరాల కోసం చిన్న వయసు నుంచే ఇన్వెస్ట్ చేయడం ప్రారంభిస్తే, దీర్ఘకాలంలో మంచి రాబడులు పొందవచ్చు. మరోవైపు టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ కూడా తీసుకోవాలి. సాధారణ జీవిత బీమా పాలసీలతో పోల్చితే టర్మ్ బీమా పాలసీల్లో చెల్లించాల్సిన ప్రీమియమ్ తక్కువగానూ, బీమా కవరేజ్ అధికంగానూ ఉంటుంది.



తాల్ ర్యాపిడ్ చెస్ టోర్నీ విజేత ఆనంద్

భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ ఈ ఏడాది తొలి అంతర్జాతీయ టైటిల్ సొంతం చేసుకున్నాడు. మాస్కోలో జరిగిన ప్రతిష్టాత్మక తాల్ స్మారక టోర్నమెంట్‌లో 48 ఏళ్ల ఆనంద్ ర్యాపిడ్ విభాగంలో చాంపియన్‌గా నిలిచాడు. పది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య లీగ్ పద్ధతిలో జరిగిన ఈ టోర్నీలో ఆనంద్ తొమ్మిది రౌండ్‌లకుగాను ఆరు పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. నాలుగు గేముల్లో గెలిచి, మరో నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకున్న ఆనంద్ ఒక గేమ్‌లో ఓడిపోయాడు.

రిజ్వీ గురి అదిరె...



రిజ్వీ



జీతూ రాయ్

అంతర్జాతీయ షూటింగ్ సీజన్ తొలి టోర్నమెంట్‌లో తొలి రోజే భారత షూటర్లు అదరగొట్టారు. మెక్సికోలోని గ్వాడలహారా నగరంలో జరుగుతున్న ప్రపంచకప్‌లో మొదటిరోజు భారత షూటర్ల గురికి మూడు పతకాలు లభించాయి. కెరీర్‌లో తొలి ప్రపంచకప్ ఆడుతోన్న 23 ఏళ్ల ఉత్తరప్రదేశ్ షూటర్ షాజర్ రిజ్వీ 'ప్రపంచ రికార్డు' ప్రదర్శనతో పసిడి పతకం సొంతం చేసుకోగా... 18 ఏళ్ల బెంగాలీ అమ్మాయి మెహులీ ఘోష్ కాంస్య పతకం కైవసం చేసుకొని ఔరా అనిపించింది. స్టార్ షూటర్ జీతూ రాయ్ తన సత్తా చాటుతూ కాంస్యాన్ని దక్కించుకొని తన ఖాతాలో మరో అంతర్జాతీయ పతకాన్ని జమ చేసుకున్నాడు.



మెహులీ

- 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో ప్రపంచ రికార్డు
- బరిలో దిగిన తొలి ప్రపంచకప్‌లోనే పసిడి పతకం
- కాంస్యాలు నెగ్గిన జీతూ రాయ్, మెహులీ ఘోష్

గ్వాడలహారా (మెక్సికో): ఎలాంటి అంచనాలు లేకుండా బరిలోకి దిగిన తొలి ప్రపంచకప్‌లోనే భారత యువ పిస్టల్ షూటర్ షాజర్ రిజ్వీ అద్వితీయ ప్రదర్శన చేశాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో స్వర్ణ పతకం నెగ్గడంతోపాటు కొత్త ప్రపంచ రికార్డును సృష్టించాడు. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఫైనల్లో మీరట్‌కు చెందిన రిజ్వీ 242.3 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో 241.8 పాయింట్లతో తొమొయుకి మత్సుదా (జపాన్) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును రిజ్వీ బద్దలు కొట్టాడు. భారత్‌కే చెందిన స్టార్ షూటర్ జీతూ రాయ్ 219 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని గెల్చుకోగా... క్రిస్టియన్ రీట్జ్ (జర్మనీ–239.7 పాయింట్లు) రజత పతకం సాధించాడు. మరో భారత షూటర్ ఓంప్రకాశ్ 198.4 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు. 33 మంది షూటర్లు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత సాధించారు. క్వాలిఫయింగ్‌లో క్రిస్టియన్ రీట్జ్ (588 పాయింట్లు) తొలి స్థానంలో నిలువగా... రిజ్వీ (579 పాయింట్లు), జీతూ రాయ్ (578 పాయింట్లు), ఓంప్రకాశ్ (576 పాయింట్లు) వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాలను పొంది ఫైనల్‌కు చేరారు.

మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత్ నుంచి ముగ్గురు షూటర్లు మెహులీ ఘోష్, అపూర్వీ చండేలా, అంజుమ్ మౌద్గిల్ ఫైనల్‌కు చేరారు. తొలి ప్రపంచ కప్ ఆడుతోన్న మెహులీ ఘోష్ 228.4 పాయింట్లు సాధించి కాంస్య పతకాన్ని గెల్చుకుంది. లారా జార్జెటా కొమన్ (రొమేనియా–251.5 పాయింట్లు) స్వర్ణం... జు హాంగ్ (చైనా–251 పాయింట్లు) రజతం సాధించారు. గతేడాది జాతీయ సీనియర్ చాంపియన్‌షిప్‌లో మెహులీ ఏకంగా 8 స్వర్ణ పతకాలు సాధించి వెలుగులోకి వచ్చింది. భారత్‌కే చెందిన అంజుమ్ 208.6 పాయింట్లతో నాలుగో స్థానాన్ని పొందగా... అపూర్వీ 144.1 పాయింట్లతో ఏడో స్థానంతో సరిపెట్టుకుంది.

ఆసీస్ విజయం నేడే ఖాయం

దక్షిణాఫ్రికా లక్ష్యం 417: ప్రస్తుతం 293/9



మార్క్‌రమ్

డర్బన్: తొలి టెస్టులో దక్షిణాఫ్రికాపై ఆస్ట్రేలియా గెలుపు ఖాయమైంది. కాకపోతే... ప్రత్యర్థి చివరి వికెట్ పడగొట్టలేక ఆ జట్టు ఐదో రోజు కూడా మైదానంలోకి దిగాల్సి వస్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 213/9తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 227కు ఆలౌటైంది. అనంతరం 417 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన సఫారీ జట్టు నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 9 వికెట్లకు 293 పరుగులు చేసింది. చేతిలో ఒక వికెట్ మిగిలి ఉండగా... విజయానికి మరో 124 పరుగులు దూరంలో నిలిచింది. ప్రధాన బ్యాట్స్‌మెన్ ఎల్గర్ (9), ఆమ్లా (8), డివిలియర్స్ (0), కెప్టెన్ డుప్లెసిస్ (4)ల వైఫల్యం కారణంగా ఒక దశలో దక్షిణాఫ్రికా 4/49 స్కోరుతో దయనీయస్థితిలో నిలిచింది. ఈ దశలో ఓపెనర్ మార్క్‌రమ్ (143; 19 ఫోర్లు) పోరాట పటిమ చూపాడు. అద్భుత శతకం సాధించిన అతడు తొలుత డిబ్రుయెన్ (36)తో కలిసి 87 పరుగులు, కీపర్ డికాక్ (81 బ్యాటింగ్; 11 ఫోర్లు) అండగా ఆరో వికెట్‌కు 147 పరుగులు జోడించి జట్టు పరువు నిలిపాడు. వీరిని విడగొట్టేందుకు ఆసీస్ బౌలర్లు తీవ్ర ప్రయత్నాలు చేశారు. మిచెల్ మార్ష్ బౌలింగ్‌లో ఎట్టకేలకు మార్క్‌రమ్ అవుటయ్యాడు. తర్వాత స్టార్క్ (4/74) విజృంభించి ఒకే ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టాడు. వెలుతురు తగ్గడంతో చివరి ఓవర్లను స్మిత్, లయన్ వేయాల్సి వచ్చింది. డికాక్, మోర్కెల్ (27 బంతుల్లో 0 బ్యాటింగ్) వికెట్ ఇవ్వకుండా 9 ఓవర్లు పైగా బ్యాటింగ్ చేశారు.

ఒక్క పతకం మార్చేసింది!

జిమ్నాస్ట్ అరుణకు సీఎం కేసీఆర్ రూ. 2 కోట్ల నజరానా

సాక్షి, హైదరాబాద్: 'ఒక్క ఐడియా జీవితాన్ని మార్చేస్తుంది' ఇది బాగా పాపులర్ అయిన టెలికామ్ యాడ్. ఇప్పుడు ఈ యాడ్‌కు సరిగ్గా సరిపోయేలా... ఒక్క పతకం ఓ జిమ్నాస్ట్‌ను ఆకాశానికి ఎత్తేసింది. కోటీశ్వరురాలిని చేసేసింది. ఆ జిమ్నాస్ట్ బుద్దా అరుణ రెడ్డి కాగా... ఆ పతకం మెల్‌బోర్న్‌లో నెగ్గిన కాంస్యం. ఆమె సాధించిన కాంస్యంతో కాసులు... రాశులు కురుస్తున్నాయి. 14 ఏళ్లుగా ఆమె పడుతున్న కష్టాలకు తగిన ప్రతిఫలాలు లభిస్తున్నాయి. తెలంగాణకు చెందిన యువ జిమ్నాస్ట్ అరుణ రెడ్డి ఇటీవలే ఆస్ట్రేలియా ఆతిథ్యమిచ్చిన ప్రపంచకప్ జిమ్నాస్టిక్స్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం గెలిచింది. ఈ టోర్నమెంట్ చరిత్రలో పతకం నెగ్గిన తొలి భారతీయ జిమ్నాస్ట్‌గా ఆమె గుర్తింపు పొందింది. కాంస్యంతో కొత్త చరిత్ర సృష్టించిన ఆమెను శనివారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) లాల్‌బహదూర్ స్టేడియంలో ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా 'శాట్స్' తరపున ప్రోత్సాహకంగా అరుణకు రూ. 20 లక్షల చెక్‌ను తెలంగాణ క్రీడాశాఖ మంత్రి పద్మారావు అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన హైదరాబాద్ జిమ్నాస్టిక్స్ సంఘం అధ్యక్షుడు, సువర్ణ అవనిస్ కంపెనీ యజమాని సురేందర్ ఆమెకు రూ. 50 లక్షల విలువైన విలాసవంతమైన విల్లాను బహుమతిగా ఇచ్చారు. తమ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. శనివారం జరిగిన మరో కార్యక్రమంలో కొన్నాళ్లుగా అరుణకు చేయూతనిస్తోన్న ఎథిక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ తమ వంతుగా రూ. 2 లక్షలు నగదు పురస్కారాన్ని అందజేసింది. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఊహించనిరీతిలో ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. ఆదివారం ఆమె తన తల్లి సుభద్ర, సోదరి పావని రెడ్డిలతో ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా అరుణ ఘనతను కొనియాడిన ఆయన రూ. 2 కోట్ల నజరానా ప్రకటించారు. ఆమె కోచ్ బ్రిజ్ కిశోర్‌కు కూడా ఆర్థిక సాయం చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో క్రీడల మంత్రి పద్మారావు, శాట్స్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అరుణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెలంగాణ సీఎం కేసీఆర్. చిత్రంలో క్రీడల మంత్రి పద్మారావు, శాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి

వీర విహారి



- భారత్ 'బి' గెలుపు
- దేవధర్ ట్రోఫీ

ధర్మశాల: దేవధర్ ట్రోఫీ వన్డే టోర్నీలో భారత్ 'బి' శుభారంభం చేసింది. ఆంధ్ర బ్యాట్స్‌మన్ హనుమ విహారి (76 బంతుల్లో 95 నాటౌట్; 16 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగడంతో భారత్ 'బి' జట్టు 8 వికెట్లతో భారత్ 'ఎ'పై నెగ్గింది. మొదట భారత్ 'ఎ' 41.2 ఓవర్లలో 178 పరుగులకే ఆలౌటైంది. 'ఎ' జట్టు స్కోరు 51/4 వద్ద ఉన్నపుడు వర్షంతో ఆటకు అంతరాయం కలిగింది. దీంతో మ్యాచ్‌ను 43 ఓవర్లకు కుదించారు. 'ఎ' జట్టులోనూ ఆంధ్ర ఆటగాడు రికీ భుయ్ (107 బంతుల్లో 78; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేశాడు. ధర్మేంద్ర సింగ్ జడేజా 4, ఉమేశ్ యాదవ్, జయంత్ యాదవ్, సిద్ధార్థ్ కౌల్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 'బి' లక్ష్యాన్ని 43 ఓవర్లలో 175 పరుగులుగా నిర్ణయించారు. ఈ లక్ష్యాన్ని ఆ జట్టు 26.2 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి అధిగమించింది. ఈశ్వరన్ (43), కెప్టెన్ అయ్యర్ (28 నాటౌట్) మెరుగ్గా ఆడారు. నేడు జరిగే పోరులో భారత్ 'బి'తో విజయ్ హజారే ట్రోఫీ విజేత కర్ణాటక జట్టు తలపడుతుంది.

'డ్రా'తో సరిపెట్టుకున్నారు

1-1తో ముగిసిన భారత్, ఇంగ్లండ్ మ్యాచ్ • అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీ



ఇఫో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో భారత జట్టు రెండో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. ఇంగ్లండ్‌తో ఆదివారం ఇక్కడ జరిగిన పోరులో తుదికంటా ఆధిపత్యం చలాయించిన భారత్ చివరకు 1–1తో 'డ్రా'తో సరిపెట్టుకుంది. గత మ్యాచ్‌లో రియో ఒలింపిక్స్ చాంపియన్ అర్జెంటీనా చేతిలో 2–3తో ఓటమి పాలైన సర్దార్ సింగ్ సేన ఈ మ్యాచ్‌లో ఆకట్టుకుంది. శైలానంద్ లక్రా (14వ ని.) తొలి అంతర్జాతీయ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యం అందించగా... డిఫెండర్లు ప్రత్యర్థిని నిలువరించడంతో ఆట 53వ నిమిషం వరకు టీమిండియా ఆధిపత్యం కొనసాగింది. మ్యాచ్ ముగియడానికి ఏడు నిమిషాల ముందు ఇంగ్లండ్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను మార్క్ గ్లెగోర్న్ గోల్‌గా మలచడంతో స్కోరు 1–1తో సమమైంది. అనంతరం ఇరు జట్లు హోరాహోరీగా పోరాడినా మరో గోల్ చేయలేకపోవడంతో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. ఈ మ్యాచ్‌లో భారత్‌కు 9 పెనాల్టీ కార్నర్‌లు లభించినా వరుణ్ కుమార్, అమిత్ రొహిదాస్ వాటిని గోల్స్‌గా మలచడంలో విఫలమయ్యారు. ఆరు దేశాలు పాల్గొంటున్న ఈ టోర్నీలో తొలి మ్యాచ్‌లో ఓడి రెండో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్న భారత్ పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. తదుపరి మ్యాచ్‌లో మంగళవారం ప్రపంచ నంబర్‌వన్ ఆస్ట్రేలియాతో ఆడుతుంది.

అఫ్గాన్‌కు స్కాట్లాండ్ షాక్

ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ



మెక్‌లియోడ్

బులవాయో: ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఫేవరెట్లలో ఒకటైన అఫ్గానిస్తాన్‌కు స్కాట్లాండ్ షాకిచ్చింది. తొలి మ్యాచ్‌లో బ్యాట్స్‌మన్ కాలమ్ మెక్‌లియోడ్ (146 బంతుల్లో 157 నాటౌట్; 23 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీతో స్కాట్లాండ్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అతి పిన్న సారథి రషీద్ ఖాన్ నేతృత్వంలో అఫ్గాన్ మొదట 49.4 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. నబీ (92; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), నజీబుల్లా జద్రాన్ (67; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. వీల్, బెరింగ్టన్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. తర్వాత స్కాట్లాండ్ 47.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసి గెలిచింది. మెక్ లియోడ్‌కు బెరింగ్టన్ (67; 4 ఫోర్లు) అండగా నిలిచాడు. మిగతా మ్యాచ్‌ల్లో ఐర్లాండ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 93 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై గెలుపొందగా, యూఏఈ కూడా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలోనే 56 పరుగుల తేడాతో పపువా న్యూగినియాపై నెగ్గింది.

జింబాబ్వే శుభారంభం



రజా

మరోవైపు ఆతిథ్య జింబాబ్వే తొలి మ్యాచ్‌లో 116 పరుగుల తేడాతో నేపాల్‌పై జయభేరి మోగించి శుభారంభం చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 380 పరుగులు సాధించింది. బ్రెండన్ టేలర్ (91 బంతుల్లో 100; 7 ఫోర్లు, ఒక సిక్స్), సికిందర్ రజా (66 బంతుల్లో 123; 7 ఫోర్లు, 9 సిక్స్‌లు) ధాటిగా ఆడి సెంచరీలు చేయడం విశేషం. ఐదో వికెట్‌కు వీరిద్దరు 173 పరుగులు జోడించారు. అనంతరం నేపాల్ జట్టు 50 ఓవర్లలో 8 వికెట్లకు 264 పరుగులు చేసి ఓడిపోయింది. 'సెంచరీ హీరో' సికిందర్ రజా బౌలింగ్‌లోనూ రాణించి మూడు వికెట్లు తీశాడు.

‘పలకరింపు’తో చిన్నారులకు టీకాలు

- హెల్త్ బులెటిన్, పలకరింపు కార్యక్రమాల ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు
- నేటి నుంచి 30వ తేదీ వరకు చిన్నారులకు టీకాలు..
- అనారోగ్యంతో బాధపడే డాక్టర్లకు ఆరోగ్య సూచనలిచ్చే అర్హత లేదు



హెల్త్ బులిటెన్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి కామినేని, పూనం మాలకొండయ్య

సాక్షి, అమరావతి: అందరూ ఆనందంగా ఉండేందుకు ‘హ్యాపీ సండే’ పెట్టానని.. రోడ్ల మీద డ్యాన్సులు వేస్తుంటే చూస్తూ ఆనందించవచ్చని సీఎం చంద్రబాబు చెప్పారు. లేకపోతే ఇంట్లో నుంచి బయటికొచ్చి గట్టిగా కాసేపు అరిచి.. ఇంటికెళితే మంచిగా నిద్రపడుతుందని ఆయన సూచించారు. ఆదివారం ఉండవల్లిలోని తన నివాసంలో హెల్త్ బులెటిన్ ఆవిష్కరణ, పలకరింపు కార్యక్రమ పోస్టర్లను సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పీపీపీ(పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) కింద ఎన్ని ఆరోగ్య కార్యక్రమాలు చేపట్టినా.. ‘ఆరోగ్యం’లో రాష్ట్రం ఇంకా 8వ స్థానంలోనే ఉందని పేర్కొన్నారు. ఆర్థరైటిస్, ఆస్తమా, మధుమేహం, హైపర్ టెన్షన్ తదితర జబ్బులతో బాధ పడేవారి సంఖ్య విపరీతంగా పెరిగిందని చెప్పారు. మానసిక జబ్బులు కూడా తీవ్రంగా పెరిగాయని.. ఇది మంచిది కాదన్నారు. ప్రతినెలా హెల్త్ బులెటిన్ ఇవ్వడం వల్ల అనారోగ్య సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి? అనేది అవగాహన వస్తుందన్నారు. చాలా మంది మరుగుదొడ్డి కట్టుకోలేదు గానీ.. సెల్‌ఫోన్ కావాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. తనకు ఉంగరం గానీ, గడియారం గానీ లేవని సీఎం చెప్పుకొచ్చారు. చాలామంది బంగారం, డైమండ్ వంటి ఆభరణాలు పెట్టుకొని ఆనందం పొందాలనుకుంటున్నారని.. కానీ దాని వల్ల ఆనందం రాదన్నారు. అనారోగ్య సమస్యలున్న డాక్టర్లకు ఆరోగ్య సూచనలిచ్చే అర్హత లేదని తేల్చిచెప్పారు. ఈనెల 5 నుంచి 30వ తేదీ వరకూ ‘పలకరింపు’ కార్యక్రమం ద్వారా ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ టీకాలు వేసే కార్యక్రమం చేపట్టనున్నట్టు చెప్పారు. 57 వేల మందికి పైగా సిబ్బంది 1.22 కోట్ల ఇళ్లకు వెళ్లి ఈ ‘పలకరింపు’ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్థరైటిస్.. ఆస్తమా.. హైపర్‌టెన్షన్

ఇదిలాఉండగా, రాష్ట్రంలో ఆర్థరైటిస్(ఎముకలు, కీళ్ల జబ్బులు), ఆస్తమా, హైపర్ టెన్షన్ జబ్బులు తీవ్రంగా ఉన్నట్టు సీఎం విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో వెల్లడైంది. జిల్లాల వారీగా చూస్తే.. విజయనగరం, వైఎస్సార్ జిల్లాల్లో హైపర్ టెన్షన్ ఎక్కువగా ఉండగా పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లో మధుమేహం తీవ్రంగా ఉంది. శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాల్లో ఆస్తమా జబ్బుతో బాధపడుతున్నవారి సంఖ్య ఎక్కువ ఉంది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో గుండె జబ్బులతో బాధపడే వారి సంఖ్య ఎక్కువగా ఉండగా.. ప్రకాశం, చిత్తూరు, అనంతపురం, కర్నూలు, విశాఖ జిల్లాల్లో ఆర్థరైటిస్ జబ్బు అధికంగా ఉన్నట్టు తేలింది. బులెటిన్‌లో ఈ జబ్బులకు పరిష్కారం సూచించారు.

మార్చిలోనే మండుతున్న ఎండలు

- గతేడాది కంటే పెరగనున్న ఎండలు
- అప్రమత్తంగా ఉండాలని కేంద్ర విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరిక



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: మార్చి ఆరంభంలోనే సూర్యుడు చుర్రుమనిపిస్తున్నాడు. గతేడాది వేసవిలో కంటే ఈ వేసవిలో సగటున 0.5 నుంచి ఒక డిగ్రీ వరకూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. వేసవి తీవ్రత ఎక్కువ రోజులు కొనసాగుతుందని కూడా పేర్కొంది. ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు 46 నుంచి 50 డిగ్రీల వరకూ చేరుకుంటాయని తెలిపింది. వీటిని నిజం చేస్తూ అప్పుడే ఎండ ప్రతాపం చూపుతోంది. ఈ నెల 4 రోజుల్లోనే రాష్ట్రంలో అక్కడక్కడా ఉష్ణోగ్రతలు 39 – 40 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయి. ఆదివారం నందిగామలో 40, జంగమహేశ్వరపురంలో 39, కర్నూలులో 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్చిలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత ఇంకెలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు.

అప్రమత్తంగా ఉండాల్సిందే

భూతాపం, వడగాల్పుల తీవ్రత పెరిగే ప్రమాదం ఉన్నందున కేంద్ర విపత్తు నిర్వహణ శాఖ తెలుగు రాష్ట్రాలతోపాటు మరికొన్ని రాష్ట్రాలను అప్రమత్తంగా ఉండాలంటూ తాజాగా హెచ్చరించింది. వడగాల్పు మరణాల నియంత్రణపై దృష్టి సారించాలని, ముందు జాగ్రత్తలపై కరపత్రాలు, పోస్టర్ల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని సూచించింది.

2 నెలలపాటు తీవ్ర వడగాల్పులు: గతంలో మేలో వడదెబ్బ మరణాలు నమోదయ్యేవి. గత మూడేళ్లుగా ఏప్రిల్‌లోనూ వడదెబ్బ మరణాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది మార్చిలోనే వడగాల్పులు తీవ్రంగా ఉండే పరిస్థితి కనిపిస్తోంది. మార్చిలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు మించి నమోదు కావడం భవిష్యత్తు ప్రమాద ఘంటికలకు నిదర్శనమని అధికారులు చెబుతున్నారు. మార్చి ఆరంభంలోనే పశ్చిమ గాలులు వీయడం అరుదని గత కొన్నేళ్లలో ఇలాంటి పరిస్థితి గమనించలేదని వాతావరణ శాఖ రిటైర్డ్ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ చెప్పారు. భూతాపం విపరీతంగా పెరగడానికి అభివృద్ధి పేరుతో మనం చేస్తున్న తప్పిదాలే కారణమని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ వైకేరెడ్డి తెలిపారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ఎండలు పెరగడంతో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పిల్లలు, వయోవృద్ధులు, గుండెజబ్బు బాధితులు, ఇతర వ్యాధిగ్రస్తులు త్వరగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. వీరు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయటకు వెళ్లకపోవడం మంచిది. ఎండ సమయంలో వెళ్లాల్సి వస్తే తలకు, ముఖానికి వేడి తగలకుండా జాగ్రత్త పడాలి. ఎక్కువగా మంచినీరు, కొబ్బరినీళ్లు, మజ్జిగలాంటివి తీసుకోవాలి.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.